ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై
బ్రాడ్‌షీట్

# మహానగరమే పితామహుడయితే?

## స్త్రీల అనుభవంలో నగర జీవితం

*సంచిక : 14* | *తెలుగు & ఇంగ్లీష్* | *మార్చి 2019* | *విరాళం : 25 రూ.*



చిత్రకారులు: లేఖ నారాయణన్, సేకరణ : ఆర్. శ్రీవత్సన్

విషయసూచిక


- సంపాదకీయం
- ఆశల నగరం: స్త్రీలకేమిస్తోంది? మిథున్ సోమ్
- నాకంటూ ఉండటానికొక చోటు  రాణి రోహిణి రమణ్
- షెవ్వా....నెత్తురు  జూపాక సుభద్ర
- 'పంజరాలని బద్దలు కొడదాం' పింజ్రాతోడ్
- తమకి చెందని చోటు: బహిరంగ స్థలాల్లో స్త్రీలు  మధురిమ మజుందార్
- కట్టుబాట్లలో ఆనందం: విరామ సంస్కృతి, నగర లైంగికత, స్త్రీల నడవడిక  ప్రణూ దేశిరాజు
- స్త్రీలకు చెందని నగరం  మధుమీత సిన్హా
- గ్రామాల్లో, నగరాల్లో ప్రజారవాణా సౌకర్యాలు: నా అనుభవం  మిథున్ సోమ్
- హైదరాబాదు ట్రాన్స్ యాక్టివిస్టు రచన ముద్రబోయిన: ఒక పరిచయం  మధురిమ మజుందార్
- హైదరాబాద్ నగరంలో మొదటి తరం దళిత యువతుల అనుభవాలు  మాధవి మిరప
- కండక్టర్ ఊర్మిళతో ఒక రోజు  దేవయాని ప్రసాద్, అనుష సుందర్
- 'పోర్న్' ఇక్కడ ఓ ప్రతీకారాస్త్రం..!  నేహా దీక్షిత్, ఇండిపెండెంట్ జర్నలిస్ట్
- బుర్ఖా – రిక్షా  జావీద్ ఆలమ్
- బహిరంగ స్థలాలు ఎవరికి చెందుతాయి? తేజస్విని మాడభూషి
- మీటింగ్  నబీన దాస్
- సబ్ వే  ఖదీర్‌బాబు


***ప్రత్యేక సంపాదకులు :*** *మిథున్ సోమ్, రాణి రోహిణి రమణ్, మధురిమ మజుందార్, మాధవి మిరప, ఎ. సునీత*

***సంపాదకులు:*** *ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***సంచిక ఫోటోలు:*** *మిథున్ సోమ్, రాణి రోహిణి రమణ్*

# సంపాదకీయం

*నక్షాత్రాల నగరమా*

*నా కోసమే మెరుస్తున్నావా?*

*నక్షత్రాల నగరమా*

*నేను చూడలేనివెన్నో వున్నాయి కదా*

*ఇది కొత్త, అద్భుత జీవితానికి నాందా?*

*లేక పగటి కలగా మిగిలిపోయే ఇంకొక కలా?*

*ఎవరు చెప్పగలరు?*

**లాలా ల్యాండ్** అనే ఆస్కార్ గెలుచుకున్న హాలీవుడ్ సినిమాలో హీరో, హీరోయిన్లు నగరంలో కొత్త జీవితం పట్ల ఆశ, నిరాశ, ఉద్వేగం, ఆందోళన వ్యక్తపరుస్తూ పాడుకునే పాట ఇది. కొత్త, అద్భుత జీవితం గురించి నగరం ఇచ్చే హామీల నీడలో వైఫల్యం, నిస్పృహ, భగ్న స్వప్నాలు కూడా వేచి ఉంటాయని చెప్తుంది.

నగరానికున్న ఈ విరుద్ధ పార్శ్వాలని మన జనసమ్మత సంస్కృతి (పాపులర్ కల్చర్) ప్రతిబింబిస్తుంది. ఒక పక్కన నగరం అంటేనే భావుకత వుట్టిపడేలా వర్ణనలు – పారిస్ అంటే ప్రేమ నగరమని, కొలకత్తా అంటే ఆనంద నగరమని, ముంబై అంటే కలల నగరమని మనక్కనిపిస్తాయి. ఇంకో పక్క అనేక భాషా సంస్కృతుల్లో నగరాన్ని అనామకత, హింస, అపనమ్మకం, అవినీతి, కపటత్వం కలిసిన ప్రదేశంగా వర్ణిస్తారు. వదిలేసి వచ్చిన గ్రామం గురించి, గ్రామ సంస్కృతి పట్ల ఒక (తీపి జ్ఞాపకం) నోస్టాల్జియా బాగా కనిపిస్తుందిక్కడ. నగరమంటే పురుషులని కుటుంబం నుండి దూరంగా లాక్కెళ్లే అందమైన స్త్రీగా కూడా వర్ణించటం కద్దు.

నగరాలని (నగర జీవితాలని) ఈ రెండు రకాల వర్ణనల్లోకి – ప్రేమ, ఉల్లాసం, కలలు లేకపోతే దు:ఖం, లేదా అపనమ్మకం, హింసకి – కుదించగలమా? కష్టమని మా కనిపిస్తోంది. పారిస్‌కి వలస పోయిన ఆఫ్రికన్, అరబ్ వలసదారులు, ముంబైకి బీహార్ నుండి, ఉత్తరప్రదేశ్ నుండి వలసపోయిన వాళ్ళ నడిగితే, నగరాలు, నగర జీవితాల గురించి సంక్లిష్టమైన కథనాలు లభిస్తాయి. 1960ల్లో వెళ్లిన వారికి, 2000 సంవత్సరం తరువాత వెళ్లిన వారి కథనాల్లో చాలా తేడా ఉంటుంది. అయితే చాలా మేరకు నగర వలసల గురించి మనం విన్న కథనాలన్నీ పురుషులవే అయి ఉంటాయి. ఈ మధ్యనే నగరాలకు వలస వచ్చిన స్త్రీల కథనాలు కొంత వినిపిస్తున్నాయి. ఆయా స్త్రీలు సమాజం అంచుల నుండి వచ్చిన వారయితేనో, ట్రాన్స్‌జండర్ స్త్రీలయితేనో వారేం చెప్తారో మనకింకా తెలియదు. నగరాల గురించి ప్రజా సంస్కృతిలో వుండే ఊహా ప్రపంచాలని దాటి, నగరాలకు వలస వస్తున్న, నగరంలో నివసిస్తున్న యువతులు నగరం, నగర జీవితాన్ని ఎలా చూస్తున్నారో అర్థం చేసుకోవటానికి ఇది ఒక చిన్న ప్రయత్నం.

భారత దేశం చాలా వేగంగా నగరీకృతమవుతోంది. చదువు, వుద్యోగం కోసం నగరాలకొస్తున్న స్త్రీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నగరాలు కేవలం భౌగోళిక ప్రాంతాలు (స్పేసెస్) కావు. అలాగే, అందరినీ సమానంగా చూసే ప్రాంతాలు కూడా కావు. వ్యక్తుల జండర్, కులం, వర్గం, మతం, ప్రాంతం వారి నగర ప్రవేశాన్ని, అలాగే నగరంలో వారి నివాసాన్ని నిర్ణయిస్తాయి. అలాగే, ఆయా ఆశలు, ఉద్వేగాలతో కూడుకున్న వారి ఊహలు కూడా నగరంతో వారు ఏర్పర్చుకునే సంబంధాన్ని నిర్దేశిస్తాయి. ఈ బ్రాడ్‌షీట్‌లో నగరాన్ని మేము ఒక హెచ్చు తగ్గులతో కూడిన, అలాగే పోరాటాలకు నిలయమయిన జండర్ నిర్మాణంగా చూడాలని ప్రతిపాదిస్తున్నాము. అలాగే, నగరీకం ఎప్పుడు మారుతూ వుండే భావన అని మేము కూడా భావిస్తాం.

అన్వేషి సంస్థలో 'నగరం. లైంగికత: హైదరాబాదులో నివసిస్తూ, పనిచేసే యువత' అనే అధ్యయనంలో భాగంగా మేమీ బ్రాడ్‌షీట్‌ని రూపొందించటం జరిగింది. ఈ అధ్యయనంలో భాగమైన యువత గురించిన రచనలు పరిశీలించినపుడు అవి విద్యా సంస్థలపైనో, లేక పని స్థలాల పైనో కేంద్రీకరిస్తున్నాయని, వీటిల్లో నగరం కేవలం ఒక నేపథ్యంలా మిగిలిపోతుందని మాకర్థమయింది. నగరానికి చదువు కోసం, వుద్యోగం కోసం వలస వచ్చిన 50 మంది (సింగిల్ ఉమెన్) స్వతంత్ర స్త్రీలతో (ఒకరిద్దరు తప్ప దాదాపు అందరు పెళ్లి కాని వారే) మాట్లాడినప్పుడు నగరం వారి జీవితంలో కీలక పాత్ర వహిస్తుందని గ్రహించాము. అది వారు చదువుకున్న విద్యాసంస్థలు లేదా పని చేసే స్థలాల గురించి వారు చర్చించినప్పుడు స్పష్టంగా కనిపించింది. వారి వ్యక్తిగత ఆశయాలు, కోరికలు, సంఘర్షణల గురించి చర్చించే క్రమంలో స్వతంత్ర మహిళలుగా నగరం, నగరంలో మనగలగటం ఒక ప్రధాన అంశంగా ముందుకొచ్చింది.

కుటుంబం నుండి దూరంగా ఉండటం, నగరంలో జీవితాన్ని ఏర్పర్చుకోవటం ఆయా స్త్రీల జీవితాలని ఏ విధంగా ప్రభావితం చేశాయో అర్థం చేసుకోవటం మా అధ్యయన ఉద్దేశం. నగర జీవితంలోకి రావటం వారి అస్తిత్వాన్ని, కుటుంబంతో వారి సంబంధాలని, వివాహ సంబంధాల గురించి వారి భావనలని ఏ విధంగా మారుస్తుందో అని పరిశీలించాము. ఆయా యువతులు తమ జీవన శైలి, నైతికత పట్ల అభిప్రాయాలు, వేసుకునే బట్టల్లో వచ్చిన మార్పుల గురించి మాతో పంచుకున్న అనుభవాలు పితృస్వామిక కట్టుబాట్లతో వారు చేసుకోవాల్సి వచ్చిన రాజీ, సంప్రదింపులు, వ్యతిరేకతల గురించి మాకు కొత్త అవగాహన కల్పించాయి.

నగరం వారి ఆలోచనా పరిధిని విస్తృతం చేసి, ఇతర జ్ఞాన రంగాలతో  పరిచయం ఏర్పరిచి వారికి మరిన్ని అవకాశాలు కల్పించింది. అదే సమయంలో, వారిని నిరంతర నిఘాలో పెట్టి, ఆయా అవకాశాలని, పరిచయాలని పరిమితం చేసింది కూడా. ఆర్థిక స్వతంత్రం వారికి పెళ్లి, కెరీర్ గురించిన నిర్ణయాల్లో కొంత మేరకు స్వేచ్ఛనిచ్చింది కానీ కొత్త రంగాల్లో ఉద్యోగాలు ముఖ్యంగా అణగారిన వర్గాల నుండి వచ్చే స్త్రీలని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. బూర్జువా వర్గాల స్త్రీలకి లభించే కుటుంబ సహకారం వీరికి అందుబాటులో ఉండదు కనుక వారి జీవితం ప్రమాదం అంచున నడుస్తుంటుంది. చాలా మంది స్త్రీలు తమ తమ ఆశయాలని అనుసరిస్తూ తమ కలల్ని సాకారం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు కానీ తప్పనిసరి పరిస్థితుల్లో సంప్రదాయ వివాహం, కుటుంబ వ్యవస్థల్లోకే ప్రవేశిస్తున్నారు.

ముందే చెప్పుకున్నట్లు, నగర జీవితం చాలా మందికి ఒక కల, ఒక కోరిక. దానిలో నగరానికి చేరటం ఒక ప్రధానమైన మొదటి అడుగు. ఈ సంచికలో మిథున్ సోమ్ రాసిన 'ఆశల నగరం: స్త్రీలకేమిస్తోంది?' నగరానికి వలస వస్తున్న యువతుల ప్రత్యేక దారులని విశ్లేషించే ప్రయత్నం చేస్తుంది. ఈ దారులు నగరం విస్తరించిన తీరుని ప్రతిబింబిస్తాయి. 1980లలో ఒక విద్యా సంస్థల కేంద్రంగానూ, ఆ తరువాత సాఫ్ట్‌వేర్ రంగ కేంద్రంగానూ, అలాగే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వివిధ రకాల ఉద్యోగాలు, అన్ని వసతులు వున్న ఒక నయా ఉదారవాద నగరం గాను ఎదిగిన తీరు వారికి నగరానికి రావటానికి ఆయాదారులని ఏర్పరిచింది. నగరంలో ఎవరెక్కడ, ఏ రకంగా ఇముడుతారన్నది ఆయా యువతుల సామాజిక, ఆర్థిక నేపథ్యం, వారు నగరానికొచ్చిన దారులపైనా ఆధారపడి ఉంటుంది.

రాణి రోహిణి రమణ్ రాసిన "నాకంటూ ఉండటానికి ఒక చోటు" అన్న వ్యాసం స్వతంత్ర యువతులపై నివాస స్థలాల్లో వుండే నిరంతర నిఘాని వర్ణించి, విశ్లేషిస్తుంది. ఇంటి యజమానులు, ప్రయివేటు, ప్రభుత్వ హాస్టళ్లలో వార్డెన్లే కాకుండా, తోటి విద్యార్థి, విద్యార్థినులు, ఇంకా చెప్పాలంటే, చుట్టు పక్కల వుండే మొత్తం అందరూ ఆయా స్వతంత్ర

స్త్రీలకి గార్డియన్ల అవతారమెత్తి, వారిని నియంత్రించి, వారి వల్ల 'తమ' నగరం 'చెడి పోకుండా' చూసుకుంటూ వుంటారు.

'షెవ్వా...నెత్తురు' కథలో జూపాక సుభద్ర జండర్, కులం రెండూ కలిసి దళిత యువతులపై ప్రభుత్వ హాస్టళ్లలో ఎలా రాజ్యం చేస్తాయో చూపిస్తుంది. సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదివే ఒక దళిత విద్యార్థిని, వార్డెను అనుమాన నివృతి కోసం వైద్య పరీక్షకి బలవంత పెడితే వద్దని గట్టిగా నిలబడి, తన ఆత్మగౌరవం కోసం పోరాడిన కథ ఇది. అణగారిన కులాల వారి కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ హాస్టళ్లలో వారినే నైతిక నిఘాకి గురి చేసి, వారి ప్రవర్తన పై నిరంతర నిఘా పెట్టే ధోరణులని ఈ కథ ఎత్తి చూపిస్తుంది.

పింజరాతోడ్ వంటి కొత్త నగర యువతుల ఉద్యమాలు, ఇంటికి దూరంగా వుండే యువతులపై ప్రయివేటు, పబ్లిక్ ప్రదేశాల్లో అమలయ్యే నిరంతర నిఘాని ఎదుర్కొని, వారికి హాస్టళ్లలో, పబ్లిక్ ప్రదేశాల్లో సమాన ప్రవేశం, హక్కులు వుండాలని అడుగుతున్నాయి. ఇటువంటి నిఘా వారిపై బహిరంగ నియంత్రణేననీ, వివక్షగా పరిణమించి స్త్రీలకి రాజ్యాంగం ఇచ్చిన హక్కులని ఉల్లంఘిస్తోందని వారు బలంగా వాదిస్తున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో యువతులకుండే హాస్టల్ నియమాలు ఎందుకు వివక్షాపూరితమైనవో, వాటికి వ్యతిరేకంగా వారెందుకు పోరాడుతున్నారో వారితో జరిపిన ఈ మెయిల్ సంభాషణలో వారు వివరించారు. ఈ సంచికలోని 'పంజరాల్ని బద్దలు కొడదాం' వ్యాసంలో ఈ సంభాషణని చదవచ్చు.

మధుమిత మజుందార్ వ్యాసం 'తమది కాని చోటు: బహిరంగ ప్రదేశాల్లో స్త్రీలు', నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో స్త్రీలు ఎంత మేరకు స్వేచ్ఛగా తిరగ్గలరు, ఉండగలరు అన్న విషయంపై తీవ్ర చర్చ రేపిన 'వై లోయిటర్' అన్న పుస్తకం గురించి చర్చిస్తుంది. నగరంలో అన్ని రకాల బహిరంగ ప్రదేశాలపై తమక్కూడా హక్కుందని, వివిధ ప్రాంతాల్లో జరిగిన, జరుగుతున్న చిన్న, చిన్న ఉద్యమాల గురించి కూడా ఈ వ్యాసం చర్చిస్తుంది.

ప్రణూ దేశిరాజు వ్యాసం "కట్టుబాట్లలో ఆనందం: విరామ సంస్కృతి, నగర లైంగికత, యువతుల నడవడిక", ప్రత్యేకంగా ఉల్లాసం, ఆహ్లాదం కోసమే ఏర్పడిన పబ్బుల వంటి ప్రదేశాలు నగర యువతులని వైరుధ్యాల్లో ఎట్లా కట్టి పడేస్తాయో విశ్లేషిస్తుంది. ఇవి యువతుల్లో కొంత మందికి కొంత సేపు 'హద్దుల్లేని స్వేచ్ఛని' ప్రసాదిస్తున్నాయి. బహిరంగ ప్రదేశాలని ప్రధానంగా మగవారికి, వారి స్త్రీ ద్వేష ప్రవర్తనకి ధారాదత్తం చేసే ధోరణులని యధాతథంగా కొనసాగిస్తున్నాయి. ఇవి స్త్రీలని వినియోగదారులుగా మార్చిన క్రమంలో వస్తున్నాయి గాని, సమాన పౌరులుగా గుర్తించే క్రమంలో కాదు.

మధుమీత సిన్హా రాసిన 'స్త్రీలకు చెందని నగరం' వ్యాసంలో సమీరా జైన్ తీసిన డాక్యుమెంటరీ సినిమా 'హమారా అప్నా షెహర్' గురించి చర్చిస్తుంది. తమ రోజువారీ జీవితంలో స్త్రీలకి తారసపడే నగరం, స్త్రీలు తాము కూడా స్వంతం చేసుకోవాలని తహతహ లాడే నగరం ప్రధానంగా పురుషులకు ఏర్పర్చిందేనని ఈ సినిమా చూపిస్తుంది. వారు మునిసిపాలిటీ శ్రామికులు కావచ్చు, మహిళా డ్రయివర్లు కావచ్చు, పాదచారులు కావచ్చు అనుక్షణం ప్రతివారికీ తాము ఈ నగరానికి చెందమనే భావన నగరాలకున్న పురుష స్వభావం వల్లే కలుగుతుందని ఆవిడ విమర్శ.

ఏ నగరానికైనా దాని ప్రజా రవాణా సౌకర్యాలు ఆయువుపట్టు. దాని ద్వారానే ప్రధానంగా ప్రజలు తిరగటం గానీ, నగరాన్ని తెలుసుకోవటం గానీ జరుగుతుంది. ముఖ్యంగా కొత్తవారికి నగరంలో వివిధ ప్రదేశాల పరిచయం గానీ, అక్కడికి ప్రవేశం గానీ ప్రజా రవాణా సౌకర్యాలు లేనిదే సాధ్యం కాదు. విద్యాసంస్థలకు, పని ప్రదేశాలకి, షాపింగ్‌కి, ఆహ్లాదం కోసం ఎక్కడికి వెళ్లాలన్నా వాటిని నిర్ణయించేది రవాణా సౌకర్యాల అందుబాటులో ఉండటం. మిథున్ సోమ్ రాసిన వ్యాసం 'గ్రామాల్లో, నగరాల్లో ప్రజా రవాణా సౌకర్యాలు: నా అనుభవాలు' ఈ విషయాన్ని కళ్ళకి కట్టినట్లు మన ముందుకు తెస్తుంది.

సమాజం అంచుల్లో ఉన్న మనుషులు మాట్లాడినప్పుడు మనం సాధారణంగా వినం. ఈ బ్రాడ్‌షీట్ లో నగరంలో స్త్రీల జీవితాల గురించి కొన్ని విషయాలని బయటకి తెచ్చినప్పటికీ, వీరు మాత్రమే నగరంలో చిన్న చూపుకి, వివక్షకు గురవుతారని మేమనుకోవటం లేదు. జండర్ చట్రంలో ఇమడని ట్రాన్స్‌జండర్ ప్రజలు ఇంతకంటే మరింత హింసకు, సామాజిక వెలివేతకు గురవుతారు. హైదరాబాదులో ఒక ట్రాన్స్‌జండర్ యాక్టివిస్టు, రచన ముద్రబోయిన తన ముఖ పుస్తకంలో రాసిన పోస్టులని ఒక చోట పొందుపరిచి, వాటిని విశదీకరించే వ్యాసం, ఆ ప్రజలు నగర ప్రదేశాల్లో జీవించటానికి చెయ్యాల్సిన తీవ్రసంఘర్షణని ముందుకు తెస్తుంది. రచన యాక్టివిజం ట్రాన్స్ ప్రజల విషయాలపైనే కాక, దళితులు, సెక్స్ వర్కర్లు, ఇతర శ్రామిక సమూహాలతో కూడా ముడిపడి వుంది. కులం, మతం, ప్రాంతం వంటి వివిధ రకాల వివక్షా రూపాలు ఒకదానితో ఒకటి కలిసి ట్రాన్స్ ప్రజల జీవితాలని ప్రభావితం చేస్తాయనే లోతయిన అవగాహన ఆమె యాక్టివిజంలో మనకి కన్పిస్తుంది.

నగరంతో దళిత స్త్రీల అనుభవాలు మనకి చాలా తక్కువగా కనిపిస్తాయి. మిరప మాధవి వ్యాసం "హైదరాబాదు నగరంలో మొదటితరం దళిత స్త్రీల అనుభవాలు" 2000 తరువాత నగరానికి వలస వచ్చిన దళిత స్త్రీల అనుభవాలని వర్ణిస్తుంది. దళిత అమ్మాయిలు పేదరికం లోనుండి, గ్రామాల ఇరుకుదనం నుండి బయటపడి తమ జీవితంలో కొంత స్వేచ్ఛ కోరుకుంటున్నారు. అయితే, వారి చిన్న ఉద్యోగాలు, తక్కువ జీతాలు, ఎక్కువ పనిగంటలు నగరంలో తిరగటానికి, కుటుంబ నేపథ్యం బయట సంబంధాలు ఏర్పర్చు కోవడానికి, రాజకీయ రంగంలో ఆసక్తి పెంచుకోవటానికి అవకాశం ఇవ్వట్లేదు.

సాంప్రదాయ చట్రాల్లో ఇమడని భిన్న పరస్పర సంబంధాలు ఏర్పడటానికి నగరం అవకాశం కల్పిస్తుంది. దేవయాని, అనూష రాసిన 'ఊర్మిళతో ఒక రోజు' దాదాపు మగవాళ్లతో నిండిపోయిన ప్రజా రవాణా రంగంలో బస్సు కండక్టర్ ఊర్మిళ, ఆ బస్సు డ్రైవర్‌తో, వివిధ మహిళా కండక్టర్లతో ఏర్పర్చుకున్న స్నేహ బంధాల్ని చర్చిస్తుంది. ఒక రోజంతా మహిళా కండెక్టర్‌తో గడిపి ఆ అనుభవాన్ని గురించి రాస్తారు ఈ ఇద్దరు రచయితలు. ఖదీర్‌బాబు కథ 'సబ్వే'లో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసే ఇద్దరు సహోద్యోగుల మధ్య ఇటువంటి మరొక బంధమే కనిపిస్తుంది. ఈ ఇద్దరు స్త్రీ పురుషులు పని చేసే క్రమంలో దగ్గరవుతారు కానీ, వారిద్దరి మధ్య ఉండేది ప్రేమికుల మధ్య వుండే శృంగార సంబంధం కాదు. వాస్తవ జీవితం అయినా, కాల్పనికం అయినా నగర జీవితం స్త్రీలు, పురుషుల మధ్య సాంప్రదాయ సంబంధాల్లో ఇమడని కొత్త రకమయిన సంబంధాలు ఏర్పరుస్తుంది.

నేహా దీక్షిత్ రాసిన 'పోర్న్ ఇక్కడ ఓ ప్రతీకారాస్త్రం' నగరంలో ఏర్పడే సంబంధాల చీకటి కోణాల్ని వెలికి తీస్తుంది. తననుండి విడిపోయిన ప్రేమికురాలిపై ప్రతీకారం తీర్చుకోవటానికి తామిద్దరూ దగ్గరగా వున్న క్షణాల ఫోటోలని అందరికి పంపిస్తాడు ఒక యువకుడు. వారిద్దరి మధ్య సంబంధానికీ కాక ఇటువంటి 'విషపూరిత పురుషత్వానికి' కూడా నగర జీవితం అవకాశాలని కల్పిస్తుంది. అయితే, ఆయా సంబంధాలు నిలవటానికి, వికృత రూపం తీసుకోకుండా వుండటానికి కొత్త సాంస్కృతిక, సాంఘిక ఆలంబన, అలాగే కొత్త సంస్థాగత సహాయం కూడా అవసరమవుతుంది. అవెలా కల్పించగలమనే ప్రశ్న ఈ వ్యాసం మన ముందు పెడుతుంది.

మిగిలిన మహానగరాల లాగే హైదరాబాదుని కూడా పాత, కొత్త, సైబర్ నగరాలుగా విభజించి చూస్తారు. అయితే ఈ విభజన భౌతికంగా మాత్రమే కాక, భావనా పరంగా కూడా పనిచేస్తుంది పాత నగరాన్ని వెనుకబడిన నగరంగాను, కొత్త నగరాన్ని ఆధునికమైందని, సైబర్ నగరమయితే అతి ఆధునికమైందని అనుకోవటం కద్దు. బ్రాడ్‌షీటులోని రెండు వ్యాసాలు ఆధునికత, భౌగోళికత, రాజకీయాల మధ్య సంక్లిష్ట సంబంధాలని చర్చిస్తూ ఇటువంటి భావపరమయిన ఏకీకరణలని ప్రశ్నిస్తాయి.

అందరూ ముస్లింలలో వెనుకబాటుతనానికి చిహ్నంగా భావించే బుర్ఖా హైదరాబాదులో ఎక్కువగా కనిపించటానికి కారణం నగరంలో, ముస్లిం సమాజంలో వస్తున్న మార్పులని ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్త జావీద్ ఆలం రాసిన వ్యాసం 'బుర్ఖా, రిక్షా' వాదిస్తుంది. ముస్లిం అమ్మాయిలలో పెరుగుతున్న విద్యా స్థాయి వల్ల బయటికి రావటానికి ఎక్కువ బుర్ఖా వాడుతున్నారని, అంటే బుర్ఖా హైదరాబాదులో ఆధునికతకు చిహ్నంగా పనిచేస్తోందని, ఈ వ్యాసం వాదిస్తుంది. ఇంకో పక్క కొత్త అభివృద్ధి నమూనాలో భాగంగా ఆటో రిక్షాలని ప్రవేశ పెట్టిన తరువాత, హైదరాబాదుకి ఎంతో కాలం చిహ్నంగా వుండిన రిక్షా కనుమరుగయింది.

తేజస్విని మాడభూషి రాసిన "బహిరంగ స్థలాలు ఎవరికి చెందుతాయి?" వ్యాసం నగర బహిరంగ ప్రదేశాల్లో స్త్రీలకి ప్రవేశం పెంచాలని "హైదరాబాద్ ఫర్ ఫెమినిజం" అనే వేదిక తరపున తాము చేసిన వివిధ ప్రచారోద్యమ అనుభవాల గురించి విశ్లేషిస్తుంది. నగరం ఒక అమూర్త ప్రదేశం కాదని, వివిధ సమూహాలు జీవించే, స్వంతం చేసుకునే ప్రదేశాల సమాహారమని తాము నేర్చుకున్నామని

రచయిత వర్ణిస్తారు. నగర ప్రదేశాలని స్వంతం చేసుకోవాలని చేసే ప్రచారోద్యమాలు ఆయా చరిత్రలు, యదార్థ జీవన విధానాల గురించి అవగాహనతో మెలగాలని ఆమె అంటారు.

కొంత మంది నగరంతోనే ప్రేమలో పడిపోతారు. అలాంటి ఇద్దరు నగర ప్రేమికుల కవితల్ని మేమిక్కడ పొందుపరిచాము. రవీష్ కుమార్ రాసిన కవిత ఢిల్లీ నగరానికి వచ్చిన ఒక యువకుడి ప్రేమని వర్ణిస్తే, నబీనాదాస్ కవితలు శరీరంలో ఇంకిపోయిన నగరం పట్ల ప్రేమని వర్ణిస్తాయి. నగర జీవితంలో వుండే హడావుడి, నిరంతరం పాడుతూ, నర్తిస్తూ పరుగులు తీస్తూ వుండే నగరం మధ్యలో ఇద్దరు వ్యక్తుల కలయికని ఆమె కథలో చూస్తాం.

నగరం ఒక వర్గానికి చెందిన స్వతంత్ర స్త్రీలకి వాళ్ళు కోరుకునే అజ్ఞాత జీవితాన్ని జీవించటానికి అవకాశమిస్తుంది. కుటుంబం, బంధు గణం పెట్టే నిరంతర నిఘా నుండి విముక్తి కలిగిస్తుంది. ట్రాన్స్‌జండర్ ప్రజలకి కూడా ఎంతో కొంత స్పేస్ కల్పిస్తుంది. విద్యా సంస్థలు, పనిస్థలాల్లో పని చేసే స్త్రీలు, పురుషులు పరస్పర గౌరవంతో మనుషులుగా ఒకరితో ఒకరు కలవటానికి, మెలగటానికి అవకాశాలు ఏర్పడతాయి. అంత మాత్రన, కన్పించకుండా అమలయ్యే జండర్ కోడ్ మాయమవదు. పాత నైతిక సూత్రాలు ఏ స్త్రీలు ఏమి చెయ్యొచ్చో, చెయ్యకూడదో చెపుతూనే ఉంటాయి. వేసుకోవాల్సిన బట్టలు, ఇంటికి/హాస్టల్కి రావల్సిన సమయం, ఎవరితో మాట్లాడొచ్చు, ఎవరితో బయటికెళ్ళొచ్చునేవి, ఏ రకమైన హావభావాలు ప్రకటించవచ్చు వీటన్నింటిపై వుండే అప్రకటిత ఆంక్షలు ఉల్లంఘన జరిగిన మరుక్షణమే ప్రకటితమవుతాయి. వాటిని మీడియా చర్చలు సమర్థిస్తూ ఉంటాయి. స్వతంత్ర మహిళలపై మొత్తం సమాజం వారికి రక్షణ కల్పిస్తామనే సాకుతో ఒక గార్డియన్ పాత్ర తీసుకుంటుంది. నగరంలో బహిరంగ ప్రదేశాలు, పబ్బులు, నివాస ప్రదేశాలు ఇలా అన్నీ ఆ పాత్ర పోషించటానికి వేదికలవుతాయి.

జండర్ దృక్పథం నుండి చూసినప్పుడు 'చలనం లేని పాత నగరం', దూసుకుపోతున్న కొత్త నగరం వంటి విభజనలు పనికిరానివిగా తోస్తాయి. చలనం లేని పాత నగర స్త్రీలు చదువు, ఉద్యోగాల కోసం నగరం మొత్తంలో తిరుగుతున్నారు. కానీ, మెరుస్తున్న కొత్త నగరంలో యువతుల నడవడిక, స్వేచ్ఛపై వార్డెన్లు, యజమానులు తీవ్ర నిఘా పెడుతున్నారు.

నగరానికొచ్చే వలసలు జండర్, కులం, వర్గం, మతంతో ఎలా కలగలిసి పనిచేస్తాయో పరిశీలించినప్పుడు నగరం ఏక శిలా సదృశ్యంగా కాక, ఈ వివిధ రకాల ప్రజలు తమ తమ కథనాలతో కలిసి చూసే వివిధ నగరాలుగా కన్పిస్తాయి. హైదరాబాదు నగరం, నగర వాసుల అనుభవాలు రెండు వైవిధ్యంతో ముందుకొచ్చి ఇప్పటి వరకు మనకు తెలిసిన హైదరాబాదు కొత్త కోణంలో కనిపిస్తుంది.

**రాణి రోహిణి రమణ్, మిథున్ సోమ్, మధురిమ మజుందార్, ఎ. సునీత**

ఈ సంచిక కోసం వ్యాసాలు రాసిన రచయితలకి, అనువాదకులకి, సంపాదక బృందం హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతోంది.

*అనువాదం: ఎ. సునీత*

## భారతదేశంలో స్త్రీల వలసలకు కారణాలేంటి? 2001, 2011 జనాభా లెక్కలు చూద్దాం!

**■ మిథున్ సోమ్**

భారతదేశంలో పుట్టిన ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి వలస వెళ్లే ప్రజల్లో స్త్రీలదే అగ్ర స్థానం. 2011 లెక్కల ప్రకారం జాతీయ స్థాయిలో వారి భాగం 69 శాతం ఉంటే రాష్ట్ర స్థాయిలో (అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో) 65 శాతం వుండింది.

స్త్రీల వలసలకు ప్రధాన కారణం వివాహమని, అది 2001 నుండి 2011 వరకు స్థిరంగానే ఉందని లెక్కల విశ్లేషణలో తెలుస్తోంది. అంటే, పెళ్లయిన తరువాత పుట్టిన వూరు విడిచి వలస వెళ్లే స్త్రీల సంఖ్యలో పెద్ద మార్పు లేదు. జాతీయ స్థాయిలో వివాహ కారణంగా వలస వెళ్లే స్త్రీలు మొత్తం వలస వెళ్లే స్త్రీలలో 70 శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 61 శాతంగా వున్నారు. ఇందులో కూడా గ్రామీణ ప్రాంతం నుండి మరొక గ్రామీణ ప్రాంతానికి వలస వెళ్లే స్త్రీల సంఖ్య గ్రామీణ ప్రాంతం నుండి పట్టణాలకు, నగరాలకు వెళ్లే వారి సంఖ్య కంటే చాలా ఎక్కువ. గ్రామీణ: పట్టణ వలసల నిష్పత్తి జాతీయ స్థాయిలో 78:47 ఉంటే, రాష్ట్ర స్థాయిలో 71:37 వుంది.

స్త్రీల వలసలకు రెండవ ప్రధాన కారణం కుటుంబంతో పాటు వేరే ప్రాంతానికి వలస వెళ్ళటం. 2011 జనాభా లెక్కల ప్రకారం పని కోసం 10 శాతం మంది భారతీయులు తాము పుట్టిన ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి వలస వెళితే ఆంధ్రప్రదేశ్‌లో 12 శాతం ప్రజలు వలస వెళ్లారు. ఇది పురుషుల శాతం. పని కోసం వలస వెళ్లిన స్త్రీలు 2.4 శాతం మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 3.5 శాతం. 2001 తరువాత పని కోసం వలసల కెళ్లే స్త్రీల శాతం గణనీయంగా పెరిగింది. 2001లో 1.7 నుండి 2011లో 2.4 కి ఇది పెరిగితే, పట్టణ ప్రాంతాలకి వలస వెళ్లే వారి శాతం 2.9 నుండి 3.7కి పెరిగింది. అదేకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో పని కోసం వలస వెళ్లే స్త్రీల శాతం 2.2 నుండి 3.5 పెరిగితే, పట్టణ వలసల శాతం 4.2 నుండి 5.5కి వరకు పెరిగింది.

వ్యాపారం కొరకు వలస వెళ్లే ప్రజల సంఖ్య మొత్తం వలసల్లో 1 శాతం మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఇది 1.4 శాతం. స్త్రీలలో ఇది జాతీయ స్థాయిలో 0.4 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 0.5 శాతంగా వుంది.

చదువు కోసం వలస వెళ్లే వారి శాతం జాతీయ స్థాయిలో 2001లో 1.1 నుండి 2011లో 1.8 కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్ లో ఈ శాతం 1.8 నుండి 3.7 కి పెరిగింది. చదువు కోసం పుట్టిన ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి వలస వెళ్లే స్త్రీల శాతం జాతీయ స్థాయిలో 2001లో 0.4 ఉంటే 2011లో 1.0కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో 2001లో 0.8 శాతం ఉంటే 2011కి 2.5 శాతంకి పెరిగింది. అంటే దాదాపు 300 శాతం పెరిగింది.

*అనువాదం: ఎ. సునీత*

ఈ లెక్కలు తెలంగాణ విడిపోక ముందున్న 'ఆంధ్రప్రదేశ్'కి వర్తిస్తాయి.

***అడ్వయిజరీ బోర్డ్:*** *కె.లలిత, సూజీ థారు, వీణా శత్రుఘ్న, అస్మా రషీద్, ఉమ భృగుబండ, రమా మెల్కొటే, శీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, గోగు శ్యామల, కనీజ్ ఫాతిమా, మధుమీత సిన్హా, కె.సజయ.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ :*** **అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

# ఆశల నగరం: స్త్రీలకేమిస్తోంది?

■ మిథున్ సోమ్



మన దేశం నడిబొడ్డున ఒక ఊరి నుండి దక్షిణ భారతదేశంలోని హైదరాబాదు నగరానికి తన రాక ఎలా జరిగిందో కమల గుర్తు చేసుకుంది. ఆమె నివసించే ఫ్లాట్లో చిన్న అద్దాల గోడతో ఆఫీసు గది వేరుగా ఉంది. మేము మాట్లాడుకుంటుండగా ఆమెతో కలిసి ఉంటున్న స్నేహితులు (కమల మాటల్లో చెప్పాలంటే ఆమె "కుటుంబం") ఒకరొకరుగా ఆఫీసుకు బయలుదేరారు. ఇంటి పనిలో సాయం చేసే పనామె ఇల్లు శుభ్రం చేస్తోంది. తన పెంపుడు లాబ్రెడార్ కుక్కను గుండెలకు హత్తుకుంటూ ఇంటింటికి తిరిగి అమ్మకాలు చేయడంతో ప్రారంభమైన తన ఉద్యోగ జీవితాన్ని కమల మననం చేసుకుంది.

చిన్న హాస్టల్ రూములో నాలుగు మంచాలు, పలుచని చెక్క పార్టిషన్ సాయంతో నాలుగు భాగాలుగా విడగొట్టబడి గాలి, వెలుతురు సరిగా రాని ఇరుకు రూములో కూర్చుని లిపిక మాట్లాడింది. ఇంజనీరింగ్‌లో చేరి చదువు తరువాత "ఇస్రో" సంస్థలో ప్రాజెక్టు చేసి, చివరకు ఒక ఆఫీసు ఉద్యోగంలో స్థిరపడిన తన జీవిత ప్రయాణం గురించి చెప్పింది.

ఇంటి ముదు గదిలో సోఫాలో విశ్రాంతిగా కూర్చుని స్మృతి, తన చిన్నతనం, అమ్మ ఒంటరిగా ఆంధ్రాలోని ఒక చిన్న పల్లెలో కష్టపడి తనను పెంచి పెద్ద చేయడం గుర్తు చేసుకుంది. చిన్నతనంలో అప్పుడప్పుడు అమ్మకు కూలి పనిలో సాయం చెయ్యడం, చదువు పూర్తయిన తరువాత ఉద్యోగం కోసం హైదరాబాదు రావడం, ఒక పెద్ద మీడియా హౌస్‌లో చేరడం కాబోయే భర్తను కలవడం తరువాత పెళ్లి ఒక దాని తరువాత ఒకటి జరిగాయి. మేము మాట్లాడుకుంటుంటే స్మృతి తల్లి వంటింట్లో మా కోసం టీ, పకోడీలు చేస్తోంది, ఆమె కొడుకు ఇంటి ముందు చిన్న పిల్లలతో ఆడుకుంటున్నాడు.

పెళ్ళి తరువాత పుట్టి. పెరిగిన ఊరిని, కుటుంబాన్ని వదలి వెళ్లడం ఆడవారికి సహజమైన విషయమే. అయితే పై చదువుల కోసం, ఉద్యోగాల కోసం ఇల్లు వదలడం కొత్తగా పెరిగిన ధోరణి. ఇలా బయటకు వచ్చే స్త్రీల సంఖ్య చాలా పెద్దది కాకపోవచ్చు, కానీ వీరి సంఖ్య ఒక గుర్తించదగ్గ స్థాయికి పెరిగింది.

ఇక్కడ మనం ముఖ్యంగా గమనించవలసిన అంశం ఒకటుంది. అనాదిగా స్త్రీలు పుట్టిన ఊరు విడిచి కొత్త చోట్లకి వెడుతున్నా కూడా, "వలస" లెక్కలలో వీరిని గుర్తించడం జరగలేదు. పెళ్లయిన తరువాత పుట్టింటిని, ఊరిని వదలడం సంప్రదాయం కాబట్టి, దీనిని ఒక విశేషంగా పరిగణించలేదు. 1980వ దశకం వరకు అంతర్జాతీయ గణాంకాలలో, అంటే "వలస" గురించిన లెక్కల్లో, స్త్రీల ప్రస్తావన కనిపించదు. మెరుగైన జీవితం, కొత్త అవకాశాల కోసం స్వస్థలం విడిచిపెట్టేది పురుషులు మాత్రమే అన్న ప్రాతిపదిక మీదే వలస లెక్కలు జరిగేవి. ఇటువంటి నేపథ్యంలో పెళ్లి మూలంగా కాకుండా ఊరు వదిలి పెట్టి వచ్చే ఆడవారి సంఖ్య చిన్నదే అయినా రాబోయే పెనుమార్పులకు సంకేతం కాగలదు. రీతి, రివాజుల మూలంగా కాకుండా, స్వంతంగా ఇతర కారణాల వలన స్త్రీ ఇల్లు వదలడం, కుటుంబ సమీకరణలలో పెద్ద మార్పుకు దారి తీసే అవకాశం ఉంది. ఒక అమ్మాయి తలిదండ్రులు లేదా బంధువుల పరిధి దాటి స్వతంత్రంగా జీవించడం మొదలు పెట్టడంతో ఆమెను కాపాడడానికి కొత్త రక్షక వలయాలు ఏర్పడవలసిన అవసరం కలిగింది. అమ్మాయిలు నివసించే హాస్టలు వార్డెన్లు, వారు చదువుకునే విద్యా సంస్థల పెద్దలు, వారు అద్దెకుంటున్న ఇంటి పెద్దలు, ఇరుగు పొరుగు అమ్మాయిల రాకపోకల్ని గమనిస్తూ, కుటుంబం బదులుగా కొత్త సంరక్షకులుగా తయారయ్యారు.

ఈ సందర్భంలో స్త్రీల భద్రత గురించి మనకు కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి. పట్టణాలలోని విద్యా సంస్థల్లో, ఆఫీసులలో ప్రజారవాణా సౌకర్యాలలో, బహిరంగ ప్రదేశాలలో సురక్షితంగా తిరగడానికి వీరికి ఎటువంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి? అంటే పట్టణ వ్యవస్థకు సంబంధించిన యోజనలలో స్వతంత్ర మహిళల గురించి ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందా అన్నది ప్రశ్న. రోజు రోజుకి విశాలమవుతున్న పట్టణ భౌగోళిక పరిధిలో, అక్కడి సామాజిక వ్యవస్థలో స్వతంత్ర స్త్రీలకు ఎటువంటి స్థానం ఉంది?

హైదరాబాదు వంటి నగరం మన దేశంలోని నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థకి, దాని వలన వచ్చే ప్రగతికి సంకేతంగా పరిగణించబడుతుంది. ఇక్కడ వ్యాపించిన సాఫ్ట్‌వేర్ రంగం, ఔషధ నిర్మాణ రంగం ఆర్థిక ఉన్నతికి

సూచికలు. ఇటువంటి కొత్త రంగాలలో పెరుగుతున్న ఉద్యోగావకాశాల వలన, హైదరాబాదు వలసలకు కేంద్రంగా మారింది. అయితే ఇందుకు అనుగుణంగా నగర వ్యవస్థ ఎంత మేరకు తయారుగా ఉన్నదన్నది ముఖ్యమైన ప్రశ్న. వలసల వలన పెరుగుతున్న జనాభా వత్తిడి, ముఖ్యంగా స్వతంత్ర మహిళలకు అనుకూలమైన వసతులు కల్పించటంలో నగరం ఎంత ముందుకు వచ్చిందన్న సవాలుకు సరైన జవాబు లేదు.

ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదికే ముందు, స్త్రీలు చదువు కోసం, ఉద్యోగాల కోసం ఇల్లు వదిలి ఎందుకు వస్తున్నారో కనుక్కోవటం అవసరం. నగరం వీరికి ఏమైనా ప్రత్యేక ఆశలు కల్పిస్తోందా? ఈ వ్యాసంలో నేను చదువు లేదా ఉద్యోగం కోసం వలస వచ్చిన స్త్రీలపై దృష్టి కేంద్రీకరించాను. అన్వేషి ఆధ్వర్యంలో "నగరాలు, లైంగికత" ప్రాజెక్టు కింద జరిపిన పరిశోధనల ఆధారంగా ఈ వ్యాసం రాయడం జరిగింది. ఇందులో వివిధ నేపథ్యాల నుండి వచ్చిన 51 మహిళలను ఇంటర్వ్యూ చేయడం జరిగింది.

## హైదరాబాదు నగరం

ఈ నగరం తన నాలుగు వందల ఏళ్ల చరిత్రలో మన దేశంలోని ఇతర రాష్ట్రాల నుండే కాకుండా, ఇతర దేశాల నుండి వచ్చిన అనేక జాతుల వారికి స్థానం కల్పించింది. 2011 గణాంకాల ప్రకారం ఈ నగరంలోని 24 శాతం జనాభా ఇతర ప్రాంతాల నుండి వచ్చినవారే. 2000వ సంవత్సరం నుండి వలసలలో అకస్మాత్తుగా పెరుగుదల చూడవచ్చు. అవిభక్త ఆంధ్ర రాష్ట్రంలో 1990ల తరువాత కొత్త ఆర్థిక విధానాల వలన పట్టణాల కేంద్రంగా ఎదుగుదల మనం గమనించవచ్చు. 1990వ దశకంలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉండడం వలన. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలకు అధికార వికేంద్రీకరణ తేలిగ్గా జరిగింది. దీనితో ప్రతి రాష్ట్రానికి స్వంతంగా ఆర్థిక విధానాలను రూపొందించుకునే అవకాశం లభించింది. ఆర్థిక స్వాతంత్రంతో పాటు పెట్టుబడుల కోసం పోటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సర్వీసు మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగాలలో పెరుగుదల హెచ్చుగా జరిగింది. ఈ రంగాలలో అవకాశాలను తమ రాష్ట్రానికే ఎక్కువగా తెచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడ్డాయి. అనుకూలంగా ఉన్న రాజకీయ వాతావరణం, సమాజంలో పెరిగిన సాంకేతిక వినియోగం, ఆంగ్ల భాషా ప్రయోగంలో సమర్థత. ఇతర ప్రాంతీయ విశేషాలు (వేతన డిమాండు తక్కువగా ఉండడం వగైరా) వంటి అనేక కారణాల వలన పట్టణాలలో IT మరియు BPO రంగాలు వేగంగా అభివృద్ధి చెందాయి. (రాజు & జత్రానా, 2016)

2000వ దశకం మొదటి భాగంలో అవిభక్త ఆంధ్ర రాష్ట్రంలోని హైదరాబాదు నగరంలో ఐ.టి రంగం గణనీయంగా పెరగడం కనిపిస్తుంది (కెన్నెడీ, 2007). దీని వలన ఐటి ఆధారిత చిన్న వ్యాపారాలు అనేకం అభివృద్ధి చెందడం జరిగింది. పెట్టుబడులను ఆకర్షించడానికి హైదరాబాదులోని కొన్ని ప్రాంతాలను మంచి రోడ్డు సౌకర్యంలో, అంతరాయం లేకుండా విద్యుత్తు వంటి ఇతర సౌకర్యాలతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దడం జరిగింది. పెద్ద పెద్ద నిర్మాణాలు కేంద్రంగా ఉండే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. వీటి కోసం భూమి సేకరణలో సహాయం, లేబరు చట్టాలలో సవరణలు సహాయం, ఇతర సబ్సిడీలు పెద్ద ఎత్తున ఇవ్వడం జరిగింది. ఈ కారణాల వలన పెద్ద పెద్ద విదేశీ కంపెనీలు హైదరాబాదు వైపు మొగ్గు చూపాయి. వీటి రాకను రాష్ట్ర ప్రభుత్వ సఫలతగా చిత్రీకరించడం జరిగింది(కెన్నెడీ 2007, కామత్ 2011). అయితే ఈ అభివృద్ధిలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు భాగం రాలేదు. పైపెచ్చు వ్యవసాయ రంగంలో పెట్టుబడులు చెప్పుకోదగ్గ మోతాదులో తగ్గిపోయాయి(రెడ్డి & మిశ్రా, 2010). అనేక పర్యాయాలు ఇతర ప్రాంతాలకు లోటు చేసి మరీ నిధులు, విద్యుత్తు వంటి సౌకర్యాలు హైదరాబాదు నగరానికి కేటాయించడం జరిగింది.

నగరంలో వస్తున్న ఈ కొత్త రకం ఎదుగుదల కోసం ఎంతో మంది శ్రమ అవసరమయింది. హైదరాబాదును ఒక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి రక రకాల నిపుణులు కావలసి వచ్చారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల నుండి వచ్చే సాంకేతిక నిపుణులకు డిమాండు ఏర్పడింది. డిమాండుకు తగిన సంఖ్యలో కాలేజీలని ప్రారంభించడం జరిగింది. వీటికి పెట్టుబడి ముఖ్యంగా కోస్తా ఆంధ్రలోని వ్యవసాయ రంగంలోని మోతుబరుల నుండి వచ్చింది. అవిభక్త ఆంధ్రలో ప్రైవేటు రంగంలో వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు ఎక్కువ శాతం వీరి ఆధ్వర్యంలోనే నడిచాయి. హరిత విప్లవం ప్రభావంతో చాల చోట్ల వ్యవసాయం లాభసాటి వ్యాపారంగా మారింది. కోస్తా ఆంధ్రలో ముఖ్యంగా కమ్మ, రెడ్డి కులాల పెత్తందార్లకు వ్యవసాయంలో మిగిలిన లాభాలకు కొత్త వ్యాపారాలు కావలసి వచ్చాయి. వీరు సాంకేతిక విద్యా రంగంలో వినివేశం చేయడానికి అప్పటి ప్రభుత్వం కూడా మద్దతు పలికింది. భూసేకరణలో నీరు, విద్యుత్తు మరియు ఇతర సౌకర్యాలలో రాయితీలు భారీ ఎత్తున ఇవ్వడం జరిగింది. వీరు స్థాపించిన సంస్థల నుండి వచ్చే విద్యార్థులకు ఐ.టి మరియు ఐ.టి ఆధారిత కంపెనీలలో ఉద్యోగాలు దొరికాయి. పెరుగుతున్న ఐటి రంగం వలన ఈ సాంకేతిక విద్యా సంస్థలు బాగా లాభపడ్డాయి (కామత్, 2011. పే.194). ఇది కాకుండా వైద్య రంగంలో ప్రైవేటీకరణకు, అంటే ప్రైవేటు మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులకు కూడా హైదరాబాదు కేంద్రమయింది. ఈ రంగంలో ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టిన నగరాలలో హైదరాబాదు మొదటిది. ఆంధ్ర, తెలంగాణలోని అన్ని జిల్లాల వారికి హైదరాబాదు ఆశల మజిలీ అయ్యింది. నగరంలో విస్తరించిన ఐ.టి రంగం, వివిధ రకాలైన కోచింగ్ సెంటర్లు, రకరకాల చిన్న వ్యాపారాలు. ఇవన్నీ హైదరాబాదుకు రావడానికి ప్రధాన ఆకర్షణలుగా మారాయి.

మేము విద్య లేదా ఉద్యోగం కోసం వలస వచ్చిన మహిళలపైనే దృష్టి పెట్టినా, సర్వే తరువాత అన్ని అంశాలను జోడించే ఒక సార్వజనీన సూత్రం దొరకలేదు. ప్రతి ఒక్కరి ప్రయాణం, వారి జీవిత కథ విలక్షణంగా కనిపించాయి. చివరకు మేము పుట్టిన ఊరు వదిలిపెట్టి హైదరాబాదు వంటి నగరంలో ఈ స్త్రీలు స్థిరపడడానికి ప్రధానంగా కనిపించే కారణాలను మాత్రమే వేరు చేయడానికి ప్రయత్నించాము.

## ఉద్యోగ విద్యావకాశాలు

పెరుగుతున్న మధ్య తరగతి సమాజం కోరికలకు తగిన అవకాశాలు చిన్న ఊర్లు, గ్రామాలు కల్పించ లేకపోతున్నాయి. అందుకే అందరి కలలు పండేది హైదరాబాదు నగరంలోనే. విద్యార్థిని అనిక మాటల్లో చెప్పాలంటే, "మా ఊర్లో, మా చుట్టూ ఉండే జనంలో పిల్లలు పై చదువుల కోసం హైదరాబాదు వెళ్లారంటే గొప్ప గౌరవం లభిస్తుంది. అందుకనే కాకతీయ యూనివర్సిటీలో హాస్టల్లో ప్రవేశంతో సహా సీటు వచ్చినా, వద్దని, హైదరాబాదులో ఒక ప్రైవేటు కాలేజీలో చేరాను". నగరంలో కష్టపడితే గబగబా నిచ్చెన పైకి ఎగబాక వచ్చనే నమ్మకం చాలమందికి ఉంది. స్మృతి అంటుంది. "నగరం అయితే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కష్టపడితే ఉద్యోగంలో పైకి ఎదగవచ్చు. వ్యక్తిగా ఉద్యోగంలో పైకి రావాలంటే హైదరాబాదు రావడమే మార్గం". "ఆంధ్ర, తెలంగాణ విభజన తరువాత విశాఖ పట్టణం వంటి ఇతర నగరాల పేర్లు కొద్దిగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన జరగక ముందు మాత్రం జీవితంలో విజయం సాధించాలంటే హైదరాబాదు రావటం ఒక్కటే మార్గం" అంటుంది సోనియా.

హైదరాబాదులో ఉద్యోగం కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన మహిళలు కూడా ఉన్నారు. మధ్య భారతం నుండి వచ్చిన కమల చదువు పూర్తి చేసిన తరువాత పూణెలో పనిచేసి, చివరకు హైదరాబాదులో స్థిరపడింది. కొంత ఆర్థిక సౌలభ్యం ఉన్న ఇళ్ల నుండి వచ్చిన యువతులు, రెండు మూడు నగరాలు తిరిగి, ఎక్కడ ఉద్యోగం బాగుందో నిర్ణయించుకుంటున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల వలన తప్పనిసరి పరిస్థితులలో వలస వచ్చే యువతులు కూడా ఉన్నారు.

## ఆర్థిక అవసరాలు

ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇళ్ల నుండి వచ్చే ఆడపిల్లలు చాలా వరకు హైస్కూలు చదువు పూర్తయిన వెంటనే తమ ఊర్ల నుండి నగరానికి వలస వస్తున్నారు. వీరికి ఉన్న ఊరిలో ఉద్యోగం దొరకడం కష్టం. హైదరాబాదు షాపింగ్ మాల్స్‌లో, ఆసుపత్రుల్లో నర్సులుగా వీరు పని వెతుక్కుంటున్నారు. తాము సంపాదించిన మొత్తంలో దాదాపు 70–80 శాతం వీరు ఇంటికి పంపిస్తుంటారు. ఊర్లో ఇల్లు గడవడానికి వీరి సంపాదనే ముఖ్య ఆధారమన్న మాట.

శారద, శిరీష అక్కచెల్లెళ్లు. తండ్రికి జబ్బు చేసి పొలం పని మానేయడంతో వీరు వరంగల్ నుండి హైదరాబాదు వచ్చారు. ఒకరు డిగ్రీ పూర్తి చేసారు. ఇంకొక అమ్మాయి ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. వీరు డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో క్యాషియర్‌గా ఒకరు, సేల్స్‌లో ఇంకొకరు పని చేస్తున్నారు. ఇద్దరికి కలిపి నెలకు రూ.16,000/– వస్తుంది. అందులో రూ.4000/– మాత్రం ఖర్చుకు ఉంచుకుని మిగతాది ఇంటికి పంపిస్తుంటారు. వీరు చేసే పనిలో రోజుకు 10 గం॥లు నిలబడడమే. తరువాత ఇంటికి వచ్చి వంట చేసుకుని తిని,

పడుకోవడం, ఆదివారం వస్తే బట్టలు ఉతుక్కోవటం, ఇంట్లో ఏవన్నా పనులుంటే పూర్తి చేయడం, ఇంకా సమయం మిగిలితే కొంత విశ్రాంతి లభిస్తుంది. నర్సింగు కోర్సు పూర్తి చేసిన ఆనా తన ఊర్లో అవకాశాలు లేక హైదరాబాదు వచ్చింది. ఇక్కడ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తోంది. ఆమె చెల్లెళ్లు కూడా హైదరాబాదులోనే పని చేస్తున్నారు. వీరు కూడా స్వంత ఖర్చులకు కొంచెం డబ్బు ఉంచుకొని, ఎక్కువ భాగం ఇంటికే పంపిస్తారు. ఈ ఆడపిల్లల సంపాదన ఊరిలో ఇల్లు గడవడానికి ముఖ్యమైన ఆధారం అయింది.

**రాజకీయ అలజడులు**

కాశ్మీరులో, ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో శాంతి భద్రతలు కరువైనందున, ఎంతో మంది యువత భవిష్యత్తు దెబ్బతింటోంది. వారికి చదువు, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ కారణాల వలన ఆడపిల్లలు విద్య మరియు ఉద్యోగాల కోసం హైదరాబాదు వస్తున్నారు. రఫియా ఉత్తర భారత దేశం నుండి హైదరాబాదు విశ్వ విద్యాలయంలో పిహెచ్.డి కోసం వచ్చింది. ఆమె తండ్రి రాజకీయ సంఘర్షణలలో ప్రాణాలు కోల్పోయాడు. రాజకీయ అభద్రత వలన ఆమె స్వరాష్ట్రంలో పిహెచ్.డి ముందు చేసే ఎమ్.ఫిల్ కోర్సు పూర్తి చేయడానికే మూడేళ్లు పట్టవచ్చు. అటువంటప్పుడు పిహెచ్.డి పూర్తి చేయడానికి ఎంత టైము పడుతుందో ఊహించడం కష్టం. ఆమె మాటల్లో చెప్పాలంటే, "నేను పుట్టిన ప్రాంతం వదలకపోతే చదువే పూర్తి కాదు. ఇక ఉద్యోగం చేసి నా కాళ్ల మీద ఎప్పుడు నిలబడతాను? మా ఊర్లో రేపు పరీక్ష అనగా, గొడవలు మొదలయితే, వెంటనే కర్ఫ్యూ పరీక్ష వాయిదా జరిగిపోతాయి. దేనికి గ్యారంటీ లేదు" ఈ విషయాలన్నీ తల్లికి చెప్పి ఒప్పించి ఆమె హైదరాబాదు వచ్చింది.

అస్సాం నుండి వచ్చిన ప్రీతిబాల తమ రాష్ట్రంలో 2003వ సంవత్సరంలో జరిగిన జాతి కలహాలను గుర్తు చేసుకుంటుంది. కొన్ని జాతుల మిలిటెంట్ల మధ్య మొదలయిన గొడవలు సామాన్య జనం మధ్యకు వ్యాపించాయి. భిన్న జాతుల ప్రజలు ఒకరినొకరు అనుమానించటం మొదలు పెట్టారు. ఆమె చదువుకునే పాఠశాలలో కూడా విద్యార్థుల మధ్య గొడవలు జరిగాయి. ఇక గత్యంతరం లేక ఇంటర్మీడియట్ చదువు కోసం ఊరు వదలి రాష్ట్ర ముఖ్య పట్టణమైన గౌహతి వెళ్లవలసి వచ్చింది. ఆమె అంటుంది, "ఆ సమయంలో నా అంచనా ప్రకారం మా ఊర్లో 90 శాతం జనం గౌహతికి తరలి వెళ్లారు". పై చదువుల కోసం తండ్రి ఢిల్లీకి పంపడం ఇష్టపడక పోవడం వలన ఆ అమ్మాయి హైదరాబాదు నగరం చేరింది.

**ఇంటిలో శోషణ**

కొంత మంది అమ్మాయిలకు తాము పుట్టి పెరిగిన ఊరే కాకుండా, స్వంత ఇంట్లో రక్షణ లేకపోవటం వలన హైదరాబాదుకు వలస రావలసిన అగత్యం ఏర్పడుతుంది. ఆకాంక్ష ఇంటిలో ఎవరికి అక్కర్లేని కూతురయ్యింది. ఇంటర్మీడియట్ తరువాత అమ్మ, నాన్న స్వంతగా బతకమన్నారు. ఆమెకు కనీసం మాట సాయం కూడా చేయలేదు. హైదరాబాదుకు వెళ్లిపోదామన్న ఆమె నిర్ణయానికి వారి ఆమోదం లేదు, తిరస్కారం లేదు. "నీ బతుకు, నీ యిష్టం, నీ తలకాయ నొప్పి" అన్నారు. ఇటువంటి అమ్మాయిలకు నగరంలో బతుకు ఒక సురక్షిత అవకాశం అవుతుంది.

షింజిని ఒక అనాథ. అత్త, మేనమామల దగ్గర ఉన్నప్పుడు వారు ఆమెని సరిగా చూసుకోలేదు. ఆమెని, అమ్మమ్మని ఇద్దర్నీ బయటకు తరిమేసారు. హైదరాబాదులోని అనాథాశ్రమానికి ఎలాగోలా చేరింది. ఎవరూ లేకపోవటంతో ఇలా హైదరాబాదుకి చేరింది.

**తనదైన ఉనికి కోసం**

హదాసీ పట్టణానికి వచ్చేయాలన్న తన కోరిక గురించి ఈ విధంగా చెబుతుంది. "నాకు స్వతంత్రంగా బతకాలని కోరిక, అన్ని ఆంక్షలు, బంధాలకు దూరంగా.... ఒక మంచి కూతురు, అక్క, చెల్లెలు, మనవరాలు కాకుండా, అన్నింటికి దూరంగా అసలు నేనెవరిని అని తెలుసుకోవడానికి హైదరాబాదు వచ్చేసాను."

ఇంటికీ, తల్లిదండ్రులకు, బంధువులకు దూరంగా తామెవరో తెలుసుకోవడానికి, ఒక కొత్త ఆత్మ విశ్వాసంతో వలస వచ్చే అమ్మాయిలు ఒక ప్రత్యేక వర్గంగా కనిపిస్తున్నారు. తమ ఆలోచనల్ని విశాలం చేసుకోవడానికి, క్రొత్త దృక్పథాలు నిర్మించుకోవడానికి నగరంలో ఒక్కరిగా జీవించటానికే ఈ అమ్మాయిలు ఊరు విడిచి వస్తున్నారు. మన సమాజంలో ఉన్నత విద్య, ఉద్యోగం ఈ మార్గాన్వేషణకు మాధ్యమాలుగా పని చేస్తున్నాయి.

మోనిక తన పట్టణ అనుభవాల్ని ఈ విధంగా వ్యక్తం చేస్తుంది. "నేను చాల చిన్న వయస్సులో అంటే నాకు పదహారేళ్లు ఉన్నప్పుడే హైదరాబాదు వచ్చాను. స్వంత ఊరు వదలి పెద్ద నగరానికి వస్తే కొత్త అనుభవాలు, కొత్త అవకాశాలు లభిస్తాయి. మంచి చదువు వలన, పదిమందిలో మాట్లాడే నేర్పు, ఆఫీసులో ఏ విధంగా మెలగాలి... వంటి ఎన్నో విషయాలు తెలుస్తాయి. నేను ఇక్కడకు వచ్చిన మొదట్లో ఎంతో అమాయకంగా ఉండేదానిని. ఏమి తెలియదు. ఇక్కడి మనుషుల్ని గమనిస్తూ, వారు ఎలా మాట్లాడతారో, ఒక విషయం గురించి సంప్రదింపులు ఎలా చేస్తారో అన్ని తెలుసుకున్నాను. నా మీద నాకు ఇప్పుడు ఎంత నమ్మకం కలిగిందంటే ప్రపంచంలో ఏ మూలకి తీసికెళ్లి వదిలినా నేను బతగ్గలను. ఇంత ఆత్మవిశ్వాసం హైదరాబాదు నగరమే నాకు ఇచ్చింది. అందుకే ఈ ఊరంటే నాకు పిచ్చి".

**నగరం ఆశ కల్పిస్తుంది**

ఇంత వరకు మనం కలుసుకున్న మహిళలంతా ఒకే సామాజిక వర్గం, ఆర్థిక నేపథ్యం నుండి వచ్చిన వారు కాదు. అందరి కథలను కలిపే సామాన్య సూత్రం నగరం. ఇది ఆశయసిద్ధి కోసం, అవకాశం కోసం కేంద్ర బిందువుగా కనిపిస్తుంది. అయితే నగరానికి వచ్చి వీరంతా లాభపడ్డారా, జీవితాలు బాగుపడ్డాయా అని పరిశీలిస్తే సమాధానం తేలికగా లభించదు. ఈ జవాబు అనేక అంశాలపై ఆధారపడి ఉంది. అవి ఏమిటో ఒకటొకటి పరిశీలిద్దాం.

మొదటగా వారు పుట్టిన కులం, జాతి, ఊరు వంటి అంశాలు వారి వ్యక్తిత్వాన్ని, నగరంలో వారి భవిష్యత్తుని నిర్దేశించేవిగా కనిపిస్తాయి. ఉదాహరణకు, చదువుకున్న మధ్య తరగతి అమ్మాయిలకు ఐ.టి రంగంలో ఉద్యోగాల కోసం ప్రయత్నించే అవకాశం ఉంటుంది. రెండవది, కులం, సాంస్కృతిక నేపథ్యం కలిసి రాకపోయినా, వృత్తి నైపుణ్యం ఉంటే అమ్మాయిలు నగరంలో అందుబాటులో ఉన్న కోచింగ్ సెంటర్ల ద్వారా పెద్ద ఉద్యోగాల కోసం కావలసిన ఇతర అర్హతలు సంపాదించుకోవచ్చు. మూడవది, ఆర్థిక సంక్షోభంలో ఉన్న కుటుంబాల ఆడపిల్లలు మాత్రం ఏదో ఒక ఉద్యోగం కోసం వెతుకుతారు. సూపర్ మార్కెట్ అయినా, మాల్ అయినా, బ్యూటీ పార్లరయినా ఏదో ఒక చోట చిన్న ఉద్యోగం సంపాదించుకుంటారు. వారి ఇంట్లో ఆర్థికంగా స్థిరత్వం కొంత వరకు వచ్చిన తరువాతే, వీళ్లు కొత్త నైపుణ్యం సంపాదించటం, మెరుగైన ఉద్యోగాలు వెదుక్కోవడం గురించి ఆలోచించగలరు.

సహజంగా కుటుంబం, సమాజం విధించే ఆంక్షల పరిధి దాటి, స్వంతంగా ఏదైనా సాధించడం, దాని కోసం ప్రయత్నించడం, ఇవన్నీ నగరంలోనే సాధ్యం. అయితే ఈ ప్రయత్నంలో ఎవరు ఎంత దూరం వెడతారు, ఎంత వరకు అనుకున్న లక్ష్యం సాధిస్తారు అన్న విషయాలు మాత్రం తేలికగా అంచనా కట్టలేము. లక్ష్య సాధనలో ఆడవారు పని చేసే ఆఫీసులోని వాతావరణం, వారి చుట్టూ వారికి అండగా నిలిచే సంబంధాలు (పాతవి, కొత్తవి కూడా, పాతవి అంటే ఊరు, కుటుంబం నుండి ఏర్పడినవి; కొత్తవి అంటే, విద్యాలయాల్లో, ఆఫీసుల్లో, సమాజంలోని ఇరుగు పొరుగు ద్వారా ఏర్పడేవి) వీటన్నిటిపై ఆధారపడి ఉంటుంది. ఈ ఆడపిల్లల ఆశలను, లక్ష్యాలను వారు నివసించే నగరం ఎంత వరకు ఆదరించి అవకాశాలు కల్పిస్తుంది అన్నది కూడా ఒక ముఖ్యమైన అంశం. ప్రజా రవాణా సౌకర్యాలలో, హాస్టళ్లలో, అద్దెకు ఉండే ఇళ్లల్లో, విద్యా సంస్థల్లో, ఆఫీసుల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో నగరం ఆడవారికి సమాన అవకాశాలు ఇవ్వగలుగుతోందా? పెళ్లి కాని యువతులు ఒంటరిగా నివసిస్తుంటే, పితృస్వామిక సమాజంలో ఒక సహజమైన ఆందోళన ఉంటుంది. ఒంటరి ఆడపిల్లల లైంగిక స్వాతంత్ర్యం గురించి ముఖ్యంగా ఒక భయం ఉంటుంది. అంటే సామాన్యంగా ఉండే సమాజ నియమాలకు విరుద్ధంగా ఏమైన జరిగిపోతుందో ఏమో అనే భయం అన్నమాట.

ఒక కేంద్ర విశ్వవిద్యాలయం వంటి చోటులో, ఒక రాష్ట్ర విశ్వవిద్యాలయంలో, విద్యార్థినులు తమపై రాత్రి పూట విధించే కర్ఫ్యూని తొలగించాలని డిమాండు చేయవలసి వచ్చింది. దీని వలన మగపిల్లలతో సమానంగా అన్ని వేళలా విశ్వవిద్యాలయ గ్రంథాలయాన్ని వారు ఉపయోగించుకోవచ్చు. దీని కోసం వారు ఉద్యమించవలసి వచ్చింది. ఢిల్లీ నగరంలో "పింజ్రా తోడ్" ప్రచారంతో, భద్రత పేరిట హాస్టళ్లలో, అద్దె ఇళ్లలో హెచ్చు రుసుం వసూలు చెయ్యడాన్ని మహిళలు నిరసించారు. మేము మాట్లాడిన అమ్మాయిలలో కొందరు నగరంలోని కొన్ని కాలనీలలో తమకు ఇళ్లు అద్దెకు ఇవ్వకపోవడం, కొన్ని చోట్ల ఎక్కువ అద్దె ఇస్తేనే ఇల్లు ఇస్తానని దబాయించడం వంటి సమస్యలను ప్రస్తావించారు. అంటే డబ్బు ఒక్కోసారి "ఒంటరి మహిళ" అన్న ముద్రను అధిగమించడానికి ఉపయోగపడుతుంది. విభిన్న సామాజిక వర్గాల నుండి వచ్చే ఆడపిల్లలందరికి నగరం ఒకే విధమైన అవకాశాలు ఇవ్వదు.

ఉదాహరణకు ఐ.టి రంగంలో పనిచేసే ఆడపిల్లలకు ఇబ్బంది లేకుండా వారి ఆఫీసులు ఉచితంగా షటిల్ సర్వీసులు అందిస్తున్నాయి. ఇందులో పని చేసే ఆడవారు ఎక్కువ శాతం మధ్యతరగతికి చెందిన వారు. మాల్స్‌లో, బట్టల షాపులో, సూపర్ మార్కెట్లలో పని చేసే అమ్మాయిలు ఎంత రాత్రయినా పనయ్యాక తమ దారి తామే చూసుకోవాలి. అలాగే రాత్రి షిఫ్టులో పనిచేసే మున్సిపాలిటీ వర్కర్లకు కూడా ఎటువంటి రవాణా భద్రత లేదు. ఐ.టి రంగం విపరీతంగా పెరగడం వలన, అందులో పని చేసే యువతుల సంఖ్య కూడా ఎక్కువ కావడం వలన, ఈ ఆఫీసుల చుట్టు పక్కల ఉన్న కాలనీలు అమ్మాయిలకు అనుకూలంగా వసతులు కల్పిస్తున్నాయి. వారికి ఇళ్లు, ఫ్లాట్లు తేలిగ్గా దొరుకుతాయి. నగరంలోని ఇతర సౌకర్యాలు కూడా వారికి తేలిగ్గా అందుబాటులోకి వస్తాయి.

పట్టణాలలో చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ ఒంటరిగా బతుకుతున్నంత మాత్రాన, ఆడవారికి వారి జీవితంపై స్వయం నిర్ణయాలు తీసుకునే అధికారం పూర్తిగా లభించిందని భ్రమ పడకూడదు. ప్రస్తుతం చదువు, ఉద్యోగం వంటి అంశాలలో స్వంత నిర్ణయాలు తీసుకున్నా, పెళ్లయిన తరువాత ఈ స్వతంత్రం ఎంత వరకు మిగిలి ఉంటుంది అన్నది ప్రశ్నార్థకమే.

ఇల్లు, కుటుంబం అనే వలయం నుండి బయటపడి ఒంటరిగా బతకడం వలన ఆడపిల్లలకు ఆత్మ విశ్వాసమైతే ఏర్పడుతుంది. అయితే దీన్ని ముందు ముందు జీవితంలో ఎంత వరకు నిలబెట్టుకోగలరో అనేది మాత్రం ఒక క్లిష్టమైన పజిల్ వంటిది. నగరంలో చదువు, ఉద్యోగం వలన సంపాదించుకున్న కొత్త సామాజిక, సాంస్కృతిక నేపథ్యం దాని ద్వారా లభించే కొత్త అండదండలు, కొత్త అనుబంధాలు వాటి ద్వారా ఆమె అనుభవించే సుఖం, భద్రత, ఆత్మవిశ్వాసాలని, భవిష్యత్తు జీవితాన్ని ఆమె తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి.

**References:**


Census. 2011. Primary census abstracts. Registrar General of India, Ministry of Home Affairs, Government of India.

Kamat, Sangeeta. 2011. 'Neoliberalism, Urbanism and the Education Economy: Producing Hyderabad as a "Global City"'. Discourse: Studies in the Cultural Politics of Education, May, 187–202.

Kennedy, Loraine. 2007. 'Regional Industrial Policies Driving Peri-Urban Dynamics in Hyderabad, India'. Cities, Peri-Urban India Special Issue (pp. 89-147), 24 (2): 95–109. doi:10.1016/j.cities.2006.06.001.

Raju, Saraswati, and Santosh Jatrana. 2016. Women Workers in Urban India. Cambridge University Press.


Reddy, D. Narasimha, and Srijit Mishra. 2010. Agrarian Crisis in India. Oxford, New York: Oxford University Press.



***మిథున్ సోమ్ అన్వేషిలో పని చేస్తున్నారు.***

sommithun@gmail.com.


***అనువాదం: బి. శ్యామసుందరి***



# దిల్లీ కవనం

**■ నబీన దాస్**

నీ వలస లజ్జ తుప్పు
పెరిగిన నా గోళ్ళ కింద మకిలి
ఉత్తరించేస్తాను
ప్రతి దిగులు జాబిలి వేళ
*
పెనవేసుకున్న మన మబ్బుల నీడలు
నవ ప్రణయ తడి మేఘ శ్లోకాలు
దిల్లీ హాత్ వల్లించే మన కలయికలు
*
తొలగించేయ్!
అలసిన మువ్వలు
చునరీ చునరీ అరిచే కంచు గంటలు
నీ పాదాలాసాంతం సాంద్ర విచలిత స్వేద బిందువులు
**
చెల్లాచెదురయిన రాతిరి గాజుముక్కలు
మన ఊపిరి దర్శించే ప్రతీ ముక్క ఓ అద్దం
ఆ ఘడియలని ఇంటికి తీసుకువెళ్ళే డ్యూటీ కానిస్టేబుల్
**
నీ దిగులు అధరాల వెలిసిన పాన్ మరక
చర్ఖీ–దాద్రీ జానపద గాథను ఆలపించే గుల్ఖండ్
గేయాలు
ఎండిన బావిని చూసేందుకు
నేను వెళ్ళలేనే ఎన్నటికీ
**
నా ప్రియా!


నీవొక వేసవి ఊసు
చంచల కోరికల వీధుల నీ ఉప్పు రవ్వ నేను
పెదవిన పెదవి మోపి ప్రేమ ఖండంలో నర్తిస్తాం
చూపు తూర్పు సారించిన నీ మేకచర్మం డప్పు
మోహ్రౌలి దిగంబర వేల్పు నిదురించే చోట
విస్మృత లాలిపాట మేలుకొంటుంది స్వప్నాలతో
**
నీ తేనీటి కప్పులు నా పాలిన కనులు
పొంగక చెడిన పాలలో చిలికిన నా జాతకాలు చదువుతాయవి
ఒకటి పట్టు బాహువు, మొరటు లేత చర్మం మరొకటి
*
రసిక దిల్లీ మరిగి పోతుంది కెంపసుపు కాంతిలో
అలసి కన్రెక్కిన ఒంటె నడుము పోలిన వీధులు

కావున నా సఖా!
నను మరెక్కడయినా కలవవా?


**నబీన దాస్ హైదరాబాద్‌లో కవయిత్రి రచయిత**


*అనువాదం : అనంతు చింతపల్లి*

# నాకంటూ ఉండటానికొక చోటు




**■ రాణి రోహిణి రమణ్**

పెరుగుతున్న పట్టణీకరణతో చాలామంది మహిళలు, పురుషులు చదువు కోసం, ఉద్యోగం కోసం ఒంటరిగా నగరాలకు, పట్టణాలకు వలస రావటం ఎక్కువయింది. నూతన భారత అభివృద్ధి కథనంలో వాళ్ళు భాగం అయినప్పటికీ, నగరాల్లో వారి రోజువారీ జీవితంపైన, ముఖ్యంగా ఉండటానికి ఇల్లు వెతుక్కోవటంలో వారికెదురయ్యే అనుభవాలని పెద్దగా పరిశీలించటం జరగలేదు. ఒంటరి యుక్త వయస్కుల నగర జీవిత అనుభవంలో అవమానం, నడవడికపై పర్యవేక్షణ, ప్రత్యక్ష వివక్ష ఒక సాధారణ భాగం అయిపోయాయి. ఈ విషయంలో యువతులకు, యువకులకు పెద్దగా భేదం లేదు కానీ, అయా చర్యల ప్రభావం మాత్రం భిన్న స్థాయిలో ఉంటుంది.

'ఎందుకు బలాదూర్ తిరగాలంటే' (why loiter) అన్న ప్రచారోద్యమం (ఈ సంచికలో పింజ్రా తోడ్ కార్యకర్తలతో ఇంటర్వ్యూ, అలాగే మధురిమ మంజుదార్ వ్యాసం చూడండి) సమకాలీన భారత దేశంలో బహిరంగ ప్రదేశాల పురుషాధిక్య స్వభావాన్ని గుర్తింపులోకి తెచ్చింది. అలాగే కొన్ని నగర ప్రాంత కార్యకర్తల సమూహాలు మన బహిరంగ ప్రదేశాల్లో స్త్రీలకి మరుగు దొడ్లు కూడా లేకపోవటాన్ని, అత్యంత అవసరమైన రోడ్లపై వీధి దీపాలు వెలగకపోవటాన్ని కూడా ఎత్తి చూపారు. ఒకరకమైన పురుషాధిక్య చూపు రోడ్లపై తిరిగే స్త్రీలందరినీ లైంగికంగా అందరికీ అందుబాటులో వుండే స్త్రీలుగా పరిగణించి, మహిళలని బహిరంగ ప్రదేశాలకి చెందకుండా చేస్తుంది. మానవ ఆవరణ శాస్త్రవేత్త రిట్టి ల్యాకోస్ చెప్పినట్లు ఇప్పటి యువతీ, యువకులు విద్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో తమని తాము వినియమ పౌరులుగా వ్యక్తం చేసుకుంటున్నారు. అయితే ఇటువంటి వినమయ పౌరసత్వంలో పేద, వెనుకబడిన కులాలకి చెందిన యువతులకు చోటు లేకుండా పోతోంది.

నగరాలలోని నివాస యోగిత ప్రాంతాల్లో పెళ్ళికాని యువతులపై లింగ వివక్ష ఎలా పని చేస్తుందన్న విషయంపై మనకి వున్న కథనాలు తక్కువ. సూసీ తారు, రమా మెల్కోటేలు 1985లో హైదరాబాదులోని వర్కింగ్ విమెన్స్ హాస్టళ్ళపై పరిశోధన జరిపి, ఇక్కడుండే మహిళల ప్రవర్తనపై, నడవడికపై రోజువారీ పర్యవేక్షణ సాధారణ నియమంగా పరిగణించే స్థాయిలో ఉంటుందని తెలిపారు. 21వ శతాబ్దంలో కూడా మహిళా విద్యార్థినులపై ఇటువంటి వివాదాస్పద నిఘా పెద్ద ఎత్తున అన్ని విశ్వ విద్యాలయాల్లో అమలవుతుందని పింజ్రా తోడ్ ఉద్యమం తెలిపింది. శిఖా మఖాన్ అనే డాక్యుమెంటరీ సినిమా నిర్మాత తన 'బ్యాచిలర్ గర్ల్స్' అనే సినిమాలో ముంబైవంటి మహా నగరంలో ఎగువ మధ్య తరగతికి చెందిన స్వతంత్రంగా జీవించే మహిళల, ముఖ్యంగా యువతుల కథల్లోని బాధాకర అనుభవాలని చూపిస్తారు. వారి రాకపోకలు, కదలికలపై, ప్రవర్తనపై అమలయ్యే నిఘా, నిబంధనల్ని ఈ సినిమా చిత్రీకరిస్తుంది. ముంబైవంటి మహానగరం కూడా ఆయా మహిళల పట్ల శత్రుపూరితంగా వ్యవహరిస్తుందని చెబుతుంది.

ఈ శత్రుపూరిత భావన దేన్ని సూచిస్తుంది? అసలు నివాసయోగ్య ప్రాంతాల్లో ఈ మహిళలపై వుండే నిఘాకు, బహిరంగ ప్రాంతాల్లో అమలయ్యే నిఘాకు సంబంధం ఉందా? మరి ఈ నిఘా స్వతంత్ర మహిళల కదలికలపై, జీవితంపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుంది? ఈ నిఘాకి మూల్యం చెల్లించేదెవరు? అసలు మన నగరాల జెండర్ గురించి ఈ భావన ఏమి తెలియపరుస్తోంది?

**నాలుగు ప్రదేశాలు, నాలుగు అనుభవాలు: హైదరాబాదుకు వలసొచ్చిన యువతుల రోజువారీ సంఘర్షణ**

హైదరాబాదుకు వలస వచ్చిన యువతుల అనుభవాలను అర్థం చేసుకోవడం కోసం చేసిన ఇంటర్వ్యూలలో భాగంగా ఈ వివరాలు తెలిసాయి. నిజామీ సంస్కృతికి నిలయం హైదరాబాదు అని అందరికీ తెలిసిందే, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉంది. ఈ ఉద్యమంలో యూనివర్సిటీ విద్యార్థులు క్రియాశీలమైన పాత్రను పోషించారు. ఈ నగరం పెద్ద ఎత్తున ఐ.టిలాంటి సేవారంగాలకు కేంద్రంగా ఉండి ప్రతి సంవత్సరం వేలాది యువతీ, యువకులను ఆకర్షిస్తుంది. హైదరాబాదు నగరం గురించి జరిగే ప్రచారంలో ముందు చూపించేది వీళ్ళనే.

యూనివర్సిటీ హాస్టళ్ళు, ప్రయివేటు హాస్టళ్ళు, పి.జి వసతి గృహాలు, అద్దె ఇండ్లలాంటి వివిధ రకాల నివాస స్థలాల్లో ప్రవేశం కోసం ప్రయత్నించినప్పుడు ఎదురయినవే ఈ అనుభవాలు. ప్రతి కథ హైదరాబాదు గురించి ప్రచారంలో ఉన్న కథనాల్లోని జెండర్ కోణాలని ఆవిష్కరిస్తుంది. ఆయా ఊహాల్లో స్త్రీలకు స్థానం ఉందా అని పరిశీలిస్తుంది. స్త్రీలకి చోటు కల్పించని నగరాలు, ఆ ఆలోచనలేని నగర కథనాలు ఎంతమేరకి సరయినవనే ప్రశ్న వేసుకోవడానికి అవకాశమిస్తుంది.

*చాలా భయంకరమైన పరిస్థితి, చాలా మంది అడిగే ప్రశ్న, "మీరు ఏం చేస్తారు, ఎవరు మీతో ఉంటున్నారు" అని, మా జూనియర్ ఒకబ్బాయి ఇంటికోసం వెతుక్కుంటున్నాడు, తన తమ్ముడు కూడా తనతో పాటుగా ఉండటానికి వీలుగా. నేను కూడా అతనితో కలిసి వెతికాను. అయా ఇంటి ఓనర్లు అందరూ అతను నా బాయ్ ఫ్రెండ్ అని అనుకున్నారు. అతన్ని చూస్తే నా కంటే వంద సంవత్సరాల చిన్నగా ఉంటాడు. ఒక వేళ నిజంగానే అతను నా బాయ్ ఫ్రెండ్ అయినా సరే, ఇలాంటి విషయాలని, అతనితో నీ సంబంధం ఎలాంటిది, అని ప్రత్యక్షంగా అడగటం సరయిందేనా? నీకు అద్దెకు కావాలంటే 8000వేలంటారు. కానీ మధ్యవర్తి చెప్పింది 5000వేలే. అంటే దీని వెనుక అర్థం, 'మీరిద్దరూ కలిసుండొచ్చు, అది మేం పట్టించుకోకుండా ఉండటానికి 3000వేలు అదనంగా చెల్లించాలి' అని.*

**అనిందిత, పరిశోధక విద్యార్థిని**

అనిందిత, హైదరాబాదులోని ఒక సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతుంది. ఈ సంఘటన యూనివర్సిటీ దగ్గరలో కిరాయి ఇంటికోసం వెతుకుతుంటే జరిగిందని చెప్పింది. పశ్చిమ బెంగాలు నుండి వలస వచ్చిన విద్యార్థిగా ఆమె మొదట్లో

యూనివర్సిటీలోనే ఉండేది. యూనివర్సిటీ అధికారులు విద్యార్థులతో మాట్లాడకుండానే వాళ్ళ హాస్టల్స్ నిబంధనలను మార్చడంతో అనిందిత మరియు కొంత మంది పరిశోధక విద్యార్థులు సింగిల్ రూముల నుండి ఇద్దరు లేక ముగ్గురు ఉండే విద్యార్థుల రూములలోకి మారవలసి వచ్చింది. పరిశోధక విద్యార్థినిగా చదువుకోవటానికి సొంత గది అవసరం కాబట్టి, అనిందిత క్యాంపస్ వదిలి వెళ్ళటానికి నిశ్చయించుకుంది.

తాను యూనివర్సిటీలో చేరిన తర్వాత తన జీవితం, తనకు ప్రపంచం పట్ల ఉండే వైఖరిలో మార్పు వచ్చిందని చెప్పింది. తన అభిప్రాయాలను చెప్పాలంటే తన గొంతు విప్పవలసిన అవసరం ఉందని తెలుసుకుంది. లింగ భేదాలను సమాజం ఎలా బలవంతంగా రుద్దుతుందో క్యాంపస్‌లో తెలుసుకుంది. క్యాంపసు లింగ భేదాలను కొంత రూపు మాపుతుందని, కొన్నింటిని తిరిగి పునరుద్ధరింప చేస్తుందని తెలుసుకుంది కూడా. ఈ కారణంగానే పెద్దగా ఏం ఆలోచించకుండా ఆమె తనకంటే చిన్న వాడైన అబ్బాయితో ఇల్లు వెతకడానికి వెళ్ళింది, ఈ నేపథ్యంలో, ఇంటి కోసం వెతుకున్న సందర్భంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, యూనివర్సిటీల్లో చదువుకునే విద్యార్థులపై సమాజపు నిఘాని చూసి అసహ్యించుకుంది. అలాగే తన స్నేహితుల అనుభవాలను కూడా చెప్పింది, కులం, మతం, ప్రాంతం, జాతి పేరుమీద ఈ నిఘా ఇంకా ఎక్కువగా ఉంటుందని చెప్పింది.

విశ్వవిద్యాలయ విద్యార్థులను నివాస స్థలాలో చిన్నచూపు ఎలా చూస్తారనే విషయాన్ని ఆమె కథనం ఎత్తిచూపుతుంది. ఆమెకన్నా చిన్న వయసులోని యువకుడితో ఉంటే ఇళ్ళు చవగ్గా దొరికే అవకాశాలు తగ్గిపోతాయి. అందరికీ తెలిసిన విషయం ఏమిటంటే వలస వచ్చిన విద్యార్థుల రాకతో విశ్వవిద్యాలయాల చుట్టూ ఉండే నివాస ప్రదేశాల స్వభావంలో మార్పులు వస్తాయి. ఈ విద్యార్థుల కోసం తినుబండారాలు, సెకండ్ హ్యాండ్ పుస్తకాలు, వాడిన బట్టల వ్యాపారాలు పెరుగుతాయి. కానీ స్థానికులు పెరుగుతున్న అవకాశాలను చూడకుండా ఈ 'అసాధారణ' యువతులను తమ 'సాధారణ' చూపుతో కొలిచి వాళ్ళకి ఇళ్ళు ఇవ్వడం కేవలం ఆర్థికం కోసమే అని చెప్తారు.

*"హాస్టలులో ఏమీ జరగలేదు కానీ, నేను ఒకటి రెండు సార్లు రాత్రి వేళ ఆలస్యంగా హాస్టల్‌కి తిరిగి వెళ్ళాల్సి వచ్చినపుడు, నగరంలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నాను, చార్మినారు చూడటం కోసం వెళ్ళి హాస్టల్‌కి తిరిగి వెళ్తున్నాం. రాత్రి 7గంటలు లేదా 7.30 అయ్యింది. నేను చెప్పేది ఒక నెల క్రితం జరిగిన విషయం... (కొంత మంది మగవాళ్ళు అక్కడ నిలబడి ఉన్నారు) 'చూడండీ ఈ యూనివర్సిటీ అమ్మాయిలు రాత్రివేళ ఎలా లేటుగా వస్తున్నారో..... ఈ మధ్య ఆడవాళ్ళకి స్వేచ్ఛ కాస్త ఎక్కువైంది అని వాఖ్యానించాడు"*
**రఫత్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని.**

రఫత్ ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థిని. తమ విశ్వవిద్యాలయం చుట్టూ నివసించే వాళ్ళు తమను చూస్తున్న తీరు గురించి తన అనుభవాలను తెలిపింది. 'ఈ యూనివర్సిటీ అమ్మాయిలకు స్వేచ్ఛ ఎక్కువయిందనే' వ్యాఖ్య వీరిని వ్యక్తులుగా చూడలేదు. వీళ్ళు ఆలస్యంగా రావటానికి కారణం యూనివర్సిటీ వీళ్ళని సరిగ్గా నియంత్రణ చేయట్లేదని దాని అర్థం. మిగతా సెంట్రల్ యూనివర్సిటీల హాస్టళ్ళలా కాకుండా మహిళా హాస్టళ్ళ సమయ పాలన విషయంలో ఈ విశ్వవిద్యాలయం చాలా కఠినంగా ఉంటుంది. సాయంత్రం 6గంటల లోపు హాస్టల్‌లోకి వచ్చేయాలి. ఈ మధ్యనే విద్యార్థినులు హాస్టల్‌లో, లైబ్రరీలో చదువు కోవడానికీ, ఇతర అకాడెమిక్ అవసరాల కోసం ఈ సమయాన్ని పెంచాలని ధర్నా చేసారు. ఈ విధంగా ధర్నా చేసినందుకు కొంత మందిని పరిపాలనా విభాగం శిక్షించింది కూడా. వారిలో అమ్మాయిలు కూడా ఉన్నారు.

ఈ కోణం నుండి స్థానికుల ఆందోళనని మనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే, వారి ఉద్దేశంలో విశ్వవిద్యాలయ అధికారులు 'ఇటువంటి స్త్రీలని' నియంత్రించాలి. హబ్బర్డ్ (2012) మాటల్లో, స్థానికులు ఆయా విద్యార్థినులని 'స్వతంత్రమైన లైంగికతతో కూడిన శరీరాలుగా' చూస్తున్నారన్న మాట. అటువంటి శరీరాలు, స్త్రీలని కుటుంబ, సమూహ నియంత్రణలో పెట్టే సామాజిక సమతుల్యతని దెబ్బ తీస్తాయి. అందువల్ల వారి కదలికలు ప్రమాద భరితమవుతాయి. అంతేకాదు, ఇటువంటి స్వతంత్ర స్త్రీలు తమ నియంత్రణలో వుండే స్థానిక స్త్రీలకి వేరేదారులు చూపుతారనే భయం కూడా వారిని వెంటాడుతుంది. అందువల్లే ఈ విద్యార్థినులపై తమ నిఘాతో కూడిన కన్నేసి ఉంచుతారు.

*"నేను కిరణ్ అనే మిత్రుడితో హాస్టల్‌కి వస్తుంటే వర్షం వచ్చింది. అతడ్ని లోపలికి పిలిచే అవకాశం లేకపోవటం వల్ల హాస్టల్ బయట బట్టలు ఇస్త్రీ చేసే షెడ్డు క్రింద ఆగాం. నేను కూర్చుని ఉన్నాను, తను నిలబడి ఉన్నాడు. మమ్మల్ని అక్కడ చూసిన హాస్టల్లోని ఒకామె నా అన్న మిత్రునికి ఫోన్ చేసి చెప్పింది. అతను నా అన్నకు చెప్పాడు. ఈలోపు వర్షం ఆగిపోయి కిరణ్ వెళ్ళిపోయాడు. అన్నకు తెలిసిన వెంటనే నాకు ఫోన్ చేసాడు. 'బయటి వ్యక్తి ఎవరో ఫోన్ చేసి చెప్పినప్పుడు నాకు చాలా బాధగా అనిపించింది. నువ్వే ముందుగా ఫోన్ చేసివుంటే ఇంత ఇబ్బంది ఉండేది కాదు' అని చెప్పాడు. 'వర్షం పడుతుంది కాబట్టి ఆగమని చెప్పడం కూడా నా తప్పే' అని చెప్పాను. దానికి అన్న కూడా 'సరేలే' అన్నాడు. బయటి వ్యక్తి ఎవరో చూసి నా అన్నకు చెప్పడం నాకూ, నా అన్నకు కూడా బాగనిపించలేదు".*
**రాధ, చిన్నపాటి హాస్టల్‌వాసి.**

రాధ వ్యాపారస్థుల కుటుంబానికి చెందిన వ్యక్తి, ఆమెకి ఇంజనీరింగ్ పూర్తయ్యాక కావాలనుకుంటే కుటుంబ వ్యాపారం చూసుకొనే అవకాశం ఉంది. తన సొంత అస్తిత్వం కోసం హైదరాబాదుకి వచ్చింది. రాధకు ఆమె అన్న ఆమె రాకపోకలు, కదలికలు తన బాధ్యత అని భావించి హెచ్చరికగా ఫోన్ చేసాడని ఈ సంభాషణలో స్పష్టంగా తెలుస్తుంది.

రాధలాంటి అమ్మాయిలు తమ గుర్తింపు కోసం పెద్ద నగరాలకు వలస రావటమే తల్లి తండ్రులు తమకిచ్చిన ఒక 'బహుమతిగా' అనుకుంటారు. కుటుంబాలకు ఎంతో రుణపడి ఉన్నాం కాబట్టి, వారికి ఎలాంటి తలవంపులు తేకుండా చూడటం తమ బాధ్యత అనుకుంటారు. వారికున్న స్వీయ నియంత్రణకి హాస్టలు వార్డెనుల అదనపు నియంత్రణ తోడవుతుంది. ప్రైవేటు హాస్టల్స్‌లో ఆమె తోటివారు కుటుంబ సభ్యుల మాదిరిగానే ప్రవర్తిస్తుంటారు. తమ తోటి మగ మనిషితో మాట్లాడటం వంటి చిన్న చిన్న చర్యలని, నమ్మకాన్ని వమ్ము చేయటంగా చూస్తారు. విశ్వవిద్యాలయాల్లో అమలయ్యే అధికారిక నియంత్రణ బదులు ఇక్కడ 'నైతిక నియంత్రణ' రాధ అంతర్గత అపరాధ భావనని ఎక్కువ చేసింది.

స్వీయ 'నిఘా' వల్లనే మగ స్నేహితుడిని ఆగమని చెప్పడాన్ని, అదీ తన అన్నకి తెలియకుండా చేయడాన్ని తప్పుగా భావించి కొంచెం బాధపడ్డది. కుటుంబ వ్యాపారాన్ని కాదని పట్టణానికి రావాలని నిర్ణయం తీసుకున్న యువతిగా, తన గురించి పుకారులు రావడమే తనని బదనాం చేసినట్లు భావించింది. తనతోటి హాస్టల్‌లో ఉండే వ్యక్తే తన అన్నకు చెప్పిందని తెలిసీ ఆమెతోటి గొడవ పడాలనుకోలేదు.

*"నాకు బాగా గుర్తుంది..... ఆ ఇంటి యజమాని మెహిదిపట్నంలో నివాసముండేవాడు, ఇటువైపు సిటీకి వచ్చినపుడు, మా పక్క ఇంట్లో అతని చుట్టం ఇంట్లో ఉండేవాడు. మేముండే అపార్ట్‌మెంటులో మెట్ల కింద ఒక చిన్న రూంలో మందు తాగేవాడు. కొన్ని సార్లు నేను, మా రూంలో ఉండే స్నేహితురాలితో కలిసి పైకి వెళుతుంటే చూసాడు. 'రండి మేడమ్, మాతో కలిసి తాగండి, మీరు కూడా తాగుతారు కదా' అన్నాడు. తను మేము మందు, సిగరేట్లు తాగుతామని మావంక ఒక విధంగా చూసేవాడు."*
**సంగీత, హైదరాబాదులోని హైటెక్ సిటీలో కార్పొరేట్ ఉద్యోగిని.**

సంగీత హైదరాబాదులో ఎమ్‌బిఏ చదివి మల్టినేషనల్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. నగరానికి సంబంధించిన తన అనుభవాల గురించి అడిగితే ఆమె ఆఫీసులోగానీ, నివాస ప్రాంతాలలోగానీ 'బయటి వ్యక్తిగా' ఎలా ఫీలయిందో చెప్పింది. నగరంలో ఉండేవాళ్ళకు బయటి నుండి వచ్చిన ఒంటరి అమ్మాయిల నైతికతలో తేడా ఉందనే బలమైన నమ్మకం ఉంది. అందువల్ల అలా స్వతంత్రంగా జీవించే తోటి ఉద్యోగులను ఏ వాహనం లేకపోయినా, అర్ధరాత్రి ప్రయాణించాల్సి వచ్చినప్పుడు సురక్షితంగా ఇంటికి చేర్చాలనే ఆలోచన వారికి రాదు. ఎందుకంటే ఆమె 'సొంతంగా' వెళ్ళగలదనే అభిప్రాయం. సంగీత స్వతంత్రంగా ఉంటుందని, ఆమెపై ఎవరి నియంత్రణా లేదు కాబట్టే ఆమె ఇంటి యజమాని ఆమెను తనతో కలిసి మందు, సిగరేటు తాగమని అడిగాడు.

సంగీత చెప్పిన విషయాలు ఒంటరి యువతులు నగరంలో స్వతంత్రంగా ఉండటంలోని సమస్యలను బలంగా మన ముందుపెడతాయి. మా అధ్యయనంలో చాలా మంది మహిళలు ఇంటి నుండి దూరంగా ఉంటే స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఉంటూ తమ జీవితాన్ని తమ అభీష్టం ప్రకారంగా,

తమ ఆకాంక్షలకు అనుగుణంగా జీవించవచ్చునని చెప్పారు. తమని అందరూ స్వతంత్రులైన మహిళలుగా, తమ జీవితాలని నడుపుకునే సామర్థ్యమున్న వ్యక్తులుగా పరిగణించాలని వీరి ఆశ. కానీ దీనికి విరుద్ధంగా 'శృంగార చూపులకు' గురిచేసి వారి స్వతంత్రాన్ని 'సెక్సుకు అందుబాటులో ఉండేవారుగా' అర్థం చేసుకోవటం జరుగుతోంది.

**కొత్త సంరక్షకులు వారి నియంత్రణా తృష్ణ**

హబ్బర్డ్ (2012) వాదన ప్రకారం, నియంత్రణ లేని లైంగికత నగర జీవుల ఊహల్లో ప్రమాదం. ఈ ఊహాజనిత ప్రమాదాలు ఎన్నో కలలతో, ఆకాంక్షలతో నగరాలలోకి వచ్చిన ఒంటరి యువతుల శరీరాలకు జోడింపబడతాయి. తమ చదువులకోసం ఉద్యోగాల కోసం వచ్చే యువతులని తమ ఎదుగుదల కోసం నగరాలు ఆహ్వానిస్తున్నాయి. కానీ ఇలా వచ్చిన యువతుల మారిన జీవన శైలిని, కొత్త స్నేహాలను, అవకాశాలను, భద్రత పేరుమీద నియంత్రించే పనిని నగరంలోని వివిధ నిర్మాణాలు తమ చేతుల్లోకి తీసుకుంటాయి. ఒక రకంగా చూస్తే యువతులపై కుటుంబ నియంత్రణాధికారాన్ని పెద్ద నగరాలు తమ చేతిలోకి తీసుకున్నట్లు కనపడుతుంది.

ఇంటి యజమానులు, హాస్టలు యజమానులు, హాస్టలులోని తోటివారు, ఇలాంటి వాళ్ళు రోజువారీ స్థాయిలో కట్టడి చేస్తుంటారు. యూనివర్సిటీలు, సంస్థలు ఒంటరి మహిళల 'సంరక్షకులుగా' అవతారం ఎత్తుతాయి. మా పరిశోధనలో అర్థమయిందేమిటంటే జె.ఎన్.యు, హెచ్.సి.యు వంటి విశ్వవిద్యాలయాల్లో 'ఆకస్మిక తనిఖీల' పేరుతో అధికారులు హాస్టళ్ళల్లో జరిపే తనిఖీలు యువతీ యువకుల లైంగికతను అసహ్యకరంగా చూపిస్తాయి. వీటి ద్వారా విశ్వవిద్యాలయం వారి కుటుంబ సభ్యుల స్థానంలోకొచ్చి వారి 'సంరక్షకుడి'గా మారి ఆయా హక్కులని కూడా పొందుతుంది. ఇటువంటి తనిఖీల్లోనే ఒక విద్యార్థిని 'చెడ్డ ప్రవర్తన'ని చిత్రీకరించి ఆమె తల్లితండ్రుల దగ్గరికి పంపటం జరిగింది. అలాగే మాను విశ్వవిద్యాలయంలో అమ్మాయిలకి ఎక్కువ సమయం లైబ్రరీలో ఉండటానికి అవకాశమివ్వాలని అడిగినందుకు ఆమెని 'పింజ్రాతోడ్' ఏజెంటని, అంటే డబ్బులు తీసుకుని గొడవ చేసే అమ్మాయిగా వర్ణించారు. యూనివర్సిటీలు ఇటువంటి విచిత్ర వాదనల ద్వారా యువతులు ఎదుర్కొంటున్న సమస్యలను అప్రధానం చేస్తున్నాయి.

ఇలాంటి ప్రవర్తనలు ప్రయివేటు హాస్టళ్ళు, యూనివర్సిటీలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇటీవల కొన్ని సంవత్సరాల నుండి నైతికత పేరు మీద బహిరంగ స్థలాల్లో కనిపించే ఆధునిక యువతీ, యువకులపై దాడులు పెరిగాయి; ఉదాహరణకు, గౌహతీలో పబ్‌కు వెళ్తున్న యువతులపై దాడి; దీనికంటే ముందు శ్రీరామ సేన పేరుమీద పబ్‌కు వెళ్తున్న యువతులపై జరిగిన దాడులు; పబ్‌కి వెళ్తన్న యువతులను కొన్ని తెలుగు ఛానెళ్ళు వెంబడించి ప్రసారం చేయడం; ఉత్తర ప్రదేశ్‌లోని ఆపరేషన్ రోమియో; కేరళలో బహిరంగంగా ముద్దులు పెట్టుకుంటున్న వారిపై వ్యతిరేకంగా దాడులు. ఇలా 'నైతికతను కాపాడే' పేరుమీద ఆధునిక యువకులు, స్వతంత్రంగా జీవించే యువతులపై ప్రతి రోజూ జరిగే దాడులు, సాధారణీకరించ బడుతున్నాయి. ఇటువంటి నైతికత పేరుమీద జరుగుతున్న దాడుల సందర్భంలోనే అనందిత, రాధ, రఫత్ మరియు సంగీతలాంటి వాళ్ళు ఎదుర్కొంటున్న నిఘాని అర్థం చేసుకోవగలం. ఒంటరిగా, స్వతంత్రంగా బ్రతికే మహిళలను తమలో కలుపుకోవటానికి నగరాలు, వాటి నిర్మాణాలు సిద్ధపడకున్నా, ఇటువంటి యువతుల గట్టి సంఘర్షణే తమ కోసం, ఇతరుల కోసం హైదరాబాదులోను, ఇతర నగరాల్లోనూ యువతులకి మెరుగైన స్థానాన్ని సాధించటానికి మార్గం ఏర్పరుస్తుంది.

**References**


Lukose Ritty A. 2002.*"Gender Youth and Consumer Citizenship in Globalizing India Liberalization's children"* Duke University Press, Durham and London.

Melkote Rama and Tharu Susie J, "An Investigative Analysis of Working Women's Hostels in India", *Signs, Autumn* 1983, pp. 164-171.

Hubbard, Phil. 2012. *Cities and Sexualities.* Routledge, Oxon.

Phadke Shilpa, Khan Sameera and Ranade Shilpa. 2011. *"Why Loiter: Women & risk on Mumbai Streets"* , Viking, Penguin.



**రాణి రోహిణి రమణ్ అన్వేషిలో పని చేస్తున్నారు.**
rohini.redstar@gmail.com


***అనువాదం: ఆర్ శ్రీవత్సన్ & ఏశాల శ్రీనివాస్***



# సెలవుకు నివాళి గీతి

■ **నబీన దాస్**


ఆత్రంలో ఎన్నడూ ప్రేమించకు -
గడబిడ పెడుతుందది మన లోపలి పాదరసాన్ని
అందుకే, రాతిరికి తన మోతాదు మత్తుమందు వంపి
పురవడికి మెలేసి ఉపశమనించు ప్రతి పగటినీ
ప్రస్తుతం విద్యుత్తు సేకరణలో మునిగి తేలుతున్న మబ్బులు
మౌలాలి కొండల్లో రాతిరి పక్షుల విడిది
వెర్రెత్తించే రద్దీ, నా ఆరాటాల నడుమ
ఇందాకే వెలిసిన సాయంకాలం
వర్షంలో ఒంటికాలి బజ్జీ బళ్ళు
చిత్రమైన కంపుకొట్టే మురికి గుంటలు
ఉప్పు నీట పాలిపోయిన రేల-
మనలోన ఏమీ లేదు ప్రేమ క్రిమి తప్ప
దారి పక్కన పోగైన చెత్త కుప్పలా
మరీ సుదీర్ఘం అవనీయకు నీ మరుపు
తపాలా భట్వాడా వాడి దగ్గర ఇంకా గులాబీ వాసన
కొంచెం కుళ్ళి, మోహ లయలో,
కానీ యాతన మంచిదే.


**నబీన దాస్ హైదరాబాద్‌లో కవయిత్రి, రచయిత**


***అనువాదం : అనంతు చింతలపల్లి***

# షెవ్వా....నెత్తురు

■ జూపాక సుభద్ర





మా హాస్టలు బిల్డింగు మొత్తం వరంగల్ టౌన్‌లోనే బాలికలకు ప్రభుత్వం గట్టిచ్చిన ఒకే ఒక్క పక్కా బిల్డింగు. మిగతా సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ళన్నీ కిరాయికి తీసుకుని నడిపిచ్చేవే. ఓ నాలుగైదు రూములున్న గూన పెంకుటిల్లు గాని, దాబా గాని కిరాయికి తీసుకోవడం దాంట్ల నూటికి నూటిరువై మందిని కొట్టంల ఎడ్లను దోలినట్లు దోలడం, హాస్టల్ రన్ చేయడం యిదీ సోషల్ వెల్ఫేర్‌ల పాత్ర.

వెంటిలేషన్లు లేని చిన్న చిన్న పంది గుడిసెలసోంటి గదులు, సాలీసాలని టాయిలెట్లు. యిక రోజూ నీళ్ళకోసం, బాత్రూమ్ కోసం, అన్నం కోసం యుద్ధమే. కనీసం నాలుగున్నరకు లేస్తేనే స్నానం, టాయిలెట్స్, కార్యక్రమాలు. పొరపాటున కొంచెం లేటయ్యిందా....యిక స్నానం కాదు గదా టాయిలెట్‌కి కూడా ఓ మగ్గు నీళ్ళకోసం అవస్థలు పడాల్సిందే.

హాస్టలుకు దగ్గర్లో ఎక్కడైనా ఓపెన్ బోరింగ్ వుంటే యిద్దరు కలిసి ఒక్క బకెట్ మోసుకొని తెచ్చుకుంటే అవే మొకం టాయిలెట్స్‌కి. అదీ లేకుంటే వంటవాళ్ళు బియ్యం గడిగిన నీళ్ళు కూరలు కడిగిన నీళ్ళే గతి. అట్లా నీళ్ళ సౌలతు లేక స్నానాలు లేకపోవడం వల్ల సోషల్ వెల్ఫేర్ హాస్టలు పిల్లలందరికి గజ్జి, పుండ్లు సర్వసాధారణం. అదేందో గాని ఏ సోషల్ వెల్ఫేర్ హాస్టలుకు పోయినా కుక్కల, పందుల కొట్లాటలు కనిపిస్తాయి. బహుశా సోషల్ వెల్ఫేర్ భాగస్వామ్యం కోసమేమో.

కాని వరంగల్ టౌన్‌లో వున్న యీ బాల సముద్రం బాలికల హాస్టలు బాలికల కోసం ప్రభుత్వం గట్టించిన పక్కా బిల్డింగు. పైన కాలేజి చదివే వాళ్ళకు, కింద ఫ్లోరు రెండవ తరగతి నుంచి పది చదివే వాళ్ళకు. నీళ్ళ సౌలతు పుష్కలం. ఇరవై నాలుగు గంటలొచ్చేది. చుట్టు పదారి గోడుండేది. పై అంతస్తులో వుండే కాలేజాస్టల్లో ముప్పయ్ మందికి ఆర్రూములుండేవి. డిగ్రీ వాళ్ళు, యింటర్, వొకేషనల్ టీచర్ ట్రైనీలంతా కలిసుండే వాళ్ళు. కాని టాయిలెట్లు స్కూల్, కాలేజి వాళ్ళకు కలిపి కిందనే వుండేవి.

నా అదృష్టం కొద్ది నాకు యీ కాలేజి హాస్టల్‌లో సీటొచ్చింది. రోజు నీళ్ళు, స్నానం టాయిలెట్లు, తిండి యీ బాధల బారిన బడకుండా కేవలం చదువుకొనుడే నాకున్న పనయినందుకు నేనెన్ని జ్ఞాన గోపురాలు కట్టచ్చో అనుకున్నాను.

నేను యింటర్‌లో జాయినయినంక హాస్టల్‌కు పంపేటపుడు మా అయ్య దగ్గెర కూసోబెట్టుకొని "బిడ్డా! మనింట్ల అందరికి ఏడేండ్లకే పెండ్లి జేసిన నువ్వు సిన్న బిడ్డవని సదివిత్తన్న. నా పేరు కాపాడాలె నాకు పేర్దేవాలె, ఫలానోని బిడ్డ 'గిట్లనట' అనే పేరు నాకు రావద్దు బిడ్డా. పైలం"

అన్న మాటల్తో కాలేజి హాస్టలూ, పుస్తకాలు, నచ్చిన ఒకరిద్దరు దోస్తులు దప్ప నాకు వేరే జోలి ఏముండకపోయేది.

ఒకరోజు కాలేజి నుంచి హాస్టల్లకచ్చే వరకు కాలేజి స్కూలు పిల్లలు అందరూ బైట గుంపులుగ ఎవరికో ఏదో ప్రమాదకరమైందన్నంత సావు మొకాల్తో బయంగ గుసగుస మాట్లాడు కుంటంద్రు.

నేను గుంపు దగ్గరికి బోయి 'ఏంది యాకమ్మా! ఏందందరు బైటనే నిల్చున్నరు ఎవలకేమైంది? అనడుగుతుంటె హాస్టల్ వర్కర్ల మాటలు పెద్దగ వినబడ్తున్నయ్. 'ఏందే మల్లు! సీ పాడుగాను గింతపాపమానె సూసినావె బాతురూము నింద అర్సేయి మందాన నెత్తురు ఏ... సెందరిత్తందిపో..'

'అవును గని గిదెవలసనే....కాలేజి పోరగాల్ల పనా, యిస్కోలు పోరగాండ్ల పనా'

'ఏమోనే ఎట్ల సెప్పేటట్టులేదు కత' మల్లి అదే గొంతు.

'ఏ పోరికో కడుపైంది, అది పోగొట్టుకొనే దానికి కడుపు దిగదాగుంటదే'

'లచ్చక్కా యీ సదువుకునే ముండలను నమ్మద్దు'

'అవును గని రామక్కా కడుపు దిగదాగితే ఒంట్లె నెత్తురంత బోయి లేసెట్టుంటదానె కత మరి గీ పోరగాండ్లేమొ అందరు సింగిడి బింగిడాడ్తనే వున్నరు గాదు' నివద్దేనె సెల్లే ఎవ్వలు కుసకుసమని కనబడ్తలేరు. యింకో గొంతు 'ఆ...అనుమాన మత్తదని సేలాయించుక తిరుగుతంద్రు తియ్.'

యింతలో మల్లక్క అనే స్వీపరు బొచ్చె గొట్టుకుంట మా గుంపుల దిక్కు ఒక్కొక్కర్ని పట్టి పట్టి చూసినట్లు చూస్తూ "ఎవలకర్మ గాలిందో...యిది పాపమా అన్యాయమా ఎవల బతుకుల మట్టిబడ్డదో" పెద్దపెద్దగ అరుసుకుంట మాట్లాడ్తంది.

వాళ్ళ మాటలన్ని వింటాంటే యింకా బయంతో అయోమయంగా ఆందోళనగా, ఎవలకు వాళ్ళు మాట్లాడుకోడానికి కూడా నోరు ఆడ్తలేదు. పైన కాలేజి వాళ్ళం కూడా అందరం యీ విషయమ్మీదనే చేతులు కాళ్లాడక కిందనే సతికిలబడ్డాం పైకి పోకుండ.

యివుతల వాచ్‌మెన్ గుర్కా వార్డెన్‌ను తీసుకొనొచ్చిండు. పేరుకు రెండు హాస్టల్లకు యిద్దరు వార్డెన్లున్నా అనదికార నియంత్రణంతా కాలేజాస్టల్ వార్డెన్ చేతిలోనే. పిల్లల మీద నిఘా రకరకాలుగా పెట్టేది. వారానికి మాంసం పెట్టకున్నా పెట్టిందని, రోజు పప్పు, కూరగాయలు యివ్వకున్నా యిచ్చిందని సంతకం చేయాలి. తనిఖీకి వచ్చినపుడు కూడా అవే వల్లించాలె. పూర్తి అటెండెన్స్ లేకున్నా వున్నాదని చెప్పాలె. పిల్లలు ఎవరు ఎదురు తిరుగుతారోనని తెలివిగా ఎవరెవరు ఏయే టైమ్‌కి హాస్టల్‌కొస్తున్నారు? ఎవరికి మగ విజిటర్స్ వస్తున్నారు? ఎవరికి తాము చదివే కాలేజీల్లో అటెండెన్స్ రిపోర్టు, తక్కువగా వుంటుంది, ఎవరు షికార్లు,

సినిమాల కెల్తున్నారు. యిట్లాంటి డేటా అంతా రాబట్టి ఆ సంబందీకుల్ని ఎత్తి పొడుస్తూ కంట్రోల్‌లో వుంచుతూ, తను మా నోల్లు మూయించి మా కడుపులు గొట్టి ముడుపులు గట్టేది.

అట్లాంటి చరిత్రున్న మా వార్డెన్ యీ సమస్యతో ఎవర్ని ఏం జేస్తదో, ఎవరి పెంట పేగులు బైటబడ్తయో, ఎవర్ని హాస్టలుకెళ్ళి ఎల్లగొడితే, ఎవల జీవితం ఎప్పటి సిప్పెనుగుల బడ్డట్టయితదో అని ఎవల మనుసుల వాళ్ళం కుందాపన పడ్తుంటే మేడమస్తందని వర్కర్లు ఎదురుబోయి 'నమస్తమ్మాంటె, నమస్తమ్మ' అని నమస్తెలు గొట్టింఁడ్రు.

'నమస్తెగనీ, యీ హాస్టల్ల శానశాన కతల్జరుగుతాంటె మీరంతేంజేస్తంఁడ్రు' అంటూ బాత్రూమ్‌ల వైపు చూస్తూ పైకి ఎక్కుతుంటె కాలేజి, స్కూలు పిల్లల గుంపు లెక్కడికక్కడ సెదిరిపోయినం. బయం బయంగా వార్డెన్ వెనుకనే మెల్లమెల్లగా కదిలినం. యీలోగా పైన వరండల కుర్చీ వేసింఁడ్రు వర్కర్లు.

చాలా శాడిస్టు ఆనందం, హుషారుతో కుర్చిలో కూర్చొని 'మల్లమ్మా పెద్దమనిషైన స్కూలు పిల్లలందర్ని పిలుచుక రాపో, కాలేజోల్లెవరు కిందుండడానికి వీల్లేదు' వార్డెన్ ఆర్డర్. 'సరే మేడమ్' కాలేజి హాస్టల్ వాళ్ళం. కింద పెద్ద పిల్లలంతా వార్డెన్ ముందు దొంగల్లా దోషుల్లా, ఏ తప్పు చేయకున్నా ఏదో చేసినంత అలజడి, ఆందోళన మా మొకాలల్ల కనబడ్తుంది. వార్డెన్ మమ్మల్ని కండ్ల నుంచి కాళ్ళదాక గుచ్చి గుచ్చి లోతుగా వడగట్టినట్లు చూస్తుంది. మూడు రోజుల్నుంచి ఎవరైనా సుస్తిగా కనిపించింఁడ్రా, 'ఏమో అమ్మా'. వర్కర్ మల్లమ్మ...

'ఏమో! అంటవేంది అన్నం బెట్టేటప్పుడు సూడవా ఎవరి హెూషు ఎట్లుందో,

'అన్నం టైమప్పుడంత లొల్లి లొల్లి గుంటది మేడమ్ వాళ్ళు సాపిన గిన్నెల్నే సూత్తం గాని వాళ్ళ మొకాలు జూసేటట్లు ఉంటదామ్మ అంతాగమాగము! గా టైమ్లు'...

'యివ్వాల వూరికెవరు పోయింఁడ్రు' వార్డెన్. 'ఎవలంటే శాంతమ్మన్ను యింక పోషమ్మ' అంది మెల్లగ యాది తెచ్చుకుంట రాజమ్మ అనే అసిస్టెంటు కుక్కు.

'రాజక్కా గాల్లు మూడో తర్గతోల్లేనాయో సిన్నపిల్లలేగాదు...' అని మల్లమ్మ దీర్ఘందియ్యంగనే మాలో కొద్ది మంది, వర్కర్లంత జెర నవ్వినట్లు జేసింఁడ్రు.

'నవ్వులాట గాదు! యిది హాస్టలు పరువుకు సంబంధించిన విషయం. హాస్టల్‌కు వార్డెన్ గున్నందుకు నా పేరు గూడ బద్నామైతదీ' అంది, ఆమె నీతి నిజాయితే యీ హాస్టలుకు సిమెంటు సున్నమైనంత బెట్టుగ.

హాస్టలుకు రోజు లేటుగా వచ్చేవాళ్ళను, మగ విజిటర్స్ ఎక్కువగా వచ్చేవాళ్ళను, కాస్త షోగ్గా తిరుగుతూన్న వాళ్ళు వీళ్ళంగా ఆమె అనుమాన దోషులే. వీళ్ళని దగ్గరికి పిలుచుకొని ఎక్స్‌రే చూపుల్తో వాళ్ళ తనువునంత దుర్బినేసి చూసినట్లు చూసింది. పొరపాటున నేను ఆమె నియంత్రణా లిస్టులోని దోషుల విభాగంలో లేను గనుక బతికిపోయిననుకున్నా. ఒక్కొక్కర్ని గదిలోనికి పిలుచుకొని పోయి గద్దించింది, బెదిరించింది. దాదాపు యీ హింస పోలీసుల్లేని థర్డ్ డిగ్రీలాంటిదే. అంతకంటే ఎక్కువగానే.

మా కనీస అవసరాలను, పేదరికాన్ని, అటవాట్లను, మనసుల్ని, కులాల్ని అవమానించి కుళ్ళబొడిచినా అసలు విషయం తేలలేదు.

'మర్యాదగా ఒప్పుకొంది లేకుంటే యిప్పుడు దాచి పెట్టినా రేపైనా బైటబడ్తది' అప్పుడు చేసేదే ముండదు. జిల్లాల, రాష్ట్రంల పెద్ద గొడవైతది, పేపరోల్లొసర్తరు, పోలీసోల్లొస్తరు, ఏమనుకుంటంఁడ్రు కడుపులు పోగొట్టుకునుడు మాటలా మిమ్ముల జూసి వేరోల్లు తయారైతరు' అని అందర్ని నిలబెట్టి భయపెట్టింది. కానామె మాటలు గట్టుకు కట్టెలు మోసినట్లైంది. ఎవ్వరూ సప్పుడు జెయ్యాలే నేలసూపులు సూత్తంఁడ్రు.

'ఏంది మార్తమా! నువ్వు యీ మధ్య సరిగ్గ హాస్టల్‌లోనే వుంటలేవంట గదా!' వార్డెన్.

'లేదు మేడమ్ హాస్టల్లనే వుంటన్న మేడమ్' – తడబడుతూ మార్తమ్మ

'శకుంతలా నీ విజిటర్స్ తగ్గింఁడ్రా యింకా పెరిగింఁడ్రా' – సర్కాస్టిగ్గ.

మౌనంగా తల వంచుకున్నది శకుంతల.

లక్ష్మమ్మా వీళ్ళ రోగం కుదుర్చుడిట్ల గాదు గనీ...

'ఆ గుర్ఖాకు ఆఫీసు జీబు తీస్కరమ్మని చెప్పు'...

మేము తెల్ల మొకాలుసుకొని ఒకరి మొకాలు ఒకరు చూసుకుంటూ అసహాయంగా మేడం దిక్కు చూసే సాహసం చేయబోతుంటే 'గవర్నమెంటు మీకిన్ని సౌకర్యాలిస్తే మీరేసే వేషాలియ్యా; నెయ్యన్నం దినే కుక్కా అంటే అది లంద తోళ్ళకాడి కురికిందట ఏంజేస్తం హాస్పటల్లో తోసి టెస్టులు చేయిస్తేగాని ఎవరి బండారమేందో బైటబడ్తది?' అని అరుస్తూ జీబుకోసం మళ్ళా పురమాయించింది. ఆమె మాటలు మా కడుపుల్ల కాగే నూనో బోసినట్లైంది.

'జీబ్ వచ్చేలోగా మీరంతా మొకాలు కడుక్కొని బట్టలు మార్చుకొని రడీగుండండి' అని కొందరు వర్కర్లతో తన గదిలోకి పోయి గడేసుకున్నది. మేమంతా వరండల్నించి ఏమ్మాట్లాడుకోకుంట, సప్పుడు జెయ్యకుంట రూములల్లకు బోయినం.

'మేడమన్నది అర్తంగాలె' ఏందక్కా అనడిగిన ఓ డిగ్రీతో.

'యిండ్ల అర్తంగాని దేమున్నది' ఎవరి హెూష్ ఎట్లున్నదో టెస్ట్ చేసి చెప్తరు' అట్ల బాత్రూమ్ మిస్ట్రీ బైట బడ్తది' అని కొంచెం వ్యంగ్యంగ అన్నది వార్డెన్‌ను అనుకరిస్తూ..

యింకో అక్క అందుకొని 'మనకేం బయం మనమేమైన తప్పు జేసినమా పోదాం పా...ఎక్కడికంటే అక్కడికే'...

పదోక్లాసు కరుణ 'టెస్ట్ ఎట్ల జేస్తరక్కా' బియస్సీ చదివే దుర్గక్కతో....

'ఎట్లేమున్నది పొట్ట చూస్తరు, బట్టలూడదీసి కాళ్ళ మద్యల టెస్టరేసి చూస్తరు' అనంగనే చానమందికి కాళ్జేతులు సల్లగైనయ్, కడుపుల బయంజొచ్చింది, వణుకు బుట్టింది. ఎవరు బైటకు ఎక్కువ తక్కువ ఏమ్మాట్లాడుకుంటలేరు. ఎక్కడ యీ దవఖాన టెస్టును వ్యతిరేకించి మాట్లాడితే వుత్తపుణ్యానికి యీ గబ్బు నింద మొయ్యాల్ని వస్తదని ఎవరి బాధను, భయాన్ని 'టెస్టు చేయించుకోము' అనే ఆలోచనను ఎవలకు వాళ్ళే గుండెలోకి కుక్కుకొని బైటబడలేక పోతుంఁడ్రు స్కూలు వాళ్ళ నుంచి కాలేజి వాళ్ళవరకు.

యీ వార్డెన్ ఆగడాలు మాకొత్తగాదు. ఎన్నో రకాలుగా బాధలు పడి వున్నోళ్ళమే. కూర సరిపోత లేదన్నా, మంచి కూరలొండించండి మేడమ్ అని అంటే...

'గొడ్డు కారాలక్కుడా గతిలేని బతుకుల్నించొచ్చి యిక్కడ కూరలకు డిమాండ్ చేస్తరు. కూరల్దిన్న మొకాలైతె బాగుండు. గవర్నమెంటు సొమ్ము బాగ అచ్చొచ్చింది' అని తిట్టేది...

మాకొచ్చే పాకెట్ మనిని అడిగితే మీ పిచ్చకుంట్ల పైసలెవడిగ్గావాలె మెల్లగిస్తలే, అని హేళన చేసేది. ఎవరైన ఎదురడిగితే కచ్చబట్టి వాళ్ళను ఏవో కారణాలు చూపించి హాస్టల్నించి వెళ్ళగొట్టేది.

అభద్రతతో ఆమె ఏం చేసినా ఎదురు చెప్పని అసహాయత మాది. కాని యిప్పుడు మా శరీరాలను పరీక్షలకు గురిచేయబోతుందనేది మమ్మల్ని యింకా గాయపర్చినట్లైంది. కాని ఎదురు తిరగలేని అసమర్థత. ఎదురు తిరిగితే నిందమోయాల్సిన పరిస్థితి అది తలుచుకుంటేనే పెద్దలు యాదికొస్తుంఁడ్రు. అందరూ మారుమాట లేకుండా సీరియస్‌గా రడీ అవుతుంఁడ్రు.

యిట్లాంటి వాతావరణం మనసు నంతా కోసినట్లయింది అయినా నేను కూడా రడీ అవడానికే మనసును దిటవు చేసుకుంటుంటే ఎక్కడో ఓ బలం, ఓ ఆత్మవిశ్వాసం మాట వినటం లేదు. దవాఖానకు పోతే ఏ గొడవుండదు నలుగురితో నారాయణంత సుఖమింకోటి లేదు. కాని చిక్కంతా చికాకంతా పోకపోతేనే. ఆ చిక్కులను నేను ఎదుర్కొని నిలబడ్తానా రేపటి నా హాస్టలు బతుకెంత దుర్భరంగా వుంటదో ఎన్ని కాకులకు నేనెద్దుపుండు నవుతానో టెస్టుకు పోకపోతే నన్నే దోషిగా నిలబెట్టి హాస్టలు నుంచి తీసేస్తరేమో. మా అయ్యవ్వలు నా మీద పెట్టుకున్న ఆశలేంగావాలె అట్లని సిగ్గు సంపుకొని బట్టలిప్పుకొని టెస్టెట్లా చేయించుకోవాలె వార్డెన్ ఆడామె అయుండి ఆడపిల్లలకు యీ అబార్షన్ టెస్టులేంది.

అయినా యీ హాస్ట నేనెంత నా బిషాదెంత తిప్పి తిప్పి కొడితే యింటరే. అయినా వెళ్ళను దవాఖానకు, ఏదైతే

అదవుతుందనే ఓ సాహసం కడుపులో మెరుస్తూ గుండె చీకటిని ఊరిస్తుంది 'వద్దు' 'పోతా' చాలా సేపు ఘర్షించుకొని, సాహసాల కథలు సామెతలు, అనుభవాలు అన్నీ కూడి దిటవు కోసం 'గుండెకు రాళ్ళను పంప్' చేస్తున్నట్లనిపించి నాకు నేను మనసు నిబ్బరం చేసుకొని కడుపునిండా వూపిరి పీల్చుకొని మిగతా వాళ్ళని కూడా కదిలించి ఆపదానికి ప్రయత్నిద్దామని డిగ్రీ అక్క వాళ్ళ రూములోకి పోయిన మెల్లగ.

నన్ను చూడంగనే సునందక్క ఏంటి పిల్లా నువ్వింక తయారు పల్లేదు జల్దినదూ...

'నాకు రాబుద్దయితలేదక్కా'

'ఎందుకు'

'ఆ టెస్టు చేయించుదు నాకు ప్రాణం సచ్చినట్లనిపిస్తందక్కా నాకే కాదు అందరి కట్లనే వుంటదక్కా... మీరు పెద్దోల్లు, సీనియర్స్ గదాక్క ఫ్లీజ్ మేడమ్‌తో మాట్లాడి యీ దవాఖాన టెస్టులు ఆపు జేయించండక్కా' అన్నాను బతిమిలాడినట్లుగా

సునందక్క ఒక్కసారి ఏదో జరగరానిది, అనరానిది నేనంటున్నట్లు 'ఏంది రోట్ల తలబెట్టి రోకలికి మఱ్ఱబడినట్టున్నది నీ కత' చూదు అతి తెలివనుకోకు వద్దంటే మనమే లొసుగులబద్దం మనమే తప్పు చేయనప్పుడు చేయించుకుంటే వచ్చిన తలవంపేంది' కొంచెం ఘాటుగా అన్నది.

మల్లా తనే 'ఎందుకొచ్చిన తలనొప్పి! సప్పుడు జేకుండ తయారై రాపో పోదాం' అంది నన్ను గదమాయిస్తూ విసుక్కుంటూ. కాని నాకు కోపం సఱ్ఱున కాల్కచ్చింది. మీరెవ్వలైనా బోండ్రి నేనైతే రాను.

వెంటనే సునందక్క కోపంగా 'నీకేమన్నా పిచ్చా రాకుంటే నిన్ను హాస్టల్లుండ నిస్తరా... 'ఏమ్! బుఱ్ఱున మాటలేనా నోర్మూసుకొని నడువ్' అంది నాతో వున్న చనువుతో..

మల్లా 'నేను రావడం లేదక్కా! అని చెప్పి నా రూముకొస్తుంటే రడీ అవుతున్నవాళ్ళు, అయినవాళ్ళు, నా రూమ్మేట్స్ నన్ను 'తయార్వడవా' అని ఆశ్చర్యంగా అడుగుతుండ్రు.

యింతలో జీబువస్తే ట్రిప్పుకు పదిహేనుమందిని కుక్కి దగ్గర్లో వున్న నర్సింగ్ హొమ్‌కి తరలిస్తుండ్రు. మెచూర్ అయిన స్కూలు పిల్లల్ని, కాలేజి వాళ్ళందర్ని మా వార్డెన్ వర్కర్స్‌తో! రూము రూము గాలిం చల్లా చూడమంది. ఎవరైనా వెళ్ళకుండా దాక్కున్నారా అని, అట్లా నేను రూములుండి పోవడం ఆశ్చర్యపడి 'ఏందమ్మా అందరు పరీచ్చ కోసం బోతాంటె నువ్వేంది రూములున్నవు' అన్నది లక్ష్మమ్మ అనుమానంగా నన్ను చూస్తూ 'నేను రాను' అన్నా ఖచ్చితంగా.

అయ్యో మేడమూకోదమ్మా'

'మేడంతో నేం జెప్త నువ్వు పో' అన్నాను గొంతుపెంచి. నా కింకా పట్టుదల ఎక్కువయింది వార్డెన్ నియంత్రణా దోషుల్లో నేను లేకపోవడం నాకింకా శక్తి వచ్చినట్లయింది.

నన్ను వార్డెన్ అదుపులో పెట్టుకోవడానికి నాకే కారణాలు లేవు అందుకే నాకు నామీద నమ్మక మొచ్చింది. 'నేను టెస్టుకు వస్తలేననే విషయం హాస్టలంతా పొక్కింది. వార్డెన్ వర్కర్లను తీసుకొని వచ్చింది నా రూముకు. ముందు నాక్కొంచెం భయమైనా తర్వాత నిశ్చయంగా నిలబడ్డా.

'ఓ...తమరా! చూద్దానికి నంగనాసి తీరే వుండి చేసేవి యింత కార్యాలన్నమాట' చాలా రాష్‌గా, వ్యంగ్యంగా, కసిగా అంది కావాలని. 'మేడమ్ నేను టెస్టు చేయించుకోను' నేనేందో హాస్టల్లందరికి తెలుసు మీరేంజేస్తరో చేస్కోండి! నేనైతే హాస్పటల్‌కు రాను' చివరికి నిర్భయంగా, నిర్ణయంగా చెప్పగానే, ఆమె అహం దెబ్బతిన్నది.

ఆమె కెదురు మాట్లాడిన మనిషిలేదు. అట్లాంటిది వర్కర్ల ముందట మాట్లాడినందుకు సెవుదెగిన కుక్క తీరుగ కయ్యి కయ్యిమంటూ 'నీ సంగతి రేపు చెప్ప నువ్వెట్ల హాస్టల్లుంటవో చూస్త' అని ముగ్గురు వర్కర్లను తీస్కోని దవాఖానకు బోయింది.

కాని టెస్టులో ఎవ్వరూ బాత్రూమ్ నెత్తురు బాధ్యులు తేలలేదు. యిపుడా విషయం మబ్బు బట్టి నేను టెస్టు నిరాకరించడమే పెద్ద ఎజెండా అయి కూసున్నది. అందరి నోల్లే నేను బబుల్‌గమ్ నయిన, వార్డెన్ నన్నెట్లా యిరికించాలనే పన్నాగంలో యింటికి పోయింది. మేడమ్ రేపేం జేత్తదో ఏమో అనుకుంటా వర్కర్లు వాళ్లిండ్లకు బోయిండ్రు.


నా కడుపుల గుడగుడ మొదలైంది. మేడమ్ కూసిందంతా చేస్తే నా సదువేంగావాలె, మా అయ్యవ్వకు ఏం సమాధానం జెప్పుకోవాలె. మా హాస్టల్లోల్లెవరూ నాకు సానుభూతిగా మేడమేం జేస్తదోనని బాధపడుతూ నిద్రబోలేదు. రేపు వార్డెన్ ఏంబట్ట గాల్సిమీదేత్తదో, ఏమంటగట్టి ఎల్లగొడ్తదో, అని బాధపడి ఏడ్సుకున్నము అందరం. దావుకాండ్ల శానమందేడ్సిండ్రట టెస్టు చేసేటప్పుడు. హాస్టలుకొచ్చి చాలా మంది అన్నందినకుంటనే ఏందో పోగొట్టుకున్నోల్లల్లా దుప్పటి ముసుగేసుకొని కొందరేడిసిండ్రు. రేపు నా సదువు జీవితమెట్లా తెల్లార్తదో అనే ఆందోళనతో నాకన్ను మూతబడ్డలేదు.

తెల్లారు జామున గిట్ట కన్ను మలిగిందో లేదో కింద నుంచి వర్కర్లు మొత్తుకుంటున్న అరుపులు

'గీ కుక్క కగ్గివెట్ట ఎల్లగొట్టుండ్రి మల్లీ పంతలకు రాకుంట', 'యిదేనేమో నిన్న బాత్రూమ్‌ల కరాబు చేసింది యియ్యాల్ల మల్ల గీ బోరింగు గాడ' 'ఒవ్వ'!...అని నోరు గొట్టుకుంట గీ కుక్క జేసిన సంగద్దెలువక పోరగాండ్ల కెన్ని గోసలు, ఎన్ని ఎతలు ఎంత పంచనామయిపాయె' అనే మాటలు నా నెత్తిన నెయ్యి బాలు పోసినంతగా నా మనసు తేలిక పడ్డది.

వార్డెన్ నన్నింక ఏం చేయలేదు అని సంతోషంగా లేచి కిందికురికిన.

***జూపాక సుభద్ర ప్రముఖ దళిత రచయిత్రి. తెలంగాణ ప్రభుత్వంలో పనిచేస్తారు. చాలా సంవత్సరాలుగా అన్వేషి సభ్యురాలు ఈ కథ రాయక్క మాన్యమ్ దళిత మహిళల కతల పుస్తకం నుండి తీసుకోబడింది.***



Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## నిజాం పరిపాలన, ముస్లింలు

### హైదరాబాద్ 'విమోచన' గురించి నిజాలు, కట్టుకథలు

సంచిక : 1(త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ నవంబర్ 2010 విరాళం : 10 రూ.

విషయసూచిక

- ఎడిటోరియల్
- చరిత్ర, నిశ్శబ్దాలు
  ఎమ్.ఎ.మోయిద్
- నా శవ పేటికపై ఉత్సవాలా!
  ఎం.ఎ.మాజిద్
- హైదరాబాద్‌పై ఒక ముస్లిం దృక్కోణం
  హసనుద్దీన్ అహ్మద్
- ఆత్మ గౌరవాన్ని దెబ్బకొట్టవద్దు
  రఫత్‌సీమా, కనీజ్ ఫాతిమా
- అర్థసత్యాలు, అపోహలు
  దివికుమార్
- నిజాలను నీరు గార్చే ప్రయత్నం
  శ్రీనివాస్ ఏశాల
- 'ఒకే నిజాం': రెండు స్ఫురణలు
  ఆర్. శ్రీవత్సన్

H.E.H. Mir Osman Ali Khan
Nizam of Hyderabad


సంపాదకులు: ఎమ్.ఎ.మోయిద్, ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్

అనువాదకులు: కనీజ్ ఫాతిమా, ఎమ్.ఎ.మోయిద్, ఆర్.శ్రీవత్సన్ (ఇంగ్లీష్), ఎ. శ్రీనివాస్, ఎ. సునీత (తెలుగు)

అడ్వయిజరీ బోర్డ్: షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమ మెల్కొటె, కె. సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శత్రుఘ్న, డి. వసంత, కె.లలిత, ఎన్. వసుధ, గోగు శ్యామల, వి. ఉష

ప్రొడక్షన్: ఎ. శ్రీనివాస్, టి. శ్రీలక్ష్మి

ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.



Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## కులం, జనగణన, ప్రజాస్వామ్యం

### భిన్న దృక్పథాలు

సంచిక : 2(త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ జూన్ 2011 విరాళం : 10 రూ.

విషయసూచిక

- సంపాదకీయం
- కులం లెక్క తేల్చాల్సిందే
  దుర్గం సుబ్బారావు
- జనగణనలో కులాల్ని లెక్కిస్తే భారత దేశం కుల సమాజంగా మారిపోతుందా ?
  కె.సత్యనారాయణ
- బాక్స్ ఐటమ్‌లలోని సమాచారం వివరణలను అందించినవారు
  కె.వై. రత్నం, తెలుగుఅనువాదం : కె. సజయ
- కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు-రాజ్యాంగం రీత్యా అవసరం
  రవివర్మ కుమార్
- కులం, జనగణన: ముందు చూపుతో ఆలోచిద్దాం!
  సొనాల్దే దేశాయి
- జనాభా లెక్కలలో కులగణన ఎందుకుండకూడదు?
  వి.కె.నటరాజ్
- కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు
  సతీష్ దేశ్‌పాండే, మేరీజాన్

ప్రత్యేక సంపాదకులు : ప్రొ॥జి.కృష్ణారెడ్డి, డా॥కె.వై.రత్నం, ప్రొ॥చెన్న బసవయ్య

సంపాదకులు: ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్

అడ్వయిజరీ బోర్డ్: షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మేల్కొటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.

ప్రొడక్షన్: ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి

ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

ఫోటో : అనుపమ్ నాథ్ / ఎ.పి., గార్డియన్, యు.కె., 11-2010-జూన్, సౌజన్యంతో.

# ‘పంజరాలని బద్దలు కొడదాం’

## పింజ్రాతోడ్ సభ్యులతో సంభాషణ




■ **సంభాషణకర్త: రాణి రోహిణి రమణ్**

పింజ్రాతోడ్, విద్యార్థినులని సంకెళ్ళలో పెట్టి ఉంచటానికి హాస్టళ్ళు అవలంభిస్తున్న తిరోగమన నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఢిల్లీలో వివిధ కళాశాలల్లోని మహిళా విద్యార్థినులు చేస్తున్న ఉద్యమం. వీరు యువతులని పితృస్వామిక సమాజం రక్షణ పేరుతో చేసే కట్టడికి వ్యతిరేకంగా 2015 నుంచి పనిచేస్తున్నారు. భద్రత, రక్షణల పేరుతో చైతన్యాన్ని, స్వేచ్ఛని విద్యార్థినుల హక్కులను అణచివేయటానికి ఏర్పడిన సిసిటివి ఆధారిత భద్రతా నిర్మాణాన్ని సవాలు చేస్తున్నారు. యువతులపైన కర్ఫ్యూ పేరుతో నిషేధాలు విధించటాన్ని నిరసిస్తూ, వారికి ఆర్థికంగా అందుబాటులో ఉండని నివాసాలను, అతిథి గృహాలను నియంత్రించటం, విశ్వవిద్యాలయ వాతావరణంలో యువతులపై జరిగే లైంగిక వేధింపులను నిర్మూలించి, ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన అంతర్గత ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేయటం వంటి అంశాలపై పనిచేస్తున్నారనే విషయం మీ కర్థమవుతుంది. ఈ ఉద్యమానికి వ్యవస్థాపకులు గానీ, నాయకులు గానీ లేరు. అది గతంలో నడిచిన మహిళా ఉద్యమానికీ, రాబోయే ఉద్యమానికీ అనుసంధానంగా పనిచేసే కార్యకర్తల సమూహం. దీనికి ఢిల్లీలో నిర్వహించబడే ఎన్నో విద్యార్థి ఉద్యమాలలో భాగస్వామ్యం ఉంది. మన దేశంలో వివిధ ప్రాంతాలలో మొదలైన ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది.

**ప్రశ్న : మహిళా హాస్టళ్ళు ఈ పద్ధతిలో పని చేయటం మొదలుపెట్టి చాలా కాలమైంది. ఈ విధంగా ఉద్యమించే ఆలోచన మీకెలా కలిగింది? ఏ అంశాలకు మీరు ప్రతిస్పందిస్తున్నారు? ఇది ఎవరి చొరవ? మీరు మొట్టమొదట లేవనెత్తిన అంశాలేవి? ఈ ఉద్యమం ఎక్కడ మొదలైంది?**

జవాబు: హాస్టళ్ళల్లో అమలవుతున్న నియమ నిబంధనలకు గానీ, విశ్వవిద్యాలయాలలో పాతుకుపోయిన పితృస్వామిక ఆచరణకు గానీ వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమాలలో ఇది మొట్టమొదటి ఉద్యమం కాదు. గతంలో ఇటువంటి ప్రతిఘటనలు చాలా జరిగాయి. ఇందులో ఇటీవలి కాలంలో 2009లో రామ్‌జస్ కాలేజీలో, 2013లో సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో, నగరంలో ‘కిస్’ ఆఫ్ లవ్ (ప్రేమపూర్వకమైన ముద్దు), 2015 ఫిబ్రవరి 14న శుద్ధదేశీ రొమాన్స్, కమ్ అండ్ సీ ద బ్లడ్ ఆన్ మై స్కర్ట్ (నా లంగా పైన ఉన్న రక్తపు మరకలు చూడు”), వంటి ప్రతిఘటన/రాజకీయ కార్యకలాపాల ద్వారా కలుసుకుని సమూహంగా ఏర్పడిన యువతులున్నారు.

జులై 2015లో, జామియ పాలకవర్గం పంపించిన నోటీసు పెద్ద కలకలం రేపింది. విద్యార్థినులకి ‘రాత్రి బయటకు వెళ్ళే వెసులుబాటును’ నిరాకరించే నోటీసు అది. విద్యార్థినుల తల్లిదండ్రుల దగ్గర నుంచి, ఉత్తరాల ద్వారా గానీ, ఫాక్స్ ద్వారా గానీ, ‘తండ్రి’ అని చెప్పబడే వ్యక్తి పేరిట నమోదు చేసిన ఫోన్ నెంబరు నుంచి పంపించే ఎస్ఎమ్ఎస్ ద్వారా గానీ, ముందుగానే అనుమతి తీసుకుని, హాస్టలు నుంచి బయటకు వెళ్ళి, రాత్రి తిరిగి రానవసరం లేకపోవటాన్ని, “నైట్ అవుట్” అంటారు. దీనికి వరుసగా ప్రతిస్పందనలు మొదలయ్యాయి. జామియా హాస్టలు నుండి ఒక అమ్మాయి రాసిన శక్తివంతమైన ఉత్తరాన్ని చూసి, ఢిల్లీ మహిళా కమిషన్ తనంతట తానుగా పంపించిన నోటీసుతో మొదలైనది. ఈ అంశాన్ని ముందుకు తీసుకుపోవటానికి మీడియా దృష్టి పెడుతున్న ఈ సమయం, మైనారిటీ సంస్థ అయిన జామియాపై ప్రత్యేకంగా గురి పెట్టడం తగదని భావించి, ఫేస్‌బుక్ పేజిని ప్రారంభించాము. జంతర్ మంతర్‌లో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించటం కోసం సంతకాల ద్వారా వినతి పత్రం తయారు చేసి ఢిల్లీలోని వివిధ విశ్వవిద్యాలయాల హాస్టళ్లలో ఉండే విద్యార్థినుల కథలను అజ్ఞాతంగా ప్రచురించడం మొదలు పెట్టాము. మొదటి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా చేసిన డిమాండ్లు నిషేధాలను, గడువులను ఎత్తివేయడం, స్థానిక సంరక్షకుల అవసరాన్ని తీసివేయటం. నగరంలో స్థానిక సంరక్షకునిగా ఉండాలంటే, వివాహితులై 30 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సున్న పురుష బంధువులు కావాలి. అలాంటి వాళ్ళు ఇక్కడి విద్యార్థినులలో చాల మందికి ఉండటం కష్టం. అలా ఎవరైనా ఉన్నప్పటికీ, మహిళా హాస్టళ్ళలో ప్రతి వారం రాత్రుళ్ళు ఆలస్యంగా రావటం, బయటికి వెళ్ళటం వంటి అంశాలపైన తరుచూ అధికారులు పెట్టే చికాకులను భరించటానికి సిద్ధపడరు. హాస్టళ్ళలో వసతి పెంచాలని, యోగ్యతను బట్టి కాకుండ అవసరాన్ని బట్టి వసతి ఇవ్వాలనీ, నిరంతరం జరిగే అవమానాలకు ముగింపు పలకాలనీ, నైతిక ప్రవర్తన పైన కాపలా వ్యవస్థను తొలగించాలనీ, లైంగిక వేధింపుల ఫిర్యాదుల పరిహార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండు చేశాము.

విశ్వవిద్యాలయం చుట్టు పక్కల ప్రాంతంలో చాలా ఎక్కువ అద్దెలతో పెరుగుతున్న ప్రైవేటు అతిథి వసతులను నియంత్రించవలసిందిగా డిమాండు చేశాము. ఈ డిమాండ్లు, మా ఫేస్‌బుక్ పేజి, మేము జరిపిన మొట్ట మొదటి రాత్రి కవాతు, అలాగే ప్రజాభిప్రాయ సేకరణ ఇవన్నీ వివిధ కళాశాల కాంపస్‌ల మధ్య సంబంధాలకు అవకాశం కల్పించాయి. మొదట్లో ఒక వాట్సాప్ గ్రూప్ ముఖ్యమైన అందరినీ సమన్వయం చేయటానికి ఏర్పాటైంది. తరువాత రెండు సంవత్సరాల కాలంలో ఈ సంబంధాలు విస్తరించాయి. తరచు జరిగే సమావేశాలతో కళాశాలలు స్వంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ, వారి నిర్దిష్టమైన డిమాండ్లు చేయటం మొదలు పెట్టటం ద్వారా కొంత క్రమబద్ధమయ్యాయి.

**ప్రశ్న: హాస్టళ్ళ నిబంధనలు వంటివి సమాజంలో జెండర్ వివక్షతకు ప్రతీకగా చూస్తున్నారా? హాస్టళ్ళ తాళాలు బద్దలుకొట్టటాన్ని కళాశాల క్యాంపస్‌లలో ఉండే జెండర్ వివక్షతను సవాలు చేయటంగా భావిస్తున్నారా?**

జవాబు: విశ్వవిద్యాలయాలలో నిషేధాలు జెండర్ వివక్షతకు ప్రారంభం కానీ, అంతంగానీ కాదు. యువతులు ఎదుర్కునే సమస్యలను చర్చించాలంటే చాలా ప్రశ్నలకు సమాధానం వెతకాల్సి ఉంటుంది. పింజ్రాతోడ్ ఒక ఉద్యమంగా కొన్ని నిర్దిష్టమైన డిమాండ్లతో, కేవలం నిషేధాలను తొలగించటం కోసం మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ సామూహిక రాజకీయాల స్థాపనకు అవసరమైన వ్యక్తీకరణకు అవకాశమిస్తూ, విద్యార్థినులు తమ రాజకీయాలను వ్యక్తీకరిస్తూ, వాటిని నిలబెట్టే నిర్మాణాలను రూపొందించుకోవటానికి అవసరమైన వ్యక్తీకరణకు, అవకాశాల కోసం పని చేస్తుంది. ఈ ఉద్యమం విశ్వవిద్యాలయాల వ్యవస్థను సవాలు చేసే విద్యార్థుల ఉద్యమాలను, అవి 'యూజీసీని ఆక్రమించు' ఉద్యమం గానీ, రోహిత్ వేములకు న్యాయం జరగాలనే ఉద్యమం గానీ లేదా విశ్వవిద్యాలయంపైన నిరంతర దాడులని వ్యతిరేకించడంలో గానీ పాల్గొనటం, వాటితో సంబంధాలు పెట్టుకోవటం, విశ్లేషణపూర్వకమైన విమర్శ చేయటం వంటి వాటికి అవకాశం ఇచ్చింది. వీటికంటే ముఖ్యంగా ఈ ఉద్యమం మహిళా ఉద్యమంతో సంబంధాలు పెట్టుకుంటూనే అందులోని నిచ్చెన మెట్ల క్రమాన్ని ప్రశ్నిస్తూ 'మహిళ' అనే వర్గానికి ఉండే రకరకాల అర్థాలకు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ ఉండే అవకాశాన్ని ఇచ్చింది. ఈ అనుభవం మాకు వినయాన్ని నేర్పింది, స్ఫూర్తినిచ్చింది. దీని నుంచి మేము నేర్చుకుంటూనే ఉన్నాము.

మహిళల లైంగికత, స్వేచ్ఛకు సంబంధించి పితృస్వామిక, బ్రాహ్మణవాద ఆందోళనలలోనే ఈ నిషేధాలు వేళ్ళూనుకుని ఉన్నాయని మా భావన. దీని ఆధారంగా జెండర్ వివక్షత ఏర్పడింది. విశ్వవిద్యాలయాలు మహిళలకు పరిపక్వత లేదనే ఉద్దేశ్యంతో, వారికి నిర్ణయాలు తీసుకోగలిగిన సమర్థతను ప్రశ్నించి చూసే ఈ వ్యవస్థలను కొనసాగించే ప్రయత్నం చేస్తాయి. లైంగిక వేధింపుల పరిహార యంత్రాంగం ఏర్పాటు చేయని విశ్వవిద్యాలయాలు, భద్రత, రక్షణ పేరిట మోసపూరితంగా చేసే పనులను మేము సవాలు చేస్తూనే ఉన్నాము. ఇవి రాజ్యాంగ విరుద్ధమైనవి, ఎందుకంటే ఇవి మహిళల కదలికను, చైతన్యాన్ని అణచివేయటమే కాకుండ, ఇక్కడి విద్యార్థినుల పవిత్రతను కాపాడటంలో వాళ్ళ తండ్రికి, భర్తకు మధ్య వారధిలాగా వ్యవహరిస్తాయి. విశ్వవిద్యాలయాలలో ఈ విధానాలు విరివిగా ఉన్నాయి. నిషేధాలకు వ్యతిరేకంగా ఆర్థికంగా అందుబాటులో ఉండే వసతి కోసం, పరిహార యంత్రాంగం ఏర్పాటు కోసం మేము చేస్తున్న పోరాటం, మహిళల స్వేచ్ఛ కోసం, సామూహికీకరణ కోసం, వారి జీవితాలపై వారికి నియంత్రణ కోసం పితృస్వామిక వ్యవస్థతో బేరమాడే శక్తి కోసం. బ్రాహ్మణవాదం, పితృస్వామికవాదం, 'పబ్లిక్' 'ప్రైవేట్'ల మధ్య వైరుధ్యాన్ని ఇలా వర్ణిస్తుంది. 'మంచి బ్రాహ్మణ స్త్రీ', 'ప్రైవేట్'కి పరిమితమై ఉంటుందనీ, వీధులలో, పని ప్రదేశాలలో అంటే 'పబ్లిక్' అనబడే ప్రదేశాలలో కనిపించే స్త్రీలు లైంగికంగా అందుబాటులో ఉండేవారని, అవి చెడిపోయిన, అనైతిక ప్రదేశాలు కావటం వలన అక్కడ వెలివేయబడిన దళిత, ఆదివాసీ స్త్రీలుంటారనీ చిత్రీకరిస్తుంది.

మహిళలుగా మనకు ఈ పాత్రల్ని ఆధిపత్య వ్యవస్థలు నిర్ధారించాయి. ఇవి ఏ రకంగా చూసినా వాటి ప్రయోజనాలకి అనుగుణంగా రూపొందించబడినవే. ఇటీవలి కాలంలో మహిళా కార్మికులను రాత్రి వేళలో పని చేయటానికి 'అనుమతించే' విధంగా కార్మిక చట్టాలను సవరించటం ఒక మంచి ఉదాహరణ. దీని వలన ప్రయోజన మెవరికి? చీకటి పడిన తరువాత ఎట్టి పరిస్థితులలోనైనా కొందరు స్త్రీలని బంధించి ఉంచాలని తాపత్రయపడే ఈ వ్యవస్థ మరి కొందరు బయటికి వెళ్ళాలని ఎందుకు కోరుకుంటుంది? ఈ చట్టానికీ, మా మీద ఉన్న నిషేధానికి వెనుక ఉన్న కారణం ఒక్కటే. వ్యవస్థ అనుకూలతను బట్టి, మహిళలు వీధులపైన అయినా, ఇళ్ళల్లో హాస్టళ్ళల్లో బంధించబడి ఉంటారు. మన శరీరాలతో, జీవితాలతో వాళ్ళకుండే అవసరాన్ని బట్టి–వీధులను ఊడ్చే శ్రామికులగానో, ఫాక్టరీలలో చెమటోడ్చే కార్మికులుగానో లేక వర్గ–కుల అధికారాల రక్షణకు వారి 'గౌరవ మర్యాదలను' భద్రపరచటానికో అన్నది నిర్ధారించబడుతుంది. బయటికి రావటానికి మేము  చేసే పోరాటం, పితృస్వామిక వ్యవస్థకు ఎంత వ్యతిరేకమో, అంతర్గతంగా కుల వ్యవస్థకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు కూడా అంతే వ్యతిరేకం. నిషేధాల ద్వారా మహిళల శరీరాలపైన చేసే నియంత్రణకు, స్త్రీలను ఇళ్ళల్లో, హాస్టళ్ళల్లో అతిథి వసతులలో బంధించే బ్రాహ్మణ వాద పితృస్వామిక వ్యవస్థ మూలం. ఈ పోరాటం ఖచ్చితంగా ప్రైవేట్/పబ్లిక్ భావజాలాన్ని నిర్మూలించటానికే.

**ప్రశ్న: హాస్టళ్ళలో నియమ నిబంధనలను మార్చినంత మాత్రాన సరిపోతుందా? ఇప్పటి పరిస్థితులలో మహిళల రాకపోకల్ని, వారి భద్రత అనే అంశాలను ఏ రకంగా సమన్వయం చేస్తారు?**

పైన చెప్పినట్లు, నిషేధాలను తొలగించాలనే మా డిమాండు పోటీగా చేసినది కాదు. ఈ డిమాండు వయోజనులైన మహిళలకు, వారికి నచ్చిన చోటికి వెళ్ళటానికి హక్కుందనీ, వారికి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉన్నదనే అవగాహనపైన ఆధారపడి ఉంది. సిసి టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, మహిళలను పంజరాలలో బంధించినంత మాత్రాన, లైంగిక వేధింపులు, హింస అనే సమస్యలు పరిష్కారం కావు. నిజం చెప్పాలంటే పెద్ద సంఖ్యలో మహిళలు వీధులలోకి వచ్చి, పబ్లిక్ రవాణా సౌకర్యాలను వినియోగించుకుంటే ఈ వీధులు ఇప్పటికంటే ఎక్కువ భద్రంగా ఉంటాయనే భావన మా వ్యక్తీకరణకు కేంద్రం. ఎందుకంటే మహిళలు పబ్లిక్ ప్రదేశాలను ఆత్మవిశ్వాసంతో వినియోగించుకోగలగటం కూడా ముఖ్యమైన అంశమే. చాలాసార్లు, హాస్టలుకు సమయానికి చేరుకోగలగటం కోసం, వీళ్ళు తమకు నమ్మకం లేని దారులలో ప్రయాణించాల్సి ఉంటుంది.

కాబట్టి భద్రత, రక్షణ అనే ఈ తర్కం, మనకు ఏ రకంగానూ ఉపయోగపడదు, పోతే సమర్థవంతమైన, పారదర్శకమైన పరిహార విధానాన్ని నిర్మించటం, తరచు వినియోగించబడే వీధులలో వీధి దీపాలు ఏర్పాటు చేయటం, భద్రమైన, ఆర్థికంగా అందుబాటులో ఉండే పబ్లిక్ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయటం, లైంగిక హింసను ఎదుర్కొనటంలో ఎంతగానో ఉపకరిస్తాయి. పబ్లిక్ ప్రదేశాలు మహిళలకు సురక్షితం కావనే కథనాలను గణాంకాలు సమర్థించవు. వాస్తవానికి, చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యుల ద్వారా, పరిచయస్తుల ద్వారా అత్యాచారానికి, హింసకు గురవుతారు. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చేసే పోరాటం మొట్టమొదట సన్నిహితులూ, కుటుంబ సభ్యులు ఉండే వాతావరణంలో మొదలు కావాలి.

**ప్రశ్న: రాత్రుళ్ళు స్వేచ్ఛగా తిరిగే అమ్మాయిల అనుభవాలు అంత సంతోషకరమైనవి కాదని, ఎన్నో విశ్వవిద్యాలయాల నివేదికలు చెప్తున్నాయి. హాస్టళ్ళ నిబంధనలు మీరు ఆశించిన విధంగా సడలించబడితే మీ ముందున్న సవాలేమిటి?**

లైంగిక వేధింపులు విశ్వవిద్యాలయాల బయట ఎంత జరుగుతాయో, లోపల కూడ అంత విస్తారంగా జరుగుతాయి. చాలాసార్లు పితృస్వామ్య వ్యవస్థ నిబంధనలను అతిక్రమించిన మహిళలు కూడా దానికి శిక్షించబడతారు. బలపరిచే వ్యవస్థలు లేనప్పుడు మహిళల పైన దాడులు ఇంకా పెరుగుతాయి. ఒక ఉద్యమ రూపంలో పింజ్రాతోడ్, ఒకవైపు తన డిమాండును ముందుకు తీసుకుపోతూనే, ప్రత్యామ్నాయ ఆలోచనా విధానాన్ని సూచించింది. ఉదాహరణ, రాత్రిపూట కవాతు, కొన్ని వేళలలో ఏ ప్రాంతాలలో అయితే మహిళలు రాత్రిపూట తిరగటం నిషేధమో అటువంటి అవకాశాల్ని కల్పించటానికే.

అంతేకాదు, ఇంత విస్తృతమైన పద్ధతులలో హింస జరిగేది, మహిళలు కొన్ని వేళలలో బయట తిరగటం వలన మాత్రమే కాదు. ఉదాహరణకు, గ్రంథాలయాలలో విద్యార్థులకు, విద్యార్థినులకు వేర్వేరు వేళలు కేటాయించబడదు. అయినా, కొన్ని నిషేధాల వలన విద్యార్థినులకు కొన్ని సమయాలలో గ్రంథాలయాలు అందుబాటులో ఉండవు. అలా ఎవరైనా వెళ్ళినట్లైతే ఆమెను వింతగా చూడటం, అసౌకర్యం కలిగేటట్లు ప్రవర్తించటం, అందరూ కలిసి ఆమెను తరిమికొట్టడం జరుగుతుంది. ఇలాంటి 'నిషేధింపబడిన' ప్రదేశాలలో మహిళలుండడం అనే విషయాన్ని సాధారణం చేయటం, వీటిని అందుబాటులోకి తీసుకురావటం, ప్రజాస్వామికం చేయటం అవసరం.

**ప్రశ్న: మన దేశంలో వివిధ ప్రాంతాలలో ఉన్న హాస్టళ్ళతో సంబంధాలు పెట్టుకోవటం సాధ్యపడిందా?**

దేశంలో నలుమూలల ఉండే విశ్వవిద్యాలయాలలో ఇటువంటి పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. మానూ (MANUU)లో, విద్యార్థులు హాస్టళ్ళలోని హాజరు పట్టికలను, నిబంధనల పుస్తకాలను తగలపెట్టటం లాంటిది. ఒక శక్తివంతమైన సంఘటన. అదే విధంగా భోపాల్ నేషనల్ లా స్కూల్‌లో జరుగుతున్న ప్రతిఘటన లేదా,

బెనారెస్ హిందూ విశ్వవిద్యాలయంలో విస్తృతంగా జరుగుతున్న లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా జరిగిన శక్తివంతమైన ప్రతిఘటన, అన్నీ కూడా. ఈ ఉద్యమాలతో సంబంధం పెట్టుకున్నాము. వాటి నుంచి స్ఫూర్తినీ పొందాము. చాలాసార్లు, అందరినీ అందుకోవటానికి అందరూ సౌకర్యంగా భావించే, ఫేస్ బుక్ పేజీ చాలా ఉపయోగపడింది, మా కార్యకలాపాలు కొనసాగించటానికి, ముందుకు తీసుకుని పోవటానికీ హాస్టళ్ళతో, కళాశాలలతో ఇంకా దగ్గరి సంబంధాలు ఏర్పరచుకోవటానికీ ఉపయోగపడింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కొందరితో పరిచయం చేసుకోవటం ద్వారా ఆ ఉద్యమం గురించి ఇంకొంచెం లోతుగా తెలుసుకోగలిగాం. అయితే కొన్ని కళాశాలల్లో స్వతంత్రంగా స్థాపించబడిన పింజ్రాతోడ్ విభాగాలు, పనిచేస్తున్నాయనే విషయం మాకు మీడియా ద్వారా తెలిసింది. వివిధ కళాశాల కాంపస్‌లలో ఇటువంటి అంశాల ప్రభావం గురించి, అక్కడ జరిగే సంప్రదింపుల గురించీ విస్తృతమైన అవగాహనను ఈ ఉద్యమం మాకు కలిగించింది.

**ప్రశ్న: ఈ ఉద్యమంపైన మీడియా ఎంతవరకు దృష్టి నిలిపింది?**

జవాబు: పింజ్రాతోడ్ ఢిల్లీలో, డిసెంబరు 12 తరువాత జరిగిన ఉద్యమంలో భాగంగా పనిచేయటం వలన, మొదటి దశలో మీడియా దృష్టి కుతూహలంతో దీనిపైన పడింది. చాలాసార్లు పింజ్రాతోడ్ పాల్గొనే కార్యక్రమాల్లో అవి ఎంత చిన్నవైనా, అవి యూజీసీని ఆక్రమించు కార్యక్రమం గానీ, రోహిత్ వేములకు న్యాయం జరగాలి కార్యక్రమంగానీ, మీడియా అవసరానికి మించిన ఆసక్తి కనబరిచింది.

మీడియా నివేదికలు మాకు అనుకూలంగా ఉండటమే కాకుండా, కళాశాల అధికార యంత్రాంగంపైన, వాళ్ళు జారీచేసిన షో కాస్ నోటీసుల విషయంలో, వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వెంటాడే విషయంలో, ఒత్తిడి తీసుకురావటానికి ఉపయోగపడటమే కాకుండ, మీడియా కథనాలని ఏ విధంగా తయారు చేస్తుంది అనే విషయం పట్ల మాకు ఆసక్తి పెంచింది. చాలాసార్లు, మీడియా మేము చెప్పిన విషయాలను మార్చి, సవరించి బ్రాహ్మణవాద పితృస్వామ్య వ్యవస్థకు అనుకూలంగా, పితృస్వామ్య బదులుగా లింగ వివక్షత అని చెప్తూ, వ్యవస్థకు వాళ్ళ కథనాలని కొటేషన్లలో చూపించటం మొదలు పెట్టింది. మేము ఇటువంటి ఉద్యమాలలో పాల్గొనటం మా తల్లిదండ్రులకు తెలుసా? ఈ విషయంలో వారి అనుమతి ఉందా? అని, అడగటం, మమ్మల్ని "దేశంలోని ఆడపడుచులు స్వాతంత్ర్యం కోరుకుంటున్నారు" అని సంభోదించటం జరిగాయి. మేము దీనికి అభ్యంతరం చెప్పాము. చాలాసార్లు మేము మాకు తెలియకుండా "నేను చేయగలను (ఐకెన్) అనే ఉద్యమంలో భాగంగా పరిగణించబడ్డాము. విడిగా సభ్యులను కళాశాలలో షార్ట్స్ వేసుకుని, ఫోటోలు తీసుకొని పంపించమని కోరటం, మా ఉద్యమం ఒక వ్యక్తి యొక్క విప్లవ పోరాటం కాదని, విద్యార్థినుల సామూహిక ప్రయత్నమనే మా వాదనను తక్కువగా చేసి చూపించడమే. చాలాసార్లు తమ రిపోర్టుల సంచలనాత్మక విలువను పెంచటం కోసం మమ్మల్ని ప్రత్యేకంగా ఎంపిక చేసిన పోస్టర్లతో ఫోటోలు ఇమ్మని అడిగే హక్కు తమకుందని మీడియా భావించింది. జండర్‌ను ఒక విధంగా చూపించదలచిన మీడియాతో మేము నిరంతరం సంప్రదింపులు కొనసాగించాము. అంటే, ఉద్యమాన్ని ఒక స్థాయిలో నిలబెట్టటంలో మీడియా ఉపయోగపడిన విషయాన్ని మేము నిరాకరించలేక పోయినప్పటికీనీ, ఐఐటీ ఢిల్లీలో దుస్తుల నిబంధనల వంటి అంశాలల్లో ఎంతో ఆసక్తి చూపించి విస్తృతంగా ప్రచారం చేసిన మీడియా, అదే ఫేస్‌బుక్ పేజీలో ఒక దళిత విద్యార్థిని, తన భాగస్వామి బాయ్‌ఫ్రెండ్ తనను బెదిరిస్తున్నాడని చేసిన ఫిర్యాదులను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం గుర్తించదగింది.

**ప్రశ్న: ఈ ఉద్యమంలో పాల్గొంటున్న వారికి ఎటువంటి అనుభవాలు కలిగాయి? మీ కుటుంబాలు ఇరుగు, పొరుగు, స్నేహితులలో పురుషులు, సహచరులు, ఉపాధ్యాయులు దీనికి ఏ విధంగా స్పందించారు?**

కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహచరుల స్పందన విషయంలో ఎవరి అనుభవం వారిదే. ప్రోత్సహించటం, దోహదం చేయటం నుంచీ, సమ్మతించకపోవటం, హేళన చేయటం వరకు. చాలాసార్లు, సభ్యులు అత్యుత్సాహాన్ని చూపించే వారిగాను అతి చురుకుగా స్పందించే వారిగాను, చిత్రీకరించబడ్డారు. ఎన్నోసార్లు రాత్రి కవాతుకు సంబంధించి కుటుంబాలతో అబద్ధాలు చెప్పాల్సి వచ్చేది. ఉద్యమకారులుగా, మీడియాతో ఎవరు మాట్లాడతారు, ఎవరు మాట్లాడరు అనే విషయంపై, ఎవరి ఫోటో మీడియాకు అందచేస్తాము, ఫేస్‌బుక్ పేజీలో పెట్టాము వంటి అంశాల పట్ల జాగ్రత్తగా ఉండాల్సి వచ్చేది. ఇటువంటి అంశాలెన్నో ఉద్యమంలో మా నిర్ణయాలను ప్రభావితం చేశాయి. ఉద్యమంలో కీలక పాత్ర వహించిన కొందరు పబ్లిక్‌గా కనిపించే ప్రతిఘటన కార్యక్రమాలలో కానీ, సమావేశాలలో కానీ పాల్గొనలేరు. పింజ్రాతోడ్, తెల్లవారి ఝామున 5 గంటలకు గోడ పత్రాలను అతికించటం, అర్ధరాత్రి హాస్టల్ గదుల తలుపుల కింద నుంచి కరపత్రాలు వదిలి పెట్టటం వంటి, చాటుగా చేసే గెరిల్లా యుద్ధ పంథాను అవలంబించింది. ఒక్కోసారి వేరే పేరుతో కూడా పని చేసింది. కొందరు కార్యకర్తలకు ఉద్యమంలో తమతో కలిసి పనిచేసే వారు సహచరులు కూడా అయ్యారు. ఇవి కూడ కఠిన సమయాలలో అర్థం చేసుకుని అంగీకారం ఫలితంగా ఏర్పడిన సంబంధాలే. అయితే సహచరులు అలా లేనప్పుడు, కార్యకలాపాల తీవ్రత, నిర్వహణ బాధ్యతల వలన కలిగే ఒత్తిడి వలన సన్నిహిత సంబంధాలపైన వ్యతిరేక ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా సహచరులైన వారు ఈ స్థాయి రాజకీయ క్రియాశీలతను అర్థం చేసుకోలేక పోవటం వలన. అదే కారణంగా అర్థవంతమైన సంబంధాలు ఏర్పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉద్యమం ద్వారా ఏర్పడిన స్నేహితులతో, కార్యకర్తలు సన్నిహిత భాగస్తుల ద్వారా తామనుభవించిన హింసాత్మక ఘటనలను కూడా పంచుకున్న సందర్భాలున్నాయి. ఏబివిపి సభ్యులే కాక తోటి కార్యకర్తలు వేధించిన ఆయా సందర్భాల్లో యూనివర్సిటీ పాలనా యంత్రాంగంతో పోరాడటానికి వారికి మేమిచ్చిన తోడ్పాటుతో పాటు, దాని గురించి బయటి వారికి అర్థం చేయించటానికి, కుటుంబ సభ్యులతో వారి పోరాటానికి కూడా మా మద్దతునిచ్చాం.

**రాణి రోహిణి రమణ్ అన్వేషిలో పనిచేస్తున్నారు**


**rohini.redstar@gmail.com**


ఈ ఇంటర్వ్యూ 2018లో ఈ మెయిల్ ద్వారా జరిగింది. 2019లో ఈ వేదికని నిశితంగా విమర్శించి పింజ్రాతోడ్ నుండి తాము వైదొలుగుతున్నట్లు దళిత, బహుజన, మైనార్టీ విద్యార్థినులు ప్రకటించారు. ఈ ప్రకటన రౌండ్ టేబుల్ ఇండియా బ్లాగ్‌లో వచ్చింది.

http://roundtableindia.co.in/index.php?option=com_content&view=article&id=9582&catid=129&Itemid=195

https://pinjratod.wordpress.com/2019/03/20/women-on-the-edge-of-time-reflections-from-pinjra-tod/

*అనువాదం : పి.మాధవి*



# తమకి చెందని చోటు: బహిరంగ స్థలాల్లో స్త్రీలు

## (వై లాయిటర్ పుస్తకం ఆధారంగా)


■ మధురిమ మజుందార్

శిల్పా ఫాడ్కే సమీరా ఖాన్ ఇంకా శిల్పా రనడే రాసిన 'వై లాయిటర్: విమెన్ అండ్ రిస్క్ ఆన్ ముంబై స్ట్రీట్' అనే పుస్తకంలో మహిళలకు పబ్లిక్ ప్రాంతాలు అందుబాటులో ఉండటం, బహిరంగ ప్రదేశాలలో పని లేకున్నా స్వేచ్ఛగా తిరగ గలగటం, ఆ క్రమంలో ప్రమాదాలకి సిద్ధపడడం స్త్రీవాదులు ముఖ్యమైన అంశంగా పరిగణించాల్సిన అవసరం అని వాదిస్తారు. సాధారణంగా మహిళలకు బహిరంగ ప్రదేశాల్లో షరతులతో కూడిన ప్రవేశం ఇవ్వబడుతుందని, అదీ తాము గౌరవ ప్రదమయిన వారమనీ, తమకు వేరే ఉద్దేశ్యమేమీ లేదనీ నిరూపించుకున్న మేరకే అన్న విషయాన్ని ఈ పుస్తకం ఎత్తి చూపుతుంది. స్త్రీలు బహిరంగ ప్రదేశాలకు చెందరనే భావన వల్ల వాటిలో ప్రవేశించిన స్త్రీలు ఎప్పుడైనా బెదిరింపులకు గురి కాగలరు. ఏ కులం, మతం, వర్గానికి చెందిన స్త్రీలైనా ఈ నియమానికి మినహాయింపు కాదు. ఈ పుస్తకాన్ని, అలాగే పబ్లిక్ ప్రదేశాల్లో మహిళల స్థానం చుట్టూ జరుగుతున్న ఉద్యమాలను గురించి ఈ వ్యాసం క్లుప్తంగా సమీక్షిస్తుంది.

**మన నగరాలు ఎవరికి చెందుతాయి?**

మన నగరాలలో పబ్లిక్ ప్రాంతాలపై అసలు సిసలైన అధికారం పురుషులదేననీ, స్త్రీలని తమ దైనందిన జీవితంలో భాగంగా తాత్కాలికంగా వీటిని ఉపయోగించుకోవడానికి మాత్రమే అనుమతిస్తారు అనేది అందరూ అంగీకరించే నియమమే. నిజానికి కుటుంబం బయట ప్రజా జీవితాన్ని కలిగి ఉండే హక్కు, బహిరంగ ప్రదేశాలు, ప్రాంతాలు అందుబాటులో ఉండే హక్కులను అత్యధిక మహిళలు ఒక శతాబ్దం క్రితం వరకు కూడా అనుభవించలేకపోయారు. స్త్రీలు, వలసదారులు, భూమిలేని పేదలు, బానిసలు మొదలైన వారు నగరాలకి చెందని వారనే హద్దులు నిర్ణయిస్తూ నగరాలకి, ఇంకా పౌరసత్వానికి ఇచ్చిన లోపభూయిష్ట నిర్వచనాన్ని ఈ పుస్తకం ఎత్తి చూపింది. స్త్రీలను ఇప్పటికీ స్వయం ప్రతిపత్తి కలిగిన పౌరులుగా చూడరు. వాళ్ళు పురుషుని అండలోనే ఉండాలని చట్టంతో సహా అందరూ భావిస్తారు. ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో స్త్రీలకు సమాన పౌరసత్వం ఇవ్వబడింది. కానీ ఈ హక్కు కేవలం సిద్ధాంతాలకి మాత్రమే పరిమితమయింది, అమలులోకి ఇంకా పూర్తిగా రాలేదు.

'కాలం మారుతూ వస్తోంది. ప్రత్యేకించి మన దేశంలో సరళీకరణ అనంతరం మరింత ఎక్కువ మంది స్త్రీలు పబ్లిక్ ప్రాంతాల్లో అడుగుపెడ్తున్నారని' వాదించేవారు ఉన్నారు. మేము, కుటుంబ సంరక్షకుల అండ లేకుండా స్వతంత్రంగా జీవిస్తున్న స్త్రీలపై ఒక పరిశోధన చేస్తున్నాం. ఆయా స్త్రీలతో మాట్లాడిన సందర్భంలో మాకు అర్థమయిందేమిటంటే విద్య, ఉద్యోగాల కోసం వస్తున్న స్త్రీల పట్ల నగరాలు, వారి కుటుంబ ప్రతినిధులాగా వ్యవహరిస్తున్నాయి. అందువల్లే స్త్రీలకు నగరాలు సమానంగా అందుబాటులోకి రావట్లేదు. ఆయా నగరాలు గీసిన గీతలు మహిళలు




ఉల్లంఘించినట్లయితే అది బహిరంగ ప్రదేశాల మర్యాదకి ఒక ప్రమాదంగా భావిస్తారు. అందుకే లైంగిక హింసకు సంబంధించిన ప్రతి కేసులో – అప్పుడు ఆమె ఎలాంటి బట్టలు ధరించింది? అప్పుడు ఆమె ఏమి చేస్తోంది? అనే ప్రశ్నలు లేవనెత్తుతారు. ముందే చెప్పినట్లు స్త్రీలు ఇప్పటికి కూడా స్వయం ప్రతిపత్తి కలిగిన పౌరులు కాదు. అందుకే వారు, వారి జీవితాలు పురుషులు కాపాడవలసిన అంశాలుగా మిగిలిపోయాయి. స్త్రీలు పబ్లిక్ ప్రాంతాల్లో, పరిమిత ప్రవేశానికే అనుమతించబడేలా ఆధునిక రాజ్యం మరియు ఆర్థిక వ్యవస్థ ఒక చారిత్రక సందర్భాన్ని సృష్టించాయి. కానీ స్త్రీలు ఆ పితృస్వామ్య నియమ నిబంధనలను అనుసరిస్తూ, కొన్నిసార్లు ఆ నియమ నిబంధనలను ముందుకు తీసుకువెళ్ళే మోడరేటర్స్‌గా కూడా వ్యవహరించాల్సి ఉంటుంది.

**స్త్రీలకు సంబంధించిన ప్రవర్తనా నియమావళి**

స్త్రీలపై కట్టుబాట్లు, పర్యవేక్షణ ఎంత శక్తివంతంగా అమలవుతాయంటే తరచుగా వారు ఆ పితృస్వామ్య విలువలను అంతర్గతంగా జీర్ణించుకొని, తమకు తామే నిషేధాలు విధించుకుంటారు. సమాజం స్త్రీల భద్రత గురించి పదే పదే మాట్లాడి, వారు తమంతట తామే బైటికి వెళ్ళేందుకు వెనుకడుగు వేసేలా చేస్తుంది. 'మర్యాద', 'హింస నుండి రక్షణ' అనే చట్రాల మధ్య ఏదో ఒక్కటి ఎంపిక చేసుకోవాల్సి వస్తే – స్త్రీలను బలవంతపెట్టి వారు మొదటి అంశాన్నే ఎన్నుకొనేలా చేస్తారు. ఒక మహిళ తాను హింసను ఎదుర్కోవాలా? వద్దా? అన్న విషయాన్ని ఆమెకు వదలకుండా కేవలం ఆమె మర్యాదని కాపాడాలన్న భావజాలమే ఇందులోని అసలైన, లోతైన అంశం.

మీ భద్రత కోసమే అని చెప్పి లేడీస్ హాస్టల్స్‌లో విద్యార్థినులకు కఠిన వేళలను (స్ట్రిక్ట్ టైమింగ్) అమలు పరుస్తుంటారు. కానీ వారిని సురక్షితంగా ఉంచడానికి అవసరమైన, తగిన మౌలిక సదుపాయాలను, చర్యలను తీసుకోవడంలో తరచూ వైఫల్యం చెందుతుంటారు. కొన్ని కొన్ని సమయాలలో విద్యార్థులు నిర్దేశించిన వేళలకు, సమయానికి హాస్టల్‌కు చేరుకోలేకపోతారు. భద్రతను ప్రధానాంశంగా పరిగణించే దృష్టి కోణంలో ఈ విషయం 'రూల్‌ను వ్యతిరేకిస్తూ కావాలనే ఆలస్యంగా వచ్చారు' అని మాత్రమే చూడబడుతుంది. దీనిలో మహిళలకు 'రిస్క్' తీసుకునే హక్కులేదు, ఒకవేళ వారు అందుకు సిద్ధపడితే 'సమస్యలను కావాలని కొని తెచ్చుకుంటున్నారని' చెప్పి క్రమశిక్షణలో పెట్టాలనే ధోరణికి దారి తీస్తుంది.

నిజానికి స్త్రీలకు బహిరంగ ప్రదేశాల్లో సంతోషంతో, హాయిగా తిరిగేందుకు అనుమతి లేదు. బైటకు అడుగుపెట్టిన క్షణం నుండి వారిని వెంటాడే చూపులు వారిని అశక్తులను చేస్తాయి. స్త్రీలు ఆ చూపులను తప్పించుకోవాలనుకుంటారు. ఒక ఉద్దేశ్యం, లక్ష్యంతో మెలుగుతూ సాధ్యమైనంత తక్కువ చోట్లలో ఇమిడిపోతూ, కనపడకుండా, అస్పష్టంగా ఉంటారు. లైంగిక వాంఛతో తడిమే చేతుల నుండి తప్పించుకోవటానికి, అలాగే పబ్లిక్ ప్రాంతాల్లో స్త్రీలకు షరతులతో కూడిన అనుమతి ఇవ్వడానికి ఇది రెండు ముఖాల వ్యూహంగా పనిచేస్తుంది. ఇంకోపక్క సగటు మగవాళ్ళు సమాజమిచ్చిన సాధికారతతో వ్యవహరిస్తుంటారు, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టమొచ్చినట్లు తిరుగుతుంటారు.

స్త్రీలు తమకు తారసిల్లే ప్రతి కొత్త ప్రదేశాన్ని, ఎదురుపడే ప్రతి అపరిచిత వ్యక్తిని ఒక బెదిరింపుగానో, ప్రమాదంగానో భావించాల్సిన అవసరం లేకపోవడమే వారికి పబ్లిక్ ప్రదేశాల్లో గొప్ప స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. పబ్లిక్ ప్రదేశాలలో

విరామం పొంద లేకపోయినా, అవి తమకు అనుకూలమని భావించకపోయినా, స్త్రీలకి ఆయా నగర ప్రదేశాలతో సంబంధం కష్టమవుతుంది. బయటి ప్రపంచంలో హాయిగా సౌలభ్యంతో సంతోషంతో గడిపే అవకాశం ఉండటం వల్ల స్త్రీలకు నిజంగా చాలా స్వేచ్ఛ లభిస్తుంది. ఎటువంటి స్పష్టమైన అవసరం లేకుండా స్త్రీలు పబ్లిక్ ప్రాంతాలలో ఉండగలగటం ఎంత ఊహించలేని విషయమో ఈ పుస్తకం చక్కగా వెల్లడి చేస్తుంది. స్త్రీలకు మరెక్కడికి వెళ్ళాల్సి లేకుండా అక్కడే నిల్చుంటూ లేదా కూర్చుంటూ, మాట్లాడుకుంటూ, విజిల్స్ వేసుకుంటూ, నవ్వుకుంటూ, బిడ్డకు పాలిస్తూ వారికి నచ్చిన పనిచేసే అవకాశం ఇచ్చే నగరం మనం ప్రస్తుతం జీవిస్తున్న నగరాలకి పూర్తి భిన్న స్వభావం కలిగి ఉంటుంది. ఆ నగరం కావాలనే కోరికను 'వై లాయిటర్' అనే పుస్తకం వ్యక్తపరుస్తుంది. దాన్ని అనుసరించి ఒక ఇండియాలోనే కాదు, దక్షిణాసియా వ్యాప్తంగా స్త్రీలందరి గొంతుకలతో ప్రతిధ్వనించిన ఉద్యమానికి, పబ్లిక్ ప్రదేశాలపై హక్కు పొందగల్గాలి అనే కోరికకు మధ్య ఎంతో సారూప్యత ఉంది. ఈ పుస్తకం (2011) ఇదే కోరికను నేరుగా వ్యక్తపరుస్తూ పని లేకుండా జాప్యం చేస్తూ తిరిగే అవకాశం, కోరిక చుట్టూ అల్లుకున్న ఈ ఉద్యమాలన్నీ కూడా ఫెమినిష్టు డిమాండులేనని చెపుతుంది.

**ఖాళీగా తిరుగుతూ జాప్యం చేయటం స్త్రీలకు ఒక రాజకీయ అవసరం**

స్త్రీలు, బహిరంగ ప్రదేశాలు వారికెంత అందుబాటులో ఉన్నాయనే జరుగుతున్న వాదనల్లో – 'సెక్యూరిటైజేషన్' ('భద్రతావాదం') చుట్టూ జరిగే చర్చల పరిమిత పరిధిని దాటి ముందుకు వెళ్ళడంలో ఈ పుస్తకం విజయం సాధించింది. అలాగే దృష్టి కోణాన్ని 'భద్రతా' దృక్పథం నుండి ఒక హక్కుల ఆధారిత దృక్పథానికి ఒక సరైన పద్ధతిలో మార్చింది. 2012లో ఢిల్లీలో జరిగిన ఒక అమానుష, అత్యాచార ఘటన అనంతరం స్త్రీలకు బహిరంగ ప్రదేశాల్లో కల్పించాల్సిన భద్రతా చర్యల చుట్టూ ప్రధానంగా దృష్టి మరలింది. స్త్రీల ప్రవేశంపై విధించే నిబంధనలు, ఆంక్షలు, పరిమితులని వ్యతిరేకిస్తూ వారు బహిరంగ ప్రదేశాలని తమవిగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో అనేక మహిళా సంఘాలు (ఉమెన్స్ కలెక్టివ్స్) వివిధ సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించాయి. 2013 జనవరి 5న 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం' వారు ఒక అర్ధరాత్రి కవాతుని నిర్వహించారు. చాలా మంది భావించినట్లు స్త్రీలని రాత్రివేళ ఇళ్ళలో, ఇతర ప్రదేశాల్లో బంధించటం వల్ల భద్రత పెరగదనీ, ఎంత ఎక్కువ మంది స్త్రీలు బహిరంగ ప్రదేశాల్లో ఉంటే స్త్రీలకి భద్రత అంత ఎక్కువగా ఉంటుందనీ, ఏవేళల్లో అయినా పురుషులు, స్త్రీలని సమానంగా గౌరవిస్తే వారికి భద్రత పెరుగుతుందనీ సందేశాలు పంపటానికి ఈ కవాతును నిర్వహించారు.

**'ధాబాల్లో అమ్మాయిలు'**

'గర్ల్స్ ఎట్ ధాబా' అనే పాకిస్తానీ గ్రూపు పురుషులే ఎక్కువగా ఉండే రోడ్డు పక్కన తినుబండారాల షాపులు, ప్రదేశాలలోకి వెళ్ళటానికి ప్రయత్నించారు. బహిరంగ ప్రదేశాల నుండి స్త్రీలు కనబడకుండా పోవడంతో కలవరం చెందిన వీరు స్త్రీ, పురుషులందరికీ సమానంగా అందుబాటులో ఉండే ఒక ప్రపంచాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించారు. నిజానికి ఈ పుస్తక ప్రచురణని స్వాగతిస్తూ అనేక నగరాలలో చాలా ఉద్యమాలు నిర్వహించబడ్డాయి. 'బ్లాంక్ నాయిస్' అనే స్త్రీవాద కలెక్టివ్ 2015లో బెంగుళూరులో 'ద మీట్ టు స్లీప్' (నిద్రపోదాం కలిసిరండి) అనే ఉద్యమాన్ని ప్రారంభించింది. స్త్రీలు పబ్లిక్ పార్కుల్లో ప్రవేశించి పనిలేకుండా తిరుగుతూ, నిద్రపోతూ లేదా ఊరికే అటూ ఇటూ తిరుగుతూ గడిపారు. 25 పెద్ద, చిన్న నగరాలైన బెంగుళూరు, ముంబై, డిమాపూర్, కోహిమా, సూరత్, పాంజిమ్, జైపూర్, వడోదరా, జోధ్‌పూర్, ఇస్లామాబాద్, కరాచి మరియు రాంచీల నుంచి 500 మంది స్త్రీలు, బాలికలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

ఈ కలెక్టివ్ ఇదే సమయంలో 'ఒంటిరిగా నడవండి' (వాక్ ఎలోన్) అనే మరో ఉద్యమాన్ని కూడా ప్రారంభించింది. దీనిలో వారు ఇష్టపడే హీరోలను గుర్తు తెచ్చుకుని వారిని అనుకరిస్తూ ఇంతకు ముందు వారు ఎప్పుడూ వెళ్ళని ప్రదేశాలకు వెళ్ళి ఒంటరిగా నడవాలి. ఎంతో కాలంగా నేర్పుతూ వస్తున్న 'ఆడపిల్లలంటే తలవంచుకుని, ఒబ్బిడిగా, భయభక్తులతో' కలిగి ఉండాలనే' భావజాలంపై ఉమ్మడిగా పోరాడడమే ఈ ఉద్యమ ఉద్దేశ్యం. ఈ స్త్రీలు వ్యక్తులుగాను, ఉమ్మడిగాను కార్యాచరణ చేపట్టడం ద్వారా, తమకి తమ చుట్టూ ఉన్న వారికి కొత్త అనుభవాలను సృష్టించే ప్రయత్నం చేశారు. ఆయా అనుభవాల ద్వారా – భయం, అవమానం, హింసల స్థానంలో భాగస్వామ్యం, ఇతరులతో కలవటం, ఆత్మాభిమానం కలుగచేసారు. 21 జనవరి 2017న చేపట్టిన 'ఐ విల్ గో అవుట్' (నేను బయటకు వెళతాను) అనే దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలో స్త్రీలకు న్యాయంగానూ, సమానంగానూ పబ్లిక్ ప్రాంతాలు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. బెంగుళూరులో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మహిళల మీద వీధుల్లో జరిగిన సామూహిక లైంగిక వేధింపులను నిరసిస్తూ 30 నగరాలు, పట్టణాలలో స్త్రీలు, పురుషులు ప్రదర్శనలు నిర్వహించారు.

**భయాన్ని అధిగమించటం**

కొత్త సాంప్రదాయ వాదం పెరుగుతున్న ప్రస్తుత సందర్భంలో స్త్రీలు, దళితులు, ముస్లింలు, వలస వచ్చిన వాళ్ళు, జంటలు (couples) వంటి వారిని నగరంలో సమాన సభ్యులుగా చూడకపోవటం వల్ల వారి జీవితాలు మరింత అస్థిరంగా మారుతున్నాయి. రాజకీయాలలో మరియు ప్రజాభిప్రాయంలో చోటుచేసుకున్న మార్పులు స్త్రీల మర్యాద పేరులో మరింత కఠిన ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని ప్రోత్సహిస్తున్నాయి. ఏ విధమైన అతిక్రమణ అయినా మరింత హింసాపూరితంగా నివారింపబడుతోంది. స్త్రీలను నిరుత్సాహపరుస్తోంది.

"వై లాయిటర్" అనే పుస్తకం దీనిని అనుసరించి పెద్దా, చిన్నా పట్టణాలు, నగరాలలో వెల్లువెత్తిన అనేక ఉద్యమాలు సమస్య రోజురోజుకూ పెరుగుతూ వస్తోందని. దాన్ని పట్టించుకోకుండా ఉండాలనే మన కోరిక సాధ్యపడదని సూచిస్తున్నాయి. పెద్ద వ్యవస్థలలో వాస్తవమైన మార్పులు తీసుకుని రావడంలో ఈ ఉద్యమాలు పెద్దగా చేయగలిగింది ఏమీ లేదని నిరాశావాదులు వాదించవచ్చు. కానీ బహిరంగ ప్రదేశాలతో స్త్రీలకున్న బలహీన బంధాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం వల్ల ఒక విషయంలో మాత్రం తప్పకుండా మార్పు వస్తుంది. ఆ విషయాన్ని కప్పిపెట్టటం మాత్రం ఇక సాధ్యపడదు.

**మధురిమ మజుందార్ 2016-18 సంవత్సరంలో అన్వేషి చేపట్టిన సిటి-సెక్స్యువాలిటి ప్రాజెక్టులో పని చేసారు. ప్రస్తుతం తమిళనాడులోని సిరి పెరమ్‌బూదూర్‌లో వున్న రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.**

శిల్పాఫాడ్కే, సమీరా ఖాన్, శిల్పా రనడే (2011) వై లాయిటర్, విమెన్ అండ్ రిస్క్ ఆన్ ద ముంబయి స్ట్రీట్, వైకింగ్, పెంగ్విన్.

*అనువాదం: కె. సత్యవతి*

*ఈ సంచికలో సింగిల్ విమెన్ అన్న పద బంధానికి ఒంటరి యువతులు/ మహిళలు/ పెళ్ళి కాని యువతులు, స్వతంత్ర యువతులు/ మహిళలు అని భిన్న విధాలుగా తెలుగులో వాడాము. వీటిల్లో ఏది వారి పరిస్థితిని సరిగ్గా ప్రతిబింబించదని మాకనిపించినప్పటికీ వీటిని పర్యాయపదాలుగా వాడితే కొంతలో కొంత వారి పరిస్థితి పాఠకులకి అర్థమవుతుందని అనుకుంటున్నాము. అలాగే పబ్లిక్ స్పేస్ అన్న పద బంధానికి కూడా బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ స్థలాలు అని రకరకాలుగా వాడాల్సి వచ్చింది. కానీ ఇవేవీ దాని భావాన్ని సరిగ్గా సూచించవు. అలాగే పాపులర్ అన్న పదం కూడా, ఇది పోస్ట్ మార్క్సిస్ట్ సిద్ధాంత చర్చలో ఒక కీలక భావన. ఆ అర్థంలో వ్యాసకర్తలు వాడారు. దాన్ని తెలుగులో జన సమ్మత సంస్కృతి అని వాడాము. ఇవి కూడా ఆ పదం యొక్క సరయిన అర్థాన్ని సూచించవు. కొత్త పదాలు ఇంకా రాకపోవడానికి తెలుగు రాజకీయ చర్చల్లో వామపక్ష సిద్ధాంత స్రవంతి, దానితో సమానంగా గత రెండు దశాబ్దాలలో ఎదిగిన స్త్రీవాద, దళిత సాహితీ విమర్శ సిద్ధాంత స్రవంతులతో సమానంగా ఇతర ఏ సిద్ధాంత స్రవంతులు ప్రబలకపోవటం ప్రధాన కారణం. సమాజం, రాజకీయాలు, ఆర్థికం మనకి తెలియని రీతుల్లో మారిపోతున్న తరుణంలో అనూహ్యరీతుల్లో మారుతున్న సమాజ మరియు జండర్ నిర్మాణాల గురించి మాట్లాడుకోవటానికి ప్రస్తుత పదజాలం మనకు సరిపోవట్లేదు.*

# కట్టుబాట్లలో ఆనందం: విరామ సంస్కృతి, నగర లైంగికత, స్త్రీల నడవడిక

■ ప్రణూ దేశిరాజు

## ఒక ఆనందదాయకమైన రోజు

ఈ రోజు బుధవారం. మా యూనివర్శిటీకి ఐదారు కిలోమీటర్ల దూరంలో బేగం పేట్‌లో వున్న లైఫ్ స్టైల్ మాల్ లోని టెన్ డౌనింగ్ స్ట్రీట్ పబ్‌లో ఇవ్వాళ 'లేడీస్ నైట్'. సాయంత్రానికల్లా మేము మాతోపాటు రావటానికి మరి కొంత మంది అమ్మాయిలని సమీకరించాం, "మస్తు మజా వస్తుంది, నంగనాచిలా ఉండకు, అరే, అమ్మాయిలు స్వేచ్ఛగా తాగొచ్చు" అంటూ (అదేంటో, మాలో కొంచెం తెలివిగల అమ్మాయి చెప్పే వరకు, ఆ రోజు అమ్మాయిలు వస్తారనే కారణం ఎక్కువ మంది అబ్బాయిలని పబ్బులకి రప్పించటానికి ఉపయోగపడుతోందని మాకు అర్థం కాలేదు) మేం మామూలుగా క్యాంపస్‌లో గానీ, బయట గానీ వేసుకోవటానికి ధైర్యం చెయ్యని డ్రెస్సులు ఆ రోజు పబ్బుకి వెళ్ళటానికి వేసుకున్నాం.

బయలుదేరడానికి సిద్ధమయ్యాము. ఎక్కే ఆటోలో, క్యాబ్‌లో, క్యాంపస్‌లో మా తోటివాళ్ళు, దారిలో మాకు ఎదురయ్యే స్త్రీ/పురుషుల చూపులు మా శరీరాల్ని ఒక పక్క తినేసేటట్లు చూస్తూ, మరోపక్క చీదరించుకోవటానికి సిద్ధపడేవే. ఆ చూపుల నుండి "రక్షించు" కోవటానికి మా షాల్స్, దుప్పట్టాలు, ఫ్రగ్గులు, కోట్లు వేసుకుని బయలుదేరాం. జాగ్రత్తగా తయారయ్యి క్యాంపస్ గేట్ బయటికొచ్చి ఆటో కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాం (ఇదంతా కాల్ కాబ్ సర్వీసులు రాకముందటి ముచ్చట)

మేమక్కడ ఎదురు చూస్తున్నంత సేపూ దారిన పోయే అన్ని వాహనాల్లోంచి ఈలలు, చూపులు, కామెంట్లు వస్తూనే వున్నాయి. కొన్నిసార్లు వాళ్ళని విదిలించుకున్నాం గానీ, చాలా మటుకు, కఠినమైన చూపుతో వాళ్ళే చూపు తిప్పుకునేటట్లు చేసాం. విసుగొచ్చి తర్వాత పట్టించుకోవటం మానేశాము. మొత్తానికి ఆటోలో పబ్ చేరుకున్నాం. బౌన్సర్లని దాటి, మా 'రక్షణ కవచాలని' తొలగించి మేకప్‌తో, స్వేచ్ఛగా, ఉద్వేగంతో లోపలికి ప్రవేశించాం.

### నడవడిక గురించిన పాఠం

నేను, ఇద్దరు స్నేహితులు కలిసి ఒక రైల్వే బ్రిడ్జి క్రింద నిలబడి అటూ, ఇటూ పోతున్న రైళ్ల చప్పుడు విందామని వెళ్ళాం. దాని కోసమే అక్కడికెళ్లాం. అంతే, నేనొక పార్టీ డ్రెస్‌లో వున్నాను. అప్పుడే ఫ్రెషర్స్ పార్టీ అయింది. అక్కడి నుండి, క్యాంపస్‌కి వెళ్లకుండా, కొంచెం సేపు ఇక్కడ ఆగాము. పోలీసులు వచ్చేసారు, "మీరు ఈ అమ్మాయిని వాడుకుంటున్నారు. నువ్వు వాళ్ళకోసం వ్యభిచారం చేస్తున్నావు" అంటూ. నేనేమో, "లేదండీ. మేము మా దగ్గర జరిగిన పార్టీ తరువాత ఇటు వస్తున్నాం" వాళ్లేమో, "ఆహా, ఈ సమయంలో పార్టీకి అనుమతిస్తారా మీ విద్యా సంస్థలో?" అని అన్నారు. "అన్ని విద్యా సంస్థల్లో ఫ్రెషర్స్ పార్టీ ఉంటుందండి."

కానీ వాళ్ళకి పరిస్థితిని అర్థం చేసుకునే ఉద్దేశం లేదు. పరిస్థితిని దారుణంగా చూడ్డానికే సిద్ధంగా వున్నారు. అసలయినా, ఏ ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలని, అది కూడా, అంత నీచంగా, కఠినంగా ఎలా చేస్తారు? కనీసం వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి కదా. ఆ తరువాత మమ్మల్ని పోలీస్ స్టేషన్‌కి పట్టుకెళ్లి అక్కడ వేధించారు. మూడు గంటలు ఉత్తినే కూచో బెట్టారు. ఒకరి తరువాత మరొక పోలీసు వచ్చి అడగటం. ఆపకుండా అడుగుతూనే ఉన్నారు, "ఇలాంటి బట్టలు ఎందుకేసుకున్నావ్?అని. నేను మోకాళ్ళ కిందికి వచ్చే డ్రెస్ వేసుకున్నాను. వళ్ళు కనిపించే డ్రెస్ ఏమీ కాదు. ముదురు రంగు స్టాకింగ్స్ కూడా వేసుకున్నాను. స్త్రీలు డ్రెస్సులు, షార్ట్స్, చీరలు కట్టుకోరా? మొత్తం వళ్లంతా కప్పే డ్రెస్ వేసుకున్నా. కేవలం నా చేతులే కనిపించే డ్రెస్. అంతే కాదు, దాని పైన ఫ్రగ్ కూడా వేసుకున్నా. కానీ వాళ్ళేం చూడాలనుకున్నారో అదే చూసారు.

మా కాలేజీ నుండి ఒకరొచ్చి వాళ్ళతో మాట్లాడారు. "నాకు వీళ్ళందరూ తెలుసు" అని రాసిచ్చారు కూడా. చాలా మందికి ఫోన్ చేసి మాట్లాడారు. పెద్ద డ్రామా అయింది. పోలీసులు హాస్టల్ ఆఫీస్‌కి ఫోన్చేశారు. మా ఐడెంటిటీ కార్డులు చెక్ చేశారు. మేమప్పటికే మా ఐడెంటిటీ కార్డులు చూపెట్టాం. కానీ, మేము చెప్పింది ఏదీ నమ్మటానికి వారు సిద్ధంగా లేరు. తర్వాత, ఇంకొక స్నేహితుడు వచ్చాడు, ఇద్దరు, ముగ్గురు వేరే వాళ్ళు కూడా వచ్చారు. అతనికున్న కాంటాక్ట్‌లు చూసి పోలీసులు కొంచెం భయపడ్డారు. అతనక్కడికి రావటం మా అదృష్టం.

నాతోపాటు పోలీసులు పట్టుకున్న అబ్బాయిలకి ఇది మొత్తం హాస్యాస్పదంగా అనిపించింది. మొదట్లో కొంత భయపడ్డారు గానీ, తరువాత బాగా నవ్వుకున్నారు. వాళ్లకి, పోలీసులు నన్ను మైనర్‌గా భావించటం, తమలో ఒకళ్ళని తార్పుడు గాడిగా, ఇంకొకళ్ళని విటుడిగా భావించటం చూసి నవ్వొచ్చింది. నాకేమో జరుగుతున్నది నమ్మ శక్యం కాలేదు. అస్సలు నమ్మశక్యం కాలేదు. "మీరేం ఆలోచిస్తున్నారో మీకు అర్థమవుతోందా? మా ముఖాలు చూస్తే తెలియట్లేదా? విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులని మీరెప్పుడు చూడలేదా? వాళ్ళు మీ ప్రపంచంలో ఉండరా? ప్రపంచం నిండా మీకు వేశ్యలు, తార్పుడుగాళ్లే కనిపిస్తారా?"

***

నగరాలని, పట్టణ ప్రాంతాలని విద్యా, వృత్తిపరమైన కేంద్రాలుగా మార్చటానికి భారత ప్రభుత్వం బృహత్తర ప్రయత్నాలు చేస్తోంది. దీనితోపాటు విద్య, స్వయం ప్రతిపత్తి కోసం వివిధ సామాజిక ఉద్యమాలు చేసిన పోరాటాల ఫలితంగా విద్య, ఉద్యోగాలు, స్వేచ్ఛ, సామాజిక చలనం కోసం అల్ప సంఖ్యాక వర్గాలు, ముఖ్యంగా స్త్రీలు నగర ప్రాంతాలకి వలసలు రావటం ఎక్కువయింది. చాలా మటుకు నగరాల్లో ఉండటం కోసం, బహిరంగ ప్రదేశాల్లో తాము కన్పించటం కోసం స్త్రీలు జరిపే ప్రయత్నాలు, వారికి రక్షణ కల్పించాలనే ఆందోళన కింద కప్పివేయబడతాయి (ఫెస్టర్, 2005)

నగర జీవితంలో భాగంగా స్త్రీల శరీరం శృంగార భరితమైనదిగా రూపొందించబడుతుంది, అలాగే ప్రదర్శించ బడుతుంది కూడా. అంతకు ముందువరకు సమాజం ఆమోదించిన స్త్రీత్వ లక్షణాలు పునర్నిర్మించబడతాయి. అంతేకాక నగర నైసర్గిక స్వరూపం మనం అనుకునేట్టు అమూర్తంగా కాక లింగపరంగా నిర్ధారించబడుతుంది. ఏ స్థలం ఎవరికి చెందుతుందో, చెందదో గీసే గీతలు ఈ ప్రక్రియలోనే ఏర్పడతాయి, అవే స్త్రీల ప్రవర్తనని శాసిస్తాయి. పబ్‌లకి వెళ్లే స్త్రీల అనుభవాలని ఒకవైపు నగర జీవితంలో వుండే నిరంతర గందరగోళం, ప్రమాదం; మరోవైపు కేవలం పబ్బులు కల్పించే స్వేచ్ఛ, ఆనందాల మధ్యన మాత్రమే అర్థం చేసుకోగలం. మధ్య తరగతి విరామం కోసం మాత్రమే వుండే పబ్‌లు, ప్రమాదకరమైన నగర 'బహిరంగ' స్థలాలు కలిసి, నగరానికి సరిపడే స్త్రీల లైంగిక అస్తిత్వాన్ని తయారు చేస్తున్నాయి.

ఈ మధ్యన 'పబ్ కెళ్లే స్త్రీలు' అన్న పదం బాగా ప్రచారంలోకి వచ్చింది. ఆర్థిక స్వతంత్రం, ఉదారవాద ఆర్థిక విధానాల కారణంగా ఇప్పటి వరకు మగవాళ్లకు పరిమితమయిన విరామ ఆర్థిక వ్యవస్థలోనికి (తీరిక సమయాన్ని సంతోషంగా గడపటానికి అవసరమైన సౌకర్యాలు కల్పించే ప్రదేశాలు, స్థలాలు, విహార యాత్రలు, రిసార్టులు, పబ్బులు, బార్లు, మాల్స్, థియేటర్లు మొదలైనవి) మధ్య తరగతి స్త్రీలకి ప్రవేశం లభించింది. ఉదార పెట్టుబడిదారీ విధానంలో నానిన విరామ ఆర్థిక వ్యవస్థలో పబ్బులని ఒక మధ్యస్థ/నడిమి ప్రదేశంగా భావిస్తారు. ఇవి స్త్రీ పురుషులు కలవటం కోసం పని కొచ్చే ఆధునిక సంప్రదాయ స్థలాలుగా రూపొందాయి.

సంఘ కట్టుబాట్లకు, అది అంచులకి నెట్టేసిన విలువల మధ్య వుండే మార్గాన్నే లిమినాలిటీ (నడిమి ప్రదేశం)గా అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ రోజువారీ జీవితంలో లభ్యం కాని జీవన విధానాలు, దృక్పథాలు – అది నృత్యం చెయ్యటం కావచ్చు, రెచ్చగొట్టేటట్లు బట్టలు వేసుకోవటం కావచ్చు.

బహిరంగ ప్రదేశాల్లో స్త్రీలు 'నమ్రత, అణుకువతో' మెలగాలనే సంఘ కట్టుబాట్లని ఎదిరించి, ప్రశ్నించే నడవడిక, ప్రదర్శన కావచ్చు ఇవన్నీ అందుబాటులో ఉంటాయి.

నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో స్త్రీత్వం, విరామం మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవటానికి నేను నడిమి ప్రదేశంగా అందరు ఒప్పుకునే పబ్‌లకి, వాటి బయట తమ బట్టలు, నడవడిక గురించి స్త్రీలు ఎదుర్కునే వేధింపులు, దాడుల మధ్య వ్యత్యాసాన్ని పై రెండు ఉదంతాల ద్వారా ఎత్తి చూపించాను.

***

"నాకు పబ్బుల్లో బంధించినట్లు అనిపించదు, ఇక్కడ నాకిష్టమైన బట్టలు వేసుకోవచ్చు, వేరే వాళ్ళు చూస్తారని భయం ఉండదు."

"క్యాంపస్, క్లబ్, మాల్స్‌లోనే స్త్రీలు తమకి నచ్చిన, హాయిగా వుండే బట్టలు వేసుకోవటం కన్పిస్తుంది, వేరే ఎక్కడా కనిపించదు"

"మేము గుంపుగా వెళ్తాం. ఇద్దరు తక్కువగా, ఒక్కళ్ళుగా అసలు వెళ్లనే వెళ్ళం. ఎక్కువ మంది ఉంటే, ఎక్కువ మజా. కానీ, ఎక్కువ మంది ఉంటే, ఎక్కువ భద్రత ఉన్నట్లు అన్పిస్తుంది. రోడ్డు మీద క్యాబ్ కోసం వేచి చూస్తున్నపుడు చాలా ఆందోళనగా ఉంటుంది. రోడ్డు పైన వెళ్లే వాళ్ళందరూ మన పైన నిఘా చేస్తుంటారు. 'మీరందరు ఇట్లా బట్టలేసుకుని అక్కడికెళ్లి గబ్బు చేస్తారు, అసహ్యంగా ప్రవర్తిస్తారు' అన్నట్లు చూస్తుంటారు.

**2013-14 ల మధ్య జరిపిన ఇంటర్వ్యూల నుండి**

***

బహిరంగ ప్రదేశాల నుండి బహిష్కరించబడిన నడవడికని క్లబ్బులు, డిస్కో పబ్బులు కాపాడతాయి. నగర జీవితం నిరంతర విభజనలతో కొనసాగుతుంటుంది. నగరంలో ఏ ప్రాంతం ఎవరికీ చెందాలన్న మధ్యవర్తిత్వం ఆ గోడలే జరుపుతుంటాయి.

పబ్బులు, తాము నగరం ఒప్పుకునే విలువలని ధిక్కరిస్తున్నామనే ఒక భ్రమని కల్పిస్తాయి. సమాజం సాధికారత కల్పించే సంఘ నిర్మాణాల పరిధిలోనే ఆనందం వెతుక్కునేలా చేస్తాయి. ప్రభుత్వ పరిమితులున్న భవనాలలో, కట్టుబాట్లని ధిక్కరించే వెసులుబాటు కలిపించే ఈ పబ్బులు ఆయా భవనాల వెలుపల ఆ కట్టుబాట్ల కొనసాగింపుకే బాగా ఉపయోగపడతాయి. కట్టుబాట్లని కూలదోస్తున్నామనే ఈ ప్రదేశాలే ఆ సమాజ కట్టుబాట్లని బలపరుస్తున్నాయి.

ఆడవాళ్ళకి ఒక రాత్రి డబ్బు లేకుండా మందు ఇస్తామనే 'లేడీస్ నైట్' పబ్బులు మిగిలిన రోజుల్లో మగతన ప్రదర్శనకి నిలయాలుగా వర్ధిల్లుతున్నాయి. ఈ ప్రత్యేక లేడీస్ నైట్‌లు, అధిక ఆదాయం గల, డబ్బిచ్చే మగవాళ్ళని క్లబ్బులకి రప్పించటానికి ఒక ఆకర్షణగా మాత్రమే కాక, ఆడవాళ్లని 'ఇలా' గౌరవించి తమని తాము మర్యాద గల ప్రదేశాలుగా నిరూపించుకుంటున్నాయి. ఈ ప్రత్యేక లేడీస్ నైట్‌లో ఆడవారిపై నిఘా ప్రత్యక్షంగానే జరుగుతుంది. రక్షణ పేరుతో బార్టెండర్‌లు స్త్రీలకే ఇచ్చే మందు పరిమాణాన్ని నియంత్రిస్తారు. క్లబ్బుల్లోని కెమెరాలు, కస్టమర్ల అతి వినోదాన్ని నియంత్రించే బౌన్సర్లు కూడా దీనిలో భాగమే.

మహా నగరాల్లో స్త్రీల శరీరాలు తమని తామే నియంత్రించుకుంటాయి. చిన్న పట్టణాల నుండి, ఇతర మహా



నగరాల నుండి వచ్చి స్వతంత్రంగా బ్రతుకుతున్న స్త్రీల వల్ల నగర స్థలాల్లో సహజంగా అమలయ్యే లైంగిక విభజనలు మారటానికి అవకాశమేర్పడుతోంది, ముఖ్యంగా ఏ ప్రదేశాలు ఎవరికి చెందుతాయి అన్న విషయంలో స్త్రీలు కేవలం తమ ప్రవర్తనని నగరానికి తగ్గట్టు మలుచుకోవటమే కాదు; తమ వ్యక్తిగత అనుభవాల చిత్రపటంలో నగర స్థల వివరణలని కూడా భాగం చేసుకుంటారు. (టోపోగ్రఫీ-అంటే ఏ స్థలాలెట్లాంటివి అన్న జ్ఞానం) ఆయా అనుభవాలు వారి ప్రత్యేక కమ్యూనిటీ నేపథ్యం, సహజంగా లేదా సామాజికపరంగా స్త్రీలుగా ఎదుర్కోవాల్సిన ప్రమాదాల గురించి వారికుండే అవగాహన నేపథ్యంలో ఏర్పడతాయి.

***

పెళ్ళికాని యువతుల పట్ల సమాజంలో వుండే వివక్ష కూడా వారి నగర అనుభవాన్ని రూపుదిద్దుతుంది, వారు నగరాల్లో హింసకి గురయ్యే అవకాశాల్ని ఎక్కువ చేస్తుంది. తమని తాము నియంత్రించుకోవటం ద్వారా రక్షణ పొందగలమనే పరిజ్ఞానాన్ని, ఆయా నియమాలని పాటించకుంటే శిక్షలు పడతాయనే తీవ్ర భయమే కొనసాగిస్తుంది. అ భయమే నగరంలో స్త్రీత్వ ప్రదర్శనని, ఆచరణని నిర్దేశిస్తుంది.

ఫ్రెంచ్ తత్వవేత్త మిచెల్ ఫ్యూకో చెప్పినట్లు ఆధునిక యుగం వచ్చే మునుపు మొరటుగా, క్రూరంగా వుండిన (డిసిప్లిన్) నియంత్రణ అధికార ప్రయోగం, 18వ శతాబ్దం మొదట్లో ఆధునికత రాకతో భాషా పరంగానే కాక, భావ (కాన్సెప్చువల్) పరంగా రూపాంతరం చెందింది. అధికారం (పవర్) కేవలం బయటి నుండి ప్రయోగించే బలంగా కాక, మన చుట్టూ ప్రబలిపోయి, వ్యాపించి శరీరాల్లో ఇంకి పోయే జ్ఞానంగా రూపాంతరం చెందింది.(ఫ్యూకో, 1975) ఇటువంటి మార్పు వల్ల నియంత్రణకుపయోగపడే పరిజ్ఞానం మనుషుల అంతర్గత జీవితంలో భాగమవుతుంది. భవన నిర్మాణంలో వినియోగించే పెనాప్టికాన్ అనే రూపాలంకారాన్ని వాడి, ఫ్యూకో, ఆధునిక ప్రపంచంలో (జైళ్లలో, హాస్పిటళ్లలో, స్కూళ్లలో) నియంత్రణ (డిసిప్లిన్) స్వయం నియంత్రణగా (సెల్ఫ్ డిసిప్లిన్) రూపుదిద్దుకునే ప్రక్రియని ఇలా వివరించారు:

"అప్పుడప్పుడు ప్రయోగించినా సరే, నియంత్రణ మనుషుల్ని శాశ్వతంగా ప్రభావితం చేస్తుంది. ప్రయోగించే అవసరం లేనంత సంపూర్ణంగా ఆ అధికార ప్రభావం ప్రబలుతుంది. (పెనాప్టికాన్ అంటే భవనంలో వుండే వారందరిని ఒకే ప్రదేశం నుండి వారిని యంత్రించే వారు చూడగలిగే భవన నిర్మాణం) ఈ కొత్త రకమైన భవన నిర్మాణ పరిజ్ఞానం దాన్ని ప్రయోగించటానికి ఏ మనిషి అవసరం లేని అధికారాన్ని సృష్టించి, కొనసాగిస్తుంది; క్లుప్తంగా చెప్పాలంటే, ఆయా భవనాల్లో వుండే మనుషులు ఎటువంటి పరిస్థితుల్లో ఉంటారంటే, తమంతట తామే ఆ అధికారాన్ని మోస్తూ వుంటారు(ఫ్యూకో, 1975)

మన సామాజిక ఒప్పందంలో ఈ అంతర్లీన అధికారిక చూపు పాతుకుపోయి, మనని, ఇతరులని కలిపే నిశ్శబ్ద ఒప్పందంగా పరిణమిస్తుంది. స్వయం నియంత్రణ ఆధునిక సమాజాన్ని నడిపే కీలక ఆలోచన. ఇదే ఆధునిక ప్రపంచంలో ఆదర్శ వ్యక్తిత్వాన్ని మలిచి, నిర్మించి, నడిపించేది. ఫ్యూకో ఆలోచనలో, ఆధునిక సమాజంలో

అధికారం అన్నది,

"మనుషుల అణువణువుని చేరుకుంటుంది, శరీరాల్ని, చేసే పనులని, తీరు తెన్నులు, ఆలోచించే తీరు, నేర్చుకునే విధానం, రోజువారీ జీవితాల్ని అన్నిటినీ స్పృశిస్తుంది. (ఫ్యూకో, 1980 :30)

మన శరీరాలు ఇటువంటి అంతర్లీన నియంత్రణతో రూపుదిద్దుకుంటాయి. నగరాలు – తమ నైసర్గిక విభజనలు, వాటిని బలపరిచే విరామ సంస్కృతులు, ఒకరికొకరు తెలియకపోయినా కలవటానికి అవి కల్పించే అవకాశాలతో – స్వతంత్రంగా జీవించే స్త్రీలకి తమని తాము మార్చుకోవటానికి, సమాజ కట్టుబాట్లని ఉల్లంఘించటానికి ఊహించని, కొత్త అవకాశాలు కల్పిస్తాయి. అయితే ఈ అవకాశాలకి నగర జీవితంలోని విభజనలు, తమ జీవితంలో తామేం చెయ్యాలో ప్రత్యేక మహిళలకున్న ఆలోచనలు అడ్డుకట్ట వేస్తాయి.

***

స్త్రీలు నగర జీవిత విభజనలని ఉల్లంఘిస్తే పితృస్వామ్యం విధించిన కట్టడులని కళంకితం చేసి, వాటిని ధిక్కరించినట్ల వుంటుంది. అటువంటి ఉల్లంఘనలని సరిదిద్దటానికి అవసరమైన చర్యలు తీసుకోవటానికి కమ్యూనిటీకి అధికారం అప్పగిస్తుంది పితృస్వామ్యం. ఒంటరి స్త్రీలపై కుటుంబాలు తెలివిగాను, స్నేహంగా వుండే ఇరుగు పొరుగు వాళ్ళు, లేదా అపరిచితులు కొన్నిసార్లు పోలీసులు చేసే నియంత్రణ ఈ సాధికారత కల్పించిందే; ఇదే అధికారం కొన్నిసార్లు ప్రత్యక్ష భౌతిక, లైంగిక, మానసిక హింసకి, అత్యాచారాలకి కూడా దారితీస్తుంది.

ఇది బాగా అర్థం చేసుకోవటానికి మనం ఈ వ్యాసం మొదట్లో ఉదహరించిన ఉదాహరణలకి తిరిగి వెళదాం. అవి పరస్పర విరుద్ధంగా కనిపించొచ్చు కానీ, నాణానికి రెండు పార్శ్వాలు.

మొదటి ఉదంతం పబ్ లోకి ప్రవేశించే ముందు స్త్రీలు తమ రక్షణ కోసం నగర జీవితంలో వాడే పరిజ్ఞానాన్ని ముందుకు తెస్తుంది: గుంపులుగా ప్రయాణించటం; శరీరాన్ని కప్పుకోవటానికి ఫ్రగ్గులు, కోట్లు, దుప్పట్టాలు వాడటం. నగర జీవితంలో నడవడిక ఏ రకంగా అమరింపబడి ఉంటుందో తెలిసిన స్త్రీల పరిజ్ఞానం ఇది. రెండవ వర్ణన మహా నగరాల్లోని 'పురుష యాజమాన్యం' గురించి మనకు అర్థం చేయిస్తుంది. స్త్రీల శరీరాలు నగరాలకి స్వతహాగా చెందవని, వారిపై నియంత్రణ వారి నడవడిక, సమయం, వున్న స్థలం, వేసుకున్న బట్టలు, ఎవరితో వున్నారో అన్న విషయాలపై ఆధారపడుతుందని తెలుపుతుంది.

పబ్బుల్లో స్త్రీల అనుభవం దీనికి పూర్తిగా భిన్నమైంది. ఇక్కడ స్త్రీలు స్టైలిష్‌గా, ఫ్యాషనబుల్‌గా వుండాలి. వేసుకునే బట్టలు మన శరీరాలు ఏఏ ప్రదేశాల్లో అమరుతాయో, అక్కడ కావాల్సిన నడవడికకి సరిపోతాయో నిర్ణయించి సమాజ నిర్మాణంలో మన చోటుని నిర్ణయిస్తాయి; బహిరంగ స్థలాల్లో స్త్రీల ప్రవర్తనపై అమలయ్యే తీవ్ర నియమావళి, దీనికి పూర్తి భిన్నంగా పబ్బుల్లో, అదే స్థాయి వివక్షతో అమలయ్యే స్త్రీల బట్టలు/ప్రవర్తన గురించిన నియంత్రణ చూసినప్పుడు మనకో విషయం అర్థమవుతుంది. ఇటువంటి అస్థిరమయిన సాంఘిక లైంగిక నియమాల నేపథ్యంలో మాత్రమే నగరంలో స్త్రీత్వం మనకు గోచరమవుతుంది.

పబ్బుకి, నగరానికి మధ్య వుండే తీవ్ర వ్యత్యాసం వల్ల పబ్బుల కెళ్లే స్త్రీలు నగరంలో 'మర్యాదగా' ఉంటూ, పబ్బుల్లో ఆ వాతావరణానికి తగ్గట్టు 'తయారవ్వాల్సి' ఉంటుంది. ఈ రెండు భిన్న ధృవాల మధ్య తమ స్త్రీత్వాన్ని ప్రదర్శించాల్సిన అవసరం నగర ప్రజలుగా స్త్రీలకి మాత్రమే కలుగుతుంది. బయట, పబ్బుల్లో – రెండు చోట్లా కూడా ఆమె నడుచుకునే తీరు నిశితమైన సాంఘిక పరిశీలనకు గురవుతుంది.

**ప్రణూ దేశిరాజు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్‌లో రీసెర్చ్ స్కాలర్**
pranoo.d@gmail.com

**ఈ వ్యాస రచనకి ఉపయోగపడిన రచనలు**

టోనీ ఫెస్టర్, ది రైట్ టు జెండెరెడ్ సిటీ: డిఫరెంట్ ఫార్మేషన్స్ ఆఫ్ బిలాంగింగ్ ఇన్ ఎవ్రిడే లైఫ్, జర్నల్ ఆఫ్ జెండర్ స్టడీస్, వా. 14, నం.3, 2005.

మిచెల్ ఫ్యూకో, పవర్/నాలెడ్జి: సెలెక్టెడ్ ఇంటర్వ్యూస్ అండ్ రైటింగ్స్ 1972–77, పాంథియోన్ బుక్స్, 1980.


మిచెల్ ఫ్యూకో, "పెనాప్టికాన్" చాప్టర్, డిసిప్లిన్ అండ్ పనిష్: ది బర్త్ ఆఫ్ ది ప్రిజన్, న్యూయార్క్, వింటేజ్ బుక్స్, ఫ్రెంచి నుండి అనువాదం అలాన్ షెరిడన్, 1977, పేజీలు. 195–228.

హెన్రి లెఫ్బెర్, "ది రైట్ టు ది సిటీ" చాప్టర్, రైటింగ్స్ ఆన్ సిటీస్ నుండి, బ్లాక్వెల్ పబ్లిషర్స్, 2000.ప.147–209 పేజీలు, ఎలినార్ కాఫ్‌మన్, ఎలిజబెత్ లేబాస్ ఫ్రెంచి నుండి ఇంగ్లీషులోకి 1996లో అనువాదం చేసారు.

మరనథ వాహలంగ్ మరియు తేజస్విని మాడభూషి "మిడ్ నైట్ మార్చ్ – హైదరాబాద్ రిపోర్ట్" ఇన్ సెక్సువాలిటీ అండ్ హెరాస్మెంట్: జెండర్ పాలిటిక్స్ ఆన్ క్యాంపస్ టు డే, అన్వేషి రీసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, 2013 **www.anvishi.org**

***అనువాదం: ఎ. సునీత***

# రవీశ్



ఈ రోజు నేను చిన్న టౌన్‌లా అనుభూతి చెందుతున్నాను
మెట్రో లాగ కూడ...
ఆ...నువ్వు సౌత్ ఎక్స్ నుండి వెళుతున్నప్పుడు నేను కరవల్ నగర్ లా ఫీల్ అవుతాను.
నోర్మూసుకో...నీకేమైనా పిచ్చా? ఢిల్లీలో అందరూ ఢిల్లీ వాసుల్లాగే ఫీల్ అవుతారు...
అలా కాదు...అందరి కళ్ళల్లో ప్రేమ ఎలా అయితే ఉండదో...ఢిల్లీలో అందరూ ఢిల్లీ వాసులు కారు...
అచ్చా...అయితే నేను సౌత్ ఎక్స్ ఎలా అయ్యాను?
ఎలా అంటే నేను కరావల్ నగర్ అయ్యినట్లు...
బాగా చెప్పావు నువ్వు...
ఒకవేళ ఈ బారాహ్ పులా బ్రిడ్జ్ ఫ్లై ఓవర్ లేకుండా ఉంటే సౌత్ ఎక్స్ మరియు సరాయ్ కాలె ఖా మధ్య దూరం తగ్గేది కాదు.
నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? లేక ఈ నగరాన్నా?
నగరాన్ని....ఎందుకంటె నా నగరం నువ్వే కాబట్టి...
గదే మారుస్తున్నాను...నగరాన్ని కాదు
కేరళ నుండి దక్షిణ ఢిల్లీలో సురాయ్ జులైనా అయిన జార్ల గ్రామమంతా ఎస్కార్ట్స్, హెూలీ కుటుంబాలు,
అపోలో లో పనిచేసే నర్సుల నగరం అయిపోయింది...
కిరాయి గదుల్తో పాటు వారి కలలు కూడ మారిపోతుంటాయి. గుండె జబ్బుల రోగుల బాగోగులు చూస్తూ చూస్తూ...అతని మనస్సు పాత ఇంటి ఓనరు కూతురి మీద ఆగిపోయింది...
సురాయ్ జులైనా అంటే ఎంత ప్రేమంటే మలబార్ హెూటల్ అనే
ఒక ధాబానే తెరిచాడు.
ఎదురు చూపులకు మరో తావు లేకుండా...
పుష్ప విహార్‌లో ఉన్న ఈ ఇంట్లో మన జ్ఞాపకాలున్నాయి
కానీ నువ్వంటావు గది మాత్రమే మారిందని...
చూడు అద్దెకుండే వాడికి ఏ నగరమూ సొంతం కాదు ....
ఢిల్లీలో ఉండే
లక్షల ఇళ్ళల్లో ఎవరికి తెలుసు ఎవరు ఢిల్లీ వాసులో, నువ్వు అలాంటి ఇంటి మిద్దె మీదే కదా కలిసావు...
ఇప్పుడు అడ్రస్సే మార్చుకోవడానికి పోతున్నావు..
నీకు అస్సలు భావుకతే లేదు...
ఈ నగరానికి దామన్ ఉంటే
ఎంత బావుండేది?
ఉంటే ఏమి చేస్తావ్?
నేను ఆ దామన్ లోనే ఒక గది కట్టుకునే వాడిని...
ఆ నీలం కోటు అతను పుస్తకాన్ని గుండెలకు హత్తుకుని ఎందుకు నుంచున్నాడు?
ప్రేమ యొక్క మధుర క్షణాల్లో అలాంటి ప్రశ్నల్లో చిక్కుకుపోవటం
అతనికి అలవాటుగా మారింది...అందుకే అతను మౌనంగా ఉన్నాడు. అతని జుట్టులో వేళ్ళను దూర్చి చిక్కులను సవరిస్తూ...
విశ్రాంతి లేని శ్వాసలు కులరహిత సమాజాన్ని సృష్టించే అంబేద్కర్
మాటలతో గడుస్తూ ఉంది...
చూడు ఈ పుస్తకమే మనల్ని ఎప్పుడూ కలిపే ఉంచుతుంది.

***అనువాదం: మిరప మాధవి***

ఇష్క్ మే షహర్ పుస్తకం నుండి తీసుకోబడింది

# స్త్రీలకు చెందని నగరం

■ మధుమీత సిన్హా




పెట్టుబడులను ఆకర్షించటానికీ, ప్రపంచ పటం మీద విజయవంతంగా నిలదొక్కుకోవటానికి తీవ్రంగా పోటీపడుతున్న అనేక నగరాలు తెగించి ఆధునికీకరణ చెందుతున్నాయి. అయితే ఈ క్రమంలో అక్కడ నివాసం ఉండే వారి పరిస్థితి ఏమవుతుంది? మౌలిక సదుపాయాల గురించిన చర్చే ఎక్కువగా వినిపిస్తుంది. కొత్త రోడ్లు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, షాపింగ్ మాల్స్, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, సినిమా హాళ్ళు, థీమ్ పార్కులు పట్టణ సరిహద్దులను ఎత్తులోనూ, విస్తృతిలోనూ అన్ని వైపులా తోసుకు వెళుతున్నాయి. అనేక ఆకాంక్షలతో నగరాలలోకి పెద్ద సంఖ్యలో దూసుకొస్తున్న వారికి అవి ఉపాధి అవకాశాలు కలిస్తుండవచ్చు. నగరంలోని పాత, కొత్త నివాసులు అక్కడ నిలదొక్కుకుని, స్థిరపడటానికి చేయాల్సిన రోజువారీ పోరాటంలో చిక్కుకుపోయి వున్నారు.

నగరంలో ఉంటూ, అక్కడి నియమనిబంధనలు పాటిస్తూ, దాని మౌలిక సదుపాయాలను ఉపయోగిస్తూ, దాని పెరుగుదలకు దోహదపడే వారికి నగరంపై హక్కులు కూడా లభించాలి. అంటే నగరాలు అందరికీ ద్వారాలు తెరచి అవకాశాలు కల్పించాలి, కానీ వాస్తవం అందుకు విరుద్ధంగా, చేదుగా ఉంది. నగరానికి, దాని నివాసులకూ మధ్య ఏర్పడే సంబంధం పాత, కొత్త అధికార వ్యవస్థలు, వాటి విధివిధానాలపై ఆధారపడుతుంది. ఈ వ్యాసంలో నేను భారతదేశంలోని పట్టణ జీవితపు జండర్ పార్శ్వాలపై దృష్టి కేంద్రీకరిస్తాను. నగరాలు కొన్ని రకాల సంబంధాలను, కొన్ని ప్రవర్తనా నియమాలనూ, నమూనాలనూ ఏ విధంగా ముందుకు తోస్తాయి, అలాగే నగరంలో నివసించటానికి అవి ఎటువంటి జండర్ నిబంధనలను పాటిస్తాయి అనే అంశాలను మేరా అప్నా షహర్ అనే సమీరా జైన్(*2011*) తీసిన డాక్యుమెంటరీ సినిమాను విశ్లేషించటం ద్వారా వివరించటానికి ప్రయత్నిస్తాను.

'మేరా అప్నా షహర్' ఢిల్లీ నగరంలో యువతుల రోజువారీ జీవితాన్ని అన్వేషించి వెల్లడిస్తుంది. ఆనంద్ పట్వర్ధన్ తీసిన *'బోంబే హమారా షహర్', 'జరి మరి'* వంటి అనేక డాక్యుమెంటరీలు అత్యంత ప్రతికూల నగర నేపథ్యంలో పేదల బాధాకరమైన కథలను నమోదు చేసాయి. 'మేరా అప్నా షహర్' నగరాన్ని జండర్ దృక్పథం నుండి పరిశీలిస్తుంది. వారి దోపిడీ, ఉనికి కోసం వారి రోజువారీ పోరాటం వంటి అంశాలనే కాక నగరానికి చెందాలని, దానిని స్వంతం చేసుకోవాలనే స్త్రీ అభిలాషను కూడా వ్యక్తపరుస్తుంది. ఆ సినిమా శీర్షికలోని మేరా(నాది), అప్నా(స్వంతం) అనే రెండు పదాలు స్వాధీనత గురించి ఈ సినిమా సారాంశాన్ని సూచిస్తాయి. పట్వర్ధన్ సినిమాలో హమారా(మన) అనే నినాదానికి భిన్నంగా జైన్ సినిమాలో 'స్వంతం చేసుకోవటం' ఎక్కువ వ్యక్తిగతంగా వున్నప్పటికీ జండర్‌ని సమూహ అర్థంలో చూసినపుడు దాని అసలైన అర్థం బోధపడుతుంది.

ఈ సినిమాలో మూడు కథలు సమాంతరంగా నడుస్తాయి, అవి మూడు విభిన్న దృక్పథాలను చూపిస్తాయి: మొదటిది నగరంలోని ఒక మహిళ వివిధ నగరావరణాలను ఉపయోగించటంతో మొదలవుతుంది; రెండవది నగన రోడ్లపై వాహనాలు నడిపే ముగ్గురు మహిళా డ్రైవర్లకి నగరంతో ఏర్పడే సంబంధాన్ని చిత్రీకరిస్తుంది; మూడవది మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతంలో ఒక కిటికీలో స్థిరంగా ఉంచిన కెమెరా నగరాన్ని పరిశీలిస్తూ వివిధ సమయాలలో నిశ్శబ్దంగా ఉన్నప్పుడు, విపరీతంగా శబ్దాలు వినిపిస్తున్నప్పుడు, ఏమీ జరగనప్పుడు, అనేక సంఘటనలు జరుగుతున్నప్పుడు – వీధిని చిత్రీకరిస్తుంది.

ఇక్కడ వ్యక్తిగతం చెల్లాచెదురుగా, గాల్లో తేలినట్లు వుంటుంది, కానీ అది స్త్రీవాద చరిత్ర, రాజకీయాలలో బలంగా పెనవేసుకుని వుంటుంది. కింది తరగతి, శ్రామిక స్త్రీల జీవితాల పరిశీలన ద్వారా ఈ చిత్రం 'నగరంలోని స్త్రీ' అనామకంగా వుండటానికి, తప్పుగా గుర్తించబడటానికి మధ్య జరిగే ఘర్షణలో జీవిస్తూ ఉంటుందని చూపిస్తుంది. అందరూ తనను గమనించే తమ స్వంత బస్తీలో, ప్రాంతంలో కంటే నగరంలోని ఇతర ప్రాంతాలలో కారు నడపటం సులభంగా వుంటుందని ముగ్గురు డ్రైవర్లలో ఒకరైన సునీత ఈ సినిమాలో వ్యాఖ్యానించటం దీనికి మంచి ఉదాహరణ. తనకి చెందని ప్రదేశాన్ని తన కనుగుణంగా మలుచుకోవటం ద్వారా ఆమె అనామకురాలవటం, అలాగే ఆమె నగరాన్ని స్వంతం చేసుకోవటం రెండూ జరుగుతాయి.

1970ల నుండి భారతదేశంలో సాగుతున్న మహిళా ఉద్యమం విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ మొదలైన అవసరాల కోసం మహిళలకు రోజువారీ నగరాన్ని ఉపయోగించుకునే అవకాశాలను సృష్టించింది. ఇది నగరమనే ప్రదేశాన్ని అనేక విధాలుగా మార్చివేసింది. మహిళలు గృహకార్మికులుగా, మున్సిపాలిటీ కార్మికులుగా, సెక్యూరిటీ గార్డులుగా, ఉపాధ్యాయులుగా, నర్సులు, రిసెప్షనిస్టులు, డాక్టర్లు, గృహిణులుగా నగర బహిరంగ ప్రదేశాల్ని వివిధ అవసరాల కోసం ఉపయోగిస్తున్నారు.

సమీరా జైన్ "ఏ ప్రదేశమైనా జండర్ స్వభావాన్ని సంతరించుకుని లింగపరంగా విభజించబడటం మనకు తెలుసు, మనం అర్థం చేసుకోగలం, నాకు నా స్వంత ఆలోచన కావాలి. నా స్వంత గొంతుక కావాలనిపించింది" అంటూ తన స్వంత గొంతుకలో మాట్లాడి ఒక స్థలానికీ, చూసే చూపుకీ మధ్య సంబంధాన్ని తల్లకిందులు చేస్తారు.

'మేరా అప్నా షహర్' ఒక ప్రయోగాత్మక డాక్యుమెంటరి సినిమా, ఇది మెట్రోపాలిటన్ నగరం కథని దానికున్న గొప్ప చరిత్ర ద్వారా దీన్ని నిర్మించిన మహానుభావుల ద్వారా చెప్పకుండా, రోజువారి జీవితపు అవకాశాలు, పరిమితులని నిర్ణయించే నాజూకైన జండర్ సంబంధాల ద్వారా చెప్తుంది.

మనమొక ప్రదేశానికి చెందుతామనే మనోభావం, ఆ ప్రదేశం వల్ల కలిగే ఉపయోగం, అక్కడి రోజువారీ కార్యకలాపాలల్లో

పాల్గొనటం ద్వారా క్రమంగా పెరిగి పెద్దదయి ఒకరూపు తీసుకుంటుంది. 'నగరాన్ని ఉపయోగించుకోవటం', 'నగరానికి చెందటం' అన్న రెండు భావనలు ఒకటితో ఒకటి ముడిపడి ఉంటాయి. 'ద ప్రాక్టిస్ ఆఫ్ ఎవ్రీ డే లైఫ్' అనే తన పుస్తకంలో మైకేల్ డీ సర్ట్యూ, ఉదాహరణనిస్తూ రోజువారీ నడక (లేదా నగర ప్రదేశాలకుండే మరికొన్ని ఉపయోగాలు) వంటివి మన  దినసరి జీవితంలో భాగమయ్యి నగరంతో ఒక వ్యక్తిగత  అనుబంధాన్ని ఏర్పరుస్తాయి అని ఎత్తిచూపిస్తాడు. అయితే ఒక స్త్రీకి నగర ప్రదేశాల వినియోగం పితృస్వామ్య అధికార సంబంధాలకి లోబడిన లింగపరమైన గుర్తింపు ద్వారా మాత్రమే సాధ్యం. అంటే అస్థిత్వం, నగరాన్ని స్వంతం చేసుకోవటం రెండూ ఎప్పుడూ సంఘర్షిస్తూనే ఉంటాయి.

ఈ సినిమాలో 'నగరంలో స్త్రీ' అనే పాత్ర సమిష్టి వ్యక్తిత్వం ద్వారా 'నగరానికి చెందటం' అనే భావనను అన్వేషిస్తుంది. ఈ పాత్రను మనం మొదటిసారి సినిమా ఆరంభంలో చూస్తాము, ఒక ఒంటరి మహిళ బస్ స్టాప్‌లో ప్రశాంతంగా కూర్చుని కెమెరా వైపు సైగలు చేస్తుంటుంది, బహుశ మన దృష్టిని ఆకర్షించటానికి కావచ్చు. అక్కడి నుండి సీన్ మూల మీద ఉన్న టీ కొట్టుకు కదులుతుంది, అక్కడ చాలా మంది వుంటారు, టీ పోసి ఇచ్చేవాళ్ళు, సిగరెట్లు అమ్మేవాళ్ళు, ఇంకా చాలా మంది అటూ ఇటూ తిరుగుతుంటారు. నేపథ్యంలో తక్కువ స్వరంలో క్రికెట్ కామెంటరీ వినిపిస్తుంటుంది. కొన్ని క్షణాలు కనిపించే ఒక షాట్‌లో ఒక స్త్రీ టీ కొట్టు వెనుక కూర్చుని కనిపిస్తుంది. ఆమె టీ కప్పులు కడుగుతూ ఉండవచ్చు లేక కొట్టుకు సంబంధించిన పనిలో భాగం అయి ఉండవచ్చు. రోజువారీ జరిగే ఈ సన్నివేశాన్ని మన దృష్టికి తీసుకొచ్చిన తర్వాత సీన్ ఒక స్త్రీ మీద కేంద్రీకరిస్తుంది, ఆమె టీ కొట్టు ముందు నుండి రెండుసార్లు తిరిగిన తర్వాత మూల మీద నిలబడి టీ కొంటుంది. తర్వాత వెళ్లి తియ్యటి వక్కపొడి కావాలని అడుగుతుంది. తర్వాత అక్కడే నిలబడుతుంది. ఆమె అక్కడ వుండటం ప్రేక్షకులకు అసౌకర్యం కలిగిస్తుందని అనిపిస్తుంది మనకు. ఆ సీన్‌లో వున్న అందరికీ ఏదో పొసగనట్లు ఉంటుంది. ఆమె ఎవరు, అక్కడ ఎందుకుంది? అని మనం ఆపకుండా అడుగుతుంటాం. ఆ ఫ్రేంలోని పురుష పాత్రలు ఆమె వైపు చూసి అర్థవంతంగా నవ్వుతూ, వెకిలిగా చూస్తాయి, ఆ స్త్రీ ఎవరై ఉండవచ్చు అనేది అందరికీ అర్థం అయినట్లు, ఆమె ఉనికి ఇతరుల నుండి ప్రతి చర్యను ఆకర్షిస్తుంది. ఆ చర్యలతో నగర స్థలానికుండే జండర్ స్వభావం స్పష్టంగా వ్యక్తమవుతుంది.

తర్వాత ఆ నగర స్త్రీ పాత్ర ఒక పార్క్‌లో కూర్చుని కన్పిస్తుంది, విశ్రాంతిగా కూర్చుని వుంటుంది, పడుకుంటుంది, తొడలను గోక్కుంటుంది, చుట్టూ పరికించి చూస్తుంది. ఆమె ఒంటరిగా వుండటం, సేదతీరుతూ తనలో తానే ఆనందం పొందటం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. మగవాళ్ళు ఆమెని చూసి, మళ్ళీ మళ్ళీ ఆమెను దాటుకుని వెళతారు లేక ఆమె ఎదురుగా కూర్చుని చూసి నవ్వుతారు. ఆమె చేసే సైగలను అనుకరిస్తారు. ఆమె ఎందుకు అట్లా చేస్తున్నదో ఏమీ తెలియక, ఎవరినీ పట్టించుకోకుండా కూర్చున్న తీరు, ఆమె చూపులు అందరినీ గందరగోళంలో పడవేస్తాయి.

మరొక సందర్భంలో ఆ స్త్రీ ఒక మెయిన్ రోడ్డు వద్ద నిలబడి వుంటుంది, రోడ్డు దాటటానికి ఆమెలో ఎటువంటి తొందరా కనిపించదు, ఊహించినట్లుగానే ఇద్దరు వ్యక్తులు ఒక మోటార్ సైకిల్ మీద ప్రమాదకరంగా ఆమెకు అతి దగ్గరగా వచ్చి, ఆమెను దాటి వెళతారు. ఆ వెంటనే ఆమె ముందు ఒక కారు ఆగుతుంది, ఆమె దృష్టిని ఆకర్షించటానికి కొంచెం సేపు అది అక్కడే ఎదురుచూస్తుంది. ఆమెనుండి స్పందన లేకపోవటంతో అది వెనుకకు, ఆమె దగ్గరగా వస్తుంది. ఆ కారు ఆ విధంగా రావటంలో వున్న ఉద్దేశాన్ని గుర్తించి ఆమె దానికి దూరంగా నడిచి వెళుతుంది. ఈ సంఘటన మనల్ని, ఇంతకు ముందు వ్యక్తపరచిన డీ సర్ట్యూ చెప్పిన 'చెందటం' అనే పదం వద్దకు తీసుకువెళుతుంది. సినిమాలోని సీన్లు సూచిస్తున్నట్లు ఇక్కడ భయం, అసౌకర్యం, ఆందోళన వంటి మానసిక భావనలు సృష్టించబడతాయి. ఇక్కడ నగరం కేవలం ఒక భౌగోళిక ప్రదేశంగా కాకుండా జండర్‌పరమైన ప్రవర్తనకు నియమాలు విధించే ప్రదేశంగా మారుతుంది. కొన్ని స్థలాలలో మహిళల ఉనికి ప్రతికూల పరిణామాలకు దారితీస్తుందని నగరం చెప్పటం మొదలుపెడుతుంది. టోనీఫెస్టర్ అన్నట్లు "ఇక్కడ చెందటం, అనుబంధం పెంచుకోవటం అనేవి సమకూర్చుకున్న జ్ఞానం, జ్ఞాపకాలు, ప్రతిరోజు నడవటం వల్ల సమకూరే సన్నిహిత అనుభవాల ఆధారంగా నిర్మితం అవుతాయి. మన మిక్కడి వారం అనే భావన రోజువారీ అనుభవాలతో పెరిగి, వాటి ప్రభావం పేరుకుపోయి, సమయం గడిచేకొద్దీ మారుతుంది".

ఇక రెండవ కథ కదులుతున్న కారులో ఇద్దరు స్త్రీల గురించినది. ఒక స్త్రీ కారు నడుపుతుంటుంది. మరొక స్త్రీ ప్రయాణీకుల సీటులో వుండి తన డ్రైవింగ్ ఉద్యోగం గురించి, నగర జీవితంలో అది ఎలా నడుస్తుందో మాట్లాడుతుంటుంది. ఈ సమాంతర కథలోని మొదటి సీన్‌లో ఒక స్త్రీ కారు నడుపుతుండగా మరొక స్త్రీ ఆమెతోటి ప్రయాణీకురాలు. వారిద్దరూ వృత్తిరీత్యా డ్రైవర్లనీ, ఇద్దరూ ఆజాద్ ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకున్న తర్వాత ఈ వృత్తిని ఎంచుకున్నారనీ మనకు త్వరలోనే తెలుస్తుంది. మరొక సీన్‌లో పార్కింగ్ ప్రాంతంలో ముగ్గురు స్త్రీలు ఇతర పురుష డ్రైవర్లకు దూరంగా నిలబడి వుంటారు, తమని అందరూ గమనిస్తున్నారనీ, తమ గురించి మాట్లాడుకుంటున్నారనీ వారికి తెలుసు కానీ వారు పట్టించుకోకుండా మాట్లాడుకోవటం కొనసాగిస్తారు. ఇద్దరు స్త్రీలు కారు నడపటంలో వుండే ఆనందం గురించి మాట్లాడుకుంటారు, దానితో పాటే నాలుగు రోడ్ల కూడళ్ళ వద్ద, తమ కారు పక్క నుండి వేగంగా వెళ్ళే మగవాళ్ళు తమను తేరిపార చూడటం వల్ల కలిగే ఆందోళన, తడిసిపోవటం, టాయిలెట్లు ఉపయోగించటంలో సమస్యల గురించి కూడా చర్చిస్తారు. ఒక ఆసక్తికరమైన టాయిలెట్ సీన్ లో స్త్రీలు ఒక పబ్లిక్ టాయిలెట్ వైపు నడుస్తుంటారు, స్త్రీల కోసం నిర్మించిన ఆ టాయిలెట్ లోపల కారిడార్‌లో లైట్ లేకుండా చీకటిగా వుంటుంది, దాని నిర్వహణ సరిగ్గా వుండదు. స్త్రీలను నగరం ఎంత పట్టించుకోలేదో ఈ సీన్ తేటతెల్లం చేస్తుంది.

ఇక మూడవది ఒక ఇంటిలోని కిటికీలో ఉంచిన కెమెరా ఒక చిన్న రోడ్డులో జరిగే విషయాలను గమనిస్తూ వుంటుంది – మగవాళ్ళు రోడ్డు దాటి చాలా హాయిగా చెట్టు దగ్గర మూత్రం పోస్తారు; రోడ్డు అవతల చుట్టూ గోడలున్న ఆట స్థలంలో మగపిల్లలు ఆడుకుంటుంటారు; ఆ రోడ్డు మీద అప్పుడప్పుడూ డ్రైవర్ల మధ్య తగాదాలు అవుతాయి; కొంత మంది పాదచారులు నడుస్తుంటారు; కిటికీలోని ఈ కెమెరా ద్వారా ఇటువంటివే అనేక విషయాలు జరుగుతున్నట్లు కనపడుతుంది. అయితే ఎప్పుడయితే సినిమాలోని నగర స్త్రీ పాత్ర ఆరోడ్డు పేవ్మెంట్ మీద విశ్రాంతిగా నగరం తనదే అన్నట్లు కూర్చోగానే అంతకుముందు అతి మామూలుగా ఉన్న ఆ రోడ్డు స్వభావం మారిపోతుంది.

నగరంలో కారు నడుపుతూ పనిచేసే స్త్రీల కథని నగరంలో విశ్రాంతిగా వుండే మహిళ కథని దగ్గరికి తీసుకువచ్చి 'నగరాన్ని ఉపయోగించుకోవటం', 'దానికి చెందటం' అనేవి ఎట్లా పనిచేస్తాయో పరిశీలించారు. ఇక్కడ 'నగర ఉపయోగం' స్త్రీలకు తమ రోజువారీ జీవితాన్ని, తమ పనుల్ని అడ్డంకులు లేకుండా చేసుకోగలిగే అవకాశంగా ఈ సినిమా మనకి చూపిస్తుంది. అది మహిళా డ్రైవర్ల జీవితాల చిత్రీకరణలో వ్యక్తీకరిస్తుంది. వాళ్ళు డ్రైవింగ్ నేర్చుకునేటప్పుడు, బాస్‌ల నుండి ఆదేశాలు తీసుకునేటప్పుడు లేక డ్రైవింగ్ లో ఎదురయ్యే అనుభవాలను పంచుకునేటప్పుడు అది వ్యక్తమవుతుంది. 'ఉపయోగించటం' అంటే ఇండియా గేట్ చుట్టూ వాళ్ళు నడవటం, కారులో నగరంలో మరొక డ్రైవర్ స్నేహితురాలితో మొహమాటం లేకుండా మాట్లాడుకోవటంలో మనకి కనిపిస్తాయి. ఈ సీన్లు 'నగర ప్రదేశాలు' జండర్ సంబంధాల్లోని వివిధ కోణాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వర్ణిస్తాయి.

ఈ సినిమా ప్రయోగాత్మకత, రూపంలేని కథ, సాధారణ కెమెరాతో పాటు ఒక దాగి వున్న కెమెరా ద్వారా, కదిలిపోయి మసకగా వున్న చిత్రాల ద్వారా వెల్లడవుతుంది. ఒక అనుభవపూర్వక క్షణాన్ని ఎటువంటి తొందర లేకుండా పంచుకోవటం ఈ సినిమా ప్రత్యేకత. నగరంలోని స్త్రీ హాండ్ బాగ్‌లో ఉంచిన పెన్ కెమెరా వివిధ మగవాళ్ళ స్పందనలను నమోదు చేస్తుంది – వారు వినోదంగా చూడటం, అసౌకర్యంగా వుండటం, ఆసక్తి, ఉత్సుకత  కనబరచటం. ఇవన్నీ ఆమె అసాధారణతకి స్పందనలుగా మనకి తెలుపుతుంది.

నగర స్త్రీగా కొమితా ధండా నగరంలో తారట్లాడే పాత్ర పోషించింది. ఆమె ఆధునిక నగరం అందించే పలురకాల వినోదాలని, ఆహ్లాదాలని ఆస్వాదిస్తూ తిరిగే బాడిలైర్ వర్ణించిన ఫ్లానైర్ కాదు: ఆ పాత్రకి ప్రతిగా వున్న స్త్రీ పాత్ర కూడా కాదు. ఈ సినిమాలో 'నగర స్త్రీ' పాత్ర ఒక పాదచారి. స్త్రీల శరీరాలకు నగరం విధించే పరిమితులు, సరిహద్దులతో రాయబారం నడిపే పాత్ర. పురుషత్వంతో నిండిపోయిన నగర బహిరంగ ప్రదేశాలు స్త్రీలకి అందించే 'భయం, అభద్రతతో' కూడిన సంకేతాలను ఈ పాత్ర భగ్నం చేస్తుంది. ఆమె తన పరిమితులను, సరిహద్దులను విశ్లేషించుకుని అధిగమించటానికి ప్రయత్నిస్తుంది. అంటే పురుషులచేత ప్రబలంగా ప్రయివేటీకరించబడి, భయం, అభద్రతా సంకేతాలను సంతరించుకున్న బహిరంగ స్థలాల స్వభావాన్ని నగర మహిళ భంగం చేస్తుంది. నగరం విధించే పరిమితులు, నియంత్రణల సరిహద్దుల్ని నెట్టుకుంటూ, తనపై జరిగే హింస, దాడులకి బాధ్యత తీసుకోవటానికి నిరాకరిస్తుంది. నగరం వైపే వేలెత్తి చూపిస్తుంది.

**మధుమీత సిన్హా, ఇంగ్లీష్ & ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో అధ్యాపకులు**
madhumeetasinha@gmail.com

***అనువాదం: ఆశాలత***

# గ్రామాల్లో, నగరాల్లో ప్రజారవాణా సౌకర్యాలు: నా అనుభవం

■ మిథున్ సోమ్

నగర వీథులు, రోడ్లపై తిరగగలిగే సామర్థ్యం కలిగుండటం నగరంలో జీవించటానికి చాలా అవసరం. నా అభిప్రాయంలో ప్రజారవాణా సౌకర్యాలు మంచిగా ఉండి, నా అంతట నేను సౌకర్యవంతంగా తిరగగలినప్పుడే వాటిని స్నేహపూరిత నగరాలనొచ్చు. భారతదేశంలో అనేక నగరాలు, పట్టణాలు, గ్రామాలకి వాటి ప్రత్యేక రవాణా సౌకర్యాలున్నాయి. అనేక చోట్ల ఒంటరిగా జీవించి, ఆయా ప్రదేశాలని అర్థం చేసుకోవటానికి, అక్కడ తిరగటానికి నాకు ఉపయోగపడిన ప్రజారవాణా సౌకర్యాల గురించి ఈ వ్యాసంలో నేను చర్చిస్తాను.

నేను ఛత్తీస్‌ఘడ్‌లోని ఒక చిన్న గనిపట్టణంలో (మైనింగ్ టౌన్) పెరిగాను. అది ఎలాంటి ఊరంటే సైకిల్, రెండు చక్రాల, (నాలుగు చక్రాల వాహనాలు తక్కువ. అవి కూడా అంబాసిడర్, ఫియట్ కారు మాత్రమే) వాహనాలే ప్రధాన రవాణా సౌకర్యం. బస్ స్టాండ్‌కి, హాస్పిటల్ లాంటి ప్రదేశాలకి వెళ్ళాలంటే మాకు ప్రజా రవాణ సౌకర్య రూపంలో సైకిల్ రిక్షానే అందుబాటులో ఉండేది. అంతేకాకుండా సైకిల్ రిక్షాని పిలవడానికి ఒకరు వెళ్ళాల్సి వచ్చేది. ఇక నా దృష్టిలో రైలు ప్రయాణమంటే సంవత్సరానికి ఒక సారో, రెండు సార్లో మా తాతగారింటికి వెళ్ళటానికి చేసే దూర ప్రయాణమే. నేను ఆ ట్రిప్పు కోసం ఎంత ఎదురు చూసేదాన్నో, రైలు ప్రయాణం కోసం అంతే ఎదురు చూసేదాన్ని. రైలు ప్రయాణమంటే ఎందుకంత ఇష్టం అంటే ప్రయాణంలో రెండు చక్రాల బళ్ళ మీద వచ్చే కామిక్స్ కొనుక్కోవడానికి, కిటికీ దగ్గర సీటు కోసం నేను మాఅన్న పోట్లాడుకునే వాళ్ళం. సుదూర ప్రయాణంలో వళ్ళు ఊగుతూ ఉండటం నాకు బాగా నచ్చేది. అక్కడ నుండి ప్రజా రవాణా మీదే పూర్తిగా ఆధారపడడం దాకా జరిగింది నా సుదీర్ఘ ప్రయాణం.

పట్టణ నివాసంలో నామొదటి అనుభవం నేను జబల్‌పూర్‌లో గ్రాడ్యుయేషన్ చేసినప్పటిది. అక్కడ కూడ ఎప్పుడైనా అత్యవసర సమయంలో జైలు లాంటి హాస్టల్ నుండి బయటికి రావాలంటే నేను ఎక్కువగా సైకిల్ రిక్షా మీదే ఆధారపడేదాన్ని. నా హాస్టల్ ఎలాంటిదంటే లోకల్ గార్డియన్ (స్థానిక సంరక్షకులు) లేకుండా అమ్మాయిలని ఒక్క అడుగు కూడ బయటపెట్టినిచ్చే వారు కాదు. స్థానిక సంరక్షకులు లేని నాలాంటి వారికి పట్టణంతో పెద్ద పరిచయం ఉండేది కాదు. అప్పుడప్పుడూ దొంగతనంగా బయటకెళ్ళినప్పుడు తప్ప.

ఎప్పుడైతే నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి ముంబయి మహా నగరానికి వెళ్ళి, మహా నగరంతో అసలైన పరిచయం ఏర్పడిందో, అప్పుడు నాకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. ముంబయిలో అనేక రకాలైన ప్రజారవాణా సౌకర్యాలు బస్, రైలు, ఆటోలు, టాక్సీలు ఉన్నాయి. ముంబయిలో ఉన్న ప్రజారవాణా సౌకర్యం చాలా ప్రసిద్ధమైనదని దేశంలో వేరే నగరాలకి ముంబయికి ఎక్కడా పోలిక లేదని నాకు అప్పుడు తెలియదు. నేను ముంబయి వెళ్ళిన మొదటి నెలలోనే రాత్రిపూట ఒంటరిగా ప్రయాణం చేయడం మొదలుపెట్టాను. అది చాలా సాహసవంతంగా అనిపించింది. నాకు బాగా గుర్తు ఒక రోజు నేను బస్ స్టాప్‌లో 505 బస్ కోసం ఎదురుచూస్తున్నాను. నా బస్ రావడానికి ముందు 502వ నెంబరు బస్సు చూసి ఇంకో రెండు బస్‌లు వస్తాయని అనుకున్నాను నేను. కానీ నా బస్ బదులు 352 రావడం చూసి ఆశ్చర్యపోయాను. ఇంకో విషయం నా వెనకే ఒక సీటు ఖాళీగా ఉన్న విషయం కూడ నేను గమనించనే లేదు. ఒక పెద్దాయన నన్ను పిలిచి నువ్వు ముంబయికి కొత్తా అని అడిగారు. నేను అవును అన్నాను. 'మరి ఎలా?' అన్నరాయన ఆ రెండేళ్ళలో నేను నేర్చుకున్నది ఏంటంటే బస్‌లో ప్రయాణించే ప్రయాణికులను, ప్రతీ సీట్‌ను, వారు కూర్చునే భంగిమలను, హాండ్ బాగ్‌ని కదిలించటాన్ని నిశితంగా గమనించటం. ఆమె నిలబడితే అప్పుడు ఆ సీట్ ఆక్రమించుకోవటానికి సిద్ధంగా ఉండాలి కదా మరి! ఆ సమయంలో నాకు కాలుష్యం వల్ల బ్రోంకైటిస్ వచ్చింది.

నేను అర్థరాత్రి 12.30గం.కి కూడ బస్‌లో ఒక్కదాన్నే ప్రయాణించేదాన్ని. నాకు స్థానిక రైల్లో ప్రయాణమంటే చాలా ఇష్టం. చాలా మంది బయటి వారు రైలు ఎక్కాక వారు మొదటిసారి రైలుని ఎలా మిస్స్ అయ్యింది చెపుతుంటారు. ఆ రద్దీలో దాదర్ స్టేషన్ గుంపులో నేను కూడ ఒకసారి రైలు మిస్ అయ్యాను. రైళ్ళ రాకపోకల ఫ్రీక్వెంసీ చాలా బాగా ఉండేది కనుక అది పెద్ద విషయం ఏమీ కాదు. నేను ఎప్పుడైనా ఒంటరిగా ఉండాలని అనిపించినపుడు స్థానిక రైలు పట్టుకుని చర్చ్ గేట్ వరకు వెళ్ళేదాన్ని. అక్కడ మెరైన్ డ్రైవ్‌కి వెళ్ళి సముద్రాన్ని చూసి మళ్ళీ రైలులో తిరిగి నా ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చేసేదాన్ని. నా స్వస్థలం, జబల్‌పూర్‌లో ఉన్నట్లుగా కాకుండా నాకు నగరం బాగా నచ్చేది. స్వతంత్రంగా, స్వేచ్ఛగా బయటికి వెళ్ళడానికి ఎవ్వరి మీద ఆధారపడ నవసరం లేకుండా ఉండడం. ఇక్కడే రాత్రి జీవితం అంటే ఏమిటో కనుక్కున్నాను. ఎవరైనా, ఎప్పుడైనా చక్కగా వీథుల్లోకి వెళ్ళవచ్చు, తిరగవచ్చు. ఒకసారి మేము నలుగురం అమ్మాయిలం మెట్రోలో అర్ధరాత్రి సినిమా చూడడానికి వెళ్ళాము. మా ఆఖరి రైలు మిస్ అయ్యాం. చేసేదేమీ లేక అక్కడే మెరైన్ డ్రైవ్ దగ్గరే అటు ఇటూ తిరిగి టీలు తాగి రాత్రంగా గడిపి మళ్ళీ చర్చ్ గేట్ దగ్గర మొదటి రైలు పట్టుకుని మా ఇన్‌స్టిట్యూషన్‌కి చేరుకున్నాం. రోజంతా పగలు క్లాసులతో, అసైన్‌మెంట్లతో బిజీగా ఉండే మమ్మల్ని అర్ధరాత్రి సినిమాలొక్కటె కలిపేవి. రాత్రి ప్రయాణం అనేది మాకెప్పుడూ సమస్య కాలేదు.

**ఢిల్లీ**

పై చదువులకు నేను ఢిల్లీ వెళ్ళాక గానీ ముంబయి రవాణా సౌకర్యం యొక్క గొప్పదనం ఏమిటో అర్థం కాలేదు. ఢిల్లీలో కూడ బస్‌లు, ఆటోలు ఉండేవి. మెట్రో అప్పటికి రాలేదు. ఆటో వాళ్ళతో బేరసారాలు, తలనెప్పులు ఎదుర్కోవడానికి ఆటో కోసం ఎదురు చూడడానికి నేను మానసికంగా తయారవాల్సి వచ్చింది. ముంబయిలో ఆటోలోకి ఎక్కిన తర్వాత గమ్యస్థానం చెప్పొచ్చు. అక్కడ నా ఫ్రెండ్స్ కొంత మంది ఆటోలో మంచి స్టీరియో సిస్టం లేదని ఎక్కేవాళ్ళు కాదు. నేను ఢిల్లీలో నేర్చుకున్నదేమిటంటే ఢిల్లీ ఆటోలు మీటరు మీద నడవవు. ఇంకా ఏమి నేర్చుకున్నానంటే రాత్రిపూట గానీ లేదా ఉదయాన్నే గానీ కాంపస్‌లో తిరిగినంత ఈజీగా అర్థరాత్రి ఒంటరిగా కాంపస్ బయట తిరగలేము. మేము రాత్రి తొమ్మిది తర్వాత మండి హౌస్‌లో థియేటర్ ఫెస్టివల్ నుండి తిరిగి వచ్చేటప్పుడు కనీసం మా యూనివర్శిటీ గేట్ వరకైనా మమ్మల్ని వదిలిపెట్టమని బస్ డ్రైవర్స్‌ని బెదిరించేవాళ్ళం, విసిగించేవాళ్ళం. ఒక్కోసారి మేము గెలిచేవాళ్ళం ఒక్కోసారి బస్ డ్రైవర్ మా మాట వినేవాడు కాదు. మేమెళ్ళాల్సిన బస్ స్టాఫ్‌కి నాలుగు స్టాపుల ముందే ఆపేసేవాడు. మెట్రో వచ్చిన తరువాత ఎన్నో మార్పులు వచ్చాయి.

**రాయపూర్**

ఏదేమైనా మా స్వస్థలంలో మాత్రం ఇప్పటికీ మేము ప్రైవేట్ వాహనాల మీదే ఆధారపడతాం. నేను పి.హెచ్.డి చేసేటపుడు ఫీల్డ్ వర్క్ కోసం వేరే జిల్లాకి రోజూ ప్రయాణం చేయాల్సి వచ్చేది. అప్పుడు ఎక్కువగా మా నాన్నగారి మీద ఆధారపడేదాన్ని. అది ఎండాకాలం, వర్షాకాలం, చలికాలం ఏ కాలమైనప్పటికీ నేను మా నాన్నగారిని అడగాల్సి వచ్చేది. నన్ను పికప్ చేసుకుని డ్రాప్ చేయమని. ఇంటికి బస్ స్టాప్‌కి 3 కిమీ దూరం ఉండేది. అక్కడ నా సొంత వాహనాన్ని పార్క్ చేసుకోవడానికి స్థలం ఉండేది కాదు. ఆఖరి మైలు దూరం మాత్రం నేను కాలి నడక లేదా ఎవరైనా ద్విచక్ర వాహనాల వారిని, ఆఖరికి సైకిల్ వాళ్ళ దగ్గర కూడా లిఫ్ట్ తీసుకునేదాన్ని. ఒకచోట సైకిల్స్ అద్దెకిచ్చే షాపు ఉండేది. నేను అక్కడ నుండి సైకిల్ అద్దెకు తీసుకుని రోజూ నాకు నచ్చిన గ్రామానికి వెళ్ళేదాన్ని. అక్కడ ఒక లేడీస్ సైకిల్ పది



జెంట్స్ సైకిల్స్ ఉండేవి. నా కంటే ముందు ఎవ్వరూ ఆ సైకిల్‌ను అద్దెకు తీసుకోకూడదని నేను దేవుణ్ని ప్రార్థించేదాన్ని.

**పొడయా హాట్**

ఢిల్లీ కంటే ముందు రెండు సంవత్సరాలు నేను ఝార్ఖండ్‌లో చిన్న బ్లాక్‌లో గడిపాను. అది పొడయా హాట్ అనే ఒక మార్కెట్ ఏరియా. గవర్నమెంట్ ఆఫీసులు, బస్ స్టాండ్ చాలా దగ్గరగా నడచి వెళ్ళి చేరుకునేలా ఉండేవి. అక్కడ జిల్లా కేంద్రాలకి ఇతర పట్టణాలకి బస్సులు ఉండేవి. అక్కడ జనాలు బస్ టాప్ పైన కూర్చోవడం సాధారణం. పెళ్ళిళ్ళ సీజన్‌లో అయితే చాలా బస్‌లు పెళ్ళిళ్ళకు అద్దెకు ఇచ్చేసేవారు. చిన్న పిల్లలు, స్త్రీలు, ముసలివారిని మాత్రమే బస్‌లో ఎక్కనిచ్చేవారు. మిగిలిన వారిని బస్ పైన కూర్చోమనేవారు. నా మగ సహోద్యోగులు మాత్రం వీలైనంత వరకు ఇలాంటి సమయాల్లో వారి సొంత వాహనాలను ఉపయోగించడానికి ఇష్టపడేవారు. నా పనంతా గ్రామాలు తిరగడమే. ఆఫీస్ వాహనాలపై (ఏదైతె ప్రత్యేక అధికారి, స్త్రీ ఉద్యోగుల కోసం కేటాయించబడిందో) ఆధారపడే బదులు నా సొంత వాహనాన్ని తెచ్చుకుని దాన్ని వాడుతూ తిరగడం నాకిష్టంగా ఉండేది. పొలాల్లో నడుస్తూ, మోకాళ్ళ లోతు చెలమల్లో దిగుతూ ప్రయాణించటం చాలా బాగుండేది. స్వతంత్రంగా, స్వేచ్ఛగా అనిపించేది. అప్పుడే నేను మోటర్ బైక్‌ని నడపడం నేర్చుకున్నాను.

కానీ నేను నా స్వస్థలానికి గానీ, వేరే ప్రదేశాలకి వెళ్ళాల్సి వచ్చినప్పుడు నేను ఆఖరి బస్ మీద ఆధారపడేదాన్ని. ఆ బస్ సాయంత్రం 7 గంటలకు స్టేషన్‌కి వచ్చేది. నేను సుమారు 5 గంటల నుండి దాని కోసం వేచి ఉండేదాన్ని. సొంతూరు నుండి తిరిగొచ్చేటప్పుడు రైలు స్టేషన్‌కి చేరుకునే సరికి తెల్లవారు ఝాము 2.30 గంటలు అవుతుండేది. నేను అక్కడే తెల్లారే వరకు వేచి ఉండాల్సి వచ్చేది. నేను ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టిన ఆరు నెలలకు తిరిగి వెళ్ళాక కూడ అక్కడ స్టేషన్‌లో పని చేసే దుకాణాదారులు, వెయిటర్స్ నన్ను గుర్తుపట్టి అడుగుతుండేవారు ఇన్నాళ్ళు ఏమైపోయారు మేడం అని ఇందులో నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమీ లేదు, ఎందుకంటే ఆ సమయంలో ఒంటరిగా ఒక మహిళ రైలులో ప్రయాణించడం, రైలు కోసం వేచి చూడటం అరుదు కాబట్టి ఎవ్వరికైనా సులభంగా గుర్తుంటాము. అది కూడ ఝార్ఖండ్ లాంటి మారుమూల ప్రదేశాలలో, అందులో అక్కడ ఏ మగవారు తమ భార్యలను గానీ, తమ అక్క చెల్లెళ్ళను గానీ, తమ బైక్ పై కూర్చొబెట్టుకుని వెళ్ళేవారు కాదు. ఒక యువతి బైక్ పై వెళ్ళటం చాలా అరుదు. అలాంటి చోట్ల నేను నా పది మంది సహోద్యోగులలో రోజూ ఎవరో ఒకరి బైక్ ఎక్కి వెళ్ళేదాన్ని లేదా నా బైక్ పైన మగ సహోద్యోగులు ఎవరైనా నా వెనకాల కూర్చుని వచ్చేవారు. అయితే ఇది సంథాలీ స్త్రీ, పురుషులు ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని మార్కెట్‌కి వెళ్ళేటటువంటి ప్రదేశం కూడా!

ఢిల్లీలో నా చివరి సంవత్సరంలో విద్యార్థి జీవితం నుండి ఉద్యోగ జీవితానికి మారినపుడు నాకు కాబ్స్‌లో, విమానాలలో ప్రయాణించే వైభోగం లభించింది. అప్పుడు నాకు వ్యక్తిగత ప్రయాణానికి బస్సుల కంటే ఆటోలే సౌలభ్యంగా కనిపించటం ప్రారంభించాయి, హైదరాబాదుకొచ్చే వరకు ఇది కొనసాగింది.

**హైదరాబాద్**

నేను హైదరాబాద్‌కి వచ్చాక నగరంలో ప్రయాణించాలంటే నా భర్త పైనే ఆధారపడటం మొదలయింది. మేము మా సొంత వాహనం లోనే కాబట్టి, నా భర్త బంధువులు హైదరాబాద్ నలుమూలల ఉన్నారు కాబట్టి మేము హైదరాబాద్ అంతటా కారులో ప్రయాణిస్తుంటాం. నేను నా గూగుల్ మ్యాపులని ఉపయోగించే నావిగేటర్‌గా మారాను. ఇక్కడ ఈ టెక్నాలజీ బాగా ఉపయోగపడింది కానీ నేను నగరం పూర్తి స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి ఎప్పుడూ బహుశా ప్రయత్నించలేదు. నేను ఉద్యోగంలో చేరిన తర్వాత రోజూ ప్రజా రవాణా సౌకర్యంలో ప్రయాణిస్తూ నగరాన్ని బాగా అర్థం చేసుకున్నాను. (హైదరాబాద్‌లో ఉన్న రెండేళ్ళలోఉద్యోగంలో చేరిన మొదటి కొన్ని నెలల్లో మా ఆఫీస్‌లో ఒకతను అడిగారు: ఎందుకు మీరు ఏ ప్లేసో చెప్పక ముందే మాటి మాటికి ఈ ప్లేస్ నాకు తెలియదని చెప్తారు అని అడిగాడు)


హైదరాబాద్‌లో ఉన్న సౌలభ్యం ఏమిటంటే ఇక్కడ ఎం.ఎం.టి.యస్ రైళ్ళు, బస్‌లు, ఆటోలు, షేరింగ్ ఆటోలు ఎక్కువగానే ఉంటాయి. బస్ ప్రయాణం నాకు చాలా విషయాలు నేర్పింది. పరిగెడుతూ రోడ్డు మధ్యలో బస్ ఎక్కడం, ద్విచక్ర వాహనాలను తప్పుకుంటూ మధ్యలో బస్ దిగడం వంటివి చేయటానికి అవసరమైన శారీరక ఫిట్‌నెస్ ఉండాలి. బస్ నంబర్‌లు వెతుక్కోవటంలో చాలా షార్ప్‌గా ఉండాలి. ముఖ్యంగా బస్‌లు ఎక్కువగా వచ్చే లక్డి కా పూల్ లాంటి రద్దీ బస్ స్టాప్‌లలో చాలా అప్రమత్తంగా బస్ నంబర్లు గమనించాలి. బస్‌లు వేసే సడెన్ బ్రేకులకు, వేగంగా తిప్పే మలుపులకు నన్ను నేను సంయమనం చేసుకోవడం నేర్చుకున్నాను. (ఎయిర్ హొస్టెస్ నేర్చుకునే దానికంటే ఎక్కువగా) నా పర్స్ నిండా డబ్బులున్నపుడు మాత్రం ఊబర్, ఓలా కాబ్‌లు నా ప్రయాణ జీవితాన్ని సులభతరం చేస్తాయి.

ఎం.ఎం.టి.యస్ స్టేషన్ మా ఇంటికి నడక దూరంలో ఉండటం వలన నేను ఎక్కువగా ఎం.ఎం.టి.యస్ రైలు ప్రయాణానికే ప్రాధాన్యతనిస్తాను. ఇంతకు ముందులా కాకుండా నేను పని చేయడం మొదలు పెట్టాక ఎం.ఎం.టి.యస్‌ల మీదే ఆధారపడ్డాను. రైళ్ళు అర గంట, గంట ఆలస్యంగా నడవటానికి అలవాటుపడాలి. హఠాత్తుగా రైళ్ళు రద్దు అవుతాయి. మరీ ముఖ్యంగా సాయంత్రాలు. రైలు ఆలస్యానికి కారణాలు ప్రతి రోజూ ఏదో ఒకటి ఉంటుంది. ఒక రోజు రైలు 40 నిమిషాలు ఎందుకు ఆలస్యం అయిందని అడిగితే సిగ్నల్ ఇవ్వలేదని, ఎక్కడో పని జరుగుతుందని కారణాలు చెప్పారు. నేను, రోజూ కలుసుకునే నా సహ ప్రయాణీకులూ ఈ కారణాలకు అలవాటు పడిపోయాం.


రోజూ ప్రయణం చేసే ప్రయాణికులని కలవటం వల్ల వారి మధ్యలో ఉండే స్నేహం, అపేక్షలను గమనించాను. నేను కొందరు అద్భుతమైన స్త్రీలను కూడా చూసాను. వారు తమ ఆహారాన్ని, ఆందోళనలను, కథలుగా ఒకరితో ఒకరు పంచుకునే వారు. రెండేళ్ళ క్రితం చాలాసార్లు వాళ్ళు 'మెట్రో' వస్తోందన్న విషయం మాట్లాడుకునే వారు. వస్తే ప్రయాణం సులభమవుతుందని అనుకునేవారు. మెట్రో రైలు ప్రారంభమైన తరువాత దానిలోనూ, దీనిలోనూ కలిపి ప్రయాణించి, కొంతమంది మెట్రోకి మారిపోయారు. కొంతయంది ఎమ్ఎమ్‌టిస్‌తో ఉండిపోయారు. మరి కొంతమంది కొత్త లైన్‌ల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త మెట్రో లైన్లు పెరిగే కొద్దీ నగర ప్రయాణ రూపురేఖలు చాలా మారబోతున్నాయి.

ఒకసారి వెను తిరిగి చూసుకుంటే, ఒక స్త్రీగా రవాణా సౌకర్యాలని, ఖర్చు, అందుబాటు, భద్రతలని దృష్టిలో

పెట్టుకుని ఎంపిక చేసుకున్నానని అర్థమయింది. ఇక్కడ నేనొక మధ్యతరగతి, ఆధిపత్య కులానికి చెంది, అన్ని అవయవాలు సరిగ్గా పనిచేస్తున్న స్త్రీగా మాట్లాడుతున్నాను. ఈ పరిమిత పరిధిలో కూడా మన జీవన విధానం– పని, వినోదం, షాపింగ్ ఇలా అనేక విషయాలకి సంబంధించి – మనకు తెలియకుండానే ప్రజా రవాణా సౌకర్యాల చుట్టూ అల్లుకుపోతుందో అర్థం చేసుకోవచ్చు. జబల్‌పూర్ హాస్టల్లో నన్నెప్పుడూ మగమనిషి లేకుండా బయటకు వెళ్ళటానికి అనుమతించక పోవటంతో ఆ పట్టణం నాకు అపరిచితంగానే ఉండి పోయింది. కాలేజీ, హాస్టల్ గురించి మంచి జ్ఞాపకాలు గానీ ఆ పట్టణం గురించేమీ లేవు. ఢిల్లీ నాకు పెద్ద విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తిరగడానికి అవకాశమిచ్చింది గానీ, నగరంలోకి మాత్రం పరిమితులతో కూడిన అనుమతి మాత్రమే ఇచ్చింది. విశ్వవిద్యాలయం నుండి బయటికెళ్ళినప్పుడు ఎప్పుడూ జాగ్రత్తగా మెలగాల్సి వచ్చేది. సమయం గురించి పట్టించుకోవాల్సి వచ్చేది. సాయంత్రం కాగానే భద్రత నిచ్చే విశ్వవిద్యాలయ ప్రాంగణానికి వెనక్కి పరిగెత్తుకుని వెళ్ళోల్సొచ్చేది. ముంబాయి నగరం నాక్కావాల్సినంత స్పేస్ నిచ్చింది. ప్రజా రవాణా సౌకర్యాలనిచ్చింది. బహిరంగ ప్రదేశాలోనికి ఆహ్వానించింది. ఇప్పటికి ఆ ఆనందకర అనుభవం ఆ నగరంవైపు నన్ను లాగుతూనే ఉంటుంది.




ఇంటిదాకా రవాణా సౌకర్యాలు కల్పించే నగరాలు నాకు నచ్చాయి. పట్టణాల్లో, గ్రామాల్లో ఎక్కడో అక్కడ దిగి ఇంటికి చేరుకోవటానికి ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. ఝార్ఖండ్‌లో పుడయ్యాహట్‌లో ఉన్నప్పుడు నా అనుభవం సాధారణ స్త్రీల అనుభవం లాంటిది కాదని నా కర్థమయింది. నేను నడిపే బైక్ వల్ల నన్ను పలు గ్రామాల్లోని స్త్రీలు గుర్తు పెట్టుకునేవారు. చాలా ఉత్సుకతతో బైక్ గురించి అడిగి, నా హెల్మెట్ ధరించి వాళ్ళని కూర్చోపెట్టుకుని తిప్పమనేవారు. ఆ పల్లెల్లో అత్యధిక స్త్రీలకి ప్రయాణమంటే పుట్టింటికి వెళ్ళటం, బ్లాక్ ఆఫీసుకి లేదా హాస్పిటల్ లేదా ఏ ప్రభుత్వ ఆఫీసుకి వెళ్ళటమే.




హైదరాబాదు నాకు సమయం, స్పేస్ రెండూ ఇస్తుంది. నాకు ఈ సమయానికి ఇల్లు చేరుకోవాలనే బాధలేదు. ఎంతలేటయినా రవాణా సౌకర్యాలు లభ్యమవుతాయి. జీవితంలో మొట్టమొదటిసారి ప్రజా రవాణా సౌకర్యాల వాడకం నేను నగరానికి చెందుతానని ఈ నగరం నాదే నన్న భావనని కల్పించింది.

వివిధ నగరాల్లో, గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో నివసించిన నాకు ఒక గమ్యస్థానం నుండి మరో గమ్యస్థానానికి చేరడానికి ప్రజా రవాణామార్గాలు కేవలం సౌకర్యాలు మాత్రమే కాదు, ఆయా స్థలాలతో చనువు, అనుబంధం ఏర్పరచి, వలస వచ్చిన మహిళగా ఈ నగరాన్ని నా సొంత ఇల్లుగా భావించేటట్లు చెయ్యటానికి, నన్ను ఇంకా స్వేచ్ఛగా, స్వతంత్రంగా తిరిగేలా చేయటానికి ఇవి చాలా ఉపకరించాయి.


**మిథున్ సోమ్ అన్వేషి రిసర్చ్ సెంటర్‌లో పనిచేస్తున్నారు**
sommithun@gmail.com.

***అనువాదం : మాధవి మిరప***



# రచన ముద్రబోయిన:

## హైదరాబాదు ట్రాన్స్ యాక్టివిస్టు

### ఒక పరిచయం

■ మధురిమ మజుందార్

జండర్, లైంగిక ధోరణి, వర్గం, కులం, మతం వంటి భిన్న అంశాల కలయికే రోజువారి నగర జీవితంలో మనం అనుభవించే ఆధిక్యతని, అలాగే, మనం ఎదుర్కొనే కష్టాలని కూడా రూపొందిస్తాయని ఈ సంచికలో అనేక వ్యాసాలు సూచిస్తాయి. నగరంతో మన సంబంధాలని నిర్ణయించే వాటిల్లో జండర్ ఒక ప్రధాన అంశం. పురుషులతో పోలిస్తే స్త్రీలు నగరాల్లో ప్రతికూల పరిస్థితులని ఎదుర్కొంటారు. అయితే పుట్టుకతో తమకిచ్చిన లింగ అస్తిత్వాన్ని ఒప్పుకోని వారికెదురయ్యే ప్రతికూలత దీనికంటే ఎన్నో రెట్లు తీవ్రంగా ఉంటుంది. ట్రాన్స్ ప్రజలు చారిత్రకంగా ఎంత వివక్షని ఎదుర్కొన్నారంటే. వారికి తమను తాము పోషించుకోవటానికి భిక్షాటన, సెక్స్ వర్క్ తప్ప వేరే దారులు లేకుండా పోయాయి. ట్రాన్స్ మహిళలు, ట్రాన్స్ పురుషులు, స్త్రీ/పురుష ద్వయంలో ఇమడని ఇతరులు సమాజంలో ప్రతి స్థాయిలో హింస, అణచివేత ఎదుర్కొంటున్నారు. వారు తమ కోసం తాము ఎంచుకున్న లింగపరమయిన, జండర్ పరమయిన అస్తిత్వాలని ప్రభుత్వం గుర్తించట్లేదు; ప్రభుత్వ విధానాల్లో వారికి చోటుండదు; ప్రచార సాధనాలు వారిని హేళన చేస్తాయి లేదా అసహ్యంగా చూపిస్తాయి. వైద్య రంగం వారిని రోగ గ్రస్తులుగా చూస్తుంది.

ఇన్ని అడ్డంకుల మధ్యలో రాజమండ్రికి చెందిన ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన హైద్రాబాదుకి వచ్చి ఇక్కడ నివాసమేర్పర్చుకున్నారు. ఆమెకి కామర్స్‌లో, సోషల్ వర్క్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలున్నాయి. ఆమె ట్రాన్స్ సమస్యల కోసం పోరాడే యాక్టివిస్టు. అయితే ఆమె యాక్టివిజం ట్రాన్స్ జండర్ వ్యక్తుల హక్కులకు పరిమితం కాదు. ఆవిడ అణచివేతకు గురవుతున్న దళితులు, శ్రామికుల పార్టీలతో, వ్యవసాయదారుల హక్కుల కొరకు కూడా చురుకుగా పనిచేస్తారు. ట్రాన్స్‌జండర్ ప్రజలు తమ లింగ, జండర్ అస్తిత్వంతోపాటు వివిధ కుల, మత, ప్రాంత, వర్గ అస్తిత్వాలతో వుంటారనే లోతయిన అవగాహనతో కూడుకుంది ఆమె యాక్టివిజం. కొన్ని సంవత్సరాలుగా ఆమె పని, ఈ భిన్న అంశాల గురించి పని చేసే వివిధ పోరాటాల మధ్య సంఘీభావం తీసుకురావటం.

ఆమె తన ఫేస్‌బుక్ ద్వారా తన ఆలోచనల్ని, అభిప్రాయాలని చురుకుగా పంచుకుంటూ, ఒక నెట్‌వర్క్‌ని నిర్మిస్తూ, దాని ద్వారా తన కమ్యూనిటీ యాక్టివిజంని బలపరుచుకోవటానికి పనిచేస్తుంటారు. ఈ వ్యాసం కోసం ఆమె ఫేస్‌బుక్ పోస్టులని కొన్ని తీసుకుని హైద్రాబాదులో ఒక ట్రాన్స్ మహిళగా జీవించటం, యాక్టివిస్టుగా పని చెయ్యటం గురించి, ఆమె యాక్టివిజం లోని లోతుల్ని పరిచయం చెయ్యటానికి ఒక ప్రయత్నం చేసాను. స్థలాభావం వల్ల కొన్ని పోస్టులని మాత్రమే తీసుకున్నా, అవి తేదీల ప్రకారం ఉండేటట్లు చూసాను.

**9 అక్టోబరు**

*రోహిత్ వేముల తల్లి రాధికమ్మ ఆమ్నెస్టీ ఇండియా సంస్థ అట్టడుగు వర్గాల నుండి ఉద్యోగులను తీసుకుని, తన సంస్థ టార్గెట్ల కోసం వారిని వివక్షకు గురిచేసిన కారణంగా ఆ సంస్థకి మద్దతు ఉపసంహరించు కుంటున్నానన్నారు. ఆవిడ వివక్షకు గురయిన వారి పక్షాన నిలబడ్డారు.*

*జై భీం....జోహార్ రోహిత్....మా అమ్మ రాధికమ్మంటే నాకు గర్వం!*

**ఏ అన్యాయమయినా మనకి జరిగినట్లే భావిద్దాం.**

రోహిత్ వేముల హైద్రాబాదు విశ్వవిద్యాలయంలో దళిత పరిశోధక విద్యార్థి. 2016 జనవరిలో యూనివర్శిటీ అధికారులు పాటించాల్సిన నియమాలు, పద్ధతులు పాటించకుండా, ఒక సవర్ణ విద్యార్థి ఫిర్యాదు కారణంగా ఆరుగురు దళిత విద్యార్థులకి శిక్ష విధించడాన్ని నిరసిస్తూ తన జీవితాన్ని ముగించాడు.

**15 అక్టోబర్**

*మన దేశంలో సంస్కారం పేరు మీద బలంగా వీస్తున్న నియంతృత్వ గాలుల వల్ల సెక్స్ వర్కర్ల ఉద్యమం వధ్య శిలపైకి ఎక్కడానికి సిద్ధంగా ఉందని మనందరికీ తెలుసు.*

*మీటూ ఉద్యమం తమ భిన్న లైంగికత కారణంగా పితృస్వామ్య సమాజంచే అమానుషంగా చూడబడుతున్న స్త్రీలని ఎంతమేరకు కలుపుకుంటుందో వేచి చూడాలి. సెక్స్ వర్క్‌ని ఎంచుకోవటం, భిన్న జండర్‌గా ఉండటం ఇప్పటికీ నిషిద్ధమే.*

**15 అక్టోబర్**

*నాకు ఇష్టమైన పుస్తకాల్లో ఒకటైన 'ఒక సెక్స్ వర్కర్ ఆత్మకథ' రాసిన ధైర్యశాలి నళిని జమీలా కి నేను పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాను. ఇది కుటుంబంలోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ సెక్స్ వర్కర్లపై హింసాత్మక పితృస్వామిక అణచివేత గురించి బలంగా చెపుతుంది. ఈ సంవత్సరం ఆమె తన రెండవ పుస్తకం 'రొమాంటిక్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ఎ సెక్స్ వర్కర్' కొరకు సౌత్ ఆసియా లాడ్లీ అవార్డును గెలుచుకుంది.*

*సెక్స్ వర్క్‌ని నళిని జమీలా ఏ లిపి, నియమం లేని ఒక భాషగా నిర్వచించింది. స్త్రీలకి సమాజంలో వివిధ రకాల అవకాశాలు వుంటాయి. పుట్టిన సామాజిక వర్గం బట్టి కట్టడులు కూడా వుంటాయని చెపుతూ, రాళ్లు కొట్టే పని, రోడ్డు మీద చిన్న వ్యాపారాలు చేసుకోవటం లేదా గృహ కార్మికురాలిగా పని చెయ్యటం కంటే తనకి సెక్స్ వర్క్ మెరుగ్గా అన్పించిందని అంటుంది.*

*హృదయపూర్వకంగా మాట్లాడినందుకు మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నా నళిని! జమీలా పాపులేషన్ ఫస్ట్ సంస్థకి భిన్న దృక్పథం అవలంబించినందుకు ధన్యవాదాలు చెపుతున్నా! ఈ*

*పనికి మాలిన కాలానికి నేను సదా రుణపడి ఉంటా, పర లోకంకంటే, ఇహ లోకంలో జీవితంపై నా దృష్టిని నిలిపినందుకు!*

**15 అక్టోబర్**

**ఆ ఈ అంజలి లాడ్లీ అవార్డు గెలుచుకుంది.**

మన ముందున్న జండర్ సమస్యల గురించి మీడియాలోను, ప్రచార సాధనాల్లోనూ బాగా రాసిన వారిని గుర్తించి, గౌరవించి, ప్రశంసిస్తూ లాడ్లీ మీడియా అవార్డు ఇస్తారు. సమాచారం, ప్రచార రంగాల్లో పనిచేసే పాపులేషన్ ఫస్ట్, యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్‌తో కలిసి దీన్ని నడుపుతారు. ఈ సంవత్సరం గెలిచిన వాళ్లలో నళిని జమీలాతో పాటు ఆ ఈ అంజలి బృందం కూడా వున్నారు. ఆ ఈ అంజలి ట్రాన్స్‌విజన్ అనే యు ట్యూబ్ ఛానెల్‌లో ఒక షో. సిస్ జండర్ పుట్టుకతో ఇవ్వబడిన లింగ అస్థిత్వంతో ఏ సమస్య లేనివాళ్ళు ప్రజల్లో ట్రాన్స్ జండర్ సమూహాల గురించి ఉండే అపోహలని తొలగించటానికి రచన, మరి కొందరు కలిసి ప్రారంభించిన యుట్యూబ్ ఛానెల్ ఇది.

**10 అక్టోబర్**
**వెంకట్‌ని అరెస్టు చెయ్యండి**

వెంకట్ ఒక రౌడీ షీటర్. ఇతను ట్రాన్స్ మహిళలని వేధించి, బాధించటమే కాక, హైద్రాబాదుకి చెందిన ప్రవల్లిక అనే ట్రాన్స్ మహిళని చంపినట్లు ఆరోపణలున్నాయి. ఇన్ని ఆరోపణలున్నప్పటికీ పోలీసు డిపార్టుమెంటు ఈయనపై ఏ విధమయిన సీరియస్ చర్య తీసుకోకపోవటానికి ప్రధాన కారణం ఫిర్యాదు చేసిన వాళ్లలో అత్యధికులు ట్రాన్స్ మహిళలు కావటమే.

**3 అక్టోబరు**

**మీటూ మీడియా**

*ట్రాన్స్ సెక్స్ వర్కర్లు, వెంకట్ వేధింపుల నుండి తట్టుకుని నిలబడిన వాళ్ళు తనుశ్రీ దత్తాకి మద్దతు ప్రకటిస్తున్నారు.*

**16 అక్టోబర్**

**ఒంటరి నన్న భావన**

*హలో # మీ టూ ఉద్యమం, # ట్రాన్స్ టూ అని ఎప్పుడు అంటారో కొంచెం చెప్తారా?*

**18 అక్టోబర్**

**# బాధపడుతున్నా మీ టూ # ట్రాన్స్ టూ**

*లైంగిక వేధింపులు, అత్యాచారాలు, న్యాయం అందకుండా వందల సంవత్సరాలు వెలి వేసినందుకు చరిత్ర మాకు క్షమాపణలు చెప్పుకోవాలి.*

**19 అక్టోబరు**

**గుండె పగిలిన అనుభూతి**

*ట్రాన్స్ జండర్ ప్రజలపై జరిగే సమూహిక అత్యాచారాలు, ఆసిడ్ దాడులు, వారి హత్యలు అత్యంత దుర్మార్గంగా జరిపే భయానక నేరాలు కావా?*

**25 అక్టోబర్**

**కోపంగా వుంది**

*మహిళలపై, ట్రాన్స్ ప్రజలపై వేధింపులు రెండింటికీ సాధికారత కల్పించేది బ్రహ్మణీయ పితృస్వామిక వ్యవస్థే. నిరంతరంగా!*

**#** మీ టూ ఉద్యమంలో ముందుకొచ్చి తమపై జరిగిన లైంగిక వేధింపుల గురించి మాట్లాడిన స్త్రీలకు రచన మద్దతుగా నిలబడ్డారు. అయితే ఇది ఎంత వరకు ట్రాన్స్ మహిళలకి ఉపయోగపడుతుందని ఆవిడ సందేహం. మీ టూ ఉద్యమం ఆవిడలో రేపిన సంక్లిష్ట భావోద్వేగాల్ని ఆవిడ రాసిన పోస్టులలో చూడొచ్చు. ఒక పక్క ఆధిక్యత వున్న స్త్రీలు చేసే ఈ ఉద్యమానికున్న ఉపయుక్తతని గుర్తిస్తూనే ఇంకో పక్క తమని పూర్తిగా ఈ ఉద్యమం పరిధి బయట వదిలేశారని భావన కూడా చూడొచ్చు.

**27 అక్టోబర్,**

**బాధ పడుతున్నా**

*ఆజాం మేరెలాల్, ఢిల్లీలోని బేగంపూర్ లోని మాళవియా నగర్‌లో హిందుత్వ గూండాలు 8 ఏళ్ల మద్రసా విద్యార్థిని కొట్టి చంపేశారు. అర్థం లేని విషపూరితమయిన మగతనపు భావన ఒక చిన్న పిల్లాడిని మరి కొంత మంది పిల్లలు కొట్టి చంపేసేటట్లు చేసింది. క్రికెట్ ఆడుకోవటానికి ఖాళీ స్థలం ఎవరిదని ఇద్దరు పిల్లల గుంపుల మధ్య వచ్చిన కొట్లాటలో, చుట్టు పక్కల వాళ్ళు కొట్లాటని ఆపకపోగా ఒక బృందాన్ని ప్రోత్సహించి ఇంకో బృందం బట్టల్ని, టోపీ ని చూసి గేలి చేశారు.*

**3 నవంబరు**

*తెలంగాణ స్త్రీలకి, ట్రాన్స్ ముమెంట్‌కి చారిత్రాక సందర్భం. రాబోయే ఎన్నికల కోసం మహిళా ట్రాన్స్ జండర్‌లు కలిసి ఎన్నికల మ్యానిఫెస్టోని విడుదల చేయడం జరిగింది. ఈ మ్యానిఫెస్టోలో దళిత మహిళలు, ఆదివాసీ మహిళలు, ముస్లిం మహిళలు, వ్యవసాయ మహిళలు, అసంఘటిత రంగంలోని మహిళలు, చేనేత మహిళలు, మహిళా జర్నలిస్టులు, వలస వచ్చిన నిర్మాణ కార్మికులు, గృహ కార్మిక మహిళలు, విదేశాలలో పని చేసే మహిళలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులైన మహిళలు, నిరాశ్రయులైన మహిళలు, మైనార్టీ అమ్మాయిలు, ట్రాన్స్ జండర్ మహిళలు మరియు తల్లిదండ్రులు లేని పిల్లలు, విద్య, ప్రజారోగ్యం, హింసకు వ్యతిరేకంగా, భద్రత, మద్యం కంట్రోలు, వ్యవసాయం, పర్యావరణం, కులాంతర, మతాంతర వివాహాలకు ప్రత్యేక వివాహ చట్టంలాంటి డిమాండ్లను అందరూ కలిసి ఈ డిమాండ్లను రాజకీయ పార్టీల ముందుంచడం జరిగింది.*

*మహిళా కామ్రేడ్లకు, తెలంగాణ ట్రాన్స్ జండర్ ప్రజలకి కృతజ్ఞతలు, మీ అందరి సహకారం వల్లే ఇంత పెద్ద చారిత్రాత్మక ఉద్యమం సాధ్యమైంది.*

మహిళా ట్రాన్స్ జండరు సమస్యలపై ముప్పై సంస్థలకు చెందిన గ్రూపు పని చేస్తుంది. దీనిలో ఇంకా కొంత మంది విద్యావంతులు, కార్యకర్తలతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ అందరినీ సంప్రదించి మహిళా, ట్రాన్స్ జండర్ మ్యానిఫెస్టోను తయారు చేసారు, డిసెంబరు 7న జరగబోయే ఎన్నికల కోసం.

**17 నవంబరు**

*ట్రాన్స్‌జండర్లని గుర్తుకు చేసుకునే రోజు సందర్భంగా సంపూర్ణ కమ్యూనిటీ సభ్యులందరినీ దీనిలో పాలుపంచుకొమ్మని ఆహ్వానిస్తుంది.*

సంపూర్ణ ట్రాన్స్ మరియు ఇంటర్ సెక్స్ భారతీయుల సంఘం. వ్యవస్థీకృత ట్రాన్స్ వ్యతిరేక హింస వల్ల చనిపోయిన అందరినీ 20 నవంబరున గుర్తు చేసుకుంటారు. క్రూరంగా హత్యకి గురయిన రీటా హెస్టర్ అనే మెసాచుసెట్స్ ట్రాన్స్ మహిళని గుర్తు చేసుకోవటానికి 1999లో ఈ ఆన్‌లైన్ కార్యక్రమం మొదలయింది.

**19 నవంబరు**

*మార్గరెట్ ఆటవుడ్ మాటల్లో "మన సమాజం ఇంకా అధికారం వున్న పురుషులని పుట్టుకతోనే బలమైన నాయకుడని భావిస్తుంది. కానీ అధికారం గల స్త్రీని మాత్రం ఒక వైపరీత్యంగా చూస్తుంది.*

*మన బలమయిన నాయకురాలు చంద్రముఖి మువ్వల ఇప్పుడు హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజక వర్గంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. నాయకత్వం అంటే వుండే మూస పోసిన ఆలోచనలనే కాకుండా ఓటు బ్యాంకు రాజకీయాలని కూడా సవాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎవరూ అడగని ట్రాన్స్ జండర్ ప్రజల హక్కుల గురించి గట్టిగా అడుగుతున్నారు.*

**జై భీం...జై సావిత్రి**

**22 నవంబరు**

*బహుజన నాయకురాలు చంద్రముఖితో...మన గుర్తు మర్చిపోకండి...మన ఓటు నాగలి పట్టుకున్న వ్యవసాయదారుడి గుర్తుకే వేద్దాం...*

*జై భీం... జై సావిత్రిబాయి...*

చంద్రముఖి ట్రాన్స్‌జండర్ మహిళ మరియు యాక్టివిస్టు. తెలంగాణ అసెంబ్లీకి 7 డిసెంబరు 2018న జరిగిన ఎన్నికల్లో గోషా మహల్ నియోజక వర్గం నుండి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ తరపున పోటీ చేశారు.

**22 నవంబరు**

**మనసు ఆశతో నిండిపోయింది**

*బహుజన సమాజ్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న సుజాత సూరేపల్లికి ఇంకింత శక్తి నిద్దాం...*

కరీంనగర్‌కి చెందిన విద్యావేత్త మరియు యాక్టివిస్టు డా॥సుజాత సూరేపల్లికి కూడా రచనకు మద్దతు ప్రకటించారు.

**22 నవంబరు**

*తాజా వార్తల ప్రకారం ప్రభుత్వం ట్రాన్స్‌జండర్ ప్రజలకి ఆధార్ యు ఐ డి సంఖ్య కోసం ఏ అవకాశం ఇవ్వలేదు.*

ఇద్దరు ట్రాన్స్ మహిళలు తమ ఆధార్ కార్డుల కోసం వెళ్లినపుడు, ట్రాన్స్ జండర్ అన్న బాక్స్ లేదని తెలుసుకుని విస్మయానికి గురయ్యారు. ఈ పోస్టు దానికి సంబంధించింది.

**22 నవంబరు**

**ప్రశాంతంగా  వుంది**

*"ఒక వ్యక్తికి తగినంత సమయం ఇచ్చి సౌకర్యం కల్పించి చూడు, ఎటువంటి మాజిక్ జరుగుతుందో"* **టు కిల్ ఏ మాకింగ్ బర్డ్ పుస్తకం నుండి**

రచన హార్పర్ లీ కాలిన్స్ 1930ల అమెరికా గురించి రాసిన నవల 'టు కిల్ ఏ మాకింగ్ బర్డ్' నుండి ఉదహరిస్తారు; సాధారణంగా ఆమె పోస్టులు చాలా వరకు రాజకీయాలకి సంబంధించిఉంటాయి.  అయితే సాహిత్యం నుండి ఉదాహరణలు, అలంకారాలు, వాదనలు కూడా ఆమె తరచుగా తీసుకుంటారు.

**30 నవంబరు**

**శక్తివంతురాలిగా  అన్పిస్తోంది**

*గాయాలు ఉద్యమాలని బలోపేతం చేస్తాయి, వివేకాన్నిస్తాయి కూడా!*

**1 డిసెంబర్**


**ఆశతో వున్నాను.**

*ఉద్యమమంటే కొట్లాటలు, వాదనలు, అసూయ, నమ్మకం, కన్నీళ్లు మరియు విభేదాలు. మానవత్వాన్ని కాపాడుకోవటానికి ఆయా భావనలు, ఉద్వేగాలతో మనమెట్లా ప్రయాణం చేస్తామో అదే అసలయిన ఉద్యమ స్ఫూర్తి.*

చంద్రముఖి 27 నవంబర్ పొద్దున్న కిడ్నాప్ చెయ్యబడింది. సరిగ్గా ఎన్నికలకి 11 రోజుల ముందు. ఆమెకేమవుతుందో నన్న భయంతో పోలీసులకి వెంటనే ఫిర్యాదు చెయ్యటం జరిగింది. రాజ్యం ట్రాన్స్ జండర్ ప్రజలపై ప్రతిసారీ ప్రత్యక్ష హింసకి పాల్పడదు. చాలాసార్లు వారిపై హింస జరిగిన సందర్భాల్లో ఏమీ చెయ్యకుండా నిశ్శబ్ద ప్రేక్షకునిగా వుంటుంది. ఈ కేసులో కూడా అదే అయింది. అయితే ఆమె తనని బంధించిన వారి నుండి తప్పించుకుని 29 పొద్దున్నే హైదరాబాదుకి తిరిగి వచ్చింది. రచన ఈ సందర్భంలో తన భావోద్వేగాన్ని తన పోస్టులో వ్యక్తం చేశారు. ఆ రోజునే బహిరంగ ఊరేగింపులో చంద్రముఖితో దిగిన ఫోటోలని కూడా పోస్టు చేశారు.


ఇలా అణచివేతకు వ్యతిరేకంగా, పొందే విజయాలు కొన్నే అయినప్పటికీ, ఆమె తన పోరాటం కొనసాగిస్తున్నారు. ఆమె బలం, ప్రభావం, ఓర్పు విభిన్న స్వరాల మధ్య సంఘీభావం కోసం ఆమె చేసే కృషి అభినందనీయం!

***అనువాదం: ఎ. సునీత***









ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

వ్యవసాయ సంబంధాలపై సుదీర్ఘ చర్చ

*సంచిక : 13** | *తెలుగు & ఇంగ్లీష్* | *మార్చి 2018* | *విరాళం : 25 రూ.*

<u>విషయసూచిక</u>

- సంపాదకీయం
- భారతదేశ వ్యవసాయ రంగంలో పరిణామ క్రమం : మన దగ్గరనున్న సమాచారం ఏం చెప్తుంది? *అమిత్ బసోలే, దీపాంకర్ బసు*
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రామాల్లో సమకాలీన వ్యవసాయ పరిస్థితులు *ఆర్.వి.రమణ మూర్తి*
- భూమా? శ్రమా? గ్రామీణ భారత దేశంలో దళితుల చారిత్రక సంఘర్షణ *ఎస్.ఎ. విద్యాసాగర్*
- రైతాంగ సమస్య అప్పుడూ-ఇప్పుడూ *హెన్రీ బెర్న్‌స్టీన్*
- పెట్టుబడి, పెట్టుబడేతర విలువ: *కల్యాణ్ సన్యాల్*
- ప్రపంచీకరణ-వ్యవసాయక సమస్య *అక్రమ్ లోధీ, క్రిస్టొబెల్ కే*
- పెత్తందారీ భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ వ్యవసాయిక వ్యవస్థకు పరివర్తన *టి.జె. బైర్స్*
- భారతీయ వ్యవసాయం, అర్ధ భూస్వామ్యమా? లేక పెట్టుబడిదారీ వ్యవసాయమా? *ప్రఫుల్ బిద్వయ్*
- భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగిన పరిణామంలో వర్గ పోరాటం కీలక చోదక శక్తేనా? *ఎస్ ఆర్ ఎప్‌స్టీన్*
- వ్యవసాయ సమస్య *కార్ల్ కౌట్స్కీ*
- ఫ్రాన్స్, జర్మనీలలో రైతు సమస్య *ఫ్రెడరిక్ ఎంగెల్స్*
- భూమి జాతీయకరణ *కార్ల్ మార్క్స్*
- పెట్టుబడిదారీ కౌలురైతుల ఆవిర్భావం *కార్ల్ మార్క్స్*
- ఆదిమ పోగుబడి వెనక దాగిన రహస్యం *కార్ల్ మార్క్స్*

**ప్రత్యేక సంపాదకులు :** *ఆర్.వి. రమణమూర్తి, ఎస్.ఎ. విద్యాసాగర్, గడియారం భార్గవ*
**సంపాదకులు:** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*
**అడ్వయిజరీ బోర్డ్:** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కోటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*
**ప్రొడక్షన్:** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*
**ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.
వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

* సంచిక సంఖ్యలో కొంత అయోమయం నెలకొనడం వల్ల ఇప్పటి నుండి వరుస సంచిక సంఖ్య మాత్రమే ఇస్తున్నాం

# హైదరాబాద్ నగరంలో మొదటి తరం దళిత యువతుల అనుభవాలు

■ మాధవి మిరప

వివిధ ప్రదేశాల నుండి వచ్చిన యువత హైదరాబాద్‌లో ఏ విధంగా సవాళ్ళను, సమస్యలు ఎదుర్కుంటుంది అనే విషయంపై అన్వేషి రీసెర్చ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ చేపట్టిన "నగరాలు: లైంగికత" ప్రాజెక్టులో  వివిధ రంగాలకు, విద్యా సంస్థలకు చెందిన యువతను ఇంటర్ వ్యూ చేయడం జరిగింది.

హైదరాబాద్ నగరానికి వస్తున్న దళిత యువతుల నేపథ్యం గ్రామాల్లో ఏ విధంగా ఉంది? ఏ వర్గపు యువత ఎక్కువగా నగరానికి చేరువవుతున్నారు? దానికి గల కారణాలేమిటి?

నగరాని కొచ్చిన దళిత యువతుల అనుభవాలు ఏ విధంగా రూపాంతరం చెందాయి? ఈ విధంగా రూపాంతరం చెందుతున్న క్రమంలో నగరానితో వారు ఏవిధమైన సంఘర్షణకు గురి అయ్యారు? వివిధ ప్రదేశాల నుండి, వివిధ వర్గాల నుండి హైదరాబాద్‌కు వచ్చిన దళిత యువతుల అనుభవాలను ఈ అధ్యయనంలో పరిశీలించాము.

అసలు వలస ఎందుకు వస్తున్నారు? ఉన్న ప్రదేశం నుండి పని కోసమో, చదువు కోసమో లేదా పెళ్ళిళ్ళ పేరు మీదో వారి జీవన భృతిని వెతుక్కుంటూ తాత్కాలికంగానో, శాశ్వతంగానో వెళ్లడం వలసగా చెప్పుకుంటాం. ప్రస్తుతం ఉన్న జీవితం కంటే మంచి ఆర్థిక స్థాయిని చేరుకోవటం కోసం లేదా ఉన్నత చదువుల కోసం చాలామంది వలస వస్తుంటారు.

ఇక్కడికి దళిత స్త్రీలు విభిన్న వర్గాల నుండి వస్తుంటారు. ఏ వర్గం అయినా నగరం లో తమ ఉనికిని వెతుక్కోవటానికో, నిలబెట్టుకోవడానికో నిరంతరం ఆరాట పడుతుంటారు. చాలా మంది క్రింది వర్గం వారైతే, అతి కొద్ది మంది మాత్రం విద్యా నేపథ్యంగా గల వర్గం నుండి వచ్చిన వారు.

ఒక మారుమూల గ్రామం నుండి వచ్చి నగరంలో నర్స్‌గా పనిచేస్తున్న ఆనా తను అనుభవాలను ఈ విధంగా చెప్పింది. "మా వూర్లో మమ్మల్ని తురకోళ్ళు కూడ వాళ్ళ గుమ్మం లోకి రానిచ్చేవారు కాదు. కానీ ఇక్కడ మేము వాళ్ళతో కలిసి పనిచేస్తున్నాం, వాళ్ళతో కూర్చొని భోజనం కూడ చేస్తాం. వాళ్ళు మమ్మల్ని ఇక్కడ చాలా బాగా చూసుకుంటారు." గుడి చివరి మెట్టు మీదనే నిలబడి దేవుడ్ని చూడాలని, గుడిలోకి ప్రవేశం లేదని, వూర్లో ఇప్పటికీ అదే పరిస్థితని చెబుతుంటారు. నగరంలో అయితే అలా కాదని, "మా ఇంటి ముందు గుడి ఉంది కదా మేము గుడికి వెళ్ళినప్పుడల్లా గుడి లోపలికి వెళ్ళి పూజారికి మా చేతులతో అతనికి మేము తీసుకెళ్లిన కొబ్బరికాయ, పూలు, పసుపు కుంకుమలు ఇస్తాం. అందరి చేతుల్లో నుండి తీసుకున్నట్లే మా చేతుల్లోంచి కూడ తీసుకుని మళ్ళీ ప్రసాదాలు అవి మా చేతులకే ఇస్తాడు పూజారి." ఇలాంటి అరుదైన సంఘటనలు వారిలో కొంత ఆత్మవిశ్వాసానికి మార్గాలు వేసాయి.

తను హైదరాబాద్ వచ్చాక ఇక్కడ అందరూ తనతో కలిసి మెలసి తిరుగుతారని, తింటారని చెబుతూ, ఎప్పుడైనా వారి వారి గ్రామానికి వెళ్ళినపుడు కొంత సామాజిక చైతన్యంతో వూర్లో మాట్లాడితే అక్కడ ఉన్న ఆధిపత్య కులాల వారు తమను బెదిరిస్తారని, "నగరం వెళ్ళి పని చేసుకుని బతికినంత మాత్రాన, నాలుగు అక్షరాలు నేర్చినంత మాత్రాన ఇక్కడ ఉపన్యాసాలు ఇవ్వవద్దని, గ్రామ కట్టుబాట్లు ఇది వరకు ఎలా పాటించే వారో అలానే ఉండాలని పెద్ద పెద్ద మాటలు మాట్లాడవద్దని, ఎప్పుడైనా వచ్చినా తమ పని చూసుకుని వెళ్ళిపోవాలని" సూచించారని చెప్పారు. అక్కడ రచ్చబండల మీద చేరిన ఆడ మగ కూడ ఒకరి బాధలు ఒకరు పంచుకుంటూ ఓదార్చుకుంటున్నప్పటికీ ఇలాంటి సామాజిక అసమానతల గురించి మాట్లాడితే ఎవ్వరూ పట్టించుకోరని, ఎవ్వరూ అర్థం చేసుకోవడానికి కూడ ప్రయత్నించరని, ఇంకా ఇవి వూర్లలో సాధారణమేనని అన్నది.

నగరంలో అయితే కుల వివక్ష ప్రత్యక్షంగా కనబడదని, ఇప్పటి వరకు 7 సంవత్సరాల నుండి తను నగరంలో ఉంటున్నా తనకు అలాంటి అనుభవం ఎదురు కాలేదని, తనకున్న నాలెడ్జ్ వరకైతే హైదరాబాద్ కుల రహిత నగరం అని ఎవ్వరు ఏ గుడికైనా ఎప్పుడైనా వెళ్ల వచ్చునని అంటుంది. ఇక్కడ ఎవ్వరూ ఎవ్వరినీ పట్టించుకోరని చెబుతుంది ఆనా.

అయితే, హైదరాబాద్ నగరంలో అడుగు పెడుతున్న వీరు గ్రామాల నుండి, చిన్న చిన్న టౌన్స్ నుండి వచ్చిన యువత. బలమైన ఆర్థిక నేపథ్యం నుండి రాకపోవడం వలన వీరు తమకు తామే కొన్ని పరిధులు, పరిమితులు విధించుకుని తమ ఉద్యోగం, ఉనికిని కాపాడుకునే ప్రయత్నాల్లోనే నిమగ్నమయి ఉన్నారు.

మాల్‌లో పనిచేసే ఇద్దరు అక్కచెల్లెళ్ళు సుమ, సుష్మ నగరంలో వారి అనుభవాలను ఈ విధంగా వర్ణించారు. తమ ఇంటర్, డిగ్రి చదువులకు సరిపడా ఉద్యోగం దొరకనప్పటికీ దొరికిన ఉద్యోగాన్నే చేసుకుంటూ, మెరుగయిన ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.  పని చేసే చోట పని గంటలు ఎక్కువగా ఉండటం, అన్ని గంటలు నిలబడి  ఉండటంతో సెలవు రోజున కూడ తమకి నగరంలో నలువైపులా తిరిగి నగరాన్ని అర్థం చేసుకునే అవకాశం, సమయం లేదని అన్నారు. ఎంతో కొంత ఆర్థిక స్వేచ్ఛ ఉన్నప్పటికీ కొన్ని పరిధులు నగరాన్ని అర్థం చేసుకోవడానికి సహాయ పడటం లేదని అన్నారు. "మేము ఎక్కువగా బయటికి వెళ్ళం ఎందుకంటే అంత సేఫ్‌గా అనిపించదు ఇంకొకటి మాకు మాల్ లో రోజూ గంటలు గంటలు నిలబడి కాళ్ళు నెప్పులు పెడుతుంటాయి ఎప్పుడైనా వెళితే జనరల్ బజార్ వరకు వెళ్ళొస్తాము ఎప్పుడైనా బిర్యాని తినాలనిపించినా ఇద్దరం వెళ్ళి పార్శిల్ చేయించుకుని వచ్చి ఇంట్లో తింటాం. హోటల్లో కూర్చుని తినాలనిపించదు."

వీరు కూడ గ్రామాల్లో కంటే నగరంలో కుల వివక్ష తక్కువని అన్నారు. గ్రామాల్లో ఏదో ఒక దాడికి గురికావటం, కుటుంబం సరియైన ప్రోత్సాహం ఇచ్చే పరిస్థితిలో లేకపోవడం వలన వీరు నగరంలో కూడ ఎవరో ఒకరి మీద ఆధారపడుతూ కొంత అభద్రతలో ఉంటారనేది నిజం. వారి చుట్టుప్రక్కల అనుభవాలు వారిని రిస్క్ తీసుకుని ముందుకు వెళ్ళటానికి సహకరించట్లేదు, ఏమైనా జరిగితే తల్లిదండ్రులు భరించలేరనేది వీరి అభిప్రాయం. వీరి ఆర్థిక వెసులుబాటు నగరంలోని డ్రస్ స్టైల్‌కి అలవాటు పడేలా చేసిందని చెబుతారు. "మేము ఊర్లో ఉన్నప్పుడు లంగా జాకెట్‌లు వేసుకునే వాళ్ళం. అప్పుడప్పుడు పంజాబి డ్రెస్‌లు వేసుకునే వాళ్ళం కానీ ఇక్కడికి వచ్చాక అన్ని డ్రెస్‌లు వేసుకుంటున్నాం, జీన్స్ కూడా వేసుకుంటున్నాం. అక్కడ అందరితో ఫ్రీగా మాట్లాడకపోయేది. ఇక్కడ అలాంటిది ఏమీ లేదు ఎవరు ఎవరితో మాట్లాడినా ఎవ్వరూ పట్టించుకోరు."

కొత్తగా వచ్చిన యువతలో కొంత ఆత్మ విశ్వాసం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఇంత పెద్ద నగరంలో వారు ఒక్కొక్కరుగా వచ్చి వారికి తగిన ఉద్యోగాలు చేసుకుంటూ వారికి తెలిసిన ప్రాంతీయ భాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ కూడ నేర్చుకుంటూ వారి ఉద్యోగ స్థలాల్లో ఒదిగిపోవటం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆనా ఇలా చెబుతుంది. "ఇక్కడికి రాక ముందు తెలుగు ఒక్కటే వస్తుండే. ఇక్కడికి వచ్చి ఉద్యోగంలో చేరాక పేషంట్లతో మాట్లాడటానికి అనివార్యంగా హిందీ, ఇంగ్లీషు నేర్చుకున్నాను. ఇంగ్లీషు అంత బాగా రాదు గానీ, హిందీలో బాగా మాట్లాడగలను. పేషెంట్లతో ప్రిస్క్రిప్షన్‌లో ఉన్నవి అర్థం అవుతాయి. డాక్టర్ చెప్పి వెళితే దాని ప్రకారంగా ట్రీట్‌మెంట్ ఇస్తాను. అదే ఊర్లో అయితే ఏమీ చెప్పకపోతుండె. ఏమీ నేర్చుకోక పోతుండె. ఇక్కడికి వచ్చాక చాలా మారాము. డ్రెస్సింగ్‌లో గానీ ఫుడ్‌కల్చర్‌లో గానీ బయటకు వెళ్ళే విషయంలో గానీ అన్నింట్లో ముందుంటాము. రకరకాలైన హెయిర్ స్టైల్స్ చేసుకుంటాను. చేస్తాను. ఈ హైద్రాబాద్‌లో ఒక్కదాన్నే




ఎక్కడికైనా వెళ్లగలను, రాగలను, ముందు అయితే బస్ రూట్స్ తెలిసేవి కావు భయమయితుండే. ఇప్పుడు ఎక్కడైనా ఉద్యోగం చేయగలననే ధైర్యం వచ్చింది."


మాల్‌లో పని చేస్తున్న సుమ, సుష్మ కూడా ఇలానే అంటుంటారు. "ఇంతకు ముందు మాకు భాష సమస్య బాగా ఉండే, ఇప్పుడు అది కొంచెం తగ్గింది రకరకాల కస్టమర్స్ వస్తుంటారు కదా మాల్‌కి. కొత్త కొత్త ప్రొడక్ట్స్ గురించి చెప్పాల్సి వస్తుంది. తెలుగు తెలీని వారికి హిందీలోనే చెబుతుంటాము. అయితే మాకు కొంత ఆత్మ విశ్వాసం సంపాదనలతోనూ భాష నేర్చుకోవడంతోనూ వచ్చింది. మా ఊర్లో అయితే మా చదువులకు ఈ మాత్రం జీతం కూడా రాదు. పోతే పొలం పన్లకు పోవాలి లేదంటే లేదు. మాకు ఇక్కడకు వచ్చినప్పుడు ఎవ్వరూ తెలీదు. మా దూరపు కజిన్ ద్వారా వచ్చాము. ఇప్పుడంతా అలవాటైపోయింది. ఎక్కడైనా ఉద్యోగం చేయగలమనే ధైర్యం వచ్చింది."

**ముగింపు:**

ఇప్పటికీ నగరానికి వస్తున్న వారిలో మొదటి, రెండవ తరం దళిత స్త్రీలే ఉంటున్నారు. కొంత కనీస విద్యతో ఆర్థిక భారాన్ని తమ భుజాల మోస్తున్న ఈ యువతలో అంతగా రాజకీయ చైతన్యం, సామాజిక చైతన్యం ఇంకా రాలేదు. గ్రామాల్లో లేని తమ స్వేచ్ఛా, ఆర్థిక స్వాతంత్ర్యాలతో విభిన్న సంస్కృతుల, భాషల వారితోనూ కలసి మెలసి ఉండే స్ట్రేటజీని నేర్చుకుని ఆత్మవిశ్వాసం పెంచుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలో కుల వివక్ష ప్రత్యక్షంగా అనుభవించక పోవటం వలన దీన్ని కుల రహిత ప్రదేశంగా చూస్తున్నారు. అయితే ఉద్యోగ స్థలాల్లో అధిక పని గంటలు ఆర్థిక వెసలుబాటు లేకపోవటం వల్ల నగర జీవితాన్ని అనుభవించేందుకు మధ్యతరగతి యువతులకు ఉండే అవకాశాలు వీరికి లభించట్లేదు.


**మిరప మాధవి అన్వేషి రిసెర్చ్ సెంటర్‌లో పనిచేసారు.**

mirapamadhavi18@gmail.com

ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## లైంగికత, వేధింపులు: విశ్వవిద్యాలయాల్లో మారుతున్న జండర్ రాజకీయాలు

సంచిక : 6&7 (త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ డిసెంబర్ 2013 విరాళం : 25 రూ.

విషయసూచిక
- సంపాదకీయం
- చరిత్రని సందర్శిస్తున్నాం -అస్మా రషీద్, మధుమిత సిన్హా
- లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు : అంతర్-వర్గ బురదలోకి ప్రవేశించగలవా? -కె.సి.బిందు
- జండర్, విద్యాప్రపంచం -కె.సునీతా రాణి
- సమానత్వం -సల్మా అహ్మద్ ఫరూఖీ
- మనల్ని వదలిపోని మనువు -మిరప మాధవి
- ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు -బి.సత్తమ్మతో ఇంటర్వ్యూ
- యూనివర్సిటీల్లో దళిత విద్యార్థినుల పరిస్థితి గురించిన ఆలోచనలు -సౌజన్య
- మహిళా విద్యార్థి వేదిక-గమనాన్వేషణ -రేఖా పప్పు
- విలింగ లైంగికత, లైంగిక హింస -సామియా వాసా
- వక్రీకృత దర్పణాలు : లైంగిక హింస -పర్నాల్ చిర్మూలే
- జండర్ చైతన్యం కోసం, అందరినీ కలుపుకునిపోయే ప్రయత్నం: ఒక విమర్శనాత్మక పరిశీలన -అనూ ఆంటోనీ, గ్రీష్మా జస్టిన్ జాన్
- లైంగిక న్యాయం పట్ల 'ఆదరణ' : కొన్ని ప్రశ్నలు -చందు
- పోస్టుమార్టం పోస్ట్‌పోన్ అవుతూనే వుంది!! -వల్లపల్లి స్వరూపరాణి
- ఐడెంటిటీ కార్డు -ఎస్.జోసెఫ్
- దళితేతర స్త్రీలు! కులం పని చేస్తుంది! దళిత ఫెమినిస్టు మానిఫెస్టో
- సంవాద్ లక్ష్యాల, ఉద్దేశాల పరిచయం
- ఒక తల్లీ కూతుళ్ళ సంభాషణ -లీలా గౌతమ్, గీతా రామస్వామి
- హైదరాబాదులో మహిళల అర్ధరాత్రి కవాతు: ఒక నివేదిక -మరనాథా వహ్‌లాంగ్, మాడభూషి తేజస్విని
- ఎస్.ఎమ్.ఎస్‌లతో వేధింపులు -జనని
- హైదరాబాదులో నాగా విద్యార్థులు- క్యాంపస్ రాజకీయాలు -ఎలికా అస్సుమి
- కనిపించని వేధింపులు - దృష్టి లోపం గల ఒక స్త్రీ దృక్పథం -రీమ్ శంషుద్దీన్




ఇది 2013 జనవరి 6న జరిగిన మిడ్ నైట్ మార్చ్ ఆహ్వాన పోస్టర్ పైన వున్న చిత్రం. వారు దీన్ని అమెరికాలో జరిగిన 'టేక్ బాక్ ది నైట్' కార్యక్రమ (అంతర్జాల) పోస్టర్ నుండి తీసుకున్నారు. అందరికీ కృతజ్ఞతలతో...

- కుచ్ కుచ్ హోతాహై -అంజలి పాథియాత్
- క్యాంపస్‌లో స్త్రీ పురుషుల అస్థిత్వ రూపకల్పన : 'సై' మరియు 'హ్యాపీడేస్' చిత్రాలలో ఆకర్షణ, అధికారం -వెన్నెల
- యూనివర్సిటీ క్యాంపస్‌లలో మారుతున్న కోరికల, హింసల చిత్రపటం -అపర్ణా నంద కుమార్

- ఫోటో ఫీచర్ - అచుత్ అజిత్, రియా దే, యాన్ జార్జ్

**ప్రత్యేక సంపాదకులు :** మధుమితా సిన్హా, అస్మా రషీద్
**సంపాదకులు:** ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్
**అడ్వయిజరీ బోర్డ్:** షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కోటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.
**ప్రొడక్షన్:** ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి
**ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.
వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి



ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## భాష, ప్రాంతం, జన సముదాయాలు

సంచిక : 8&9 (త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ డిసెంబర్ 2014 విరాళం : 50 రూ.

విషయసూచిక
సంపాదకీయం
ప్రాంతం
ఇదీ నా గొడవ కాళోజీ
గుర్తింపును నిర్మించుకునే క్రమంలో జూపాక సుభద్ర
ఉద్యమానికి ఊపిరైన భాష సంగిశెట్టి శ్రీనివాస్
తెలంగాణా, తెలుగు సినిమా భాషా రాజకీయాలు సత్యప్రకాశ్ ఎలవర్తి, వంశీ వేమిరెడ్డి
రాజకీయాలు
దళితులు ఇంగ్లీష్ కంచ ఐలయ్య
దళిత సాధికారతకు బాటవేసిన లాడ్ మెకాలే చంద్ర భాన్ ప్రసాద్
దార్శనికత లేని ప్రభుత్వాలు భాషా సమస్యలు జయధీర్ తిరుమల రావు
జాషువా చూపిన జాడ డొక్కా మాణిక్య వరప్రసాద్
సంస్కృతం, మాతృభాషల బోధన సౌమ్య దేచమ్మ
ఉర్దూ
ఉర్దూ మాధ్యమంలో హైద్రాబాద్ వైద్య విద్యాలయ సంస్థ స్థాపన సయ్యద్ ముస్తఫా కమల్
పర్షియన్ స్థానంలో ఉర్దూ తారిఖ్ రెహమాన్
ఉస్మానియా నుండి మౌలానా ఆజాద్ యూనివర్శిటీ వరకు ఎమ్.ఎ.మోయిద్
మహ్మద్ జునైద్ జాకిర్‌తో ఇంటర్వ్యూ
ఖాలిద్ సయ్యద్‌తో ఇంటర్వ్యూ
మద్రసాల్లో ఆంగ్ల భాష సాజిదా సుల్తానా
ఉర్దూ యూనివర్శిటీలో ఇంగ్లీషు చదువు ఎమ్.డి.ముజీబుద్దీన్
ప్రామాణికత : ప్రజాస్వామ్యం
ప్రముఖ దళిత రచయిత వేముల ఎల్లయ్యతో ఇంటర్వ్యూ శ్రీవత్సన్, ఎన్.మనోహర్ రెడ్డి
"ప్రామాణిక భాష" పరిధిని దాటి ఆలోచించాలి దుగ్గిరాల వసంత



చేరా : ఒక అసమాపక క్రియ కె.శ్రీనివాస్
భాష మరియు ప్రజాస్వామ్యం మాధవ ప్రసాద్
దళిత సాహిత్యం-భాష
జాతీయకవి వేమన బాటలో జాషువ కత్తి పద్మారావు
ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత కవుల భాషా ఒరవడి గోగు శ్యామల
మాతృభాష మారువేషం ప్రసేన్
భాష, జీవనం దీపా శ్రీనివాస్
దళిత కవిత్వానికి 'తిట్టు' అంతిమ లక్ష్యం కాదు! జిలుకర శ్రీనివాస్
పుస్తక సమీక్ష : హెూలీ షిట్ : ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ స్వేరింగ్, ఆర్.శ్రీవత్సన్
దళిత బహుజనుల 'గ్రామ్య భాష'పై 'గ్రంధ చక్షువు'ల దాడి చరిత్ర ఎన్.మనోహర్ రెడ్డి
అనువాదం
నిశ్శబ్దపు భాష : కె.లలితతో ఇంటర్వ్యూ గోగు శ్యామల, ఏ.సునీత
అనువాద ప్రపంచం ఏ. సునీత, శ్రీవత్సన్ మరియు మోయిద్‌ల మధ్య సంభాషణ
జ్ఞానరంగాలు, భాష ప్రథమా బెనర్జీ

మధ్యపేజీ చిత్రం : జ్యోతి వహీద్

**ప్రత్యేక సంపాదకులు : ఎన్. మనోహర్ రెడ్డి, ఎమ్.ఏ.మోయిద్ మరియు గోగు శ్యామల**
**సంపాదకులు:** ఏ. సునీత, ఆర్. శ్రీవత్సన్
**అడ్వయిజరీ బోర్డ్:** షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, అస్మా రషీద్, రమా మెల్కోటే, కె.సజయ, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, కనీజ్ ఫాతిమా, స్వాతీ మార్గరెట్, మధుమితా సిన్హా
**ప్రొడక్షన్:** ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి
**ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/2/A, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.
వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి
**ప్రింటింగ్:** రౌష్ని గ్రాఫిక్స్, అంబర్‌పేట్, హైదరాబాదు-13. సెల్: 9246172133

# 'పోర్న్' ఇక్కడ ఓ ప్రతీకారాస్త్రం..!

■ నేహా దీక్షిత్

వంటగదిలో కూనిరాగాలు తీస్తూ తిరుగాడుతోంది ఆరాధన. కూళాయిలోంచి లీక్ అవుతున్న వాటర్ ఆమె రాగానికి తాళం వేస్తోంది. ఇంకా పూర్తిగా తెల్లారకముందే రింగ్ అయిన ఫోన్ లిఫ్ట్ చేసి 'హలో' అంది.

'సులక్షణ..చెప్పు..ఆ..ఎనిమిదింటికల్లా బస్టాప్‌లో ఉంటాను.'

'హలో..?? నీ వాయిస్ బ్రేక్ అవుతోంది. ఓకే ఇంకేమైనా ఉంటే టాక్సీలో వెళ్తూ మాట్లాడుకుందాం.. ఓకే ఇక ఉంటాను.'

టాక్సీలో కొలీగ్స్ అంతా ఎక్కేశారు. సులక్షణ..ఆరాధన చెవిలో గుసగుసలాడుతోంది.

'అదంతా అతన్ని ఎందుకు వీడియో తియ్యనిచ్చావు..?' అని

'ఏది? ఎవర్ని?' ఆరాధన అయోమయంగా అడిగింది.

'నోరు ముయ్యవే, మాట్లాడావంటే బాగోదు...ఇదిగో ఇది చూడు'. తన స్మార్ట్ ఫోన్ మ్యూట్‌లో పెట్టి వాట్సప్‌లో వాళ్ల కొలీగ్ శషాంక్ నుంచి వచ్చిన ఓ వీడియో ఓపెన్ చేసింది.

అందులో కదలాడుతున్న దృశ్యాలను చూసి ఆరాధన స్థాణువైపోయింది. వీడియోలో కదలాడుతున్న తన నగ్నదేహాన్ని చూసి గుండె ఆగిపోయినట్లయ్యింది. నేరుగా వెళ్లి పెద్ద అగాథంలో పడిపోయినట్లు అనిపించింది.

'ఆ వీడియో చూసిన ఆ క్షణంలో అక్కడికక్కడే చచ్చిపోవాలనిపించింది' ఆరాధన గుర్తుచేసుకుంది.

'మరొకర్ని ఎక్కించుకునేందుకు క్యాబ్ ఆగిన వెంటనే నేను దిగేశాను. నా పరిస్థితి చూసి సులక్షణ కూడా నా వెంట దిగేసింది.'

ఆటోలో ఇద్దరూ ఆరాధన ఇంటికొచ్చారు.

***

మనీష్ అనేక రకాలుగా చెప్పాకగానీ ఆరాధన అతనితో ఆర్నెల్లపాటు సహజీవనం చేసేందుకు ఒప్పుకోలేదు. 'ఇలా చేస్తే మనకు ఖర్చులు బాగా కలిసొస్తాయి. మనిద్దరం ఎక్కువ సమయం కలిసుండే అవకాశం ఇదే కదా. ఒకర్నొకరు ఇంకా బాగా అర్థం చేసుకోవచ్చు కూడా' మనీష్ చెప్తున్నది నిజమే కదా అనుకుంది. అయితే ఇది తన తల్లిని బాధపెట్టే వ్యవహారం కదా. కానీ తనేం చిన్న పిల్లకాదు కదా, సంపాదిస్తోంది. తన నిర్ణయాలకు పూర్తి బాధ్యురాలు తానే అని కూడా తెలుసు.

గ్రేటర్ నోయిడాలో ఓ సింగిల్ బెడ్రూమ్ ఇంట్లోకి ఇద్దరూ మారిపోయారు. అక్కడే కావాల్సిన ఫర్నీచర్ మొత్తం సెకెండ్ హ్యాండ్ షాపు నుంచి తీసుకున్నారు. సాయంత్రం మనీష్ వైన్ బాటిల్‌తో వచ్చారు. వాళ్ల శరీరాలు పరస్పరం కోరుకున్నాయి.

మనీష్ కొత్త ఫోన్ తీసుకొచ్చాడు. కెమెరాలో ముద్దు ముద్దుగా కనిపిస్తున్నారు. మెరిసిపోతున్న తమ శరీరాలను కెమెరాలో చూసుకొని మురిసిపోయారు. ఇదంతా మనీష్ ప్లాన్ ప్రకారమే చేస్తున్నాడు. మనీష్ తన ఫోన్ ను వీడియో రికార్డింగ్ మోడ్‌లో పెట్టి... సెల్ఫీ స్టిక్ సాయంతో వాళ్ల బెడ్ పక్కనే ఉన్న అద్దానికి తగిలించాడు. ఫోన్‌లో మొత్తం రికార్డ్ అయ్యింది.

ఉదయం మనీష్ టీ తీసుకొచ్చాడు. ఇద్దరూ దుప్పట్లో చుట్టుకుపోయి రాత్రి మనీష్ రికార్డ్ చేసిన వీడియో క్లిప్ చూశారు. 'గొప్ప అనుభూతిని పొందాననిపించింది. అందులో ఎంతో బాగున్నాను అనుకున్నా' ఆరాధన చెప్పింది. ఆ వీడియో క్లిప్‌ను మనీష్ ఆమె ఫోన్‌కి పంపాడు. "సీజన్స్ 2,3,4కి రెడీయా?" అని మనీష్ అప్పుడప్పుడూ ఆ వీడియోను గుర్తు చేస్తూ మెసేజ్ పెట్టేవాడు. మొదట్లో అది చూసినప్పుడు పెద్దగా స్పందన లేదు. కానీ మళ్ళీ మళ్లీ చూస్తోంటే 'తామిద్దరికీ అది చాలా ప్రత్యేకమైనది అనుకున్నాను' ఆరాధన చెప్పుకొచ్చింది. వాళ్లెప్పుడు గొడవ పడ్డా ఆ వీడియో ఓపెన్ చేసి గాఢంగా ముద్దు పెట్టుకునే వారు. దాంతో ఆ గొడవ ముగిసిపోయేది.

ఏడాది తర్వాత ఆ బంధం నుంచి బయటికొచ్చారు. ఆరాధన టీమ్ లీడర్ గా ప్రమోట్ అయ్యింది. మనీష్ మాత్రం అప్పటికింకా కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ గానే ఉన్నాడు. 'మొదట్లో మనీష్ చాలా ప్రేమగా ఉన్నాడు. ఆ తర్వాత మెల్లగా అతనిలో అభద్రత మొదలైంది' ఆరాధన ఒక్కొక్కటిగా చెప్తోంది. 'దమ్ము కొట్టేందుకు బయటికెళ్లే ముందు బాస్ దగ్గర పర్మిషన్ తీసుకున్నావా?' అని మనీష్‌ని ఫ్రెండ్స్ ఆటపట్టించే వాళ్లు.

వాళ్లిద్దరూ ఒకేసారి కెరీర్ స్టార్ట్ చేశారు. ఆరాధనకు రెండేళ్లలో రెండు ప్రమోషన్లు వచ్చాయి. మనీష్ మాత్రం మంచి ర్యాంకింగ్స్ కోసం ఇంకా సతమతమౌతూనే ఉన్నాడు. 'నేను అతనికంటే ఎక్కువ సంపాదిస్తున్నా. ఎక్కువ పేరొస్తోంది. ఇది అతనికి రుచించలేదనుకుంటా'

తన షాపింగులకి, తన వారికి గిఫ్టులు కొనేందుకూ, స్నేహితులతో బీరు కొట్టేందుకూ ఆమె డెబిట్ కార్డ్ వాడుతున్నాడు. మొదట్లో చూసీ చూడనట్లే ఊరుకుంది. కానీ క్రమంగా అతని తీరు చాలా కోపం తెప్పించేది.

మనీష్ ఆమెపై చెయ్యి చేసుకోవడం కూడా మొదలైంది. ఆ తర్వాత ఆర్నెళ్లలో హింస మరింత పెరిగిపోయింది. 'అతను నన్ను చెయ్యి చేసుకున్న వాటికి పెద్ద కారణాలు కూడా ఉండేవి కావు. పప్పు ఎక్కువ ఉడికిపోవడం, నేను ఎక్కువ సేపు ఫోన్లో మాట్లాడటం ఇలా ఉండేవి అతని కారణాలు'.

ఆరాధన ఆ బంధం నుంచి బయటపడాలనుకున్నప్పుడు కూడా మనీష్ అంత తేలిగ్గా వదిలిపెట్టలేదు.

***

ఆమె తన కొలీగ్ శశాంక్‌కు కాల్ చేసింది. సులక్షణకు ఆ వీడియో పంపింది శశాంకే. ఆఫీసులో ఉన్న వాళ్లందరికీ మనీష్ ఆ వీడియో పంపాడని, 'పొగరెక్కిన లం..ని ఎలా పడుకోబెట్టాలో ఈ సీజన్-1లో చూడండి అని క్యాప్షన్ జోడించాడని శశాంక్ చెప్పాడు. అంతేకాదు ఆ వీడియోను మనీష్ ఆన్ లైన్లో కూడా అప్‌లోడ్ చేశాడని చెప్పాడు.

'ఆన్‌లైన్‌లో ఆ వీడియో కోసం వెతకద్దని సులక్షణ సలహా ఇచ్చింది కానీ అలా వెతకకుండా ఉండలేకపోయాను. వీడియోను చూశాను. రెండ్రోజుల క్రితమే అప్ లోడ్ చేసిన వీడియో అది. సుమారు పది సైట్స్‌లో కనిపిస్తోంది. యూ ట్యూబ్‌లో కూడా కాస్త చిన్న సైజు వీడియో కనిపించింది. కానీ వెబ్ సైట్స్‌ని సంప్రదించి ఆ వీడియోలను ఎలా తొలగింపజేయాలో నాకు తెలియదు.'

గుండె పగిలేంతగా ఏడ్చాను. 'నా జీవితం నా కళ్లముందే కుప్ప కూలిపోయింది. ఇక నేను బతకడం అనవసరం. మా ఇంటిపక్కనున్న కాల్వలో దూకేస్తాను అంటూ ఏడ్చాను. సులక్షణ నన్ను ఓదార్చింది. ఈ సమస్యను క్రమంగా పరిష్కరిద్దామని చెప్పింది.'

ఈ సమస్యపై సలహా కోసం సులక్షణ బాస్‌కి కాల్ చేసింది. 'అదృష్టవశాత్తు మా బాస్ ఓ మహిళ. సాయంత్రం మా ఇంటికి వచ్చి మాట్లాడతానని బాస్ చెప్పింది'.

రకరకాల ఆలోచనలతో ఆరాధన బుర్ర హీటెక్కిపోతోంది: మాకు పెళ్లయ్యిందని చెప్పి అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నాం. ఇప్పుడు వాళ్లు నా గురించి ఏమనుకుంటారు. నన్నో తిరుగుబోతు కింద జమ కట్టేస్తారు కదా? తాను ఢిల్లీ రావడాన్ని వ్యతిరేకించిన మామయ్యలు ఇప్పుడేమంటారు? నా




నిర్ణయాలను ఎప్పుడూ నమ్మని మా అమ్మకు ముఖం ఎలా చూపించాలి..? ఆఫీసులో కొలీగ్స్ ముందు నేను ఎలా తిరగాలి? అసలు ఉద్యోగం చెయ్యగలనా?

'మనీష్ ఇలాంటి పని చేస్తాడని కలలో కూడా ఊహించలేదు. తను ప్రేమించినట్లు చెప్పిన వ్యక్తిపై ఇంత ద్వేషభావం ఎలా వస్తుందసలు? ఇంత పగ? ఈ స్థాయిలో ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆలోచన ఎలా వస్తుంది? అతన్ని ఎంతగానో నమ్మి సహజీవనానికి ఒప్పుకున్న విషయం అతనికి బాగా తెలుసు అయినా కూడా ఇలా ఎలా..?

మధ్యాహ్నం వాళ్ల బాస్ అంకిత వచ్చింది. ఎనిమిదేళ్లుగా అదే సంస్థలో ప్రోగ్రామ్ మేనేజర్ అంకిత. ఆమె వయసు 30లలో ఉంటుంది. సున్నితత్వం ఎక్కువ. అంతే సమర్థురాలు కూడా. 'ఏం జరిగిందో వివరంగా చెప్పేందుకు చాలా ఇబ్బంది పడ్డాను. ఇంకా చెప్పాలంటే నా మనసు సిగ్గుతో చచ్చిపోతోంది. కానీ అంకిత ఓదార్చింది. ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి నిన్ను మోసం చేస్తే నువ్వెందుకు సిగ్గుపడాలని ధైర్యం చెప్పింది. ఆమె మాటలు మంత్రంలా పని చేశాయి. నా ఉద్వేగాన్నంతా రాశి పోశాను. నిజంగా చెప్తున్నా, ఈ ఉద్యోగం చెయ్యడం నాకు చాలా చాలా ముఖ్యం.'

వాళ్లు పనిచేస్తున్న సంస్థలో సరిగ్గా రెండేళ్ల క్రితం ఇలాంటిదే ఓ ఘటన జరిగినట్లు చెప్పిన అంకిత, మనం నీరుగారి పోకుండా ఇలాంటి వాటిని ఎలా డీల్ చెయ్యాలో నేర్చుకోవాలంది.

అంకిత తమ కంపెనీ లాయర్ కి ఫోన్ చేసింది. మరో గంటలో నోయిడాలోని ఓ పోలీస్ స్టేషన్‌కు వాళ్లను రమ్మన్నాడు లాయర్. 'నేను ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు పైకి రాలేనని అంకితతో చెప్పాను. అంకిత నేను రావాల్సిందేనని పట్టుబట్టింది. మనం ఈ సమస్య అంతు చూడాలంటే ఇవన్నీ ధైర్యంగా నిలబడి ఎదుర్కోవాలంది.

***

ఆరాధన కేసును సాధారణ భాషలో చెప్పాలంటే 'పోర్న్ తో ప్రతీకారం తీర్చుకోవడం' అంటారు. అంటే ప్రతీకారం తీర్చుకునేందుకు వారితో సఖ్యతగా ఉన్నప్పుడు తీసిన ఫోటోలను, వీడియోలను బయటపెట్టడం. ఇలాంటి నేరాల సంఖ్యను రికార్డు చేసే వ్యవస్థ ఇంకా భారతదేశంలో అందుబాటులోకి రాలేదు. ఎందుకంటే వాటిపై సాధారణంగా ఎవరూ ముందుకొచ్చి ఫిర్యాదు చెయ్యరు. నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో నమోదు చేసిన డేటా ప్రకారం 2012–2014 మధ్య అందుబాటులో ఉన్న అశ్లీల వీడియోల సంఖ్య 104 పెరిగింది. చాలా వరకు ఆరాధన కేసులాంటివే ఈ విభాగంలో నమోదు చేశారు.

వాళ్ల కంపెనీ లాయర్ తో పాటు వచ్చిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్.. మనీష్ ఫోటోలు, ఫోన్ నెంబర్ తీసుకున్నారు. ఆ తర్వాత ఆరాధనతో మాట్లాడారు. 'మళ్లీ ఎప్పుడూ ఇలాంటివి చెయ్యకండి. మీకు పెళ్ళైనా, కాకపోయినా సరే ఇలాంటి పని చెయ్యవద్దు. రోజూ వార్తా పత్రికలు చదవడం లేదా? ఇలాంటి వాటిని తప్పుగా వాడుకుంటున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి' అని చెప్పి లాయర్ వాళ్లను అక్కడి నుంచి పంపేశారు.

మర్నాడే ఆఫీసుకు రావాలంటూ అంకిత ఆరాధనతో ప్రమాణం చేయించింది. 'రాత్రంతా నిద్రపోనేలేదు. అతనికి మెసేజ్‌లు పెడుతూనే ఉన్నాను. అటువైపు నుంచి ఎలాంటి సమాధానం లేదు. గంటకు రెండు మూడుసార్లు వెబ్‌సైట్స్‌లో తానున్న వీడియో కోసం వెదికే మళ్లీ మళ్లీ చూసాను. వీడియో కింద పోస్టులు చదువుతూ ఏడుపు ఆపుకోలేక పోయాను. రాత్రి నాతో పాటు సులక్షణ ఉంది కాబట్టి సరిపోయింది. లేదంటే నేను కచ్చితంగా ఆత్మహత్య చేసుకునేదాన్నే.'

ఆ తర్వాత రోజు హిందీ పత్రికలో ఆరాధన పేరు, ఆమె పని చేసే సంస్థ పేరు బయట పెట్టకుండా ఓ స్టోరీ వచ్చింది. 'అది నా ఆత్మవిశ్వాసాన్ని చాలా వరకు పెంచింది.'

మూడు నెలలు గడియిపోయాయి. మనీష్‌కి ఆరాధన కాల్ చెయ్యలేదు, కనీసం మెసేజ్ కూడా పెట్టలేదు. మనీష్ ఆఫీసుకు వస్తున్నాడు. కంప్లైంట్ ఎలా ఇవ్వాలో అంకిత ఆరాధనకు నేర్పింది.

'మనం పని చేసే ఈ ఆఫీసులో కూడా ఇప్పటిదాకా లైంగిక వేధింపుల కేసుల్ని పరిష్కరించే సెల్ లేదు. సీనియర్ బాసులు ఈ విషయాన్ని అర్థం చేసుకుంటారో లేదో కూడా తెలియదు.

పని సక్రమంగా చెయ్యని కారణంగా నెల రోజుల్లో మనీష్‌ని ఉద్యోగం నుంచి తీసేశారు. పది వెబ్‌సైట్స్‌లో ఆ వీడియోను అప్ లోడ్ చేశారు. పోలీసులు ముగ్గురిని పట్టుకొని వాళ్ళు అప్ లోడ్ చేసిన వీడియోలను తొలగించారు. కానీ ఆ వీడియో ఇంకా చాలా మంది వద్ద అలాగే ఉంది. 'ఆ వీడియో ఉన్న నా సహోద్యోగులే మరింత మందికి పంపే అవకాశాలున్నాయి. పోలీసులు ఇంతకు మించి చెయ్యగలిగిందేమీ లేదన్న విషయం నాకు అర్థమైంది.'

పోర్న్‌తో ప్రతీకారంపై ఆరాధన ఓ ఆన్ లైన్ వ్యాసం చదువుతోంది. ఈ అంశంపై వాదించే న్యాయవాదులు ఇండియాలో కూడా ఉన్నారని తెలుసుకుంది. కానీ ఇప్పుడు ఆ సంఘటనను గుర్తు చేసుకోకూడదని భావిస్తోంది. 'నేను ఆర్థికంగా బాగా నిలదొక్కుకున్న రోజు ఆ ఘటన గురించి పూర్తిగా నోరు విప్పుతాను. ఇప్పుడే స్పందించే పరిస్థితి లేదు. నాకంటూ భద్రమైన స్థాయి కావాలి. జీవితంలో స్థిరపడటం నా మొదటి ప్రాధాన్యత. అంతేగానీ ఇప్పటికిప్పుడే వాడికి గుణపాఠం చెప్పే ఉద్దేశంతో నా సమయాన్ని వృథా చేసుకోను'.

*పేర్లు మార్చబడ్డాయి.

**నేహా దీక్షిత్ దక్షిణ ఆసియాలో రాజకీయాలు, జండర్, సామాజిక న్యాయంపై రాసే స్వతంత్ర జర్నలిస్టు.**
nehadixit123@gmail.com

ఈ వ్యాసం కింద పేర్కొన్న వ్యాసాన్నుండి సంగ్రహించబడింది. ఎమ్.ఎ. మోయిద్ సంగ్రహణ చేసారు.

This piece was originally published on Deep Dives (**deepdives.in**) as part of the series Sexing the Interwebs.https://deepdives.in/why-did-you-let-him-shoot-that-an-indian-woman-s-story-of-revenge-porn-dd7acd6e55f2 (dated 3 Nov 2017)

***అనువాదం: తులసి చందు***



# కండక్టర్ ఊర్మిళతో ఒక రోజు

■ దేవయాని ప్రసాద్, అనూష సుందర్

**టి. యస్. ఆర్. టి. సి** లో పని చేసే ఒక బస్ డ్రైవర్ ద్వారా ఊర్మిళతో మాకు పరిచయం అయ్యింది. ఫలక్ నుమా, మెహదిపట్నం మధ్య నడిచే బస్ నం 65ఎమ్ లో ఊర్మిళని కలిశాము. పొద్దున్నే 8 గంకి మేము అఫ్జల్ గంజ్ చేరుకున్నాం. కానీ ఆరోజు ఆమె బస్ ఆలస్యం అయ్యిందని మాకు తెలియలేదు. ఆమెను మేము అంతకు ముందు చూడకపోవడం వల్ల కంగారుపడ్డాం. దాదాపు గంటన్నర పాటు ప్రతి బస్సులోకి మహిళా కండక్టర్ ఉందేమోనని తొంగి చూసాం. ఒక చిన్న బస్‌లో కత్తిరించిన జుట్టు ఉన్న మహిళా కండక్టర్‌ను చూసి కంగారుగా ఆమె ఊర్మిళ అయివుంటుందని భావించి, సాధారణంగా పురుషులు కూర్చునే సీట్లలో వెనక్కి వెళ్ళి కూర్చున్నాము. బస్ డ్రైవర్ కృష్ణ చాలా సరదా మనిషి మేము ఎందుకు ఎక్కామో చాల ఆసక్తితో వివరాలడుగుతూ ప్రయాణం మొత్తం మాతో మాట్లాడుతూనే  ఉన్నాడు.

ఆ తర్వాత, ఒక ఆదివారం రోజు మేము ఫలక్ నుమా బస్ డిపో దగ్గర బస్ ఎక్కి రోజంతా బస్‌లో తిరగటానికి వీలయ్యే టికెట్ కొనుక్కున్నాం. అది ఆదివారం, పైగా రంజాన్ నెల కావటం వలన ఉదయం ప్రశాంతంగా ఉంది. ఊర్మిళ టియస్ఆర్‌టిసిలో ప్రమోషన్ కోసం, డెస్క్ ఉద్యోగం కావాలని కండక్టర్ ఉద్యోగంతోపాటు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ కూడా చేస్తోంది. ఊర్మిళ భర్త, ఆమె మామ వాళ్ళ నగల దుకాణంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. నగరంలో స్థిరపడేందుకు స్థిరమైన ఆదాయం అవసరం కాబట్టి పాఠశాల చదువు పూర్తి అయిన వెంటనే తనను టియస్ఆర్‌టిసిలో ఉద్యోగం చేయమని తన భర్త ప్రోత్సాహించాడని పేర్కొంది. మా బస్ ప్రయాణం మొత్తం ఊర్మిళ ఫోన్లో తన భర్తకి తనెక్కడున్నానో చెబుతూ, ఆయన గురించి తెలుసుకుంటూ బిజీగా ఉండింది.

ఊర్మిళకి డ్రైవర్ క్రిష్ణతో వ్యక్తిగతం, వృత్తి కలగలిసిన స్నేహ సంబంధం మాకు చాలా వినోదంగా ఉండింది. చార్మినార్ స్టాఫ్ దగ్గర పది నిమిషాలు ఫోన్‌లో ఆందోళనగా మాట్లాడి బస్సెక్కంగానే, ఊర్మిళ ఆయన్ని అడిగింది.


"ఏం జరిగింది అన్నా? ఎందుకంత విసుగ్గా ఉన్నారు?" అని


"అరె..మా పిల్లలకి అన్నం ఎలా వండాలో కూడా తెలియదు. వయసొచ్చిన పిల్లలు! ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే ఎంత సిగ్గుపడే విషయం?"

"ఆ, పిల్లలకు మనం నేర్పించాలి. పుట్టుకతోనే అన్నం వండే ప్రతిభతో పుట్టాలని మనం ఆశించకూడదు కదా!"

"వాళ్ళు ఇప్పుటికైనా నేర్చుకోవాలి కదా!"

" మీరు నేర్పించండి... అవునూ, మీకు అన్నం ఎలా వండాలో వచ్చా? మీక్కుడా రాదా?"









నిశ్శబ్దమైన అంగీకారం ...

"సరే ఇందులో ఆశ్చర్యపోవలసింది ఏమీ లేదు."

"మీ అందరూ ఒకరోజు మా ఇంటికి రండి. భోజనం ఎలా వండాలో నేను నేర్పిస్తాను. ఇప్పుడు ఇక్కడ బస్సు ఆపండి. మనకి తర్వాత ట్రిప్ ఆలస్యం అవుతుంది."

ఊర్మిళ ఊరు మహబూబ్‌నగర్ జిల్లాలోని శ్రీశైలం, 1994లో పెళ్ళి అయిన కొత్తలోనే భర్తతో హైదరాబాద్ వచ్చేసింది. కండక్టర్ ఉద్యోగం డబ్బు కోసమే చేస్తున్నానని మొదట్లో పెద్దగా ఈ ఉద్యోగం అంత ఇష్టం లేదని చెప్పినప్పటికీ, ఈ పనిని ఆస్వాదించలేక పోతున్నానని ఊర్మిళ ఒప్పుకోదు. "ఇక్కడ కలిసే మనుషులు అట్లానే ఉంటారు. స్నేహితులుగా చేసుకోకుండా ఉండలేం". అని అన్నది మాతో.

అది నిజమని మాకు వెంటనే తెలిసింది. విరామ సమయంలో అల్పాహారం కోసం చార్మినార్ దగ్గర డ్రైవర్లు, కండక్టర్లు అందరం కలిసి టిఫిన్లు, గాసిప్స్ పంచుకోవటం చూసాం. చార్మినార్–గోల్కొండ మార్గంలో పనిచేసే కండక్టర్ మహలక్ష్మితో పరిచయం మాకు చాలా సంతోషం కలిగించింది.

రాష్ట్రస్థాయి అథ్లెట్ అయిన మహాలక్ష్మి శారీరకంగానూ, మాటల్లోనూ చాలా దృఢంగా ఉంటుంది. చాలా హుషారుగా ఉండే ఆమె పదునైన వ్యంగ్య బాణాల నుండి ఎవరూ తప్పించుకోలేరు. ఆపకుండా జోకులేస్తున్న మహాలక్ష్మిని చూసి ఇబ్బంది పడుతూ ఊర్మిళ మాతో "తను ధూల్‌పేటలో పుట్టి పెరిగింది" అని చెప్పింది.

ధూల్ పేట మూడు కారణాల వల్ల అప్రసిద్ధమైందని తెలుసుకున్నాం: ఒకటి, దేశీయ మద్యం తయారీకి, రెండు గణేష్ విగ్రహాల తయారీకి, మూడు అల్లర్లకు.

"నేను ఎటువంటి నాన్సెన్స్‌ను భరించను. ఎవరైనా బస్‌లో అసభ్యంగా ప్రవర్తించినా, టిక్కెట్ కొనకపోయినా నేను వెంటనే క్రిష్ణ అన్నని బస్ పోలీస్ స్టేషన్‌కి తీసుకు పొమ్మని చెప్తాను. వెంటనే దారికొస్తారు." అన్నది ఊర్మిళ.

ఆ రోజు ఆమెతో మా బస్సు ప్రయాణం, ఆమెకి ప్రయాణికుల రద్దీని, బస్సు ప్రయాణాన్ని తట్టుకోవటానికి ఎవరి సహాయం అవసరం లేదని అర్థం చేయించింది. మహిళా కండక్టర్‌లకు బస్ రూట్లలో మరుగుదొడ్లు లేకపోవటం ఈ వృత్తికి పెద్ద సవాల్‌గా మారిందని ఊర్మిళ చెప్పింది. ఈ విషయాన్ని పై అధికారులు వెంటనే పట్టించుకోవాలని చెప్పింది. అలా టాయిలెట్లు లేకపోవటం వల్ల చాలా మంది మహిళా కార్మికుల ఆరోగ్యాలు తీవ్రంగా పాడయ్యాయని అన్నది.

ఏడు గంటల ప్రయాణంలో ఊర్మిళ ఒక్కసారి చార్మినార్‌లో మాత్రమే టాయిలెట్ వాడటం మేము గమనించాం. ఆదొక్కటే పని చేస్తుందని తను చెప్పింది. మాకు టియస్ఆర్‌టిసి ఆఫీసులోని లీగల్ ఆఫీసర్ కార్మికుల పరిహారం చట్టం ప్రాముఖ్యతను తెలియచేశాడు. ఒక కార్మికుడు అదనపు గంట పని చేస్తే అతడు/ఆమెకి రెండు రెట్లు అదనంగా చెల్లించాలని, రెండు గంటలు అదనంగా లేదా సెలవు రోజున పని చేస్తే వారికి పరిహారం అందించాలి. బస్ కండక్టర్ పోస్టు కోసం దరఖాస్తు చేసే వారిలో చాల మంది కావాల్సిన విద్యార్హతల కంటే ఎక్కువ విద్యార్హత కలిగిన వారే ఉన్నారు. (కండక్టర్ పోస్ట్ కోసం కనీసం విద్యార్హత 10వ తరగతి పాస్ అయితే చాలు) ఇది చాలా మందికి కోరుకునే ఉద్యోగం కానప్పటికీ పొలాలు ఎండిపోవడం, కావలసిన రంగాలలో సరియైన ఉద్యోగాలు లేకపోవటం, అప్పుడప్పుడు ఎన్నుకున్న రంగాల్లో చాయిస్ కొద్దిగానే ఉండటం వల్ల చాలా మంది స్త్రీలు టియస్ఆర్‌టిసిలోనే కండక్టర్స్‌గా పని చేయటం మొదలు పెట్టి తరువాత టెక్నికల్, కంప్యూటర్ ఉద్యోగాలలోకి మారుతుంటారు.

టియస్ఆర్‌టిసిలో ఉద్యోగం కోసం కనీస వయస్సు 21 సంవత్సరాలు అయితే చాలా మంది ఉద్యోగులు 25–30











సంవత్సరాల మధ్య ఉంటారు. వీరిలో కొందరు పెళ్ళికాని వారు కాగా, చాలా మంది వివాహితులు. భర్తలు భద్రత కలిగిన ఉద్యోగంలో లేకపోవటం వలన కుటుంబాన్ని పోషించటానికి ఈ పని చేస్తుంటారు.

జూబ్లీ బస్ స్టేషన్‌లో డిప్యూటి చీఫ్ మేనేజర్ చెప్పిందాని ప్రకారం టియస్‌ఆర్‌టిసి మహిళా బస్ కండక్టర్లకు అనేక ప్రయోజనాలు కల్పిస్తుంది. టియస్‌ఆర్‌టిసిలో పనిచేసే ఉద్యోగులందరికీ 15 రోజుల సాధారణ సెలవులు ఉంటాయి కానీ మహిళలకు అదనంగా 3 రోజులు సెలవులు కల్పిస్తారు. రోజుకు ఏడు గంటలున్న షిఫ్టుల్లో మూడుసార్లు పది నిమిషాల విరామం ఉంటుంది. మహిళా ఉద్యోగులను రాత్రి షిఫ్ట్‌ల నుండి సాధారణంగా మినహాయిస్తారు. వారానికి ఒకరోజు సెలవు విధానం అందరు ఉద్యోగులకు వర్తిస్తుంది.

స్త్రీల కోసం ప్రత్యేక కార్మిక యూనియన్ లేనప్పటికీ మహిళా సమస్యలని అన్ని సంఘాలు చురుగ్గా ముందు పెడతాయని మేము గమనించాం. ఆసక్తికరమైన విషయమేమిటంటే మహిళలందరూ సంఘాలలో చేరినప్పటికీ వారికి ఎక్కువ స్థానాలు లేదా పోస్టులు ఉండవు. ఈ విషయాన్ని **DCM**, ఊర్మిళ ఇద్దరూ ఎత్తి చూపారు చాలా కాలంగా మహిళా కండక్టర్లు అడిగిన డిమాండ్లు: జీతంతో కూడిన సెలవులు, మంచి పారిశుధ్య సౌకర్యాలు, పగలు డ్యూటి, అధునాతనమైన తేలికైన విధులు. (ఏసి బస్‌లలో డ్యూటీలు, అది కొంచెం ఖరీదైనవి కాబట్టి రద్దీగా ఉండవు) చాలా వరకు ఈ డిమాండ్లు జాగ్రత్తగా ఉండాలని, భద్రత కోసమూను. అయితే పనిచేసే స్థలాల్లో కొంత మేర సౌకర్యాల కోసం (ఎయిర్ కండిషన్ బస్‌లు, కొన్ని చిన్న బస్‌లను) అయితే అటువంటి అంశాలలో సీనియారిటీ ప్రకారం నడుచుకుంటారు కాబట్టి, వారి ఆశలు అరుదుగా వాస్తవ జీవితంలో కొస్తాయి.

రవాణా కార్యాలయాల్లో మహిళల సంఖ్య గత కొద్ది సంవత్సరాలలో పెరిగినప్పటికీ ఇప్పటికీ తక్కువగానే ఉందని చెప్పాలి. హైదరాబాద్ నగరంలో 9000 వేల మంది బస్ కండక్టర్లు ఉంటే వారిలో 1600–1800 వరకు మహిళా బస్ కండక్టర్లు ఉంటారు. 1990 నుండి ఈ సంస్థలో మహిళా బస్ కండక్టర్ల సంఖ్య పెరిగిందని డిప్యూటీ చీఫ్ మేనేజర్ చెప్పారు. అన్ని డిపోలను నడిపే మహిళగా మహిళా ప్రాతినిధ్యం మంచిగనే ఉందని ఆమె అభిప్రాయపడింది. అయితే, హైదరాబాద్ నగరంలో 95 మంది డిపో మేనేజర్లు ఉన్నా వారిలో 12 మంది మహిళలు మాత్రమే ఉండటం నామ మాత్రపు ప్రాతినిధ్యం అని, వీళ్ళు కూడా సీనియారిటీ వల్ల ఎదిగారని చెప్పారు. మహిళలకు నూట ఎనిమిది రోజులు ప్రసూతి సెలవులను మంజూరు చేస్తారు అంతేకాక ఆ సెలవులు పొడిగించాలన్న అభ్యర్థనను టియస్‌ఆర్‌టిసి ఒప్పుకుంది. డిప్యూటి చీఫ్ మేనేజర్ ప్రకారం చాల మంది మహిళా ఉద్యోగులు గృహ అదనపు ఆదాయం కోసం వారి గర్భధారణ తర్వాత కూడ పనిలో కొనసాగుతారు. ఆడ, మగ బస్ కండక్టర్ల సంపాదన ఒకే విధంగా ఉంటుంది. సీనియారిటీ ద్వారా పెరుగుతుంది. బస్ కండక్టర్ల జీతం 6000 రూపాయల నుండి మొదలవుతుంది. సీనియర్ ఉద్యోగుల ఆదాయం 20,000 వేల వరకు ఉంటుంది. భౌతికంగా బలహీనంగా ఉంటారనే అభిప్రాయం కారణంగా భారీ వాహనాలైన బస్‌లకు మహిళలను డ్రైవర్లగా ఉండడానికి సాధారణంగా చట్టపరమైన నిబంధనలు అనుమతించవు.

ఈ బస్సు ప్రయాణం మమ్మల్ని మేము వివిధ ప్రాంతాల సందులకు పరిచయం చేయటమే కాకుండా, మాకు బస్సులు నగరాల జీవన రేఖలని, నగరంలో అందర్నీ, అన్ని తరగతులను కలిపేవని అర్థమయింది. మధ్యతరగతి నుండి వచ్చిన మేము అత్యధిక ప్రజల జీవితాలకి పరాయి వాళ్ళమే. ఈ ప్రాజెక్ట్ చేస్తున్నప్పుడు ఊర్మిళ జీవితాన్ని, ఉద్యోగాన్ని, ఇంటి పనిని ఎలా సమన్వయం చేస్తే సమస్యలను అధిగమిస్తుందో చూడాలనుకున్నాం. కానీ ఆమె ఇంటికి వెళ్ళటం ఒక సవాల్‌గా అయ్యింది. ఆ అవరోధాన్ని మేము













అధిగమించ లేకపోయాం. ఊర్మిళ డ్యూటీ షిఫ్ట్‌లో మేము ఆమెతో ప్రయాణించడం కండక్టర్‌ల కష్టాలను తెలుసుకోడానికే కాక ఆమె ఇంటికి దూరంగా జీవించడాన్ని, జీవితాన్ని గడపటాన్ని కూడ ఆస్వాదిస్తుందని మాకు అర్థం చేయించింది. ఆమె ఉద్యోగం ఆమెకి ఇంటి బయట కూడ ఒక కుటుంబాన్ని అందించింది.

ఈ ప్రాజెక్టులో భాగంగా మేము గుర్తించిందేమిటంటే ఊర్మిళ ఒక ఒంటరి వ్యక్తిగా పని చేయట్లేదు, ఆమె ఒక ప్రొఫెషనల్ కమ్యూనిటీలో భాగంగా పైకొచ్చింది. మేము మహిళల ప్రొఫెషనల్ కమ్యునిటీలను ఎలా నిర్మించాలో, పని చేసే స్థలాల్లో ఎలా మెసులుకోవాలో ముందు ముందు అధ్యయనం చేయాలనుకుంటున్నాం.

ఈ వ్యాసం రచయితలిద్దరూ అన్వేషి సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసినప్పుడు రాసినది.



**దేవయాని ప్రసాద్, డిల్లీలోని అంబేద్కర్ యూనివర్సిటీ సైకాలజీలో పిజి చేస్తున్నారు.**

devayani.prasad@gmail.com

**అనూష సుందర్ డిల్లీలోని జవహర్ లాల్ యూనివర్సిటిలో ఆధునిక చరిత్రపై ఎమ్.ఫిల్ చేస్తున్నారు.**

anusha.90.96@gmail.com

**అనువాదం : మాధవి మిరప**

# బుర్ఖా - రిక్షా

■ జావీద్ ఆలమ్

హైదరాబాద్ ఒక ప్రవాహంలో కొట్టుకు పోతోంది. గత కొన్ని దశాబ్దాలలో, నమ్మశక్యం కానంత వేగంగా నగరంలో విస్తృతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 'మన ఆధునికత' అనే మహా కావ్యం నుండి రెండు అసాధారణ ప్రత్యేకతలని ఎంచుకుని, ఈ జరుగుతున్న మార్పులని విశదీకరించటానికి ప్రయత్నిస్తాను. మెదటిది బుర్ఖా ముస్లిమ్ మహిళలు వేసుకునే ఈ ముసుగు (తల నుంచి పాదాల వరకు శరీరాన్నంతా కప్పేది) నగరమంతటా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో విలాసవంతమైన, ఆధునిక ప్రాంతాలలో కూడ కనిస్తోంది. రెండవది, గతంలో అందరూ వాడిన రిక్షా (రవాణాకి మనుషులు తొక్కే మూడు చక్రాల వాహనం) నగరంలో దాదాపుగా అదృశ్యమైంది. బాగా వెనుకబడిన పేద ప్రాంతాలలో కూడా ఇది కనిపించడం లేదు. ఒకప్పుడు మిగిలిన నగరాలతో పోల్చి చూస్తే దేశంలో రిక్షాలు అత్యధిక సంఖ్యలో ఉండే నగరం హైదరాబాదు. దీనిని రిక్షాల నగరం అని పిలిచేవారు. విలాసవంతమైన, ఆధునిక ప్రాంతాలలో బుర్ఖా కనిపించటం, పేదరికం తాండవించే, వెనుకబడ్డ ప్రాంతాలలో రిక్షాలు కనబడక పోవటం ఈ రెండు అసంబద్ధ పరిణామాలు మన ఊహలకు విరుద్ధంగా ఉన్నాయి. అందుకే వీటిపైన మనం దృష్టి సారించాలి.

మన ఆధునికత గురించి రాసుకుంటున్న మహా కావ్యంలో బుర్ఖా ఎలా భాగం కాగలదు? చాలా మంది దీనిని ముస్లిం సమాజంలో సాంప్రదాయవాదం, మతతత్త్వం పెరుగుదలకి చిహ్నంగా అర్థం చేసుకున్నారు. అలా అయిండవచ్చు, కాకపోవచ్చు. భారతదేశంలో అన్ని సమాజాల విషయంలో లాగ రెండింటిలో కొంత వాస్తవం వుండవచ్చు. అయితే నా ఉద్దేశ్యంలో సమస్యను ఈ రకంగా చూడటం సరైనది కాదు. అసలు జరిగిందేమిటంటే ఇది వరకు కనిపించనిది, హఠాత్తుగా మనకు కనిపించటం మొదలుపెట్టింది. స్త్రీల శరీరాలను అందరి దృష్టి నుంచి కాపాడే బుర్ఖా సాంప్రదాయిక ముస్లిం కుటుంబాలలో సాధారణమైన విషయం. 30 సంవత్సరాల క్రితం సామాన్య, క్రింది మధ్య తరగతి నేపథ్యం ఉన్న ముస్లిం కుటుంబాలలో స్త్రీల విద్య, ఉద్యోగం అన్నవి అసాధారణ విషయాలు. ముస్లిం స్త్రీలు చాలా వరకు తమ ఇళ్ళకు పరిమితమై, బంధు వర్గాన్ని దాటి ఇతరుల్ని కలవటం అరుదుగా ఉండేది. అయితే, ఇంటి నుంచి బయటికి వచ్చినప్పుడు మాత్రం పరదా పాటించే వారు. ముఖాన్ని, ఒంటినీ, కప్పే 'చాదర్' కప్పుకున్నా సరిపోయ్యేది. స్త్రీల శరీరాలను గురించి, వ్యక్తిత్వం గురించి గానీ దృక్పథాలలో ఎటువంటి మౌలికమైన మార్పు రాకుండానే సమాజంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. వారు జీవనం కొనసాగించాల్సిన సామాజిక-ఆర్థిక సందర్భాలు మారుతున్నాయి.

గతంలో కడు పేదరికాన్ని అనుభవించిన వారు, కొంత మేరకు బాగుబడినా ఇప్పటికీ పేదరికంలోనే ఉన్నారు. అయితే దిగువ మధ్య తరగతి సమూహాలలో చాలా స్పష్టంగా మార్పు కనిపిస్తోంది. ఈ సమూహాలలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఆదాయంలో, జీవితావకాశాలలో పెరుగుదలని చూడవచ్చు. విద్యావకాశాలు విస్తరించాయి. ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది ముస్లిం మహిళలేనని మనం గుర్తించాలి. ముస్లిం యువకులు, చమురు సంపదలున్న మధ్య తూర్పు ఆసియా దేశాలకు వెళ్ళి, తమ కుటుంబాలను అతిదారిద్ర్యం నుంచి, కఠినమైన జీవనం నుంచి కాపాడగలిగారు. దీనివలన వీరికి, జీవితావసరాలకు సరిపోగా కొంత ఆదాయం మిగిలింది. ఈ కుటుంబాలలో స్త్రీలు పెద్ద స్థాయిలో చదువుకోవటం మొదలుపెట్టారు. మత నిబంధనలు విధించే పరిమితులకు లోబడి, ఆడపిల్లలు ఈ సదవకాశాన్ని బాగా ఉపయోగించుకుంటున్నారు. సాంకేతిక విద్యకు, ఉద్యోగావకాశాలు ఉన్న రంగాలకు ఉపయోగపడే విద్యకు, ఐటీ విద్యకు, ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు.

బుర్ఖా ఇప్పుడు ఎక్కువగా కన్పించటానిక్కారణం ప్రజా రంగంలోకి స్త్రీలెక్కువ రావటంవల్లే. వీరు విద్యావకాశాలు అందుకుంటూ ఇరవై సంవత్సరాల క్రితం వరకూ కనిపించని రంగాల్లో, ఆర్థిక రంగాలలో పనిచేస్తున్నారు. చాలాసార్లు ఈ మహిళలు దీనిని, భగవంతుని దయగా, అంటే వాళ్ళు నమ్మే అల్లా దయగా భావిస్తుంటారు. వీరు తమ మతాన్ని చాలా జాగ్రత్తగా పాటిస్తారు. బుర్ఖాను తమ ప్రపంచంలో అంతర్భాగంగా భావిస్తారు. దీనిలో ఏ మేరకు వారి కుటుంబాలలోని పురుషుల ఒత్తిడి మూలన చేస్తారో, ఏ మేరకు వారి స్వంత విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందో చెప్పటం కష్టం.

బుర్ఖా ఎటువంటి ప్రదేశాలలో ఎక్కువగా దర్శనమిస్తుంది? కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు, NIIT వంటి ఐటీ శిక్షణా కేంద్రాలు, వ్యాపార సంస్థలు, కార్యాలయాలు మొదలైన చోట్ల వీరు బుర్ఖాలు తొడుక్కుని మోటర్ బైకులపైన. మోపెడ్‌ల పైన కనిపిస్తారు. బస్సులలో మహిళల కోసం రిజర్వు చేసిన సీట్లు నింపుతూ ఉంటారు. సౌదీ అరేబియాలో లాగా ఆడవాళ్ళు ఇళ్ళకే బలవంతంగా పరిమితమై ఉండి, పురుషులు వెంట ఉంటే మాత్రమే బయటికి వెళ్ళాల్సిన పరిస్థితి మనకు లేదు. ఈ మహిళలు తరుచు ఒంటరిగా కనిపిస్తారు. ఐస్ క్రీమ్ పార్లర్లకి, బ్యూటీ పార్లర్లకీ కలిసి వెళ్తూ ఉంటారు, కొన్నిసార్లు పబ్లిక్ ప్రదేశాలలో తమ పురుష స్నేహితులతో కలిసి ముచ్చటిస్తూ కనిపిస్తారు. వీళ్ళు ముస్లిమ్ స్త్రీలని మనకు తెలుసు. అయితే, వీళ్ళ మొహాలు కప్పబడి ఉండటం వలన వీళ్ళు చేసే పని కనిపిస్తుంది గానీ, మొహాలు కనిపించవు. మిగిలిన స్త్రీలలో లాగా వీళ్ళుకూడా ఆధునిక ప్రపంచంలోనే బతుకుతున్నారు కానీ, ఆధునికత వీరికింకా దూరంగానే ఉంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పటం కష్టం. జరిగిపోయిన చరిత్ర ఈ విషయంలో మార్గదర్శకం కాలేదు. అయితే, ఇది సమస్య కాకపోవచ్చు. నామటుకు నేను, ఈ పరిణామాన్ని మారుతున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవటంలో ఒక సవాలుగా చూడటానికి ఇష్టపడతాను.

రిక్షాలు మాయమవడానికి సంబంధించిన కథ ఇంత సంక్లిష్టమైనది కాదు. డెబ్బైయవ శతకం మధ్యలో ఆటో రిక్షా (మూడు చక్రాలు, యంత్ర శక్తితో నడిచే చిన్న టాక్సీ) ప్రత్యక్షమయింది. తరువాతి 15 సంవత్సరాల కాలంలో ఇది నెమ్మదిగా రిక్షాని పక్కకి పెట్టింది. డెబ్బై, ఎనభై దశకాలలో హైదరాబాద్‌ని అందరూ క్షీణిస్తున్న నగరంగా చూడటం మొదలు పెట్టారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాలకు పని కోసం ప్రజలు పెద్దస్థాయిలో వలస వెళ్ళారు. ఏ ప్రాంతాలకు వెళ్ళారు, ఎటువంటి పని కోసం వెళ్ళారు అనే విషయం వారి సామాజిక స్థాయి, విద్యార్హతల పైన ఆధారపడింది. ఏది ఏమైనప్పటికీ ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌లు, ప్రవాస భారతీయ ప్రజని తయారు చేయటానికి బాగా దోహదం చేశాయి. ముస్లింలలో, క్రింది తరగతి కింది మధ్య తరగతుల నుంచి చాలా మంది, ప్రత్యేకించి మధ్య తూర్పు దేశాలకు, చమురు డాలర్లు తెచ్చిన ఆకస్మిక సంపద, ఉద్యోగావకాశాల కారణంగా వలస వెళ్ళారు.

తరువాత తొంభైలలో నిర్మాణ రంగం బాగా పెరిగి ఫ్లై ఓవర్లు, వ్యాపార భవనాలు, బహుళ అంతస్తులున్న




నివాస గృహ సముదాయాలతో మొదలై హైటెక్ సిటీ (నగరం) నిర్మించబడింది. రకరకాల పనులకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ మార్పుకు కొన్ని విషయాలు దోహదం చేశాయి. విదేశాలకు వలస వెళ్ళిన బంధువుల దగ్గర నుంచి వచ్చిన డబ్బు, అలాగే కొంత మేరకు నగరం విస్తరించబడటం వలన ఏర్పడిన కొత్త అవకాశాల వల్ల కొంత వరకు ప్రజలు ఆటో రిక్షాలు నడిపించటానికి, నిర్మాణ పనులు వంటి వాటికి మారటానికి పురికొల్పాయి. దళితులకు, ఇతర వెనుకబడిన జాతుల వారికీ (ఓబిసీ) ఉద్యోగాలలో కోటాలు, విద్యావకాశాలు నెమ్మదిగా విస్తరించటం వంటివి ఈ మార్పుకు సహకరించాయి. పేద వాళ్ళు పక్కనే ఉన్న బ్లూ కాలర్, వైట్ కాలర్ ఉద్యోగాలకి మళ్ళారు. (ఇలా జరిగిన తరువాత కూడా మిగిలిన రిక్షాలను, మిగిలి పోయిన దళితులు తొక్కుతున్నారు. విరిగిపోవటానికి సిద్ధంగా ఉన్న రిక్షాలలో సరుకులను రవాణా చేస్తున్నారు. రిక్షా నడిపే వారి సమూహంలో దళితులు, ముస్లింలు కొంత, ఓబిసీ లుండేవారు). రిక్షాలు మాయమవటం అంటే పేదరికం అంతరించిందని కాదు; సాపేక్షికంగా చెప్పాలంటే, ఇది అతి పేదరికం కొంత మేరకు తగ్గిందనటానికి సూచిక మాత్రమే; అయితే రెండూ ఇంకా స్పష్టంగానే కనిపిస్తున్నాయి. ప్రజలు ఎక్కువ స్థాయి నైపుణ్యతలు అవసరమైన స్థానాలకు కొంత మేరకు మారగలిగారు. ఇది నా ఉద్దేశంలో ముఖ్యమైన పరిణామం. ఎందుకంటే ఇది ఆత్మగౌరవం పెంచటానికి ఉపయోగపడి ఇతరుల చేత సమానులుగా గుర్తించబడాలనే డిమాండుకు దారితీసింది. సమానత్వ భావజాలం, దానితోపాటే అంతటా తమ కమ్యూనిటీ పట్ల నిబద్ధత పెరగటం మనం చూస్తున్నాం. అంటే ఇది కొత్త ఆశలకు ఊపిరి పోస్తోంది.

కుటుంబ స్థాయిలో కూడా ప్రాధాన్యతలు బాగా మారుతున్నాయి. ప్రజలు నివసించటానికి మంచి ఇల్లు ఉండాలని కోరుకుంటున్నారు – పాతకాలపు గుడిసె ఎవరికీ నచ్చట్లేదు. జీవితాలను బాగు చేసుకోవటానికి తమ పిల్లలను స్కూళ్ళల్లో చూడాలనుకుంటున్నారు. పేదరికం విధించే నిర్బంధం నుండి కొంత వెసులుబాటు దొరికి, కొత్తదారులు కనిపించటంతో మానసిక పరిధులు విస్తరిస్తున్నాయి. ఎన్ని లోపాలున్నా ప్రజాస్వామ్యం కొంత మేరకు స్థిరంగా పని చేయటం దీనికి సహకరించింది. ప్రజాస్వామిక ప్రక్రియ తలుపులు తెరవడంతో వ్యతిరేక శక్తులున్నప్పటికీ, ప్రజలు బయటికి వస్తున్నారు. కొత్త చోట్లలో ప్రవేశించి ప్రపంచం విసిరే కొత్త సవాళ్ళు ఎదురుకుంటున్నారు. వీటిని ఏ రకంగా ఎదుర్కుంటున్నారు అనేది, మామూలు మనుషులు రాసుకుంటున్న స్వీయ చరిత్రలు తెలుపుతున్నాయి. గెలుపుల మధ్యలో ఇమిడి ఉన్న విషాదాంతాలు, మానసిక క్షోభ కూడా అంతటా కనిపిస్తున్నాయి.

బుర్ఖా విరివిగా కనిపించటం, రిక్షా అదృశ్యం కావటం ఈ రెండు రకాల మార్పులను కలిపి విశ్లేషించినట్లైతే, కంటికి కనిపించని ఒక బలమైన మార్పు కనిపిస్తుంది. దీనిని వెలికి తీయాలి. ఇక్కడ ఒక మాట చెప్పటానికి సాహసం చేస్తున్నా. హైదరాబాద్ ప్రజలకు వారి రోజువారీ జీవితం అన్నిటికంటే ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాపంచిక జీవితం తాలూకు సాధారణ లయ వీళ్ళకు ముఖ్యమైనదిగా కనిపిస్తోంది. ఇది సార్వత్రిక విలువల జంజాటం లేకుండా ఆనందాన్నిచ్చే సాధారణ, రోజువారీ విషయాలు కేంద్రంగా ఉండే ఆధునికత.

మతం మరుగై పోయిందనీ, దాని ప్రాముఖ్యత తగ్గిపోయిందనీ నేను భావించటం లేదు. నిజం చెప్పాలంటే వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. హిందువులకు, ముస్లింలకు ఇద్దరికీ కూడా మతం స్పష్టంగా ఎప్పటికన్నా ఎక్కువ ప్రాముఖ్యత కలిగి ఉంది. అయితే, గొప్ప విషయం ఏమిటంటే, మతం గతంలోలాగా రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేయటం లేదు. మతం, రోజువారీ జీవితం రెండూ ఒకేసారి ఉండటం, రెంటి ప్రాముఖ్యత ఒకే సమయంలో పెరగటం చూస్తుంటే, ఆధునికతను గురించి మార్క్స్ "ప్రగతి యొక్క వైరుధ్యాలు" అన్నమాట గుర్తుకొస్తోంది. బహుశా ఇదే ఇతిహాసం అనే ప్రక్రియకున్న ప్రత్యేకత కావచ్చు.

జావీద్ ఆలమ్ జ్ఞాపకార్థం ప్రేమతో సంగ్రహించబడింది.
సంగ్రహణ కర్త: ఎమ్.ఎ. మోయిద్
మూలం: సెమినార్ 585: సిటీ ఆఫ్ హోప్.
మే 2008 పేజీలు 42–44

***అనువాదం : పి.మాధవి***

# బహిరంగ స్థలాలు ఎవరికి చెందుతాయి?

■ **తేజస్విని మాదభూషి**

హైదరాబాద్‌లో "అర్థరాత్రి మార్చ్" జరిగిన ఆరు నెలల తర్వాత జూన్ 2013లో హైదరాబాదు ఫర్ ఫెమినిజం ("స్త్రీవాదం కోసం హైదరాబాద్") ప్రారంభమయింది. రాత్రివేళల్లో స్త్రీలు, ట్రాన్స్‌జండర్ ప్రజలు మరియు ఇతర సమూహాలు స్వేచ్ఛగా సంచరించేందుకు అనువుగా బహిరంగ ప్రదేశాలుండాలనే లక్ష్య సాధన కోసం అర్థరాత్రి కవాతును నిర్వహించటం జరిగింది. నాథాకు, నాకు ఇటువంటి ఆలోచన రావటానికి కారణం కొద్ది నెలలకు ముందు ఒకసారి రాత్రిపూట మేము రోడ్డు మీద నడుస్తున్న సమయంలో ఎదురైన అనుభవం అయినా; అర్థరాత్రి కవాతును' నిర్వహించటానికి మమ్మల్ని బలంగా ముందుకు తోసిన సంఘటన మాత్రం 2012 ఢిల్లీలో జరిగిన దారుణ సామూహిక అత్యాచారమే!

అర్థరాత్రి మహిళలు జరపబోతున్న కవాతు అనే ఆలోచన భిన్న వ్యక్తులను, సమూహాలను, సంఘాలను ఆకర్షించటంతో అందరం కలిసి దానిని విజయవంతంగా నిర్వహించగలిగాం. నిర్వహించిన మా అందర్నీ ఆశ్చర్యపరిచే విధంగా 2013 జనవరి 5వ తారీఖు జరిగిన ఆ కవాతులో ఎన్నో వేలమంది పాల్గొన్నారు. అందులో చాలా మంది ఢిల్లీ సంఘటనను నిరసించటానికి వచ్చిన వాళ్ళే కాని ప్రత్యేకంగా రాత్రివేళల్లో స్త్రీలు, ఇతర ట్రాన్స్‌జండర్ సమూహాలు స్వేచ్ఛగా సంచరించ గలిగే అవకాశాల గురించి ఆలోచించే వాళ్ళని చెప్పటానికి వీలులేదు. మాతో కలిసి వచ్చిన కొద్దిమంది మగవాళ్ళను మేము వెనకవైపు ఉండమని అడిగినందుకు మమ్మల్ని 'సెక్సిజం' ప్రదర్శిస్తున్న వాళ్ళుగా ముద్రించారు. ఢిల్లీలో జరిగిన సంఘటనను నిరసించగలిగిన వాళ్ళు కూడా రాత్రుళ్ళు స్వేచ్ఛగా సంచరించగలిగే సందర్భాలు స్త్రీలకు ఎందుకు అవసరమో అర్థం చేసుకోలేక పోయారు.

అర్థరాత్రి కవాతు విజయవంతం అయినా అందులో పాల్గొన్న సంఖ్యలు, సమూహాలు ఆ తర్వాత ఒక స్పష్టమైన రూపం తీసుకోలేకపోయాయనేది మాత్రం వాస్తవం. పత్రికా ప్రపంచంలో అనేక టి.వి ఛానళ్ళలో విస్తృతంగా 'అర్థరాత్రి మార్చ్' గురించి చూపించటం జరిగినా, జరిగిన చర్చలు మాత్రం అత్యాచార నేరస్థులకు ఎటువంటి శిక్షలు విధించాలనే విషయానికి మాత్రమే పరిమితం అయినాయి. పబ్లిక్ స్థలాలలో స్త్రీలు, ఇతర ట్రాన్స్‌జండర్ సమూహాలకు స్వేచ్ఛగా సంచరించే అవకాశం లేనంత వరకు వాళ్ళపై జరిగే లైంగిక హింస, దౌర్జన్యాలను అరికట్టలేం అనే మా వాదన మాత్రం మేం ఆశించినంతగా చర్చకు రాలేదు.

అట్లాగే చాలా మంది అమ్మాయిలకు స్త్రీవాద గ్రూపులను కలవటం కానీ, స్త్రీవాద ఉద్యమంలో భాగస్వాములు కావటం కానీ అంత సులువైన విషయం కాదు అనే గుర్తింపు కూడా మాకు కలిగింది. ఈ సమస్యను గురించిన చర్చకు, దాని పరిష్కారానికి ఒక చోటు అవసరం అనిపించింది.

ఈ అంశాలన్నింటి గురించి కృషి చేయాలనే తలంపుతో ప్రారంభమయింది 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం'. మా సమావేశాలన్నీ కొత్త వాళ్ళు పరస్పరం కలుసుకోవటానికి; అనుభవాలు పంచుకోవటానికి; ఎదురయ్యే సమస్యల గురించి మా ఆలోచనాపటుత్వం పెంచుకోవటానికి అవకాశం కలిగిస్తాయి. పబ్లిక్ స్థలాల్లో ఎదురయ్యే లైంగిక వేధింపుల గురించి స్త్రీలు మాట్లాడుకోవటాన్ని ప్రోత్సహిస్తాయి. అయితే ఈ క్రమంలో మనకి చాలా దగ్గరగా ఉండి, బాగా తెలిసిన వ్యక్తులతో మనం ఎదుర్కొనే లైంగిక వేధింపుల వివరాలు పంచుకోవటం చాలా కష్టమైన పని అనే అంశం ఒకటి మాకు చాలా స్పష్టంగా అర్థమయింది.

ఈ చర్చలు, వాటి పరిమితులు దృష్టిలో ఉంచుకొని మొదట్లో హైదరాబాద్ ఫర్ ఫెమినిజం నిర్వహించిన కార్యక్రమాలను పరిశీలిస్తే అవన్నీ పబ్లిక్ స్థలాలను తిరిగి ఆక్రమించుకోవటానికి సంబంధించినవేనని అర్థమవుతుంది. అదే కాకుండా వీధి నాటకాలను కూడా ప్రదర్శించటం ద్వారా మేము వీధులలో స్త్రీలు ఎదుర్కొనే వేధింపులను ఎత్తి చూపటానికి; పితృస్వామ్య సంస్కృతిని ఎండగట్టే కార్యక్రమాలను నిర్వహించటానికి కృషి చేశాం!

ప్రస్తుతం పని స్థలాల్లో, ఆఫీసుల్లో స్త్రీలెదుర్కొనే లైంగిక వేధింపులకు సంబంధించిన చర్చలు నిర్వహించే ప్రయత్నం మీద దృష్టి కేంద్రీకరిస్తున్నాం. శ్రీరెడ్డి తదితరులు సినిమా పరిశ్రమలో స్త్రీలపై లైంగిక వేధింపులు ఎదుర్కొనే అణచివేతల్ని ఎదిరించి ప్రారంభించిన ఉద్యమం; అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న 'మీ టూ' (నేను కూడా) ఉద్యమాలు కూడా మమ్మల్ని ప్రభావితం చేసినయి.

**టాబూ ట్రెయిల్**

ఇక్కడ నేను హైదరాబాద్ బహిరంగ స్థలాల్లో స్త్రీల గురించి మేం చేపట్టిన కార్యక్రమాల మీద దృష్టి పెట్టదల్చుకున్నాను. అందులో మా మొట్టమొదటి కార్యక్రమం 'టాబూ ట్రెయిల్' అంటే ఇరానీ చాయ్ దుకాణాలు; స్త్రీలను నిషేధిస్తున్నాం అని ప్రత్యక్షంగా చెప్పకుండానే స్త్రీలకు ప్రవేశాన్ని నిరోధించే చౌకబారు బార్లు – రెస్టారెంట్లని ప్రత్యేకించి దర్శించే కార్యక్రమం అది. వీటిలో కొన్నింటిలో 'ఫామిలీ సెక్షన్' లో స్త్రీలకు ప్రవేశం ఉంటుంది. అది కుటుంబ సభ్యులతో కావచ్చు, స్నేహితులతో కావచ్చు. మా కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో స్త్రీలు ఈ రెస్టారెంట్లలో అడుగుపెట్టగానే, అక్కడ కొచ్చిన జనం కూడా కంగారుపడి పోయారని గమనించాం. మాలో ఒకరు ఈ అనుభవంతో కలిగిన ఇబ్బంది గురించి మాతో తర్వాత పంచుకోవడం జరిగింది. ఆమె దృష్టిలో ఒక్కసారి మధ్య తరగతి స్త్రీలంతా వచ్చి పడేటప్పటికి అక్కడ కూర్చున్న (శ్రామిక వర్గం) మగవాళ్ళు ఇబ్బందిపడి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. దీనితో మా నేపథ్యం, మధ్య తరగతి స్త్రీలుగా వర్గంగా మాకున్న అధికారం, పబ్లిక్ స్థానాల్ని తిరిగి ఆక్రమించుకోవటం అన్న కార్యక్రమంలో ఉన్న సంక్లిష్టతను ఒక్కసారిగా ఎత్తి చూపినట్టయింది. అయితే ఈ బార్లు రెస్టారెంట్లలో మధ్య తరగతి మగవాళ్ళు చాలా తేలిగ్గా రాగలుగుతారనే మాట మాత్రం నిస్సందేహం! కూలి చేసుకునే మగవాళ్ళు ఎక్కువగా వెళ్ళే హొటళ్ళు, బార్లలో మధ్య తరగతి స్త్రీలు కనిపిస్తే కలిగే ఇబ్బందిని తేలిగ్గా 'సెక్సిజం' అని కొట్టిపారేయలేం. ఆ ఇబ్బందిని మరింత లోతుగా పరిశీలించి అర్థం చేసుకోవాలి. ఆ అవగాహన పైన మన రాజకీయ కార్యక్రమాలుండాలి. ఆ అనుభవాల తర్వాత 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం' మళ్ళీ అటువంటి 'టాబూ ట్రయిల్స్' నిర్వహించలేదు. అంటే అంత పెద్ద సంఖ్యలో స్త్రీలంతా కలిసి 'బార్లు రెస్టారెంట్'లకువెళ్ళటం లాంటివి చేపట్టలేదు.

**మౌలాలి దర్గా**

తిరిగి అటువంటి ఆత్మావలోకనం చేయాల్సి వచ్చిన సందర్భం కలిగించింది మౌలాలీ–దర్గాను సందర్శించటం. 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం'లో ఒక సభ్యురాలు ఈ కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తే, మిగతా సభ్యులంతా కలిసి పూనుకొన్నాం. సభ్యులంతా అంటే స్త్రీలు, ట్రాన్స్ జండర్ వ్యక్తులు. (పుట్టుక నుంచి స్త్రీలుగా ఉన్న వారిని 'సిస్' జండర్ స్త్రీలు అని పుట్టినప్పటి జండర్ అని, మార్చుకున్న వారిని ట్రాన్స్ జండర్ వ్యక్తులు అంటారు). మౌలాలీ దర్గాను సందర్శించి రాత్రంతా ఆ కొండమీద గడపాలి అనేది ఆ కార్యక్రమం. మౌలాలీ ఎంతో మందికి మరీ ముఖ్యంగా షియా మతస్థులకు పవిత్ర స్థలం. మా సభ్యులు మాత్రం ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన ఆలోచనల్తో అక్కడికి రావటం జరిగింది. కొద్ది మందికి ఒక పబ్లిక్ స్థలాన్ని ఆక్రమించుకోవటం లక్ష్యమైతే, కొద్ది మందికి ఒక చారిత్రాత్మక స్థలాన్ని సందర్శించటం. ఇతరులకి అందరం కలిసి సరదాగా సమయం గడపటంతో పాటు ఎత్తైన కొండ మీద కూర్చుని రాత్రిపూట నగరం అందాన్ని ఆస్వాదించటం, కొండ మీద రాత్రి నక్షత్రాల్ని చూస్తూ సరదాగా అంత్యాక్షరి ఆట ఆడుతూ, చిరుతిండ్లు తింటూ గడపటం. మర్నాడు

పొద్దున ఒక ప్రముఖ దినపత్రిక 'కొండమీద అమ్మాయిల జల్సా' అంటూ వార్త ప్రచురించింది. అక్కడి స్థానిక షియా సభ్యులకు ఈ వార్త కలవరం కలిగించి, బాధించింది. పవిత్ర మౌలాలీ దర్గాను ఒక వినోద స్థలంగా మార్చివేశారన్న ఆరోపణలు బయటికొచ్చాయి. ఏ మత సభ్యులనూ కించపరిచే ఉద్దేశంలేని మాకు, దర్గా ప్రాముఖ్యత అర్థం చేసుకోకుండా అనాలోచితంగా కొందరి మనోభావాలను దెబ్బ తీసామని అర్థమయింది. ఒక స్థానిక కమ్యూనిటీకి అతి ముఖ్యమైన ఒక పబ్లిక్ స్థలాన్ని ఆక్రమించుకోవాలని పూనుకొన్న మేము, మా స్త్రీవాద కార్యాచరణను మరొక్కసారి తీక్షణంగా పరిశీలించాలని అర్థం అయింది. మైనారిటీ సంక్షేమం ముఖ్య అధికారి (ప్రిన్సిపల్ సెక్రటరీ)కి క్షమాపణలు చెప్పి స్థానిక కమ్యూనిటీలో మా తప్పును సవరించుకొనే ప్రయత్నం చేశాం.

మొదలయిన దగ్గర నుంచి ఎంతో మందికి 'క్వీర్' అనే పదం వింత పదంగా, ఒక నెగటివ్ అర్థాన్ని స్ఫురించేది. కాని, ఇప్పటి ఉద్యమాల్లో అన్ని రకాల జండర్, ట్రాన్స్ జండర్‌లను కలిపి అన్ని సెక్సువల్ మైనారిటీలను 'క్వీర్'గా సంభోదించటం సరైనదిగా భావించటం జరిగింది. అయా సంఘ సభ్యులు మాతో కలిసి వచ్చారు. 'క్వీర్ స్వాభిమాన యాత్ర'లో భాగంగా నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలలో 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం' సభ్యులు పాల్గొన్నారు.

భిన్న లైంగికతలకు చెందిన వ్యక్తులకు పబ్లిక్ స్థలాల్లో ప్రవేశం ఉందా లేదా అనే విషయంలో నాకు స్పష్టత లేకపోయినా చాలా పేరు పొందిన ఉన్నత వర్గాల పబ్లిక్ స్థలాల్లో మాత్రం వారికి ప్రవేశం లేదనే విషయం ఖచ్చితంగా తెలుసు. అవమానాలకు గురవుతారనే భయంతో షాపింగ్ మాల్స్ వంటి ప్రదేశాలకు పోవటానికి ట్రాన్స్ జండర్ వ్యక్తులు పట్ల కమ్యూనిటి పట్ల, స్నేహ భావంతో ఉండటం అంత సులభంగా జరగదని అర్థమవుతుంది. పెద్ద సంఖ్యలో ట్రాన్స్ జండర్ వ్యక్తులు మాల్స్‌లో ప్రవేశిస్తే ఏం అవుతుందని కొన్నిసార్లు ఆలోచన వస్తుంది. పబ్లిక్ స్థలాల్లో మధ్య తరగతి స్త్రీలుగా మేము ప్రవేశిస్తే ఎదురయ్యే అనుభవాలే వాళ్ళకూ ఎదురవుతాయా? మాకు సమాజం నుంచి లభ్యమయ్యే సహకారం వాళ్ళకూ దొరుకుతుందా?

పబ్లిక్ స్థలాలను ఆక్రమించే ప్రయత్నం చేసిన మాకు ఎదురైన అనుభవాలు మమ్మల్ని చాలా ఉత్సాహపరిచేవీ, అదే సమయంలో ఆలోచనల్ని రేకెత్తించేవి కూడా! మాకు ప్రవేశించే అవకాశం లేని స్థలాల్లో ప్రవేశించటం వంటి చొరవలు ఒకవైపు స్వేచ్ఛపూరితమైనవీ, అంతే తృప్తి కలిగించేవీ అనటంలో సందేహం లేదు. ఆ అనుభవాల్ని తీసిపారేయలేం! ప్రస్తుతం పబ్లిక్ స్థలాల్ని ఆక్రమించే



మాది ఒక నగరానికి పరిమితమైన సంస్థ కావటంతో మిగతా పట్టణ ఉద్యమాలతో పోలిస్తే స్థానిక సమూహంలో మా సంబంధాలు దగ్గరగా ఉండటం సాధ్యపడింది. 'బయట తిరగటం' (Why Loiter) అనే మరొక కార్యక్రమంలో పాల్గొనటం, సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టటం లాంటి ప్రోగ్రామ్స్‌ను కూడా మేము నిర్వహించాం. అనే కాంపెయిన్‌లో జనవరి 2016లో మేము పాల్గొనటం జరిగింది.

### క్వీర్ గ్రూపులతో కలిసి

గత కొన్ని సంవత్సరాలుగా భిన్న గ్రూపులు, కమ్యూనిటీలతో కలిసి 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం' పని చేసింది. ఉస్మానియా విద్యార్థినుల సంస్థ అయిన సావిత్రీ బాయి పూలే అధ్యయన వేదిక, అన్వేషి స్త్రీల పరిశోధనా సంస్థ; నగరంలోని ఇతర జండర్ సంస్థలు(LGBT) ఉద్యమాలతో పాటు పనిచేశాం. ప్రత్యేకంగా చెప్పాలంటే మా సంస్థ సాధారణంగా సాహసించరు. ఒకవేళ ఎవరైనా కొన్నిసార్లు ధైర్యం కూడగట్టుకుంటే వాళ్ళకు చెప్పరాని ఆవేదన కలిగించే అనుభవాలే ఎదురయితయి. క్వీర్ హక్కుల గురించిన సినిమా ఒకటి చూడటానికి కొంత మంది స్నేహితులతో వెళ్ళిన ట్రాన్స్ జండర్ వ్యక్తి వైజయంతి వసంత మోగ్లీకి మాల్‌లో ప్రవేశించకుండా అడ్డగించటం లాంటి చేదు అనుభవం మిగలటం ఒక ఉదాహరణ. సెక్యూరిటీ సిబ్బందితో మామూలుగా మాట్లాడుతూ అధికారయుతంగా ఇంగ్లీషులో దబాయిస్తూ గట్టిగా వాదనకు దిగిన వైజయంతిని చివరికి సెక్యూరిటీ లోపలికి అనుమతించక తప్పలేదు. మాల్స్ వంటి పబ్లిక్ స్థలాల నిర్వాహకులు, సెక్యూరిటీ సిబ్బందిని ఇటువంటి అంశాలపై చైతన్యవంతం చేయటం ఎంత ముఖ్యమో ఈ సంఘటన తెలియ జేస్తుంది. క్వీర్ సినిమాలను ప్రదర్శించటానికి పూనుకున్న వాళ్ళల్లో ముందుండాలని అనుకున్న సంస్థలు, వ్యక్తులు కూడా వాస్తవంలో క్వీర్ వ్యక్తుల ప్రయత్నాల్ని, ఆ స్థలాల్లో ఉన్న వ్యక్తుల పై పడే ప్రభావాల్నీ గుర్తించి ఇంకొంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. మా సభ్యులు భిన్న వర్గాలు, భిన్న కులాలు, భిన్న సెక్సువల్ అభిమతం కలిగిన వాళ్ళైతే తప్ప మేం చేపట్టే కార్యక్రమాలతో సమాజంలోని అట్టడుగు వర్గాలు (మార్జినలైజ్) ఎదుర్కొనే ఇబ్బందులని గుర్తించి, అర్థం చేసుకొనే అవసరం ఏర్పడదని గుర్తిస్తున్నాం.

అప్పుడే మా ప్రయత్నాలు ఫలించి పబ్లిక్ స్థలాలు మరింత ప్రజాస్వామికంగా సమానత్వాన్ని స్థాపించేవిగా రూపొందటం సాధ్యపడుతుంది.

**తేజస్విని మాడభూషి, హైదరాబాద్‌లోని యుగాంతర్ సంస్థలో పనిచేస్తున్నారు**


mtejaswini@gmail.com

***అనువాదం:* కె. లలిత**

# మీటింగ్

■ నబీన దాస్

ఆమె టాక్సీలోంచి బయటికి అడుగుపెట్టి చుట్టూ పరికించి చూసింది. ఏదో పరిచయం లేని ప్రదేశమని కాదు. ఎందుకంటే అతన్ని కాకుండా వేరెవరినో ఈ పరిసరాల్లో ఊహించుకుంటోంది. కాని అలా ఊహించడం సాధ్యమయ్యే పనా? అంతకు ముందెప్పుడూ ఆమె అతన్ని కలవలేదు. అతను బుక్ చేసిన గదిలోకి వాళ్లిద్దరూ వెళ్లబోతున్నారు. మొదటిసారిగా రాజ్ అనే అతన్ని కలవబోతోంది. బాలీవుడ్ హీరోల పేర్లలో 'రాజ్' తరచూ వినిపించేదే. రాజ్ పేరున్న ఎంతో మంది అందమైన హీరోలు కాఫీ కప్ చేత్తో పట్టుకుని వెండి తెరపై స్త్రీల జీవితాల్లోకి వచ్చి వెళ్తూ ఉంటారు. జాజ్‌లాంటి స్త్రీల జీవితాల్లోకి కూడా. జాజ్ ఆరోజు ఆమె తనకి తాను పెట్టుకున్న పేరు.



చాందినీ చౌక్ ఈ రాత్రి మహా సందడిగా ఉంది. బహుశా ప్రతి రాత్రీ ఇలాగే ఉంటుందేమో. జాజ్‌కి పెద్దగా తెలీదు. ఆ లొకాలిటీ ఆమెకు తెలుసు కానీ రోజూ ఇక్కడకు రాదు. ప్రతిరోజూ ఆమెకు 'మీటింగ్' రోజు కాదు. బహుశా చుట్టో, ఘాటైన సిగరెట్టో చప్పరిస్తూ మామూలు ధోరణిలో 'నువ్వేం చేస్తుంటావ్' అని రాజ్ అడిగినప్పుడు జాజ్ కూడ అంతే మామూలుగా 'స్కూల్లో పాఠాలు, ముఖ్యంగా సాహిత్యం బోధించడం తన కిష్టమని చెప్పింది. దానికి అతను 'అయితే మనిద్దరికీ చాల విషయాల్లో సారూప్యత ఉంటుంది' అని ఎందుకన్నాడో ఆమెకి ఎప్పటికీ అర్థం కాదు. ఆమెకి అర్థం అయిందేమిటంటే అతను చాల బిజీ అనీ, కాన్ఫరెన్సు నుంచి కాన్ఫరెన్సుకి కన్సల్టెంటుగా అటూ ఇటూ తిరుగుతుంటాడని. ఫోనుచేసి 'మీటింగ్' కోసం అడిగినప్పుడు ఆమెకిష్టమయిన పుస్తకాన్ని తనతో తేవాలని కోరాడు.

ఆ గది మరీ అంత ఫ్రెష్‌గా లేదు. గోడలు కొద్దిగా గరుగ్గా ఉన్నాయి. నీలి రంగులో పెయింట్ చేయబడి అక్కడక్కడ ముదురు, లేత రంగుల మచ్చలతో ఉన్నాయి. ఆమె అప్పుడే కిటికీ దగ్గరకు నడుచుకుంటూ వెళ్లి నాలుగు అంతస్థుల కింద ఉన్న వీధిని చూసింది. విలువైన రాళ్లు పొదిగిన పావురంలా చాందినీ చౌక్ వెలిగిపోతోంది. ఒక క్షణం ఉద్వేగం, మరో క్షణం ఆందోళన ప్రతిబింబిస్తున్నాయి. తన కాళ్లు భుజాలు, పిక్కలను, వీపు, మెడని తదేకంగా చూస్తున్న రాజ్ చూపు ఆమెని తాకుతోంది. తన ముఖాన్ని అసలు సరిగ్గా చూసాడా? అని ఆమె ఆలోచించ సాగింది. మెడ మీది పెర్‌ఫ్యూమ్‌ని కడిగేస్తే మంచిదేమో, ఒకవేళ అతను మెడను ముద్దాడాలనుకుంటే... వాక్సింగ్ చేయకపోయినా ఆమె కాలి పిక్కలు నున్నగా ఉన్నాయి. చాల సంవత్సరాల క్రితం కాలేజీ స్నేహితురాళ్లతో కలిసి రెండుసార్లు చేసిన వేక్సింగ్ తర్వాత ఆమె శరీరం మీద మళ్లీ జుట్టు రాలేదు. 'జె! నువ్వు లక్కీ! నీ భర్త పైసలు ఆదా అవుతాయి' అని ఆమె స్నేహితులు అరిచారు. ఆమె భుజాల మీది నుంచి నెమ్మదిగా పిర్రల వరకు జారుతున్న అతని చూపుని గమనించి ఏంటో! వీపు మీద అంత ప్రేమేంటో  ఇతనికి అనుకుంది జాజ్. ఖచ్చితంగా ఇంతవరకు తన ముఖాన్ని మాత్రం అతను చూడలేదు.

కాఫీ వచ్చింది. తలుపు తట్టినచప్పుడు విని రాజ్ కొద్దిగానే తలుపు తెరిచాడు. గుమ్మంలోనే కాఫీని అందుకున్నాడు. ఈ లోపుగానే కిలాడీ సర్వీసు కుర్రాడు గదినంతా చూపుతో గబగబ సర్వే చేసేసాడు. కాని అతను జాజ్‌ని చూడలేదు. ఎందుకంటే ఆమె అప్పుడు బాత్‌రూమ్‌లోకి పోయింది. బాత్‌రూమ్‌లోని గోడలు గులాబి రంగు లాలీ పాప్, పచ్చరంగు కప్ కేక్ డిజైన్‌తో ఉన్నాయి. షవర్ మీదగా ఉన్న చిన్న గాజు కిటికీలోంచి ఆమెకు మాటను వినిపిస్తున్నాయి. కిటికీ సీలింగ్‌కి దగ్గరగా ఉంది. బయట చీకటిగా ఉంది కాని మాటలు చాల స్పష్టంగా వినిపిస్తున్నాయి. పైన టెర్రస్ ఉందేమో, అక్కడ కూర్చున్న వాళ్లు కిటికీ గాజు రేకుల గుండా బాత్‌రూమ్‌లోకి చూడగలరేమో అని అన్పించిందామెకి.

'జాజ్!' అతను పిలిచాడు. ఆమె గదిలోకి వచ్చింది. 'కాఫీ, జాజ్...'అన్నాడు, స్పూన్‌తో కలుపుతూ. ఆమె వెంటనే 'చక్కెర, పాలు వద్దు' అంది. అప్పుడు చూసాతడను ఆమె ముఖాన్ని. 'నేనలాగే అనుకున్నాను, జాజ్' అంటూ తల ఊపాడు.

"సారీ, ఇంతకంటే మంచి చోటు దొరకలేదు" అతని మాటల్లో క్షమాపణ భావం స్ఫురిస్తోంది. కాని అతను క్షమాపణ కోరాల్సిన అవసరమేముంది? అసలు అర్థం కాలేదామెకి.

"నువ్వు పుస్తకం తెచ్చావా?"

జాజ్ పుస్తకం తెచ్చింది. దాని కోసం తన బాక్‌పాక్ (సంచి)లో వెతుకుతోంది. కానీ దొరకటానికి కొంత సమయం పట్టింది. లోదుస్తులు, నైటీకున్న పట్టీలు ఆమె వేళ్ళకు అడ్డుతగులుతున్నాయి. సంచిలో రెండు ప్రోటీన్ బార్‌లు కూడా ఉన్నాయి. ఇంతకు ముందు రెండు సందర్భాల్లో ఈ ప్రాంతంలో గొప్ప అనుభవాలేమీ ఆమెకు కలగలేదు. రాత్రి భోజనం లేదు. దానికి బదులు మొరటు వేళ్లతో తడిమిన చేదు అనుభవం మిగిలింది. ఒకసారయితే పస లేని వికృతపు జోకులు వినాల్సొచ్చింది. ఈ రెండో మనిషికి ఒక రకమైన యావ  ఉందని గమనించింది. అతను వాడిన అమ్మ నా బూతులు 'నీయమ్మ, నీయక్క, నీయమ్మ, నీయక్క చెయ్యాలా–వద్దా' చివరికి ఆమె బుర్రలో 'చెయ్యాలా వద్దా' అన్న మాటలు పల్లవిలాగా  గింగురెత్తుతూ ఉండిపోయింది.

చెయ్యి తగిలితే కరకర శబ్దం చేస్తున్న ఓ ప్లాస్టిక్ పేకెట్ పక్కగా పుస్తకం దొరికింది. కండోమ్స్ తెచ్చుకోవడం తన బాధ్యతే అని ఆమె ప్రగాఢ నమ్మకం. ఒక క్షణం రాజ్‌ని కూడ ఓ పేకెట్ తెచ్చుకున్నావా అని అడగాలని అనుకుంది. అదేదో తన ధైర్యం చూపించుకోటానికి కాదు, ముందు జాగ్రత్త కోసమే. కాని అతను కాఫీ తాగుతూ ప్రశాంతంగా కనిపిస్తున్నాడు. గతంలో ఇద్దరిలా ఆమెని లాగి, గుడ్డలూడదీసే తొందర అతనిలో కనిపించం లేదు.

"నాకు నీ గురించి చాల ఆసక్తిగా ఉంది" కాఫీ తాగుతూ రాజ్ అన్నాడు. "నువ్వు చెప్పిన నీ హాబీలు మామూలుగా ఇక్కడెవరికీ ఉండవు".

అలా అడిగాటంటే ఇంతకు ముందు ఇలాంటి 'మీటింగ్'ల్లో ఎంతో మందిని చూసుంటాడు అనుకుంది జాజ్. 'మామూలు' వాళ్లందరూ అతనికి తెలిసినట్టుంది. కానీ అతన్ని వివరాలు అడగటం కరెక్టు కాదేమో. ఈ వ్యాపారంలో రూల్సు దానికి సమ్మతించవు.

"నీ పిక్కలు నాకు నచ్చాయి. నువ్వు పరుగెత్తుతావా? అతను మంచం మీద కొంచెం వంగి కూర్చుని, వచ్చి తన పక్కన కూర్చోమని చెయ్యి ఊపాడు.

"లేదు" కొంచెం ఆశ్చర్యపడింది. "కేవలం కొంచెం వ్యాయామం, జిమ్. అంతే" కాప్రి పేంటు ఆమె కండరపు వంపులో అతుక్కుని ఉంది. తన 'జట్టి' చెప్పులు తీయడానికి ఆమె సంకోచించింది. ఆమె గోళ్లు అసహ్యంగా ఉన్నాయి. కాళ్లు చాపుకుని అతని పక్కన కూర్చునే అవసరం, సందర్భం రాకూడదని ఆమె ఆశించింది. ఇంతకు ముందు 'మీటింగు'ల్లో అలా జరగలేదు.

ఆమె తత్తరపాటుని గమనించిన అతడు వంగి ఆమె 'జట్టి' చెప్పుల్ని చూసాడు. 'అందంగా ఉన్నాయి' అన్నాడు. ఎంబ్రాయిడరీ పూసలతో బాగున్నాయి. అతని చూపును గమనించిన జాజ్ ఆ చెప్పులు చాందినీ చౌక్‌లో కొన్నట్లు గుర్తు చేసుకుంది. సెకండ్ హాండ్ సంచులు, టీ షర్టులు, చెప్పులు అమ్మే దుకాణంలో కొన్నవి. ఆ దుకాణం ఒకానొక ఇరుకు గల్లీలో ఉంది. ఆంగ్ల సాహిత్యం టీచరుగా పని ప్రారంభించిన తొలి రోజుల్లో కొన్నది.

"నిజంగా ఇది నాకు నచ్చే చోటు కాదు" అన్నాడు రాజ్, చివరకు ఆమె అతని పక్కన కూచ్చుంటుండగా 'నీకు కూడ నచ్చదు, నాకు అర్థమైంది. సీలింగ్ చూడు, రంపపు పొట్టు మాదిరిగా ఉంది."

"నాశిరకం హెూటల్లో అలజడి రాత్రులు, రంపం పొట్టు రెస్టారెంట్లలో అల్చిప్పలు" జాజ్ నెమ్మనెమ్మదిగా గొణుక్కుంది.

ఇంతవరకూ స్నానం చెయ్యమని అతను అడగలేదు. ఆమెకి అతని కళ్లు నచ్చాయి. కళ్ల చివర చర్మంలో సన్నటి ముడతలున్నాయి. మరి ఆ నోరు ఖచ్చితంగా నవ్వడం లేదు. కానీ కాఫీ నురుగు అంటుకుని అతని పెదవులు అప్పుడే కోసిన సపోటా బద్దల్లా ఉన్నాయి. తన బొటన వేలు, రెండు వేళ్లతో కలిపి ఆమె చేతిలో పుస్తకాన్ని అందుకుని మొదటి పేజీని తెరిచాడు. అతని ఎడమ చేయి ఆమె మెడని సవరిస్తోంది. కొద్ది సమయం క్రితం అతను దాన్నే చూస్తూ ఉన్నాడు. బయట చాందినీ చౌక్ వెలిగిపోతోంది. గోలగోలగా ఉంది. రిక్షావాళ్లు ఒకరిని మించి ఒకరు పోటీ పడుతూ బెల్‌లు మోగిస్తున్నారు. టాక్సీలు పాకుతూ, క్లచ్ లాగిన కీచు శబ్దాన్ని చేస్తున్నాయి. పాదచారులు తమని దాటిపోవటానికి ప్రయత్నించే కార్లను బూతులు తిడుతున్నారు. వీధి దుకాణం వాళ్లు 'చునరీ, చునరీ' అని ఊరక అరుస్తున్నారు. కాస్త దూరంలో ఉన్న ఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి ఓ రైలు పొగలు కక్కుతూ చుక్ చుక్ మని పోతోంది. బాత్‌రూం కిటికీకి పైన ఉన్న టెర్రస్ మీద జనం వెళ్లిపోయినట్లున్నారు. ఎందుకంటే కిటికీ అద్దంలో నుంచి ఏమీ కనబడ్డం లేదు. చాందినీ చౌక్ నాట్యకత్తెలా ఉంది. పిచ్చిగా 'జట్టీ చెప్పులు, గాజులు, రబ్బరు బ్యాండ్లు విసిరికొడుతూ అక్కడ ఒకే ఒక గొంతు గిరగిరా తిరుగుతోంది. ఇప్పుడు వినిపిస్తోంది' మృదువుగా, తొందరగా...


'ఇక వెళ్దాం, నువ్వు-నేను'


ఏమిటిది అని ఆమె అడగదు ఇప్పుడు ఇద్దరూ కలిసి పుస్తకాన్ని ఊపుతున్నారు. ఆమె తన ఎడమ చేతితో అతని వీపుని చుట్టేస్తోంది.


**నబీన దాస్ హైద్రాబాద్‌కి చెందిన కవి, రచయిత రెండు కవితా సంకలనాలు, రెండు ఫిక్షన్ రచనలు, ఆమె ప్రచురించారు. ప్రస్తుతం "డి వానీ', 'ఢిక్లో-లవ్ స్టోరీస్' అనే సిరీస్ మీద పని చేస్తున్నారు. పై కథ 'కిండిల్' లిటరరీ మాగజైన్‌లో ప్రచురించబడింది.**

nabinamail@yahoo.com

*అనువాదం: డా.సమత రోష్ని*




# సబ్ వే

■ ఖదీర్‌బాబు





పదండి సీనియర్ గారూ అని నవ్వింది.

అలాగే జూనియర్ గారూ అని తోడు కలిపాడు.

ఆరంజ్, ఎల్లో పాట్రన్‌లో అందంగా తయారైన టేబుల్స్‌లో మూడో వరుసలో ఉన్న మొదటిది వాళ్ల ఫేవరేట్. ఎప్పుడూ అక్కడే కూచుంటారు. పదిహేను నిమిషాలు... మహా అయితే అరగంట. ఆఫీసులో రొడ్డకొట్టుడు పనిలో అదే పెద్ద వెసులుబాటు.

కాని ఇవాళ రోజూ కలిసినట్టుగా కాదు. ఇవాళ ప్రత్యేకం. మెనూ అందుకుంది.

బిల్ నేను పే చేస్తాను. అడ్డు చెప్పకూడదు.

సరే.

చట్‌పట్ చనా, ఆలూ పాటీ చెప్పింది. టిన్ కోక్ ఒకటి చెప్తే ఆఖరులో చెరి సగం తాగుతారు.

సో... అంది.

సో... అన్నాడు.

చూసుకున్నాడు. మాటలు రాలేదు. మూడేళ్లుగా కూచుంటున్నారు. ఎప్పుడో ఒకసారి ఇలా జరుగుతుందని తెలుసు. అందుకే ప్రిపేర్డ్‌గా ఉన్నట్టు బిహేవ్ చేస్తున్నారు. సుద్దులు చెప్తున్నట్టుగా అంది–

కొత్త ఆఫీసులో అయినా సరిగ్గా లంచ్ బాక్స్ తెచ్చుకో. డెస్క్‌లో కొన్ని డ్రైఫ్రూట్స్ పెట్టుకొని అప్పుడు కొంచెం తిను. టీలు తక్కువ తాగు. అలా గడ్డం పెంచకు. ఆరు నెల్లకు ఒకసారి కంప్లీట్ చెకప్ చేయించుకో. ఇవన్నీ పదే పదే చెప్పడానికి చేయించడానికి అక్కడ నేను ఉండను. గుర్తు పెట్టుకో....

ముఖంలోకి చూడలేక తలాడించాడు.

అన్నింటి కంటే ముఖ్యం ఇంక మెయిల్సు, వాట్సప్‌లు, ఫేస్‌బుక్ పలకరింపులు బంద్ చెయ్. ఫర్మాలిటీగా కంటిన్యూ చేసి తర్వాత కట్ చేయడం కన్నా వెంటనే కట్ చేయడం మంచిది. మనమేం చిన్న పిల్లలం కాదు కదా. ఏమంటావ్?...

మళ్లీ తలాడించాడు.

ఏదీ నా వైపు చూడు...

చూశాడు.

ఓరి బాబో... ఏడవకురా తండ్రీ...

పెద్ద పెద్దగా నవ్వింది. కాసేపాగి కళ్లు తుడుచుకుంటూ నవ్వే ప్రయత్నం చేశాడు

ఆఫీసులో చేరిన కొత్తలో ఇలాగే ఏడ్చింది. పని చేతగాక ఏడుపు తన్నుకొచ్చేది. పెళ్లికి ముందు ఉద్యోగం చేసేదే. పెళ్లి తర్వాత ఏడేళ్లు ఉద్యోగం మాటే మర్చి పోయింది. ఆ తర్వాత మళ్లీ చేరితే ఎంత అనుభవం ఉన్నా తెలిసిన సాఫ్ట్‌వేర్ తతంగమే అయినా మారిపోవాల్సినవన్నీ మారిపోయే ఉంటాయి కదా. ఏమైనా కావాలంటే మీ సీనియర్‌ని అడగండి అన్నాడు టీమ్ లీడర్. సీనియర్ అంటే వాడెంత పెద్దాడో ఏ నలభై, నలభై అయిదేళ్ల వాడో అనుకుంది. తనకంటే చిన్నవాడు. ముప్పై ఏళ్లు కూడా దాటనివాడు. కాని సీనియర్ సీనియరే కదా. డౌట్లు తీర్చే పద్ధతి, విసుక్కోకుండా పని నేర్పే పద్ధతి, ఎంత పనిలో ఉన్నా ఫోజు కొట్టక అటెండ్ చేసే పద్ధతి నచ్చి సీనియర్ గారూ అని పిలవడం మొదలుపెట్టింది. జూనియర్ గారూ అని తిరిగి జవాబు ఇవ్వడం మొదలుపెట్టాడు. అదో చిన్న నవ్వు.

ఇద్దరూ సిటీలో ఈ మూల నుంచి ఒకరు ఆ మూల నుంచి ఒకరు తెల్లారి ఎనిమిదికి బయలు దేరుతారు. క్యాబ్‌లో గంటా గంటన్నర జర్నీ నరకం. వచ్చాక సీట్లకు అతుక్కుపోయి మళ్లీ క్యాబ్ ఎక్కి ఇల్లు చేరేంత వరకూ అదో నరకం. ఏసి అద్భుతంగా ఉంటుంది. కాని గాలే ఆడనట్టుగా అనిపిస్తూ ఉంటుంది. కూచుని కూచుని ఉబుసుపోక–

మీ ఆవిడ ఏం వండిందండీ అని వచ్చి కూచునేది.

ఏం వండలేదండీ. తను పొద్దున్నే లేచి చేయలేదు. బాబుతో కుదర్దు.

పర్లేదు. నేను తెచ్చాను లెండి. తినండి.

మొహమాటస్తుడు. వినేవాడు కాదు.

సరే. సబ్ వేలో అయినా ఏదైనా ఎంగిలి పడదాం పదండి... బలవంతం చేసేది.

ఆఫీసుకు ఫర్లాంగు దూరంగ లో సబ్‌వే ఉంది. అందరూ వెళ్లి తింటుంటారు. వీళ్లకూ అలవాటైంది.

అందరికీ చిన్నప్పటి ఫ్రెండ్స్ ఉంటారు. మాట్లాడిందే మాట్లాడి కొత్తదేం మాట్లాడటానికి ఉండదు. పైగా మనం ఏ మానసిక స్థితిలో ఉన్నామో వాళ్లకు తెలియదు. కొలీగ్స్ ఉంటారు. కాని అందరికీ అన్నీ చెప్పుకునే పరిస్థితులు ఉండవు. ఎవరో ఒకరు భద్రంగా క్షేమంగా అనిపించాలి. తలుపు తట్టాలి.

మీ ఆయన మంచివాడే కదండీ...

చాలా. మీ ఆవిడ?

దేవత కదండీ...

కొన్నాళ్ళకు ఈ సంభాషణ మారుతుంది.

అబ్బో... మా ఆయనకు చాలా కోపమండీ...

అమ్మో... మా ఆవిడ చాలా సతాయిస్తుందండీ...

నిజానికి పెళ్లయిన మొదటి మూడు రాత్రులలోనే సమస్య తెలిసింది. పెర్ఫార్మెన్స్ యాంగ్జయిటీ. ఆ తర్వాత కూడా సమస్య పోలేదు. రాత్రి వైఫల్యం కప్పి పుచ్చుకోవడానికి పగలంతా పెత్తనం చేస్తున్నట్టుగా బిహేవ్ చేస్తాడు. అదంతా చెప్పలేదు. ఏం అలా ఉన్నారు అనడిగితే–

ఎవరి బాధలు వారివి లేండి అని ఊరుకుంటుంది.

తెలియకపోతే కదా.

పెళ్లయి ఇన్నాళ్లయినా నిజంగా గౌరవిస్తుందా ప్రేమిస్తుందా పక్కన కూచుని మెత్తగా ఎందుకు మాట్లాడదు ప్రతిదీ సందేహమే.

ఆ మాటా నిజమే లేండి అని ఊరుకుంటాడు.

ఇంతకు మునుపు క్యాబ్ ప్రయాణం బోర్ కొట్టేది. ఇప్పుడు చెరో క్యాబ్‌లో బయలు దేరాక ఫోనో, వాట్సప్పో నడిచిపోతూ ఉంటుంది. ఆఫీస్‌లో ఒకసారి కలిసి కాఫీ తాగుతారు. అతడి కోసం ఒక డబ్బా ఎక్కువ తెస్తుంది గనక కలిసి భోంచేస్తారు. సాయంత్రం సబ్‌వేలో స్నాక్ తినే మిష మీద ఏవో ఉబుసుపోని కబుర్లు చెప్పుకుంటారు. అతడికి జ్వరం వస్తే ఆమె టాబ్లెట్ తెస్తుంది. ఆమెకు పని పెరిగితే అతడు చేసి పెడతాడు. ఆఫీస్‌లో అందరూ గమనించారు. ఎవరూ గమనించనట్టే ఉన్నారు. ఆమె జోలికి ఇంకే మగవాళ్లు రావడం లేదు. అతణ్ణి వేరే ఆడవాళ్లెవ్వరూ కదిలించడం లేదు. అంతకు మించి ఏమైనా జరిగిందా అని కుతూహలం ఉన్నవాళ్లు ఉన్నారు. లేనివాళ్లూ ఉన్నారు.

ఇంతకు మించి ఏమీ వద్దు కదా అడిగాడు ఒకరోజు.

చూసింది.

అడగడం నార్మల్. అడక్కపోతే అబ్‌నార్మల్...నసిగాడు.

వద్దు.

ఆ తర్వాత ఆ చర్చ మళ్లీ ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు ఇంకా పెద్ద సంస్థలో ఇంకా మంచి ఆఫర్ వచ్చింది వెళ్లిపోతున్నాడు.

బిల్లు కట్టేసింది. చీకటి పడిపోయింది. ఇద్దరూ కావాలనే క్యాబ్‌ని మిస్ చేసేశారు.

నిన్ను ఇంటి దాకా దింపనా? అడగలేక అడగలేక అడిగాడు.

వద్దు. బస్‌లో వెళతాను.

చూసుకున్నారు.


సో...అన్నారు.


సో...అంది.


చేయి ఊపింది. చేయి సాచాడు. చివరి కరచాలనం.


రేపు మళ్లీ తెల్లారుతుంది. మళ్లీ ఆఫీసు ఉంటుంది. కాకపోతే వీళ్లు మళ్లీ ఇలా ఉండకపోవచ్చు. అందరూ ఇలా ఉండకపోవచ్చు. కాని ఇలా ఉండి ఆర్డర్ ప్లేస్ చేసేవారి కోసం మాత్రం సబ్‌వే లో పదార్థాలు తయారవుతూనే ఉంటాయి.

**మహమ్మద్ ఖదీర్‌బాబు రాసిన 'మెట్రో కథలు' పుస్తకం నుండి తీసుకోబడింది. కావలి ప్రచురణలు, 2018**









OXFORD
INDIA PAPERBACKS
Women Writing in India
Volume I
600 BC to the
Early Twentieth Century
edited by
Susie Tharu and K. Lalita


OXFORD INDIA PAPERBACKS
Women Writing in India
Volume II
The Twentieth Century
edited by
Susie Tharu and K. Lalita


Rs. 150/-
Sangeetha
COACH
F
FIRST
L
LADIES
D
DIVYANG


దారులేసిన అక్షరాలు
ఇరవయ్యవ శతాబ్దపు భారతీయ మహిళల రచనలు
సంపాదకులు
సూసీ తారు, కె. లలిత
దారులేసిన అక్షరాలు
Anveshi


BOMBAY – KUWAIT
We Can Do It!
TOWARDS A WORLD OF EQUALS
A BILINGUAL TEXTBOOK ON GENDER
शुद्ध देसी ROMANCE
Telugu Akademi
Hyderabad